శ్రీశ్రీశ్రీ భగవాన్
శ్రీ పెద్ద బాలయోగీశ్వరుల చరిత్ర



భగవాన్ శ్రీశ్రీశ్రీ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమ కమిటీ
ముమ్మిడివరం, తూర్పు గోదావరి జిల్లా

శ్రీశ్రీశ్రీ భగవాన్
శ్రీ పెద్ద బాలయోగీశ్వరుల చరిత్ర

రచన

అమూల్యశ్రీ

ప్రచురణ

భగవాన్ శ్రీ ఓం బాలయోగీశ్వర తపో ఆశ్రమ కమిటీ

ముమ్మిడివరం - తూర్పు గోదావరి జిల్లా

...ED ON THE SHELF
Date...............

ప్రథమ ముద్రణ సెప్టెంబరు 2001.

కాపీలు 2000.

దీని ముద్రణకు ఆర్థిక సహాయము చేసిన వారు తిరుమల తిరుపతి దేవస్థానము, తిరుపతి.

కమిటీ వారి అనుమతి లేనిదే భగవాన్ శ్రీ బాలయోగీశ్వరునిపై క్రొత్త రచనలుచేసి గాని, ఈ గ్రంథములోని భాగములుగాని ప్రకటింపరాదు. ఉల్లంఘించిన వారిపై చట్టసమ్మతమైన చర్య తీసుకొనబడును.

SRI VENKATESWARA
CENTRAL ...
RESEARCH ...
Acc. No. 55804
Date...........
TIRUPATI.

వెల రూ. 80/-

ప్రతులకు ప్రెసిడెంటు
ఓం భగవాన్ శ్రీ బాలయోగీశ్వర తపో ఆశ్రమ కమిటీ
ముమ్మిడివరం
తూర్పు గోదావరి జిల్లా.

ప్రింటింగ్ సూరజ్ ప్రింటర్స్ అండ్ పాకేజర్స్
రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్
తిలక్‌రోడ్డు, హైదరాబాదు-1.

తొలిపలుకు

"శ్రీశ్రీశ్రీ భగవాన్ పెద్ద బాలయోగీశ్వరుల పూర్ణచరిత్ర" అను మా మొదటి గ్రంథమును 1981లో మా కమిటీ వారు ప్రచురించడమైనది. దానిని ఆరుగురు కవులు, భగవాన్ గారి అత్యంత భక్తులు వ్రాసిరి. చాలా సంపూర్ణమైన గ్రంథమది. కాని అనేక repetitions తో కూడిన గ్రంథము.

అమూల్యశ్రీ గారు అనేక గ్రంథములు వ్రాసి పెద్దల అభిమానములు చూరగొంటిరి. వారి అసలు పేరు జె. అమ్ములయ్య గారు. ఎం.ఏ. మన రాష్ట్ర ప్రభుత్వములోని కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంటులో డిప్యూటి కమీషనర్‌గా రిటైర్ అయిన పిదప, మన ప్రభుత్వ తెలుగు అధికార భాషా కమీషన్ మెంబరుగా కూడా పనిచేసిరి. ఈయన ఆంధ్ర విశ్వవిద్యాలయము, విశాఖపట్టణములో నాతోపాటు చదువుకొన్నారు, నాకు అత్యంత మిత్రులు.

ప్రజలను ఆకర్షించేటట్టు వ్రాయగలిగిన కవిగారు, భగవాన్ శ్రీ పెద్ద బాలయోగీశ్వరుల వారి భక్తులు కూడాను. అందుచేత ఆయనను భగవానుని మీద ఒక మంచి పుస్తకమును వ్రాయమని నేను అడిగిన వెంటనే దానికి ఆమోదించిరి. కాని అప్పటికే ఆయన ఆరోగ్యము బాగులేకుండెను. అయినను లెక్కచేయక, ఈ గ్రంథమును పట్టుదలతో ఆయన ఆఖరి, రోజులలో వ్రాసి మాకెంతయో ఆనందము కలిగించిరి. అందుకు వారికి మా ధన్యవాదములు.

గుంటూరులో ఒక రాత్రి ఆయన ఈ పుస్తకమును వ్రాస్తున్నప్పుడు, ఒక ఎలుక ఎలక్ట్రిక్ వైర్‌ను కోయడము వలన పెద్ద శబ్దము, లైట్ వచ్చిందట దాంతో ఆయన సతీమణి జె. రత్నజ్యోతి, పిల్లలు అందరు లేచి మెయిన్ స్విచ్‌ని ఆఫ్ చేసిరి. లేనిచో మొత్తము ఇంటిలో షార్టు సర్క్యూట్ అయి ఉండేదని వారి నమ్మకము. భగవాన్ బాలయోగి గారి దయవలన వారి ప్రాణములు దక్కినవని వారి తృప్తి. ఇటువంటి అద్భుతాలు చాలా జరిగినవి. కాని వాటిని ఒకచోట చేర్చి వ్రాయనందుకు నేను చాలా చింతిస్తుంటాను.

ఈ పుస్తకమును ముద్రణ చేయడానికి, తిరుమల తిరుపతి దేవస్థానమువారు తగు ధన సహాయము చేసినందుకు మేము వారికి ఋణపడి యున్నాము. ప్రత్యేకముగా టి.టి.డి. ఇ.ఓ. గారైన శ్రీ పి. క్రిష్ణయ్యగారు ఐ.ఏ.ఎస్. గారికి మా ప్రత్యేక వందనములు.

ఉద్యోగరీత్యా సుమారు 10 సంవత్సరాలు నేను ఢిల్లీలోను, లండన్‌లోను పనిచేయుట

వలన, భగవానుని ప్రప్రథమముగా 1974లో మాత్రమే చూడగలిగితిని. 1983లో భగవానులు నన్ను ఆశీర్వదించి కమిటీ మెంబరుగా చేసిరి. అప్పటినుంచి ప్రతి సంవత్సరము శివరాత్రి రోజున భగవానుని సేవలో అంకితమగుట నాకు అలవాటైనది.

ప్రప్రథమంగా భగవాన్ శ్రీ పెద్ద బాలయోగిగారిని చూచినప్పటి ఆనందమును వర్ణించుట చాలా కష్టము. ఆయన రెండు కండ్లు రెండు సూర్యుల వలె ప్రకాశించెను. ఎంతో సంతోషముగా నవ్వుతూ నన్ను ఆహ్వానించిరి. ఆ సమయములో ఆ గదిలో, అంటే భగవానులు ఎప్పుడూ తపస్సు చేస్తున్న గదిలో, వర్ణించడానికి వీలుకాని సుగంధము యుండెను. మిగతా నలుగురు కమిటీ సభ్యులను అడిగితిని. ఈ సుగంధము ఎక్కడ నుంచి వస్తున్నదని, వారెవ్వరు సుగంధమును అనుభవించలేదు. నేను కూడా ఈ సుగంధమును మరల ఎప్పుడు అనుభవించలేదు. అంటే ఆ రోజున నన్ను భగవానులు ఆశీర్వదించిరని నా ఉద్దేశము. ఈ విషయము భగవానుల వారిని అడుగుటకు నాకు ధైర్యము లేకుండెను. శివరాత్రి మరుసటి రోజు ఉదయము 8 గంటల తరువాత ఆశ్రమము విడిచి పంచాయితీరాజ్ వసతి గృహమునకు వెళ్లినపుడు, నా సతీమణి అనసూయ నన్ను చూచి చాలా ఆశ్చర్యపడినది, "రాత్రంతా మేలుకొని వున్నా, ఇంత ఫ్రెష్‌గాను, ఇంత సంతోషముగాను, ఇంత ఎనర్జిటిక్‌గా కనుపిస్తున్నారే" అని అడగటము జరిగింది. నా శరీరములో విపరీతమైన బలము ప్రవేశించినట్లు అనిపించింది.

రాత్రి 12 గంటల నుండి తెల్లవారు జామున 4 గంటల వరకు కమిటీ మెంబర్లతో మాట్లాడిన పిదప దర్శనమందిరమునకు వెళ్లేముందు కొందరు భక్తులను ఆయన తపస్సు మందిరములో దర్శనము చేయించేవారు. ఎవ్వరితోను కండ్లు విప్పి మాట్లాడేవారు కాదు. శివరాత్రికి రెండు మూడురోజుల ముందునుంచి భక్తులు వచ్చి క్యూలో కూర్చునేవారు.

10 లేక 15 లక్షల మంది ఆ రెండు రోజులు భగవానుని దర్శనము చేసుకొనేవారు. ఆశ్రమము చుట్టూ వున్న దర్శనమంటపము ముందు చిన్న పి.డబ్లు.డి. కాలువలోనే స్నానాలు చేసేవారు. ప్రభుత్వము తరపున భక్తకోటికి సరియైన సదుపాయములు లేకుండెను. మద్రాసు, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి అనేకవేలమంది భక్తులువచ్చి వారి స్థావరాలను వరి పొలాల్లోనే పెట్టుకొనేవారు. అమలాపురం నుంచి ముమ్మిడివరమునకు 10 కిలోమీటర్ల దూరమున రోడ్డుకు ఒక ప్రక్కన బస్సులను ఉంచేవారు. ఆ బస్సులపైకి ఎక్కి అమలాపురం నుంచి ముమ్మిడివరమునకు నడుచుకొని వస్తున్న యువకులను చూచి చాలా ఆనందపడేవాడిని. ఈ పది కిలోమీటర్లు కార్లలో వెళ్లాలంటే నాలుగు, ఐదు గంటలు పట్టేది.

ముమ్మిడివరము ఒక పెద్ద గ్రామపంచాయితీ. త్రాగుటకు మంచి నీళ్ళు లేవు. ఆ కలుషితమైన కాలువయే వారికి ఆధారము. ఉండటానికి హోటళ్లు లేవు. చిన్న చిన్న హోటళ్ళలో అంతంత మాత్రంగా భోజన సదుపాయాలు యుండెడివి. శివరాత్రి ముందురోజు ముమ్మిడివరంలో నడుచుటకు చాలా కష్టముగా యుండెడిది. చిన్నచిన్న దుకాణాలు రోడ్లకు ఇరువైపుల యుండెడివి. ఈ దుకాణదార్లందరు భగవానుని నిర్యాణము తరువాత వాళ్లరాబడి పడి పోయినందుకు చాలా విచారిస్తుంటారు. ఒక్క మూడు రోజులలో జరిగిన వ్యాపారము వలన వారికి సంవత్సరమంతయు జరిగిన వ్యాపారముతో సమానమని అంటుంటారు.

గ్రామ ప్రజలు భక్తులుపడుతున్న అవస్థలను చూచి ఒక P.W.S. పథకమును ఒక్క సంవత్సరంలో పూర్తి చేయించగలిగితిని. అప్పటి నుంచి ముమ్మడివరపు ప్రజలు మరియు భగవానుని భక్తులు కుళాయిల ద్వారా మంచి నీళ్ళు త్రాగుటకు అవకాశము కలిగినది. ఈ లక్షలాది మందికి టాయిలెట్స్ కూడా లేవు. అయినను శివరాత్రి అయిన మరుసటి రోజుకు అన్నియు క్లీన్‌గా ఉండెడివి. ఇది యొక్క పెద్ద మిరకిల్. ఇన్ని లక్షలమంది యాత్రికులు వచ్చిన, దొంగతనాల్లాంటివి ఎప్పుడు జరుగలేదు. ఎక్కడైనా పోలీసులు భక్తులను కొట్టి హింసిస్తే వెంటనే మాకు చెప్పేవారు, పోలీసులకు చెప్పమని, పోలీసులు హింసిస్తున్నారని వారిని తీసి వేయమని పలుమార్లు చెప్పేవారు.

విదేశాలనుంచి కూడా చాలామంది వస్తుండేవారు. శ్రీమతి పామి లెస్‌కార్ట్ ప్రసిద్ధ ఫ్రెంచ్ బేలే డాన్సరు ప్రతి సంవత్సరము వస్తుండేవారు. స్వామి వారి పాలరాతి విగ్రహమును చేయించి దర్శనమందిరములో ప్రతిష్టించినవారువారే. కొన్ని సంవత్సరములక్రితము భగవానులపై వ్రాసిన బ్యాలెను హైదరాబాదులోని రవీంద్ర భారతిలో అద్భుతముగా డ్యాన్స్ చేసి ప్రజలను ఆకర్షించగలిగిరి. ఫ్రెంచ్ భాషలో ఒక పుస్తకమును కూడా వ్రాసిరి. ఫ్రాన్సులో స్వామి వారి దేవాలయమును కట్టవలెనని ఆమె కోరిక. ఎవ్వరైన భక్తులు ముందుకు వచ్చి ఈ రెండు పుస్తకములను ఇంగ్లీషులోకి తర్జుమా చేయించగలిగితే ఇంకా చాలామందికి భగవానుని సందేశము అందించటానికి వీలుంటుందని నా ఆకాంక్ష. చాలామంది భక్తులు, తమిళనాడు, కర్నాటక, కేరళలో ఉండుటవలన ఈపుస్తకాలను ఆయా భాషలలో కూడా తర్జుమా చేయిస్తే ఇంకను బాగుంటుందని నా ఊహ. అటువంటి దాతలు వస్తారని నా ఆశ. భగవానులు పబ్లిసిటి అంటే ఇష్టపడేవారు కాదు. బి.బి.సి. వారిని తీసుకువస్తే బాగుంటుందని నేను చెప్తే దానికి ఇష్టపడేవారు కాదు.

భగవానుల నిర్యాణము తరువాత ముమ్మిడివరమును చూస్తుంటే ఏడుపు వస్తుంటుంది. ఒక ఎడారిలాగ కనుపిస్తుంటుంది. శివరాత్రికి ఇప్పుడు 15,000నుంచి పైగా భక్తులు వస్తున్నా 15 లక్షల ముందు ఇది ఎట్లా ఉంటుందో మీరే ఊహించగలరు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఒక కళ్యాణ మండపమును కూడా కట్టించినారు. దీనికి మా ఆశ్రమము తరపున ఒక ఎకరం భూమిని కూడా దానము చేసితిమి. దీనిలో 300 మంది యాత్రికులు బసచేయడానికి వీలు కలుగుతుంది.

భగవానులు ఇప్పటికి బ్రతికి ఉన్నారని మేము తలుస్తాము. ఆయన భక్తులను, ఈ పుస్తకమును చదివిన వారినందరిని కాపాడుతారని మా ఆకాంక్ష.

కె. శ్రీ రామచంద్రమూర్తి

ప్రెసిడెంటు

భగవాన్ శ్రీ ఓం బాలయోగీశ్వర తపో ఆశ్రమ కమిటీ

ముమ్మిడివరం - తూర్పు గోదావరి జిల్లా

ఆంధ్రప్రదేశ్.

విషయసూచిక

దివ్యజ్ఞానోదయం - పూర్వజన్మ సుకృత ఫలం	1
కఠోర (ఘోర) తపోభంగ వ్యర్థ ప్రయత్నాలు	48
శ్రీ బాలయోగీశ్వరుల వారి తపోమహిమలు - భక్తుల అనుభవాలు	63
తుది జన్మదైన తపో బ్రహ్మ	96
శాశ్వత జీవ బ్రహ్మైక్య సిద్ధి - కైవల్యసిద్ధి	112
శ్రీ చిన బాలయోగీశ్వరులు	129
బాలయోగి - పద్మశ్రీ బోయి భీమన్నగారు	155
ఓం శ్రీ భగవాన్ శ్రీ బాలయోగీశ్వర సుప్రభాతం	157
శ్రీ బాలయోగీశ్వర సంస్తుతి - శ్రీ జయంతి స్వామినాయనగారు	159

ఓం

దివ్య జ్ఞానోదయం - పూర్వజన్మ సుకృత ఫలం

శ్లో॥ పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోऽపి సః
జిజ్ఞాసురపి యోగస్య శబ్ద బ్రహ్మాతి వర్తతే॥

భగవద్గీత - 6-44

గత జన్మలో యోగాభ్యాసం చేయుచు, యే కారణంచేతనైనా యోగాభ్యాసనానికి భంగం వాటిల్లితే, అట్టి యోగభ్రష్టుడు, ప్రస్తుత జన్మలో, పూర్వ జన్మయోగాభ్యాస వాసనా ప్రభావం చేత, అప్రయత్నంగానే, యోగసాధన వైపునకు ఆకర్షింపబడుచున్నాడు. యోగసాధకుడు (యోగ జిజ్ఞాసి) బ్రహ్మతత్త్వంను సంతరించుకొంటాడు.

ప్రొద్దున్నే లేచి బయటికి పోయివచ్చిన శ్రీ గంగయ్య, యింట పనులు చేసుకుంటున్న తన భార్య శ్రీమతి వెంకమ్మతో "సుబ్బారావు యీ రోజు కాస్త పెందలాడే ఆసామి పనిలోకి పోయినట్టున్నాడే" అన్నాడు. "నేను లేచే సరికే మిగతా పిల్లలున్నారు గాని సుబ్బారావు కనిపించ లేదు" సమాధానం చెప్పింది శ్రీమతి వెంకమ్మ. "పనేమైనా వుందేమో పెందలాడే రామన్నారేమో ఆసామివాళ్ళు పిల్లోణ్ణి" అన్నాడు శ్రీ గంగయ్య. "ఏమో! రామన్నారేమో" అంది భార్య.

శ్రీ గంగయ్యకు మిగిలిన కొడుకులకంటే, మూడో కొడుకు సుబ్బారావంటే ఎందుకో కాస్తంత వాత్సల్యం, ప్రేమాభిమానాలు. సుబ్బారావుకు తల్లిదండ్రుల యెడల, పెద్దల యెడల భయభక్తులెక్కువ. శాంత స్వభావం గలవాడు, మితభాషి. పిల్లవాడైనా "అల్లరి చిల్లర" పనులు చిలిపి చేష్టలు చేయనివాడు. పిలిస్తే చిరునవ్వుతో పలుకుతాడు. తన పనేమిటో తానేమిటో. అందుకేనేమో శ్రీ గంగయ్యకు సుబ్బారావంటే ప్రత్యేక పుత్రవాత్సల్యం. అది తండ్రి కొడుకుల మధ్యనున్న 'పూర్వజన్మ' అనుబంధం!

బారెడు ప్రొద్దెక్కిన తర్వాత పొలం పనులకు వెళ్ళే రైతు కూలీలెవరో సుబ్బారావు వూరి బయట కొబ్బరి తోటలో మౌనంగా కూర్చొని వుండడం చూసారు. ఆ విషయం గంగయ్య దంపతులకు, యిరుగు పొరుగు వాళ్ళకు, ఎవరో వచ్చి చెప్పారు. శ్రీ గంగయ్య, శ్రీమతి వెంకమ్మ పల్లెలోని యిరుగు పొరుగు చిన్నా, పెద్దా, ముసలీ ముతకా, ఆడామగా, ఆబాల

గోపాలమంతా అందరూ పరుగు పరుగున సుబ్బారావు మౌనంగా కూర్చున్న తోటలోని చేరుకున్నారు. సుబ్బారావు మౌనంగా కూర్చున్నది ఇళ్ళ గోవిందరావు గారి కొబ్బరితోట. చుట్టు వూడ్పు చేలు (వరి) నాట్లు (వూడ్పు) వేసిన పొలాలు. అప్పటికే అక్కడ మరికొందరు చే సుబ్బారావు వంక చోద్యంగా చూస్తూ వుండిపోయారు.

శ్రీ సుబ్బారావు కళ్ళు మూసుకొని, కదలకుండా కొయ్యబొమ్మలా కూర్చున్నాడు. యోగిలా ధ్యానం చేస్తున్నట్లు కనిపించాడు. ఆ కుర్రాడి శరీరం మీద గండు చీమలు, పురుగులు పారాడుతున్నాయి. అయినా అతనిలో చలనంలేదు. అసలా కుర్రాడు యీలోకంలో వున్నట్లు లేడు. కొబ్బరి చెట్టు మొదట శ్రీకృష్ణభగవానుడు, నారదుల వారున్న పటం ఆనించి వుంది. కొబ్బరికాయ 'నైవేద్యం'గా పెట్టినట్లు, పగల గొట్టిన రెండు కొబ్బరి చిప్పలు పటం ముందున్నాయి. రెండు అరటి పండ్లున్నాయి. అగరవత్తులు వెలిగించినట్లు, కాలి ఆరిపోయిన అగరవత్తులు 'నుసి' అవశేషాలు కనిపించాయి. పటంకెదురుగా ఉత్తరముఖం పెట్టి కూర్చున్నాడు. "ఏదో తనలో తాను అనుకొంటున్నాడు."

ఒకరు సుబ్బారావు ముఖం దగ్గర చెవిపెట్టి "ఓం..కృష్ణ! ఓం నారాయణ" అంటున్నాడు! అని అన్నాడు.

"ఏదైనా దయ్యమో, భూతమో" పట్టిందేమో! అన్నారు కొందరు.

"తల్లి లేని పిల్లాడు మారుతల్లి (సవతి తల్లి) గదా!"

"నోరు లేని పిల్లాణ్ణి ఏమైనా తిట్టిందేమో" అన్నారు కొందరు. "వెంకమ్మ పండును సొంత కొడుకుకన్నా యెక్కువగా చూసుకొంటుంది. ఆమె ఏమీ అనే మనిషి కాదు" అన్నారు కొందరు.

"తండ్రి గాని ఏమన్నా కోప్పడ్డాడేమో" అనుకొన్నారు కొందరు.

"గంగయ్య అటువంటి వాడు కాదు. పిల్లాణ్ణి పల్లెత్తు మాటనడు" పండు అంటే గంగయ్యకు మహాప్రాణం అన్నారు కొందరు.

"పోనీ పండు పాలేరు పని చేసే ఆసామి గాని ఏమైనా కోప్పడ్డాడేమో" అన్నారు కొందరు.

"కామందు మట్టపల్లి వెంకన్న చాలా మంచోడు. ఆయనేమీ అనుండడు" అన్నారు కొందరు.

"కామందు భార్య కోప్పడిందేమో" అన్నారు కొందరు.

"ఆ సీతమ్మ గారు గూడ మహాతల్లి" అన్నారు కొందరు.

"లంకతల్లమ్మ పూనిందేమో" అన్నారు కొందరు. లంకతల్లి కాదు-లంకిణీ కాదు. అదేమీ కాదు" అన్నారు కొందరు.

పని చేయలేక దొంగనాటకమాడుతున్నాడేమో" అన్నారు కొందరు యువకులు.

సుబ్బారావు మారుతల్లి వెంకమ్మ "నాయనా! లేరా! ఇంటికి పోదాం. నిన్నెవరైనా ఏమైనా అన్నారా! కామందుగారేమైనా మందలించారా. కామందుగారి భార్య ఏమైనా కోప్పడిందా "లే. నాయనా. నీకు పనిలోకి (పాలేరుతనం) పోవడం యిష్టం లేకపోతే, మానేస్తువు గాని. ఇంటి దగ్గరేవుండీ మరేదైనా పనిచూసుకొందువు గాని" లేరాబాబూ! చూడరా తండ్రీ" అంటూ నానా విధాలుగా బ్రతిమాలింది, అనునయించింది.

"ఓరే నాయనా! ఏమైందిరా, ఏమిట్రా" యిది అని తండ్రి గంగయ్య పిలిచాడు.

"ఒరే తమ్ముడూ-కళ్ళు తెరచి చూడరా" అన్నారు అన్నలు.

"ఒరే పండూ-మాట్లాడవేమిట్రా" అన్నారు తోటి పాలేరు కుర్రాళ్ళు.

"నీకేమైంది. చెప్పరా" అన్నారు కొందరు పెద్దలు.

"కళ్ళు తెరచి మావంకైనా చూడరా బాబూ" అన్నారు మరి కొందరు.

"లే! బాబూ! లే. ఇంటికి పోదాం రా" అని గొడవ చేసింది అమ్మ. అంత మంది తన చుట్టూ చేరి, ఎంత గొడవ చేస్తున్నా, సుబ్బారావు మాత్రం కదలలేదు. మెదలలేదు. కన్నెత్తి ఎవరివంకా చూడనూలేదు.

"అయ్యబాబోయ్- నా కొడుకు యిలా మారిపోయాడేమిట్రో."

"ఓరి దేవుడో-యీదేం కర్మంరా బాబూ!" అంటూ గంగయ్య పెద్దగా ఏడ్వడం మొదలు పెట్టాడు.

సుబ్బారావుకు తండ్రి మాట వినిపించిందేమో! ప్రయత్న పూర్వకంగా కళ్ళు తెరచీ తెరవనట్లు 'అర్థనిమీలిత నేత్రం'గా తండ్రి వంక లిప్తకాలం పాటు చూసాడు. మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు. తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఎవరెంత మంది ఎన్నివిధాల ప్రయత్నించినా సుబ్బారావు 'చలనం' లేని రాయిలా అలానే కూర్చున్నాడు.

"లాభం లేదు కాని. చేయిపట్టుకొని లేపండ్రా" అన్నారు కొందరు.

"ఏమిట్రా సుతారంగా అలాగే కళ్ళప్పగించి చూస్తారు. పిల్లాణ్ణి ఎవరూ పట్టుకొని లేపరేమిరా" అన్నారు మరికొందరు.

కాని ఎవరూ ధైర్యం చేసి సుబ్బారావు ఒంటిమీద చేయివేసి తాకలేకపోయారు. కుర్రాణ్ణి ఏదైనా భూతం ఆవహించిందన్న భయం వేసిందో! లేక ఏదో అదృశ్య దివ్యశక్తి సుబ్బారావుకు

కవచం లాగా వుండి, అతగాడి మీద చేయివేసి తాకనీయలేదేమో! చాలా మంది ప్రయత్నించారు. విఫలమయ్యారు.

ఎట్టకేలకు, ఓ పెద్దాయన, ఆ పల్లెకు పెద్ద తలకాయ లాంటి వాడు (జనిపల్లి తాతయ్య) అనే ముసలాయన సుబ్బారావును పట్టుకొని బలవంతంగా లేపాడు. సుబ్బారావు లేచినిలబడ్డాడు కాని యీ లోకంలో లేడు. తన ధ్యానానికి భంగం కలిగించారనో, మరెందుకోగాని, సుబ్బారావు కళ్ళ వెంట నీళ్ళు కారడం మొదలు పెట్టాయి. అయినా సుబ్బారావుని మెల్లిగా నడిపించుకొంటూ గంగయ్య గారింటికి తీసుకొని పోయారు అందరూ కలిసి. ఇంటికి వచ్చినా, ఎవరితోను మాట్లాడ కుండా, కన్నెత్తి ఎవరి వంకా చూడకుండా, ఇంటిముందున్న అరుగు మీద తూర్పు ముఖం పెట్టి కూర్చున్నాడు.

భగవద్గీత 6వ అధ్యాయం-44 శ్లోకం "పూర్వాభ్యాసేన...." ను బట్టియు, తర్వాత శ్రీ సుబ్బారావు 'బాలయోగి'గా దీర్ఘకాలం కఠోర తపస్సు చేస్తూ, ది. 10-2-49 రాత్రి వేళ శ్రీయుతులు వ్యాసం సత్యరాజు, గరిమెళ్ళ కృష్ణమూర్తిలతో మాట్లాడుతూ "నేను కడపటి మెట్టులో తపస్సు చేయుచున్నాను. నా జన్మపరంపరలలో నా ప్రస్తుత జన్మము చిట్టచివరిది. నేను చేయుచున్నది ఘోరతపస్సు" అని శ్రీ బాలయోగివారు వివరించుట వలనను, ది. 27-3-49న పై యిద్దరు, మరొకరితో తమ 'పూర్వజన్మ సువాసనలవలన' తమకీ స్థితి (తపస్సు చేయుభాగ్యం అబ్బినదని చెప్పుట వలనను, శ్రీ సుబ్బారావు పూర్వజన్మలో గూడా తపస్సు చేసినట్లును, కాని గత జన్మలో చేసిన తపస్సునకు ఏ కారణంచేతనో భంగం కలిగినట్లును, ప్రస్తుత జన్మలో హరిజన కులంలో శ్రీ కటికదల వెంకయ్య శ్రీమతి రామమ్మలకు బిడ్డగా జన్మించి 'తపస్సు'నకు ఉపక్రమించినట్లు మనం గ్రహించవలసి యున్నది. శ్రీ రమణ మహర్షి జీవితంలో గూడా యిట్టి సంఘటనయే జరిగినది. బాల్యమందే పుస్తకములు చేతబట్టుకొని బడికి పోవుచు పూర్వజన్మ సుకృతం వలన 'ఆకస్మికం'గా చేతిలోని పుస్తకములను పారవైచి 'ధ్యాన' నిమగ్నుడైనాడు. శ్రీ పుట్టపర్తిసాయి బాబా వారి విజయంలో గూడా యిట్టి సంఘటనయే జరిగినది. స్కూలుకు వెళ్ళుచున్న సమయంలో ఒక చిన్న ఉద్యోగి 'మీరు సాయి అవతార'మని అనగానే శ్రీ సత్యనారాయణరాజు (పూర్వాశ్రమంలో వారి పేరు) వెంటనే యింటికి వచ్చి వదినె, అన్నగార్లతో "నాకూ-మీకూ-యిక యెట్టి సంబంధంలేదు. లోకకల్యాణం కోసం నేను చేయవలసిన దివ్యకార్యము లున్నాయి. యిక బడికిపోను, చదువు కోను" అంటూ చేతిలోని పుస్తకాలు విసరిపారవేసినారు. "పూర్వజన్మ సుకృతం" చేతయిట్టి మహాత్ములు లోకకళ్యాణార్థం యీ విధంగా మారిపోతారు. వీరు కారణజన్ములైన అవధూతలు. దైవ స్వరూపులు.

శ్రీ సుబ్బారావు వింత 'ప్రవర్తన' ఆ కుర్రవాడిలో హఠాత్తుగా వచ్చిన 'విచిత్ర పరిణామం'

ముమ్మిడివరం అంతా 'దావానలం'లా పాకిపోయింది. వైర్‌లెస్ న్యూస్‌లా, రేడియో వార్తలా, క్షణాల మీద తెలిసిపోయింది. జనం గుంపులు గుంపులుగా ముమ్మిడివరంలోని 'మాలవాడ' లో నున్న కటికిదల గంగయ్య గారింటికి 'తీర్థ ప్రజ'లా రావడం మొదలెట్టారు. వచ్చి పండును చూచి పోయేవాళ్ళు పరిపరి విధాల 'తలొక మాట' అనుకొన్నారు. పండు పాలేరుతనమున్న ఆసామి గాని లేక ఆయన భార్య శ్రీమతి గౌరమ్మ గాని కోప్పడ్డారేమో' అనుకునేవారు కొందరు.

"తల్లి లేనిపిల్లాడు. మారుతల్లి గదా! ఎలాగైనా కన్నతల్లి కున్న ప్రేముంటుందా. సరిగ్గా చూడడం లేదేమో" అనుకునేవారు కొందరు.

"పాలేరు తనం చేయడం వాడికసలిష్టం లేదు. బలవంతంగా మట్టపర్తోరి బాపన్న కాయకానికి మొన్నీ మధ్యనే కుదిర్చారు! అనుకొనే వారు మరికొందరు.

"రాత్రి పెద్దలతో పాటు "హరి"భజనకు గూడా వచ్చి కాసేపు కూర్చొని వెళ్ళాడు" అన్నారు కొందరా పేట పెద్దలు.

"రోజూ మేమంతా పశువుల్ని కాసుకొంటూ గోలీలు గూడా ఆడుకునేవాళ్ళం. కోతి కొమ్మచ్చి లాడుకొనేవాళ్ళం. నిన్న సరదాగా మాట్లాడాడు మాతో" అన్నారు సాటి పాలేటి కుర్రాళ్ళు.

"పాపం చచ్చిపోయిన వాళ్ళమ్మ రామమ్మ గుర్తుకొచ్చి యిలా అయిపోయాడేమో" అను కొన్నారు కొందరు. "రెండు మూడురోజులనుండి ఏదో పరధ్యానంగా, దిగులుగా వున్నాడు."

"ఎంత మంచివాడు. ఎంత బుద్ధిమంతుడు. ఎంత నెమ్మదస్తుడు. పిలిస్తేనే కాని పలికే వాడు కాదు. బంగారం వంటి పండు" ఇలా మారిపోయాడని" మరికొందరు నిట్టూర్చారు.

"పూర్వ జన్మ సుకృతం. పట్టుమని పదిహేనేళ్ళు. భక్త ప్రహ్లాదుడులా, భక్త మార్కండేయు డిలా, అతి పిన్న వయస్సులో తపస్సునకుపక్రమించాడు. పూర్వ జన్మములో చేసుకొన్న పుణ్యం! అదృష్టవంతుడు" అన్నారు విద్యాబుద్ధులు నేర్చిన కొందరు పెద్దలు.

"చదువూ సంధ్యలు లేవు. పొట్ట చించినా అక్షరం ముక్కరాదు. కులం లేని మాలాడు. తపస్సేమిటి! వాడి తలకాయ! ఏదో "గాలి" పట్టిందని" కులతత్త్వం జీర్ణించుకొని పోయిన సనాతన ఛాందసులు కొందరన్నారు.

"కులానికి, చదువుకీ, తపస్సుకీ సంబంధమేమిటి. భక్తనంద నారే కులస్థుడు. వీరబ్రహ్మేంద్రస్వామి (బ్రహ్మంగారు) ఏ అగ్రకులంలో పుట్టాడు. రోహిదాస్‌దే కులం!" అని సమర్థించారు మానవతా దృక్పథం గల మరికొంత మంది విజ్ఞులు.

'దయ్యమని, భూతమని, అమ్మవారు పూనిందని పిల్లవాణ్ణి అనవసరంగా వేధించకండి' తన ధ్యానంలో తన నుండనీయండి. ఏదైనా చిన్న పాక ఒకటేయండి. అందులో కూర్చొని

ధ్యానం చేసుకుంటాడు. ఈ అరుగుమీద 'ఎండకీ-వానకీ ఎంతకాలం సహిస్తాడు" సలహాయిచ్చారు మరికొంత మంది హితైషులు, పారమార్థిక దృష్టి యున్న కొందరు పెద్దలు.

సుబ్బారావుకు అన్నం లేదు, నీరు లేదు, పలుకూ లేదు, పిలుకూ లేదు. ఎంత సేపని! ఎన్నిరోజులని! ఎంతకాలమని! అమ్మానాన్నలు, బంధుమిత్రులు పండుని బతిమాలారు. బతిమాలగా, బతిమాలగా కొద్దిగా 'గోక్షీరం' (ఆవుపాలు) పుచ్చుకొన్నాడు. కూర్చున్నవాడు కూర్చునట్లే అలా కూర్చున్నాడు. కన్నెత్తి చూచింది లేదు. పన్నెత్తి మాట్లాడిందీ లేదు. తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, బంధుమిత్రులకు ఏమీ తోచడం లేదు. అంతా 'అయోమయంగా' అగమ్యగోచరంగా వుంది వారికి. బంగారం వంటి పిల్లాడు అన్నెం పున్నెం తెలియని కుర్రాడు చెప్పాపెట్టకుండ, ఉన్నట్టుండి యిలా మారిపోయాడేమిటా యని వారి బెంగ! వారికేమీ పాలుపోవడం లేదు! దిగులుపడి మౌనంగా కూర్చున్నారు!

తెల్లవారుజామున నిద్రనుండి లేచాడు. కుటుంబ సభ్యులందరూ నిద్రపోతున్నారు. స్నానం చేసాడు. తాను లంక తల్లెమ్మ తీర్థంలో కొన్న శ్రీకృష్ణనారదుల చిత్రపటాన్ని తీసుకొన్నాడు. కొబ్బరికాయ, అగరువత్తులు తీసుకున్నాడు. నిద్రపోతున్న తల్లిదండ్రుల పాదాలకు నమస్కారం చేసాడు! లోకవ్యామోహ బంధాన్ని తెగద్రెంచుకొన్నట్లుగా వారి పాదాలకు మ్రొక్కి (తనను కనిపెంచినందుకు) "శాశ్వతంగా" వారి నుండి సెలవు తీసుకొన్నాడు. మాలపల్లెకు సమీపంలో దక్షిణదిశలో నున్న ఇళ్ళ గోవిందరావు గారి కొబ్బరితోటలో పైన చెప్పినట్లు ధ్యాననిమగ్నుడైనాడు.

ఆ రోజు 22-6-1946 శనివారం. శన్యూష శుభగడియల్లో ఆ బ్రహ్మ ముహూర్తం'లో సుబ్బారావు నిశ్చల ధ్యాననిమగ్నుడవడం ఎంత విచిత్రం! ఎంత వరకు పవిత్రం! ఎంత ధన్యం!

లోక జీవితం చిత్ర విచిత్రం! దైవ సంకల్పం, మరీ విచిత్రం! దైవ లీలలు మానవ మాత్రునికి అంతు చిక్కనివి. విజ్ఞానశాస్త్రం దినదినాభివృద్ధి చెందుతున్నా, "భౌతికం"గా లోక మానవ జీవనం పురోభివృద్ధి చెందుతున్నా, కొన్ని సంఘటనలు, కొన్ని పారమార్థిక విషయాలు మానవ మేధస్సునకు, విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానానికి" అంతు చిక్కడం లేదు. అవగాహన కందడం లేదు! అందుకే సుబ్బారావు ఉదంతమే ప్రబల నిదర్శనం.

తల్లిదండ్రులు గాని, సుబ్బారావు గాని 'అక్షర' జ్ఞానం లేని వారు."కులహీనమైన" 'పంచమ' కులం వారిది. వేదాంతమంటే, భక్తి అంటే, ధ్యానమంటే ఏమిటో, యోగాభ్యాసమంటే ఏమిటో తెలియదు సుబ్బారావుకి. ఏదో, రోజూ సాయంత్రం ఆ పేటలోని పెద్దలందరు చేరి చేసే హరిభజనలో పాల్గొనేవాడేమో! అంతే! దేవుడి గురించిన పరిజ్ఞానం గాని, నిత్య పూజా నిర్వహణ గాని లేని "సంస్కారం" లేని వాడు. పోనీ యే 'గురువు' గాని ఏ 'యోగి' గాని లేక ఏ 'బైరాగి' గాని పండుకు ఎట్టి ఉపదేశమిచ్చిన దాఖలాలు లేవు. ఎవరూ 'మంత్రోపదేశమివ్వలేదు.

ఏ గురూపదేశమూలేదు. కాకపోతే, కుర్రాడు మంచివాడు. నీతి, నిజాయితీ గలవాడు. ఎవరినీ పల్లెత్తి మాటలాడి యెరుగడు. ఎవరికీ యింత కీడుతలపెట్టి యెరగనివాడు. పాపపు "పనులేమీ చేయని" పుణ్యబాలుడు!

అట్టి అమాయక అజ్ఞాన అంటరాని బాలుడే శన్యూష పుణ్య గడియల్లో, బ్రహ్మ ముహూర్తంలో ప్రాతః కాల గడియల్లో చీకటిని పారద్రోలుతూ లోకానికి వెలుగునిచ్చే 'సూర్యోదయ' శుభగడియల్లో మాయామోహ లోకజీవిత బంధంనుండి "విముక్తి" చెంది నిత్య సత్య శాశ్వత 'సదానందమయ' పారమార్థిక (అధ్యాత్మిక) మార్గంలోనికి అడుగుపెట్టటానికి 'జ్ఞానోదయ' 'కిరణాలు' ప్రసరించడం జరిగిందని మనం గ్రహించవలెను.

శ్రీ సుబ్బారావు శ్రీకృష్ణ నారదుల వారున్న చిత్రపటానికి ముందుగా పూజించి తపస్సు ప్రారంభించాడు. నారదోపదేశంతో ధృవుడు, ప్రహ్లాదుడు కఠోర తపస్సు చేసి మహావిష్ణువును ప్రసన్నం గావించుకొని వరాలు పొందారు. శ్రీ సుబ్బారావు గూడా నారదుల వారిని గురువుగా భావించి శ్రీ కృష్ణసాయుజ్యం తపస్సు ప్రారంభించాడు. ఏకలవ్యుడు ద్రోణాచార్యుల వారిని గురువుగా సంభావించుకొని స్వంతంగా విలువిద్యలు నేర్చుకున్నాడు.

తల్లిదండ్రులచే పర్ణశాల నిర్మాణం

శ్రీ గంగయ్య పేదవాడు. గృహమా పూరిల్లు. బాలయోగి వారిని దర్శించుటకు రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుచుండేది. ఆ మాలపల్లెలోని వీధులు 'ఇరుకు'గా మురికిగా గూడా యుండుట చేత వచ్చిపోయే సందర్శకులకు కాస్త ఇబ్బందికరంగా గూడ వుండేది. కొందరు పెద్దలు శ్రీ గంగయ్యతో "ఏ పూర్వజన్మ పుణ్యం వల్లనో నీ కుమారుడికి అతి చిన్న వయస్సులోనే 'యోగి' అయ్యే అదృష్టం పట్టింది. "తపస్సు చేసుకొనే పిల్లవాడి మీద 'నీ కొడుక' న్న వ్యామోహం యిక వదలుకోవడం మంచిది. అలానే 'ధ్యానం' చేసుకోనీ. ఆ పిల్లవాడి 'రాత' ఎలా రాసి పెట్టాడో బ్రహ్మదేవుడు! ఏమో శివుడంతటి మహా తపస్వి అవుతాడేమో! ఎవరు చెప్పగలరు! మీదా పూరికొంప! ఈ మాలవాడ వీధులా యిరుకుగా మురికిగా వుంటున్నాయి. తపస్సు చేసుకొనే పిల్లవాడిని యిట్టి 'అపరిశుభ్ర' ప్రదేశంలో వుంచడం మంచిదికాదు. ఇట్టి పరిస్థితుల్లో బాగా ఆలోచించి తగిన వేరొకచోట చిన్నపాక వేస్తే అక్కడ బాలుడు ప్రశాంతంగా ధ్యానం చేసుకుంటాడు. వచ్చిపోయే సందర్శకులకు గూడా సౌకర్యంగా గూడా వుంటుంది" అని పదే పదే చెప్పసాగారు. కొందరు పోలమ్మ చెరువు గట్టుపై పర్ణశాల నిర్మిస్తే బాగుంటుందని సలహా యిచ్చారు. మరికొందరు గవర్నమెంటు వారి పోరంబోకుపుంత భూమిలో వేస్తే బాగుంటుందన్నారు.

శ్రీ గంగయ్య తన కుమారుడు ధ్యానం చేసుకొంటానికి వేరే చోట ఒక పాక వేయాలని నిర్ణయానికి వచ్చాడు. అయితే ఎక్కడ! తనకు శ్రేయోభిలాషులైన కొందరు పెద్దల్ని బంధుమిత్రుల్ని సంప్రదించసాగాడు.

శ్రీ సుబ్బారావు తన తపశ్శక్తివలన తండ్రిగారి సందిగ్ధావస్థ గ్రహించాడు. తన దివ్యజ్ఞానంతో తనకు తపస్సు చేసుకొనుటకు యోగ్యమైన 'పవిత్రస్థలం' తెలుసుకున్నాడు. ఒక శుభోదయాన తన తపస్సు నుండి లేచాడు. చెంబులో నీళ్ళు పోసుకొని పసుపు కలుపుకున్నాడు. ఇంటి నుండి బయలుదేరాడు. తల్లిదండ్రులు చుట్టుప్రక్కల బంధుమిత్రులు, బాలుని 'వింత' ప్రవర్తన గమనిస్తు అతనిని వెంబడించారు. ఉత్తరాభిముఖంగ యింటి నుండి సుమారు రెండు ఫర్లాంగుల దూరం నడిచి వెళ్ళాడు. చేతిలోని చెంబులోని పసుపు నీళ్ళు "ఒకచోట" (పోరంబోకు స్థలం) గుమ్మరించాడు. తిరిగి యింటికి వచ్చి అరుగుమీద మరలా ధ్యానంలో మునిగిపోయాడు.

శ్రీ గంగయ్య యిది గమనించి 'పసుపు నీళ్ళు పోసిన స్థలమందే తన బిడ్డకు 'పర్ణశాల' వేయాలని కోరిక గల్గినట్లుందని గ్రహించాడు. శ్రీ సుబ్బారావు పసుపు నీళ్ళు పోసివచ్చిన స్థలం ప్రభుత్వం వారి పోరంబోకు భూమి! అదే స్థలంలో శ్రీ గంగయ్య ఒక "పాక" నిర్మించాడు. నాల్గు చిన్న రాటలపై వెదుళ్ళు వేసి దానిపై తాటియాకులు పరచి (తాటి యాకుల కప్పు) నాల్గువైపుల కొబ్బరి తడకలు అమర్చాడు. శ్రీ గంగయ్యకు అంతకు మించి మరేమియు చేసే ఆర్థిక స్తోమత లేదు. పూర్వం మునులు అరణ్యంలో తపస్సు చేసుకుంటూ నివాసముంటానికి యిటువంటి పాకలనే (పర్ణశాలలు) వేసుకొనే వారు. వాటినే పర్ణశాలలని, కుటీరాలనీ అనేవారు. ఇప్పుడు శ్రీ గంగయ్య తపస్సు చేసుకొనే తన బిడ్డకు వేసిన పాకను గూడా విద్యాధికులు, లోకజ్ఞానం గలవారు 'పర్ణశాల' అని అనేవారు.

ఈ పర్ణశాలలో బాలయోగి తపస్సు చేసుకొనుటకు 'ఆసీను' లగుటకు ఒక చిన్న పీఠం (అరుగు) గూడా శ్రీ గంగయ్య ఏర్పాటు చేశాడు. ఈ పర్ణశాల నిర్మాణం పూర్తికాగానే ఒకనాడు బాలయోగి లేచి, తనయింటి నుండి తన కోసం నిర్మించిన పర్ణశాలకు బయలుదేరాడు. అయితే 'జలాన్నాలు' లేకపోవడం చేత, కొంత నీరసించి నడుచుటకు "ఓపిక" లేనట్లు కనిపించిన "బాలయోగి"ని తన పినతండ్రి (గంగయ్యగారి చిన్న తమ్ముడు) శ్రీ బుల్లి వెంకన్నగారు "బాలయోగి"ని ఎత్తుకొని పర్ణశాలకు తీసుకొని పోయాడు. తన ధ్యాననిమిత్తం ఏర్పాటు చేసిన పీఠంపై బాలయోగి వారు తూర్పు ముఖం పెట్టి పద్మాసనం వేసుకొని కూర్చొని తపోనిమగ్నమయ్యాడు. దరిమిలా పరమభక్తుడు శ్రీ పోలయ్యరెడ్డి గారు నిర్మించిన 'దర్శన మంటప' స్థలమే, బాలయోగి వారికి తండ్రి శ్రీ గంగయ్య ప్రథమంగా పర్ణశాల నిర్మించిన 'పవిత్ర' స్థలం.

వంశ వృక్షం

తీరాంధ్రంలోని తూర్పు గోదావరి జిల్లాలో 'కోనసీమ' ప్రకృతి సౌందర్యానికి, పాడి పంటలకు, పుణ్యక్షేత్రాలకు పుట్టినిల్లు. కోనసీమకు అధికార కేంద్రమైన అమలాపురం పట్టణానికి సుమారు పదిమైళ్ళ దూరంలో తూర్పుగా "ముమ్మిడివరం" గ్రామముంది.

ముమ్మిడివరం గ్రామంనకు దక్షిణ దిశయందు ఒక మాలవాడగలదు. "కటికదల" వంశం వారు యీ "మాలగూడెం"లో పేరున్నవారు. ఆ వాడకు యీ కటికదల వంశం వారే "తలలో నాలుక" వంటివారు. ఈ వంశంలో వెంకయ్య అను నాతడు పెద్ద మనిషి. శాంత స్వభావుడు. న్యాయవర్తనుడు. విద్యాగంథం లేని వాడు. అయినా ధర్మబుద్ధి కలవాడు. కష్టజీవి. స్థిరాస్తులు ఏమీలేని వాడు. జీవన వృత్తి (బ్రతుకుదెరువు) కౌలు వ్యవసాయం. రైతు కూలీ పని. జ్యోతిష్యమందు కొంచెం ప్రవీణుడు. ఇతరుల చేతులు చూచి వెంకయ్య చెప్పే విషయాలు యదార్థములయ్యేవి. అందుకే వెంకయ్య అంటే ఆ పల్లెలో గౌరవం.

వెంకయ్య భార్య పల్లమ్మ. ఆమె భర్తకు అన్ని విధాల అనుకూలవతియైన భార్య. శాంత స్వభావురాలు. వచ్చిపోయే బంధుమిత్రులకు, అతిథులకు "మంచి మర్యాదలు" చేయుటలో ఆమెకామెయే సాటి. ఇట్టి పుణ్యదంపతులకు శ్రీ రెడ్డి, శ్రీ పల్లయ్య, శ్రీ గంగయ్య, శ్రీ నరసన్న, శ్రీ వెంకన్న అను అయిదుగురు కుమారులును శ్రీమతి సుబ్బమ్మ శ్రీమతి గంగమ్మ అను ఇద్దరు కుమార్తెలును మొత్తం ఏడుగురు సంతానం.

శ్రీ గంగయ్య ప్రథమ వివాహం

ఈ ఐదుగురు కుమారులలో మూడవ వాడైన శ్రీ గంగయ్య గారే మన సుబ్బారావుకు తండ్రి. శాంత స్వభావం కలవాడు. పెద్దల యెడల వినయ విధేయతలు కలవాడు. కష్టజీవి. శ్రీ గంగయ్య గారి మొదటి భార్య వారి మేనమామ కుమార్తెయగు శ్రీమతి వెంకమ్మ దురదృష్టవశాత్తు ఆమె వలన శ్రీ గంగయ్యకు సంతానం కలుగలేదు. ఆమె అచిరకాలములోనే కాలధర్మం చెందింది.

శ్రీ గంగయ్య ద్వితీయ వివాహం

శ్రీ గంగయ్యకు "ఐనవిల్లి" గ్రామ కాపురస్తులు శ్రీ నక్కా రెడ్డి శ్రీమతి సత్తెమ్మల పెద్ద కుమార్తెయగు 'రామమ్మ' నిచ్చి రెండవ వివాహం జరిగింది. ముమ్మిడివరం, గోదావరుల మధ్య "ఐనవిల్లి" గ్రామమున్నది. ఇచ్చట ప్రసిద్ధ వినాయకుని ఆలయమున్నది. శ్రీ నక్కారెడ్డి గార్కి నలుగురు కుమారులు నలుగురు కుమార్తెలు గల్గారు. రెడ్డిగారు పరమ శ్రీరామభక్తుడు. శాంత స్వభావం కలవాడు. నీతిమంతుడు. రెడ్డిగార్కి 'లంక'లో స్వంత వ్యవసాయం కొంతవుంది.

పెద్ద కుమార్తె రామమ్మకి దైవభక్తి మెండు. ఆమె ఎప్పుడూ 'నారాయణ' నామం జపిస్తూ వుండేది. శ్రీ నక్కారెడ్డి గారు 'రామ' భక్తుడగుట చేత తమ ప్రథమ పుత్రికకు రామమ్మ అని పేరు పెట్టారు. తమ కుమార్తెను "రాముడూ-రాముడూ" అని ముద్దుగా పిలిచేవారు.

శ్రీమతి రామమ్మగారి దేహ కాంతి మేలిమి బంగారు ఛాయగలది. (గౌరవర్ణం) ఆమె మిక్కిలి యెత్తును, మిక్కిలి కురచయు కాక మధ్యస్థంగా వుండేది. పొడవునకు దగ్గలావు, నేత్రాలు విశాలమైనవి. లక్ష్మీదేవి వలె వుండెడిది. భర్త యెడల దైవభావంతో మెలిగేది. అత్తమామల యెడల, బంధుమిత్రులయెడల గౌరవభావంతో మెలిగేది.

శ్రీ గంగయ్య శ్రీమతి రామమ్మలకు, వెంకన్న, నాగన్న, సుబ్బారావు (మన పెద్ద బాలయోగీశ్వరులు) తర్వాత ఒక ఆడపిల్ల సంతానం గల్గారు. ఆడపిల్ల పుట్టిన కొద్దిరోజులకే చనిపోయింది. దురదృష్టవ శాత్తు శ్రీమతి రామమ్మ గారును అనారోగ్యంతో 1934 సంవత్సరములో అకాలమరణమొందిరి.

అహింసామూర్తి, హేతువాది, జీవకారుణ్యమూర్తి పంచశీలధారి, అష్టాంగమార్గ నిర్దేశి అయిన శ్రీ భగవాన్ బుద్ధుడు గూడా శైశవమందే మాతృమూర్తిని కోల్పోయాడు. శ్రీ రామానంద తీర్థులవారు గూడా బాల్యమందు తల్లిని పోగొట్టుకొన్నాడు.

శ్రీ గంగయ్య మూడవ వివాహం

వయసున డెబ్బది యేండ్లుదాటిన ముదుసలి అయిన గంగయ్య శరీరదారుఢ్యం గలిగి యుక్తవయస్సులో నున్న యువకునిలా మంచి ఆరోగ్యం కలిగియుండెను. బిడ్డలు ముగ్గురు చాలా చిన్నవారు. కనుక కొత్తపేట గ్రామస్థులైన శ్రీమతి పరమటి వెంకమ్మ (శ్రీమతి నక్కా సత్తెమ్మ గారి చెల్లెలు) గారి ప్రథమ పుత్రిక శ్రీమతి వెంకమ్మను గంగయ్య గారు తృతీయ వివాహమాడారు. తృతీయ భార్యవలన గంగయ్యగారికి వరుసగా శ్రీ భూషణం, చంద్రరావు, సూర్యనారాయణ, పెదసుబ్బారావు, చినసుబ్బారావు అను ఐదుగురు కుమారులును బాల యోగీశ్వరమ్మను నొక కుమార్తెయు గల్గిరి. ఇందులో పెద్దవాడు, నాగభూషణమే తర్వాత "చిన బాలయోగి" అయ్యాడు.

మొత్తం మీద గంగయ్య గారికి మూడు పెండిండ్లు అయ్యాయి. మొదటి భార్య వెంకమ్మ వలన బిడ్డలు కలుగలేదు. రెండవ భార్య రామమ్మ వలన ముగ్గురు కుమారులును ఒక కుమార్తెయును, మూడవ భార్య వలన ఐదుగురు కుమారులు, ఒక కుమార్తెయును, అంటే మొత్తం పది మంది బిడ్డలకు తండ్రి అయ్యాడన్నమాట. అయితే రెండవ భార్య వలన కలిగిన ఆడశిశువు పుట్టగానే పోయింది. కనుక గంగయ్య గారికి ఇద్దరు భార్యలవల్ల తొమ్మండుగురు

బిడ్డలు కలిగారన్నమాట. ఇందులో రెండవ భార్య వలన కలిగిన ముగ్గురు బిడ్డలో కనిష్ట కుమారుడు 'సుబ్బారావు' పెదబాలయోగి కాగా, మూడవభార్య వలన కలిగిన ఆర్గురు సంతానంలో 'పెద్దవాడు' భూషణం దరిమిలా "చినబాలయోగి" అయ్యాడు. విచిత్రమేమంటే గంగయ్య గారికి దాదాపు అరవై సంవత్సరాల వయస్సు వచ్చేవరకు బిడ్డలు కలుగనేలేదు. ఇద్దరు భార్యల వలన కలిగిన యీ తొమ్మండుగురు బిడ్డలు గంగయ్య గారి వయస్సు అరవై-తొంభై సంవత్సరాల వయస్సునందే! ఎంత విచిత్రం! ఏమిటీ దైవలీల!

శ్రీ సుబ్బారావు జన్మదిన విశేషం (విశిష్టత)

ది. 23-10-1930 తేదీ కటికిదల వంశానికి పర్వదినం. లోకానికి ఎంతో శుభకరం. ఆ పుణ్యదినమందే సుబ్బారావు జన్మించాడు. అది ప్రమోదూత నామసంవత్సర కార్తీకశుద్ధ విదియా స్వాతి నక్షత్ర గురువారం. సంవత్సర ప్రమోదూత అంటే "ప్రమోదాలు" అంటే 'శుభాలరాయబారి' శుభాల ప్రతినిధి అంటే "శుభప్రదాత. శుభంకరుడు. కార్తీకమాసం హైందవ మత విశ్వాసం ప్రకారం 'శైవ' సంప్రదాయక శుభ మాసం! ఆత్మ (శివ) పరంజ్యోతి లోకంలో "జ్యోతులుగా, దీపాలుగా, లోకానికి, నమ్మిన వారి గృహాలకు "వెలుగు" నిచ్చే శుభమాసం! ఇక నక్షత్రం స్వాతి, ఇది కూడా 'వెలుగు'నకు 'కాంతి' కి ప్రతీక. వారం గురువారం! "జ్ఞానం" నకు చిహ్నం. తిథి. "విదియ" ఇదియును "తెలివిడికి" గుర్తు. మొత్తం మీద యిలా "తిథివార" నక్షత్ర మాసాల్ని బట్టి పరిశీలిస్తే అన్నీ "వెలుగు"నకు 'జ్ఞానం'నకు ప్రతీకలని తేలుతుంది. కనుక యిట్టి శుభగడియల్లో జన్మించిన సుబ్బారావు కనుకనే 'అంధకారబంధుర మాయా లోక జీవితం నుండి బయటపడి, "జ్ఞానోదయుడై" సచ్చిదానందమయమైన "పరంజ్యోతి"ని పిన్నవయస్సు లోనే "చూడ" గలిగాడు. "స్వయం జ్ఞాన సిద్ధుడు"గా సహజ సిద్ధ తపస్విగా వ్యక్తమయ్యాడు. దుఃఖమయమైన మాయామేయ 'లోకులకు' జ్ఞాన మార్గదర్శి అయ్యాడు. తర్వాత తర్వాత బాలయోగిగా, తపోసిద్ధిగాంచిన "దివ్య చైతన్యమూర్తి"గా.

ఇట్టి శుభప్రదమైన తిథి వార నక్షత్ర గడియల్లో జన్మించినాడు కనుకనే బంగారు శరీర చ్ఛాయతో, విశాల 'పద్మ' నేత్రాలతో ప్రశాంత చిత్తంతో సాధు స్వభావంతో, మృదుభాషనుడిగా తన విశిష్ట "వ్యక్తిత్వం" తాను మలచుకొన్నాడు.

కారణ జన్ములు అవతార పురుషులైన బుద్ధభగవానుని మాయాదేవి తెల్లవారు జాముననే ప్రసవించింది. శ్రీ రామచంద్రమూర్తిని కౌసల్యాదేవి తెల్లవారు జాముననే కన్నది. శ్రీకృష్ణ భగవానుని దేవకీదేవి తెల్లవారు జాముననే ప్రసవించింది. ప్రభువైన ఏసుక్రీస్తునకు మరియమ్మ (మేరి) తెల్లవారు జాముననే జన్మనిచ్చింది. ఇస్లాం మత ప్రవక్తయగు హజరత్ మహమ్మదుని

అమీనా తెల్లవారు జాముననే కన్నది. ఇపుడు యీ సుబ్బారావుని (బాలయోగి) శ్రీమతి రామమ్మ గారు తెల్లవారు జాముననే కన్నది. అలానే శనివారం 'ప్రత్యూష' బ్రహ్మ ముహూర్తంలోనే తపస్సున కుపక్రమించినాడు. అది పవిత్రమైన బ్రహ్మ ముహూర్తం.

తెల్లవారు జామున ముక్కోటి దేవతలు దేవ లోకంనుండి భూలోకంనకు వచ్చి పవిత్ర గంగాది సమస్తనదులలో సప్త సముద్రాలలో స్నానమాచరించి వెళతారని ప్రతీతి. అదే సమయం లో భూలోకంలో జన్మించిన మానవుల్ని దేవతలు దీవిస్తారట. కనుకనే తెల్లవారు జామున జన్మించినవారు లోకోత్తర పురుషులు, మహానుభావులు, లోక కళ్యాణకారులు, అవతార పురుషులు అవతారమని భారతీయుల నమ్మకం. మన సుబ్బారావు లోకోత్తర మహాయోగి కానున్నాడు కనుకనే తెల్లవారు జామున జన్మించాడు. అలానే తెల్లవారు ఝామున తపస్సు ప్రారంభించినాడు.

అటులనే బాలయోగివారు అతి నిరుపేద అందునా "పంచమ" జాతిలో పుట్టుట మరొక విశేషం. క్రీస్తు మత ప్రవక్త నిరుపేద వడ్రంగి వాడైన యోసేబునకు జన్మించెను. రామకృష్ణ పరమహంస పేదపురోహితునింట జన్మించెను. అద్వైత సిద్ధాంతకర్త ఆది శంకరాచార్యుల వారు గూడా పేద బ్రాహ్మణుడిగా పుట్టెను. షిరిడీసాయిబాబా పేద బ్రాహ్మణులకు జన్మించి, వారి బిడ్డను పోషింపలేక అడవిలో వదలిపెడితే, బిడ్డలులేని ఒక పేద మహమ్మదీయ భార్యా భర్తలు చూచి, ఆ బిడ్డను 'అల్లా' తమకనుగ్రహించిన 'బిడ్డ'గా ప్రేమతో పెంచి పెద్దచేశారు.

"సుబ్బారావు" అని నామకరణం చేయటానికి గల ఒక ముఖ్య కారణం

వివాహం అయిన తర్వాత శ్రీమతి రామమ్మ గారు స్వగ్రామమైన ఐనవిల్లికి తల్లిదండ్రులు దీపావళి పండుగకు తీసుకొని పోయారు. అప్పుడామె గర్భవతి. నాగులచవితికి చెలికత్తెలతో కలిసి ఆమె వూరిబయట నున్న పుట్టలో పాలు, పండ్లు, పసుపు, కుంకుమ పోయు సమయంలో పుట్ట కన్నముల నుండి సువాసనలతో పాటు పుట్టలో నుండి (ఆదిశేషుడు) "నేను నీకు బిడ్డగా పుట్టబోవుచున్నానన్న" మాటలు వినబడడం జరిగిందట. ఆమె భయపడి యింటికి పరుగెత్తుకొని వచ్చి విషయం తల్లిదండ్రులతో చెప్పిందట.

శ్రీమతి రామమ్మకు కలలో "ఐదు శిరసుల సర్పం" కనిపించి "నాకు-నీకూ యీ సకల విశ్వానికి మూలపురుషుడైన నా స్వామి (విష్ణుమూర్తి) నీ కడుపున పుట్టబోతున్నాడు. నీవు ధన్యాత్మురాలవని చెప్పడం జరిగింది. ఇలాంటి కలలు తరచుగా రామమ్మకు రావడం జరిగింది. ఆమె భయపడిపోయింది. అమాయకులైన కన్నవారు, బంధుమిత్రులు, ఇరుగు పొరుగువారు "పాము" పగబట్టిందని చెప్పడం జరిగింది. మంత్రగాళ్ళు "సర్పదోష" మున్నదని పూజలు చేసి రామమ్మకు "తాయెత్తు" ధరింపజేసారు. సర్పరాజుకు "సుబ్రహ్మణ్యం" అని

"సుబ్బారాయుడ"ని అంటారు గదా. అందుకే సుబ్బారావు అని నామకరణం చేసినట్లు మనం గ్రహింపవలయును.

కొద్ది రోజుల తర్వాత రామమ్మ అత్త వారింటికి తిరిగి వచ్చింది. కొన్ని నెలల తర్వాత రామమ్మకు మగపిల్లవాడు పుట్టాడు సర్పదోష నివారణకో లేదా సుబ్బారాయుడి (నాగరాజు) కరుణా కటాక్షములు ఆశించియో, ఆ పిల్లవానికి "సుబ్బారావు" అని పేరుపెట్టడం జరిగింది. (ఈ సంఘటన సమాచారం-గంగయ్యగారు సుబ్బారావు మేనత్త శ్రీమతి బీరం సుబ్బమ్మ నుండి శ్రీ బాలయోగి వారి భక్తుడు శ్రీ భీమయ్య సేకరించినది) అయితే శ్రీ బాలయోగి వారి పూర్ణ చరిత్రను 'సాధికారికం'గా రాసిన శ్రీ జయంతి స్వామి నాయనగారు మాత్రం యీ విషయం గురించి రాయలేదు. బుద్ధుని తల్లికి స్వప్నంలో తెల్ల ఏనుగు కన్పించడం, క్రీస్తు జననం ముందు (కన్య మరియమ్మ గర్భం దాల్చినందున) దేవదూతలు కనిపించి, "పరమపితయగు' యెహోవా దేవుని చిత్త ప్రకారం లోక రక్షకుడు నీ గర్భమందు పుట్టబోవుచున్నాడని" చెప్పడం జరిగింది. దేవకీదేవి గర్భమందు జన్మించు మగశిశువు (శ్రీకృష్ణుడు) మేనమామ (దేవకీ సోదరుడు)ను సంహరించునని ఆకాశవాణి చెప్పడం-యిత్యాది ఉదాహరణలు ఎన్నో వున్నాయి. అలానే సుబ్బారావు తల్లి రామమ్మకు ఆదిశేషుడు స్వప్నంలో కనిపించి పుట్టబోవు బిడ్డ గురించి చెప్పాడు.

శ్రీ సుబ్బారావు గోపాల జీవితం

పంచమ కులస్థులలోను, ఇతర బడుగు వర్గాలలోను, బాలురను యువకుల్ని "సంపన్న భూస్వాముల దగ్గర "పాలేర్లు"గా పెట్టడం పరిపాటిగా వుండేది. శ్రీ సుబ్బారావు పది సంవత్సరాల వయస్సు వచ్చు వరకు ఇంటివద్దనే వుండి తల్లిదండ్రులకు యింటి పనులందు చేయూత నిచ్చెడివాడు. స్కూలుకు పోయి అక్షరం ముక్క నేర్చుకొనలేదు. అల్లరి చిల్లర పనులు చేసెడివాడు కాదు. శాంత స్వభావుడు. మితభాషి. మన సుబ్బారావుకు పది సంవత్సరాల వయస్సు రాగానే తల్లిదండ్రులు 'పేదరికం' చేత శెట్టి బలిజ రైతు దొమ్మేటి బాపన్న గారి దగ్గర 'గోవుల కాపరి'గా నియమించారు. శ్రీ సుబ్బారావు 'యెర్రగా-బొద్దుగా' చూడముచ్చటగా వుండడం వల్ల 'దొమ్మేటి బాపన్న గారి భార్య సీతమ్మ గారు శ్రీ సుబ్బారావును 'పండూ-పండూ' అని పిలిచేది. ఈ 'పండు' పేరే అందరికి సుపరిచయమైన పేరు. దొమ్మేటి వారి వద్ద 'మూడు సంవత్సరములు' గోపాలుడుగా వుండి తర్వాత మాని వేసాడు శ్రీ సుబ్బారావు.

తర్వాత శ్రీ దొమ్మేటి వెర్రియ్య (పెద సత్తయ్య) గారి వద్ద 'చిన్న పాలేరు'గా గోవులను రెండు సంవత్సరాలు కాచాడు శ్రీ సుబ్బారావు. వెర్రియ్యగారున్నూ, వారి భార్య రామమ్మ (రామ లక్ష్మమ్మ) గారున్నూ వారి బిడ్డలున్నూ శ్రీ సుబ్బారావు 'మంచితనం' చూచి ఎంతో ప్రేమతో

చూసేవారు. మే మాసాంతం జూన్ నెల మొదట్లో కోనసీమ ప్రాంతంలో వైభవంగా జరిగే శ్రీలంక తల్లెమ్మ తీర్థం (తిరునాళ్ళు) వచ్చే సరికి యజమానితో "ఇక నేను మీ దగ్గర పాలేరుతనము మాని వేస్తాను. కనుక క్రొత్త పాలేర్ని కుదుర్చుకొండ"ని శ్రీ సుబ్బారావు వారికి నిక్కచ్చిగా చెప్పాడు. యజమానులు, సుబ్బారావు తల్లిదండ్రులు గూడా "నచ్చ" చెప్పుటకు ప్రయత్నించిరి కాని సుబ్బారావు 'ససేమిరా' అని నిరాకరించాడు. "ఇటువంటి మంచి బుద్ధిగల పాలేరు మనకు దొరకడం చాలా కష్టసాధ్యమని" శ్రీ వెరియ్యగారు వారి భార్యాబిడ్డలు బాధపడ్డారు.

"ఇక ముందు నేనెవ్వరి దగ్గర గోవుల్ని కాయనని" శ్రీ సుబ్బారావు మొండికేసినా, తల్లిదండ్రుల బలవంతం వల్లను, శ్రీ మట్టపర్తి వేంకన్నగారు సుబ్బారావు 'బుద్ధిమంతు'డగుట చేత, పట్టుబట్టుట చేతను, పిన్న వయస్సులో నున్న సుబ్బారావు తల్లిదండ్రుల మాట కాదనలేక రెండు పూటల భోజనంతోపాటు పెచ్చు జీతంతో తనకు పాలేరు పని చేయడం యిష్టం లేక పోయినను, వెంకన్నగారి గోవులను కాయుటకు శ్రీ సుబ్బారావు ఒప్పుకున్నాడు. వెంకన్నగారున్నూ, ఆయన భార్య శ్రీమతి గవరమ్మ గారును శ్రీ సుబ్బారావు 'సాధుస్వభావం' వాని 'నిజాయితీ'ని చూచి ఎంతో ఆనందపడి పోయేవారు. అయితే వాళ్ళ 'దురదృష్టం' కొద్దీ సుబ్బారావు వారి దగ్గర కొద్దిరోజులు మాత్రమే (ఒక నెల గూడా లేదు) పాలేరుగా పనిచేసి మానివేశాడు.

శ్రీ సుబ్బారావు ఆకారమున తండ్రిని మేలి బంగారు దేహచ్ఛాయ గల్గి తల్లిని బోలి యుండెడివాడు. విశాలనేత్రములు గల్గి, ముఖం పూర్ణ చంద్ర బింబంవలె, విశాలమైన పాలభాగం గల్గి, ఆజానుబాహువుగా నుండెడివాడు. చిన్నతనంలో సాధారణంగా పిల్లలు 'అల్లరి చిల్లరి' చేష్టలు చేసే స్వభావం గల్గి వుంటారు. కాని శ్రీ సుబ్బారావు 'అల్లరి పిల్ల వాడు కాదు. చిలిపి చేష్టలు చేసి యెరుగడు. సాధుస్వభావం గల్గిన నెమ్మదస్తుడు. మితభాషి. పెద్దలయెడల వినయ విధేయతలు గల్గి ప్రవర్తించెడివాడు. శ్రీ సుబ్బారావు పిన్నవయస్సులో అంటే 3 సం॥ నుండి 10 సం॥ల వరకు మోకాళ్ళ వరకు తెల్లటి లాగును (నిక్కరు) చొక్కాను ధరించాడు. గోపాలవృత్తిలో చేరినప్పటి నుండి అనగా 10 సం॥ల నుండి 16 సం॥ వయస్సు వచ్చే వరకు (తపస్సు ప్రారంభించేంతవరకు) మోకాళ్ళ వరకు పరిశుభ్రమైన తెల్లటి పంచె కట్టును, ఒంటిపై చేతులు, చెవులు (కాలరు) గల్గిన బనియను, భుజంపైన రుమాలు (చిన్న పైపంచె), చేతిలో గోవుల్ని కాయుటకు గాను పొడవైన వెదురు కర్ర ధరించి యుండెడివాడు. బక్క పలచగా, సన్నటి శరీరంతో చక్కని ఎరుపు రంగుతో చూడముచ్చటగా నుండెడివాడు. ఒక్కోసారి రుమాలును చక్కగా తలపాగా చుట్టుకొనెడివాడు. చూపరులకు, రాజఠీవితో కనిపించెడివాడు. నల్లని శిరోజాలు అందమైన క్రాపింగు చేయించుకొనెడివాడు.

భారతీయ ఆర్యధర్మ (హిందూ మతం) ప్రకారం 'గోవు' చాలా పవిత్రమైనది. 'గోవు'

అంటే వేదాంతార్థంలో వెలుగు జ్ఞానం అని అర్థం. గోపాలుడంటే జ్ఞాన పరిరక్షకుడని, లేక జ్ఞానము లేదా వెలుగు ప్రసరించెడివాడని భావం! శ్రీ సుబ్బారావుకు బాల్యంలో గోవులే ఆప్త మిత్రులు. జ్ఞానోదయ ప్రభాకరులు. భారతీయులు ముఖ్యంగా హైందవులు ఆవును 'గోమాత' గా పూజిస్తారు. సర్వ దేవతా స్వరూపిణిగా సంభావిస్తారు. గోదుగ్ధం (పాలు) గోమయం, గోమూత్రం అన్నీ పవిత్రంగా భావిస్తారు. గోవు చాలా సాధు జంతువు. గోవు 'కామధేనువు' వంటిది. శ్రీకృష్ణుడు 'బాల్యం'లో గోపాలుడు గదా! జాబాల కుమారుడైన సత్యకాముడు గురువు నాజ్ఞ ప్రకారం గోవుల్ని మేపి, గో సంతతి పెంపు జేసి మహాఋషి అయ్యాడు. మన బాలయోగి వారున్నూ, బాల్యంలో గోపాలునిగా సుమారు ఐదు సంవత్సరాలు జీవితంగడిపి 'ఘోరతపస్సు'నకు ఉపక్ర మించి 'బాలయోగి'గా లోకప్రసిద్ధిచెంది కైవల్యసిద్ధి చెందారు.

తపో ఆశ్రమ నిర్మాణం

గవర్నమెంటు పోరంబోకు స్థలంలో తల్లిదండ్రులు నిర్మించిన 'పర్ణశాల' బాల యోగీశ్వ రుల వారికి అంత సౌకర్యంగా లేదు. నిత్యం తపో నిమగ్నుడైన బాలయోగికీ లోకంతో సంబంధం లేకపోయినా, ఆయన్ని దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు, 'వింత' గా చూచి పోదామని వచ్చే వందలు వేలాది భక్తులకు 'అసౌకర్యం'గా వుందని భావించాలి. కనుక మొదట నిర్మించిన పర్ణశాల కంటె కాస్త పెద్దది 'తపోశాల' (తపో మందిరం) నిర్మించాలని శ్రీ గంగయ్య గారికి ఆలోచన వచ్చింది. కొందరు పెద్దలు గూడా శ్రీ గంగయ్యకే సలహా యిచ్చారు.

మొదట నిర్మించిన పర్ణశాల వెనుక భాగంలో అనగా దక్షిణ దిశయందు కొంత ఖాళీ స్థలం మున్నది. అది గూడా గవర్నమెంటు వారి పోరంబోకు భూమియే. ఆ ఖాళీ స్థలంలో 'మంచి ముహూర్తం' చూసుకొని, రెండు చిన్న గదులు, యిటుక గోడలుతో 'తపో ఆశ్రమం నిర్మించారు శ్రీ గంగయ్య. దంపతులు బాలయోగి వారి దర్శనార్థం వచ్చే భక్తులు కొందరిచ్చే 'కానుకలు' కూడ పెట్టిన సొమ్ముతో శ్రీ గంగయ్య యీ తపో ఆశ్రమం నిర్మించాడు. అంటే అంతటి స్థిత ప్రజ్ఞుడైన సిద్ధయోగివారు ఇంకా విశాల ప్రపంచం దృష్టిలో పడలేదు. పైగా బాలయోగి వారి 'కులం' కారణంగా కూడా లోకమాయన తపో మహిమనింకా గుర్తించ లేదని పిస్తుంది.

ఈ తపో ఆశ్రమంలో రెండు గదులు వున్నాయి. ఒకటి దక్షిణాన, రెండోది ఉత్తరాన. మట్టి, సున్నంతో ఇటుక గోడల నిర్మాణమది. (గుమ్మాలు) తలుపులు మాత్రం అమరలేదు. వాటికి బదులు నాలుగు ఆర్చీలు మాత్రం అమర్చబడ్డాయి. గదులపైన వాసములు వేసి తాటి యాకుల కప్పు వేయబడింది. దక్షిణ గదిలో బాలయోగివారు కూర్చొని తపస్సు చేసుకొనుటకు

వీలుగా ఒక పీఠం (అరుగు) ఏర్పాటు చేయడమైనది. ఈ తపోశాల నిర్మాణం పూర్తికాగానే బాలయోగీశ్వరుల వారు ఎవరికీ తెలియకుండగనే 'పర్ణశాల' వీడి తపో మందిరం (తపోశాల) లో ప్రవేశించి, తన తపస్సునకు ఏర్పాటు చేసిన 'తపో పీఠం' పై పద్మాసనంతో తూర్పు ముఖంతో ఆశీనుడై తపస్సు కొనసాగించాడు. మనకు తెలిసిన విషయం ఏమిటంటే, శ్రీ బాలయోగి వారి తల్లిదండ్రులు మొదట నిర్మించిన 'పర్ణశాల' స్థలంలోనే 1949లో శ్రీ బోరపోలయ్యారెడ్డి 'దర్శన మండపం' సొంత వ్యయంతో నిర్మించారు.

"బాలయోగి" నామమే స్థిర (శాశ్వత) నామమగుట

తల్లిదండ్రులు పెట్టిన పేరు "సుబ్బారావు". అయితే చిన పాలేరుగా పని చేసినపుడు, ఎర్రగా బక్కపల్చగా వుండుట వలన "పండు" పేరున అందరూ పిలిచెడివారు. అయితే శ్రీ సుబ్బారావు 15 సం॥ వయస్సులో తపస్సున కుపక్రమించుటచేత, అది బాల్య, కౌమార (యౌవ్వన) దశలకు మధ్య దశయగుటచేత, లోకం పాప పుణ్యాలంతగా తెలియని 'బాల్య' దశలో, పెండ్లీ పేరంటంలేని బాల "బ్రహ్మచారి" దశలోనే శ్రీ సుబ్బారావు "తపస్సు" ప్రారంభించుటచేత, ఆయనను దర్శించుటకు వచ్చే భక్తులు. స్వగ్రామ, పరిసర గ్రామ ప్రజలు యావన్మంది "బాలయోగి" అని పిల్వడం ప్రారంభించారు. పద్మశ్రీ బోయి భీమన్న గారు "బాలయోగి" అని మొదట ఈలివాడపల్లిగారు పిలిచారంటాడు. "బాలతపస్వి" అని పిలుచుటకు బదులు విద్యాధికులు జన బాహుళ్యం ఆయన్ని "బాలయోగి" అని పిలుచుట పరిపాటై పోయింది. ప్రహ్లాదుడు, మార్కండేయుడు, బాల్యమందు కఠోర తపస్సు చేసినా వారిని 'బాల మునీశ్వరులని' అన్నారు. గాని 'బాలయోగు'లన లేదు. "యోగి నా మపి సర్వేషాం మదతేనాన్త రాత్మనా శ్రద్ధా వాన్భజతే యోమాం సమే యుక్తత్మో మతః (గీత-6-477) - శ్రీకృష్ణునే (విష్ణువు) పరమగతిగా భావించి స్థిర చిత్తంతో ధ్యానం చేసే యోగిని యోగశ్రేష్ఠుడని గీతా ప్రమాణం. శ్రీ బాలయోగి వారు యాభైయైదు సంవత్సరాలు జీవించి, సుమారు 39 సంవత్సరాలు సుదీర్ఘ ఘోర (కఠోర) తపస్సు చేసినను ఆయన పేరు "బాలయోగి" గానే స్థిర (శాశ్వతమై) పడి పోయింది. తర్వాత శ్రీ బాలయోగి వారి తమ్ముడు 'భూషణం' గూడా దీర్ఘ తపస్సునకు ఉపక్రమించుట చేత శ్రీ సుబ్బారావును "పెదబాలయోగీశ్వరు"లని (పెద్దస్వామి) శ్రీ భూషణంను "చిన్న బాలయోగీశ్వరు' ' (చిన్నస్వామి) లని జనబాహుళ్యం పిల్వసాగారు. 'భాషా ప్రవీణ' శ్రీ మల్లంపల్లి దుర్గా మల్లికార్జున ప్రసాద్ గారు "శ్రీ బాలయోగి పదమే యపూర్వము విచిత్రము" అని అభిభాషించాడు.

6-2-49న శ్రీ పెదబాలయోగీశ్వరులు ప్రప్రథమంగా మాట్లాడుట (శ్రీ వ్యాసం సత్యరాజుగారితో)

గవర్నమెంటు పోరంబోకు స్థలంలో శ్రీ సుబ్బారావు తల్లిదండ్రులొక పర్ణశాల నిర్మించి రనియు, అందు శ్రీ సుబ్బారావు తపస్సు కొనసాగించుచుండెననియు, రోజు రోజుకు



23-6-1947లో బాలయోగీశ్వర్లు



16-2-1950లో బాలయోగీశ్వర్లు

21-2-1950లో బాలయోగీశ్వర్లు

4-3-1954లో బాలయోగీశ్వర్లు



3-1954లో బాలయోగీశ్వర్లువారితో బోర పోలయ్యరెడ్డిగారు



స్వామివారితో శ్రీ ముత్యాల జానకిరామయ్యగారు

4-3-1954లో బాలయోగీశ్వర్లతో
బచ్చు మాధవయ్యగారు

27-2-1955లో బాలయోగీశ్వర్లు



17-2-1956లో బాలయోగీశ్వర్లు



28-2-1957లో బాలయోగీశ్వర్లు

17-2-1958లో బాలయోగీశ్వర్లు



1960లో బాలయోగీశ్వర్లు



6-1-1964లో బాలయోగీశ్వర్లు



30-10-70లో బాలయోగీశ్వర్లు





17-2-1977లో బాలయోగీశ్వర్లు



26-2-1979లో బాలయోగీశ్వర్లు



23-2-1982లో బాలయోగీశ్వర్లు



తపోమందిరమందు ప్రతిష్టించబడిన
స్వామి వారి విగ్రహం



1983లో భగవాన్ బాలయోగీశ్వర్లు



చిన్న బాలయోగీశ్వరుల వారు



[illegible] ప్రతిష్ఠింపబడిన పెద్ద బాలయోగీశ్వరుల వారి పాలరాతి విగ్రహం



[illegible] పొందిన [illegible] ప్రతిష్ఠించబడ్డ చిన్నస్వామి వారి పాలరాతి విగ్రహం

సందర్శకులధికమై శ్రీ సుబ్బారావుని "బాలయోగి" అని పిలువసాగిరనియు యింతకు ముందు చెప్పుకున్నాం. అయితే పర్ణశాల (పాక)కు పైన ఆచ్ఛాదనం కప్పి చుట్టూ తాటాకు తడికెలు మాత్రమే వుండి, పర్ణశాల దాదాపు 'బహిరంగంగా' వుండడంవల్ల వచ్చిపోయే సందర్శకుల సంభాషణములతో పిల్లలు చేయు అల్లరితో శ్రీ బాలయోగికి తపోభంగం కలుగుతూ వుండేది. కొందరు యువకులు 'తాకితే' ఏమౌతుందో చూస్తామని బాలయోగిని 'తాకు' చుండెడివారు. 'ఇది నిజమైన తపస్సో దొంగ తపస్సో' తెల్సుకొందామని శ్రీ బాలయోగిని "పట్టుకొని" వూపు చుండేవారు.

సహ గోపాలురు కొందరు "ఒరే! సుబ్బారావు! కళ్ళు తెరచి చూడరా! అని 'వేళాకోళం' గా మాట్లాడేవారు. "ఒరే! వీడింక మనతో గోలీలు ఆడడుగామోను" అని ఒకడంటే "పండు! యింక పాలేరుతనం చేయనట్టేగదా' అన్నాడు ఇంకొకడు. మనతోపాటు గోవుల్ని కాయటానికి రాడు రాడుకాబోలని, ఒకడు బాలయోగి 'చేయి' పట్టుకొని లాగితే, మరొకడు నెత్తిమీది వెండ్రు కలు లాగేదొకడు. కళ్ళలోనికి దగ్గరగా చూసేది మరికొందరు. బాలయోగికేసి చిన్న చిన్న రాళ్ళు విసిరేసే వాళ్ళు ఇంకొందరు.

పెద్దవాళ్ళు కొందరు ముఖ్యంగా ఆడవాళ్ళు భక్తితో శ్రీ బాలయోగి పాదాలకు మ్రొక్కితే, మరికొందరు టెంకాయలు, పూలు, పండ్లు శ్రీ బాలయోగి వారి పాదాల చెంత "అర్పించి" ఆయన పాదాలు స్పృసించే వారు మరికొందరు. కొందరు శ్రీ బాలయోగివారి హస్తములు బలవంతంగా తెరచి పండ్లు, కానుకలు (చిల్లరడబ్బులు) పెట్టేవారు. "సామీ మా మొర ఆలకించమని" అడిగేవారు కొందరు. "మా కష్టాలు తీర్చమని" వేడుకొనే వారు మరికొందరు.

సందర్శకులు భక్తి భావం సమర్పించిన దక్షిణ ద్రవ్యంతో తల్లిదండ్రులు పర్ణశాలను కాస్త మెరుగుపరచి 'తపోమందిరంగా' అభివృద్ధి పరిచారు. అయితే తలుపులు గాని ద్వారములు గాని లేక కేవలం నాలుగు ఆర్చీలు మాత్రం ఏర్పాటు చేయగలిగారు. శ్రీ బాలయోగి వారి దర్శ నార్థం వచ్చే భక్తులు ఒక వేళా పాళా అంటూ లేక ఎప్పుడు పడితే అప్పుడు స్వతంత్రంగా, స్వేచ్ఛగా వెళ్లి శ్రీ బాలయోగి వారి దర్శనం చేసుకొనేవారు. పెద్దపెద్దగా మాట్లాడుకొనేవారు. పసగుసలు పోయేవారు మాత్రమే కాక యోగీశ్వరుల వారిని "ముట్టుకొనుట, కదుపుట కుదలగు" చేయరాని పనులు చేయుట వలన బాలయోగి వారికి తపోభంగం, నిశ్చల సమాధి స్థితికి అంతరాయం కలగడం జరుగుతూవుండేది.

ది. 6-2-49న ఒక వింత జరిగింది. తాను ది. 22-6-46 నుండి ధ్యాన నిమగ్నమైన నాటి నుండి ఎవరితోను కన్నెత్తి చూడలేదు. నోరు తెరచి మాట్లాడలేదు. కనీసం తన తల్లి దండ్రులతోనైనా తన సహోదరులతోనైనా మాట్లాడలేదు. అట్టి "మౌని" 6-2-49న అనూహ్యంగా

ఒక భక్తుడితో మాట్లాడడం జరిగింది. 6-2-49న కాకినాడ వాస్తవ్యుడు, రిటైర్డు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు శ్రీ వ్యాసం సత్యరాజు సకుటుంబ సమేతంగా బాలయోగి వారి దర్శనార్థం ముమ్మిడివరం వచ్చాడు. సత్యరాజు పుణ్యమెట్టిదోగాని, పూర్వజన్మలో ఆయనకి పెద బాలయోగుల వారికి గల సంబంధమెట్టిదోగాని "ఎవరితోను మాట్లాడని, ఎప్పుడూ కళ్ళు తెరచి చూడని బాలయోగి వారు తన "కళ్ళు తెరచి" సత్యరాజును సైగలతో మిగిలిన వారిని బయటికి పొమ్మని ఆయన్ని తన చెంత కూర్చుండమని చెప్పాడు. కళ్ళు మూసుకొని, ధ్యానం చేసే శ్రీ బాలయోగి వారు కళ్ళు తెరచి తనకు సైగ చేయడం సత్యరాజు క్షణంపాటు నమ్మలేక పోయాడు. అంతలో తమాయించుకొని శ్రీ వారు సైగ చేసినట్లు ఆయన సమీపమందు కూర్చున్నాడు. అప్పుడు శ్రీ బాలయోగివారు "నేను తపస్సులో కూర్చున్న రెండు సంవత్సరాల ఎనిమిది మాసముల వరకును ఎవరెప్పుడు వచ్చినా దర్శనం లభించేది. నేనెవరితోను మాట్లాడలేదు. కళ్ళు విప్పిచూడలేదు. కాని నాదర్శనమునకు వచ్చే ప్రజలు చేసే "గొడవ" తపస్సులో ఉండే నాకు వినబడకపోయి నప్పటికిన్నీ, కొంత మంది నన్ను ముట్టుకొనుటవల్లను, ఇతర కారణముల వల్లను నా తపస్సునకు "చలనము" కలుగుచున్నది. ఏకాంత పరిస్థితి (తపోభగం కాకుండా) సమకూర్చుట అవసరం. తపోమందిరములోనికి ప్రజలు ప్రవేశింపకుండునట్లు తలుపులు పెట్టించి మూయించి తాళంవేయవలయును. కొంచెం పాలు, గంగ (నీరు) మాత్రం ప్రతి దినము లోపల ఉంచవలసినది అని మాట్లాడారు. కనులు మూసుకున్నారు. తపస్సు ప్రారంభించిన 22-6-46 నుండి ఇది శ్రీ బాలయోగి వారి ప్రథమ సంభాషణం. సత్యరాజు పరమానంద భరితు డయ్యాడు. ఎవరితోను అంతవరకు మాట్లాడని యోగి వారు తనతో మాట్లాడుట తన 'పూర్వజన్మ సుకృతమని' తన జన్మ ధన్యమైందనుకున్నాడు. యోగీశ్వరుల వారికి 'ఆకలి'గా నున్నదేమోయని "కొన్ని పండ్లు" వారికి సమర్పించబోయాడు సత్యరాజు. అందుకు బాలయోగీశ్వరుల వారు మరలా కనులు తెరచి నోరువిప్పి "యోగబలముచే మల జల విసర్జనలను అరికట్టినాను. అట్టి పరిస్థితుల్లో నాకు ఆకలిదప్పులుండవు. పాలు, నీరు దైవారాధనకు మాత్రమే. నా దేహము నకక్కరలేదు అని చెప్పి "రాజమండ్రి సబ్‌జడ్జి గరిమెళ్ళ కృష్ణమూర్తిని ది. 10-2-1949 అర్ధరాత్రి వేళ నాదగ్గరకు తీసుకొని రావలసినది"ని ఆజ్ఞాపించారు.

సత్యరాజు గారు రాజమండ్రి వెళ్ళి విషయం గరిమెళ్ళ కృష్ణమూర్తిగారికి వివరించాడు. తన పూర్వజన్మ సుకృతానికి గరిమెళ్ళ వారు ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబై పోయాడు. ఇద్దరును ది. 10-2-49 రాత్రి వేళ శ్రీ బాలయోగీశ్వరుల వారి దర్శనం చేసుకొన్నారు. బాలయోగి వారు కళ్ళు తెరచి వారి వంక చూచి, నోరు విప్పి, "నేను కడపటి మెట్టులో తపస్సు చేస్తున్నాను. నా జన్మపరంపరలలో ప్రస్తుత జన్మ చిట్టచివరిది. నేను చేస్తున్నది ఘోరతపస్సు. తొందరలోనే

తపోసిద్ధియగును. అట్టి తపస్సునకు ఏ విధమగు చలనం వాటిల్లకుండునట్లు తపోమందిరం తలుపులు మూసి వేసి "నిర్జారణ్య ప్రదేశం వలె" "ఏకాంత, ప్రశాంత పరిస్థితిని సమకూర్చ వలయునని" వివరించారు. ఇది రెండవ సంభాషణ.

వీరు కుతూహలమున భగవంతుని గూర్చి, భక్తి-ముక్తి తదితర విషయాలు గూర్చి అడుగుచుండగా యోగీశ్వరులవారు సమాధానం చెప్పారు. "సంవత్సరమునకొకసారియైనను తమ దర్శనం చేసుకొనే భాగ్యం మీ భక్తులకు కలుగజేయవలసిందిగా వారు బాలయోగివారిని అర్థించారు. అందుకు 'అంగీకార సూచనగా బాలయోగివారు' 'సంజ్ఞ' చేసారు. శ్రీ బాలయోగివారి ఆదేశాను సారం సత్యరాజు తదితరులు "గుమ్మములు" అమర్చి తలుపులు బిగించినారు!

ది 17-2-1949 శ్రీ వ్యాసం సత్యరాజు గారు జిల్లా ఫారెస్టు ఆఫీసరుగా పనిచేస్తున్న శ్రీ గాదెం అప్పారావు గారితో కలిసి వచ్చి శ్రీ బాలయోగీశ్వరుల వారితో మాట్లాడారు. తమ భక్తులకే కాక ప్రజలందరికినీ "మహాశివరాత్రి" మరునాడు దర్శనభాగ్యం కలుగజేతునని" బాలయోగివారు అనుజ్ఞనిచ్చారు. ఇది మూడవ సంభాషణ.

తర్వాత 27-3-49న పైన పేర్కొన్న ముగ్గురితో 1. "తమ స్వీయ చరిత్ర" గురించి 2. "నిత్యదర్శనంకు సంబంధించిన ఆదేశములు 3. తత్త్వోపదేశములు 4. శివరాత్రి దర్శనంకు సంబంధించిన ఆదేశములు, శ్రీ బాలయోగి వారు సవివరంగా చెప్పారు. 27-3-49 తర్వాత తాను 1985 జూలైలో శివైక్యం (బ్రహ్మైక్యం) చెందేవరకు మరలా యెవరితోను నోరెత్తి మాట్లాడలేదు. ఆశ్రమ కమిటీవారితో 'సంజ్ఞలు' తోనే చెప్పేవారు. "ఔ" నని గాని 'కాదని' తల ఆడించెడివారు. స్వామివారు "వ్యాసం సత్యరాజు" గరిమెళ్ళ కృష్ణమూర్తిల పేరు పెట్టి పిలుచుట, వారి పూర్వజన్మ సుకృతమెట్టిదో గతంలో యీ 'ముగ్గురి'తో స్వామివారికి గల సంబంధమేమిటో?

26-2-49 మహాశివరాత్రి మరునాడు శ్రీబాలయోగీశ్వరుల వారి ప్రథమ సర్వదర్శనం

ది. 6-2-49న వ్యాసం సత్యరాజుగారితోను, ది. 10-2-49న శ్రీయుతులు వ్యాసం సత్యరాజు, గరిమెళ్ళ కృష్ణమూర్తి, గాదెం అప్పారావు గార్లతోను తమ తపోమందిరంనకు తాళం వేయవలెనని శ్రీ బాలయోగీశ్వరులవారు నొక్కిచెప్పగా, అప్పుడు వారు "సంవత్సరమున కొకసారియైనను మీ సేవకులకు దర్శనమునిండు" అని మరీ మరీ వేడుకొనుట వల్లను 17-2-49న శ్రీయుతులు వ్యాసం సత్యరాజు గారు, గాదెం అప్పారావు గారు స్వామివారిని దర్శించి "మహాశివరాత్రి"కి భక్తులకు దర్శనభాగ్యం కలుగజేయవలయునని మిక్కిలిగా వేడు కొనుట చేతను శ్రీ స్వామివారు కనికరించి మహాశివరాత్రి మరుసటి రోజు అనగా మహాశివరాత్రి అర్ధరాత్రి 12 గం॥ నుండి మరుసటి రోజు రాత్రి 12 గం॥ల వరకు భక్తులకు దర్శన భాగ్యం కలుగజేస్తానని స్వామివారు అనుగ్రహభాషణం చేసారు.

అదే విధంగా శ్రీ స్వామివారు ది. 26-2-49న మహాశివరాత్రి (25-2-49) మరునాడు భక్తులకు సర్వదర్శన భాగ్యం కలుగచేసారు. ఈ మహాశివరాత్రి ప్రథమ దర్శనంనకు భక్తులు కొన్ని వేలమంది మాత్రమే వచ్చారు. కారణం శివరాత్రికి స్వామి వారు దర్శనం యిస్తారన్న వార్త దేశమంతటా తెలియక పోవడమే. కేవలం జిల్లాలో, ముఖ్యంగా కోనసీమలో ముమ్మిడివరం గ్రామంనకు చుట్టుప్రక్కలనున్న ప్రజలే స్వామి వారిని దర్శించుకోగలిగారు.

అయితే 27-3-1949 రాత్రి శ్రీ వ్యాసం సత్యరాజు మరియిద్దరు భక్తులతో మాట్లాడు నిత్యం ఉదయం 4 గం॥ నుండి 5 గం॥ వరకు భక్తులకు దర్శనమిస్తామని స్వామివారు సెలవిచ్చారు.

శివరాత్రి మరుసటి రోజు 26-2-49న శ్రీ బాలయోగి వారి ప్రజలకు ప్రథమ దర్శనం

ది. 25-2-49 'మహాశివరాత్రి' మరుసటి రోజున అనగా ది. 26-2-1949 శ్రీ బాలయోగీశ్వరుల వారు వేలాది మంది ప్రజలకు సర్వ "దివ్యదర్శన" మొసంగారు. దర్శనానంతరం ఆ రాత్రి శ్రీ వ్యాసం సత్యరాజు 'తపోమందిరం'నకు తాళం వేయటానికి ప్రయత్నించగా, పోలీసులందుకు అడ్డుపడ్డారు. శ్రీ బాలయోగీశ్వరులవారి ఆజ్ఞ ప్రకారమే మందిరానికి తాళం వేస్తున్నామని సత్యరాజు గారు పోలీసు అధికారులకు నచ్చజెప్పటానికి ప్రయత్నించాడు. బాలయోగి వారు అలా చెప్పినట్లు రుజువేమిటని ప్రశ్నించారు. "తలుపులు బంధించి తాళం వేయటానికి శ్రీ బాలయోగివారికి అసలు ఇష్టమో కాదో మాకు సందేహంగా నున్నది. యోగీశ్వరుని మందిరంలో నుంచి తలుపులకు తాళం వేయడం ద్వారా బాలయోగివారికి అన్నపానీయాలు, గాలి లేక, ప్రాణాపాయం కలిగితే బాధ్యత ఎవరిది" అంటూ ఈ కారణం చేత మందిరానికి తాళం వేస్తానికి యెవరైనా ప్రయత్నిస్తే అరెస్టు చేస్తామని అంటూ గ్రామంలో 144వ సెక్షను విధించారు.

ఆ నడి రాత్రి పోలీసులు, మరికొందరు పెద్దలు సత్యరాజుగారు మందిరం గర్భాలయం లోనే కూర్చొని యుండగా, అర్ధరాత్రి దాటిపోవుచున్నను "మందిరం తలుపులకు తాళం వేయక తెరచి యున్నట్లు గ్రహించిన బాలయోగివారు" కండ్లు విప్పి తలుపులెందుకు బంధించలేదని సంజ్ఞతో సత్యరాజుని అడిగారు. "పోలీసులు ఆటంకపరిచారు" స్వామీ అని సత్యరాజు గారు వివరించారు.

వెంటనే బాలయోగివారు నోరు విప్పి "మేము చేస్తున్న ఘోర తపస్సునకెట్టి అంతరాయం రాకుండాను నిశ్శబ్దంగా నుండుటకునూ, తపో మందిరానికి మేమే తాళం వేయమన్నాం. ఆటంకపరచటానికి పోలీసులకెట్టి అధికారం లేదు. ప్రజలకసలు యీ విషయంలో సంబంధం లేదు. కనుక వెంటనే తలుపులకు తాళాలు వేసి ఏకాంత ప్రశాంత పరిస్థితి చేకూర్చవలెనని"

బాలయోగివారు అనడంతో పోలీసులు తాళం వేయటానికి అనుమతినిచ్చి నిష్క్రమించారు. సత్యరాజుగారు తదితర పెద్దలు, మందిరం తలుపులకు 'బీగం' బిగించి ఆ బీగాలు తన స్వాధీనంలోనే వుంచుకొని ఆశ్రమ బాధ్యత వహించారు సత్యరాజుగారు.

తపో మందిరమును పెంకుటి తపో మందిరముగా మార్చుట

ది. 27-3-1949న శ్రీ బాలయోగి తపోమందిరము పైకప్పునకు "పెంకు" (బంగాళా పెంకు) వేయించారు శ్రీయుతులు వ్యాసం సత్తిరాజు, శ్రీ గాదెం అప్పారావు. గరిమెళ్ళ కృష్ణమూర్తి గార్లు "ఉత్తర సింహద్వారం"నకు తాళం వేసి భోజనానికి వారి మకాంనకు వెళ్ళారు. మధ్యాహ్నవేళ బాలయోగీశ్వరుల వారి దర్శనార్థం వందల కొలది భక్తులు వచ్చేవారు. మందిరం తలుపులు వేసియుండుట చూచి సందర్శకులు నిరుత్సాహపడుచుండగా తూర్పు దిశనున్న తలుపులు వాటంతటవే తెరుచుకొనుట అచటనున్న వారందరికిన్నీ ఆశ్చర్యమును, పరమానందమును కలుగజేసినది. వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకొనగానే తలుపులు వాటియంతట అవి మూసుకొని, లోపల గడియ పడిపోయెను. తలుపులు తెరుచుకొనుట, మూసుకొనుట, అంతా స్వామివారి 'తపోమహిమ' వల్లనే అని అచట నున్న వారందరు బహువిధముల శ్రీవారి తపస్సును గూర్చి ముచ్చటించుకొనిరి.

ఈ విచిత్ర మహిమోదంతం శ్రీయుతులు సత్యరాజు, అప్పారావు కృష్ణమూర్తిగార్లకు తెలిసింది. సాయంత్రం వారు వచ్చి మందిరం తలుపులు తీసారు. స్వామివారితో సంభాషించారు. భక్తుల కొరకు, ప్రజల కొరకు వారి స్వీయ చరిత్ర, తపస్సు చేయుటకు గల కారణములు, మరియు లోకానికు తెలియజేయుటకు శ్రీ స్వామి వారి 'సందేశం' ఇవ్వవలసిందిగా వారు ముగ్గురు వేడుకొన్నారు. వారి కోరిక మన్నించి అందుకు స్వామివారు అంగీకరించారు. 27-3-49 రాత్రి వారి ముగ్గురితో 1. స్వీయచరిత్ర 2. నిత్య దర్శనానికి సంబంధించి ఆదేశములు 3. దివ్యతత్త్వోపదేశములు 4. మహాశివరాత్రి దర్శనంకు పాటించవలసిన ఆదేశములు, శ్రీ బాలయోగివారు వివరించారు. శ్రీ గాదెం అప్పారావు శ్రీ స్వామివారు చెప్పిన విషయాలు వ్రాసి శ్రీ స్వామివారికి మరల వినిపించి వారి ఆమోదం పొందినారు.

శ్రీ బాలయోగివారు స్వయంగా వివరించిన తమ స్వీయచరిత్ర

ది. 27-3-49 రాత్రి సర్వశ్రీ సత్యరాజు గరిమెళ్ళ కృష్ణమూర్తి, శ్రీ గాదెం అప్పారావు గారలు శ్రీ బాలయోగి వారిని యిలా అడిగారు. 1. స్వామీ తమకీ తపస్సు ఎట్లు వచ్చింది. 2. తమకీ విద్య చెప్పిన గురువెవరు 3. తమరు సినిమా (భక్తపోతన) చూసి తపస్సులో కూర్చు న్నట్లుగా కొంతమంది ప్రజలు చెప్పుకొనుచున్నారు. అది యెంతవరకు నిజం? 4. ప్రజలు తమ

దర్శనానికి నిత్యం వస్తున్నారు. తమరేమో తపోమందిరానకు తాళం వేయుడని చెప్పియున్నారు. మరి భక్తుల దర్శనార్థం తమరేమని చెబుతారు. 5. అలానే తమరు ఎవరితోను మాట్లాడనని అంటున్నారు. మరి భక్తులోకానికి తమ దివ్య సందేశమేమిటి.

వారి కోరికమన్నించి శ్రీ బాలయోగివారు తన స్వీయ చరిత్రను యీ క్రింది విధంగా వివరించారు.

1. నా జన్మ స్థానము కొన్ని సంవత్సరములకు పూర్వము ఘోరారణ్యము. ఇచ్చట అప్పటి మహా ఋషులు తపస్సు చేయుచు ముక్తి చెందెడివారు. ఇది మహాపవిత్ర ప్రదేశ మగుటచే ఇచ్చట జన్మించితిని.

2. నా తల్లిదండ్రులు పూర్వజన్మమున చేసికొనిన మహాపుణ్యము వలన నేను వారికి బిడ్డగా పుట్టినాను. నేను ఉన్న స్థలమును, నాకు యీ స్థితియు నా పూర్వజన్మ సువాసన వలన వచ్చెను. సినిమా చూసినందువలన రాలేదు.

3. అంతక్రితము 5 సం॥లు గోవును కాచితిని. అందరి పిల్లలతోను కలసి వున్నాను. ఒక గురువు చెప్పిన విద్యకాదు. ఒక చోట చూసి నేర్చుకొనలేదు.

4. కొన్ని రోజులు రాముని పూజించుదామా, కృష్ణుని పూజించుదామా, లేక యింకెవరినైనా పూజించుదామా అని ఆందోళనయుండేది. ఒక రోజున శ్రీకృష్ణుడును, నారదులును గల బొమ్మను కొని యింటికి తీసుకొని వచ్చి ది. 22-6-1946 శనివారమున మా గ్రామ సమీపములో దక్షిణముగానున్న కొబ్బరితోటలో నా సుకృతము ఫలించి తపస్సునకు కూర్చున్నాను. అంతవరకు అన్ని ఆహారములను భుజించినాను. తరువాత తల్లిదండ్రులు పట్టుబట్టి బలవంతముగా యింటికి తీసుకొని వచ్చినారు. ఇంటియందు వారము రోజులున్నాను. అప్పుడు గూడా తపస్సు మానలేదు.

5. వారము రోజుల పిదప గ్రామ సమీపములో నున్న గవర్నమెంటు పుంతలో కూర్చున్నాను. కూర్చున్న స్థలముమీద పాకవేసినారు. అచ్చట ఉన్న కొంతకాలము పాలు పుచ్చుకున్నాను. ఒక నెల వరకు ప్రతి ఉదయమున స్నానము చేసితిని. తరువాత మానితిని. దంత ధావనము, మలమూత్ర విసర్జనము, పాలు పుచ్చుకొనుట మానితిని. నావద్ద ఉంచే మంచి తీర్థము ఒక్కొక్కప్పుడు తగ్గుతుండేది.

6. నేను తపస్సు చేసే రోజులలో వచ్చే దక్షిణ ద్రవ్యము వల్ల తల్లిదండ్రులు ఒక మందిరము కట్టించి అందులో నన్ను కూర్చుండబెట్టుటకు సరిది తీసుకొని వెళ్ళి కూర్చోపెట్టుదామని అనుకొనేటప్పటికి ఒకనాడు నేనే ఎవరికిని తెలియకుండా వెళ్ళి ఆ మందిరములో కూర్చున్నాను. అప్పటి నుండి యిప్పటి వరకును అలాగే కూర్చొని తపస్సు చేయు

చున్నాను. మందిరమునకు ఏ మరమ్మత్తులు చేసినను, నేను కూర్చున్న స్థలము మాత్రము ముట్టలేదు.

తపస్సులో కూర్చున్న 2 సం॥ 8 మాసముల వరకు ఎవరు ఎప్పుడు వచ్చినను దర్శనము లభించేది. ఎవరితోను మాట్లాడలేదు. కాని దర్శనమునకు వచ్చే ప్రజలు చేసే గొడవ తపస్సులో ఉండే నాకు వినబడక పోయినప్పటికి కొంతమంది నన్నుముట్టుకొనుట వల్లను ఇతర కారణముల వల్లను నా తపస్సునకు చలనము కలుగుచున్నందువలన గడచిన 'శివరాత్రి'కి కొన్ని రోజుల ముందు వ్యాసం సత్యరాజుతో కనులు విప్పి మాట్లాడి నా భావము చెప్పినాను. అంతేకాక ముందు రోజు రాబోయే చిక్కులు గ్రహించి ఇంకా యిద్దరితో గూడా ఆ విషయము నొక్కి చెప్పినాను. అనగా "నేను కడపటి మెట్టులో తపస్సు చేయుచున్నాను. నా జన్మపరంపరలలో ప్రస్తుత జన్మము చిట్టచివరిది. చేయుచున్నది ఘోర తపస్సు. అచిరకాలములోనే తపోసిద్ధియగును. అట్టి తపస్సునకు ఏవిధమయిన చలనము వాటిల్లకుండునట్లు తలుపులన్నియు మూసివైచి నిర్జరారణ్య ప్రదేశమువలె ఏకాంత పరిస్థితిని సమకూర్చవలెను "అని కోరగా" సంవత్సరమునకొక సారియైనను మీ సేవకులకు దర్శనమునిండు అని వేడగా, వేడగా తుదకు అంగీకరించి అదే విధముగా ది. 26-2-49వ తేదీన మహాశివరాత్రి మరునాడు నాదర్శనము నిచ్చితిని. ఆరాత్రి శ్రీ సత్యరాజు తాళమును వేయుటకు సిద్ధముగా నుండగా కొన్ని అడ్డంకులు కలుగుటచే "నేనే తలుపులకు తాళము వేయుమని ఆజ్ఞాపించితిని. దానిని కాదనుటకు ఎవరికిని ఎట్టి అధికారమును లేదు" అని చెప్పగా అడ్డంకులు లేకపోవుటచే సత్యరాజు తాళము వేసెను. వారి కోరికపై నిత్యదర్శనమునకు గూడా అంగీకరించి యీ దిగువ ఆదేశవాక్యముల నిచ్చితిని.

స్వామివారు వివరించిన వారి స్వీయచరిత్రను పరిశీలిస్తే, తమతల్లిదండ్రులు పూర్వ జన్మలో చేసుకొన్న 'మహాపుణ్యం' వల్లను, తాను జన్మించిన స్థలం చేతను, తాను తపస్సు చేస్తున్న స్థలం "మహాపవిత్రం" ప్రభావం చేతను గత జన్మలలో తాను "అసంపూర్ణంగా చేసిన తపస్సు వలన" తన పూర్వజన్మ సుకృతం ఫలించి, కటికదల గంగయ్య, రామమ్మలకు తాను బిడ్డగా పుట్టినట్లు స్పష్టపడుచున్నది. అంతేకాని (భక్తపోతన) సినిమా చూచినంత మాత్రాన తాను మారిపోయి తపస్సునకుపక్రమించలేదని స్వామివారు నిర్ద్వంద్వంగా తేటపరిచారు. అలానే ఒక "గురువు" చెప్పిన విద్యకాదని, ఒక చోట చూచి నేర్చుకొన్నది లేదని గూడా స్పష్టపరిచారు.

నన్ను గురించి ప్రపంచములో అనేక విధములుగా చెప్పుదురు. దీనిని గురించి వారిపై

కోపపడవద్దు. వారు చెప్పిన తప్పుడు మాటలు నమ్మవద్దు. తెలియని వారికి శాంతముగ చెప్పవలెను.

ఎవరూ కలలోగూడా వూహించనట్లు ది. 22-6-46న శ్రీ సుబ్బారావు తపస్సు ప్రారంభించుటకు కొన్ని రోజులు పూర్వం నుండియే ఆయనకు తెలిసియో, తెలియకనో, ఆయన పూర్వజన్మ సుకృతం వలన, ఏదో దివ్యశక్తి పాపపుణ్యాలు, 'సంసార' జీవితపు ఆటు పోటులు తెలియని ఆ బాలుణ్ణి ప్రాపంచిక జీవితంపై 'విరక్తి' కలిగిస్తూ తపోదీక్ష (ధ్యానయోగం) వైపునకు ఆకర్షించుచున్నట్లు మనం గ్రహించవలయును. తనకీ లోకజీవితం పట్ల 'విరక్తి' కలుగుతున్నట్లు ఆయన ఎవరికీ చెప్పియుండక పోవచ్చును. అదే విచిత్రం! అది అంత పిన్నవయస్సులో ఆయన మనో నిగ్రహం, 'సంయమనం', అదే దైవలీల! దివ్యశక్తి ప్రభావం! అయితే ఆయన చెప్పిన మాటలు, జరిగిన సంఘటనలు గమనించినప్పుడు "పూర్వజన్మ సువాసనల" వలన అతనిలో ఎవరూ వూహించని "మానసిక మార్పు" వచ్చినదని గ్రహించవచ్చును. చివరగా తాను చిన పాలేరుగా పని చేసిన మట్టపర్రి వెంకన్న దంపతులతో నేను మీ వద్ద పాలేరుతనము మానివేయుదును. కనుకమరియొకరిని కుదర్చుకొనుడని చెప్పుటయే కాక యింకను "యిక నెవరివద్దను పాలేరు తనము చేయను" అని స్పష్టంగా చెప్పి 1946 మే నెల చివరిలో 'శ్రీ లంక తల్లెమ్మ తీర్థం' (తిరునాళ్ళ) జరిగిన సందర్భంలో శ్రీకృష్ణనారదుల వారి చిత్రపటాన్ని కొని దానిని జాగ్రత్త పరచుకొనుట మనమక్కడ గుర్తుకు తెచ్చుకొనవలయును. శ్రీ వెంకన్న వద్ద నిండా ఒక నెల రోజులు గూడా పనిచేయలేదు. తల్లిదండ్రుల బలవంతం మీదనే శ్రీ వెంకన్న దగ్గర పనికి ఒప్పుకున్నాడు శ్రీ సుబ్బారావు. శ్రీ సుబ్బారావు! శ్రీ బాలయోగి వారిపై ఎన్నో రచనలు చేసిన స్వామి వారి పరమభక్తుడు శ్రీ జయంతి నాయన స్వామి శ్రీ సుబ్బారావు 1946 జనవరి మాసంలోనే తపస్సు ప్రారంభించుటకు విఫల ప్రయత్నం చేసినట్లు రాసియున్నాడు. శ్రీలంక తల్లెమ్మ తీర్థం జరిగిన సమయంలో భక్తపోతన సినిమా శ్రీ సుబ్బారావు చూచియుండవచ్చు. ఆ బాలకునిలో పూర్వజన్మ సుకృతం వలన అంతర్లీనంగా యేర్పడిన 'భక్తిభావన'తో ఆ సినిమా చూచి యుండవచ్చును. లేదా తోటి బాలురు, బంధు మిత్రులతోపాటు, ఆ సినిమా చూచి యుండవచ్చు. అది 'కాకతాళీయ' సంఘటన మాత్రమే! శ్రీసుబ్బారావు పూర్వజన్మ పుణ్యం వలన, పిన్న వయస్సులోనే, వాళ్ల 'హరిజనవాడ'లో నిత్యం రాత్రిపూట జరిగే హరి (రామ) భజనా కార్యక్రమాల్లో పాల్గొనే వాడు. (ఆరోజుల్లో అగ్రవర్ణాల వారు 'వూరి'లో వున్న 'హిందూ దేవాలయాలలోనికి హరిజనులకు ప్రవేశం నిరాకరించే వారు గదా. మరో విశేషమేమంటే శ్రీ బాలయోగి వారి జీవితంపై, వారి తత్వోపదేశాలపై గీతాప్రమాణంగా వివేచన రచనలు చేసిన శ్రీ కంకల అప్పారావు సేకరించిన సమాచారం ప్రకారం, తపస్సు ప్రారంభించిన రోజు

(22-6-46)నకు రెండు మూడు రోజులు ముందే శ్రీ సుబ్బారావు పని (పాలేరుతనం) లోనికి పోయి వస్తున్నా, యెవరితోను సరిగ్గా మాట్లాడక, అన్నం సరిగ్గా తినక, 'మౌనం'గా వుండి 'వింత' గా ప్రవర్తించాడని శ్రీ సుబ్బారావు మారుతల్లి శ్రీమతి వెంకమ్మగారు యిరుగు పొరుగుతో శ్రీ సుబ్బారావు తపస్సు ప్రారంభించిన తర్వాత) చెప్పినట్లు తెలియుచున్నది. శ్రీ సుబ్బారావు బాలకుడు. కుటుంబ కష్టసుఖాలు తెలియనివాడు. భార్యాబిడ్డల 'సంసార' లంపటంలో పడని బాల బ్రహ్మచారి! జీవితంలోని 'యీతిబాధలు' తెలియని లోకజ్ఞానమంతగా లేనిపిన్నవాడు. కన్నతల్లిని గుర్తించలేని మాతృమూర్తి వాత్సల్యమంటే ఏమిటో తెలియని మూడేండ్ల వయస్సులోనే తల్లిని పోగొట్టుకొన్న దురదృష్టవంతుడు. లోకజ్ఞానం వచ్చిన తర్వాత 'తల్లిలేనివాడు' అని పదిమంది అంటే ఏమైనా బాధపడ్డాడో ఏమో యెవరికీ తెలియదు. తనకా 'బాధ' వున్నట్లు ఎవరితోను అన్నట్లు దాఖలాలు లేవు. అలానే మారుతల్లి తనను 'సరిగ్గా' చూడడంలేదని గూడా 'బాధ'పడి నట్లుగాని, ఆ విషయం యెవరితోనైనా ప్రస్తావించినట్లుగాని ఋజువులులేవు. అదే సమయంలో చదువూ సంధ్యలు లేని పిల్లవాడికి 'తపస్సు' విధానం గురించి గాని యోగాభ్యాసం గురించిగాని, యీ లోక జీవితం 'మాయ' అన్న వైరాగ్యధోరణి గురించి ఏదైనా మంత్రోపదేశం చేసిన 'గురువు' గాని, బైరాగి, సన్యాసి గాని 'బోధించి'న దాఖలాలు లేనేలేవు.

భగవద్గీతలో ఆరవ అధ్యాయం (జ్ఞానయోగం) 43, 44 శ్లోకాలలో, గత జన్మలో తపస్సు చేసిన యోగి యే కారణంచేతనైనా పరిపూర్ణం కాని పక్షమున, తర్వాత (ప్రస్తుత) జన్మలో 'గత జన్మ సంస్కారం' చేసిన పుణ్యం (యోగశక్తి) వలన యీ జన్మలో తపస్సు కొనసాగించి సిద్ధిపొందు తాడని చెప్పబడింది. గీతా వాక్యం శ్రీ బాలయోగి వారు సేకరించిన 'స్వీయ చరిత్ర' విషయంతో సరిపోతుంది. కనుకనే తపస్సు ప్రారంభించిన నాటి నుండి ఘనాహారం మానివేసి, క్షీరం మాత్రం కొంతకాలం స్వీకరించి, కొద్ది కాలంలోనే 'ఆకలిదప్పులు' జలమలవిసర్జన నరికట్టగలిగాడు.

శ్రీ సుబ్బారావు మొదట తపస్సు ప్రారంభించిన ఇళ్ళ గోవిందరావుగారి కొబ్బరి తోట బాలయోగివారి తాతదండ్రులు (పూర్వీకులు) నివాస స్థలం. మన స్వామివారి తండ్రి శ్రీ గంగయ్య గారు పూర్వజన్మలో మహాతపస్వి యనియు మహా పుణ్యాత్ముడనియు స్వామి వారే చెప్పియున్నారు. కనుకనే ఇళ్ళ గోవిందరావు కొబ్బరితోట నెంచుకొన్నాడు. అలానే స్వామివారికి జన్మనిచ్చిన శ్రీమతి రామమ్మగారు పూర్వజన్మలో "ఒక మహాయోగిని" అని ఆమెయు "మహాపతివ్రత" మహా పుణ్యాత్మురాలనియు జనశ్రుతి. కనుకనే అట్టి పుణ్యదంపతుల గర్భశక్తా ఫలముగ మనయోగివారు జన్మించియున్నారు. క్రైస్తవులు ముఖ్యంగా "రోమ్‌ను కేథలిక్ శాఖకు చెందిన వారు క్రీస్తు ప్రభువుకు జన్మనిచ్చిన మేరిమాతను ఎంతో భక్తి ప్రపత్తులతో కొలుస్తారు. ఆమె కెంతో ప్రాధాన్యత నిస్తారు. లోక రక్షకుడైన క్రీస్తు ప్రభువు ఆమె గర్భమున జన్మించుట అంటే ఆమె ఎంతటి పవిత్రురాలో పునీతురాలో అని వారి విశ్వాసం. నిజమే గదా! అలానే

మన బాలయోగి వారిని కన్న శ్రీమతి రామమ్మ గారు ఎంతటి పుణ్యవంతురాలో ఎంతటి పవిత్రురాలో.

అలానే మనస్వామి వారు సెలవిచ్చినట్లు 'నేను ఉన్న స్థలం' అమలులో మనమిక్కడ మూడు ప్రదేశములను గుర్తించుకొనాలి. మనస్వామివారి జన్మస్థలమైన మాలపల్లెలోని శ్రీ గంగయ్యగారి గృహమున్న స్థలం, మనస్వామి వారు తపస్సు ప్రారంభించిన ఇళ్ళ గోవిందరావు గారి కొబ్బరితోట ఉన్న స్థలం, మూడోది స్వామివారు దీర్ఘకాలంగా సంవత్సరాలుగా తపస్సు చేయుచున్న గవర్నమెంటు పోరంబోకు స్థలం (అంటే స్వామివారి తపోమందిరం-దర్శన మంటపం, ఆశ్రమం నిర్మించిన ప్రదేశం. నా ఉద్దేశంలో యీ మూడు ప్రదేశములు చాలా పవిత్రములైనవే. వాస్తవానికి యీ మూడు పవిత్ర ప్రదేశములు ఒక కిలోమీటరు దూరంలోనే విస్తరించి వున్నాయి.శ్రీ గంగయ్య శ్రీమతి రామమ్మలకు యీ భూలోకంలో తాను జన్మించిన స్థలం శ్రీ గంగయ్య గారి గృహం స్వామివారి అభీష్టం మేరకు శ్రీ కె. శ్రీరామచంద్ర మూర్తి గారునూ, వారి సతీమణి శ్రీమతి అనసూయమ్మగార్లు అక్కడ గూడా ప్రస్తుతం జన్మమందిరం నిర్మించి యున్నారు. ఆ జన్మమందిర నిర్మాణంనకు శ్రీ మూర్తిగారు ఉదార స్వభావులైన దాతల నుండి విరాళాలు సేకరించి దానిని నిర్మించారు. శ్రీ బాలయోగి వారు ప్రప్రథమంగా తపస్సు ప్రారంభించిన ఇళ్ళ గోవిందరావు గారి తోటలో గూడ ఒక చిన్న మందిర నిర్మాణం చేసియున్నారు. శ్రీ పెద బాలయోగి వారు, శ్రీ చినబాలయోగివారు సుదీర్ఘ కాలం కఠోర (ఘోర) తపస్సు చేసిన పవిత్ర స్థలములలో బలమైన సిమెంటు తపో ఆశ్రమ గోపుర భవనాలు నిర్మించుటకు ఆర్థిక సహాయం అందించినది శ్రీ బచ్చు మాధవయ్యగారు.

శ్రీ స్వామి వారి స్వీయచరిత్ర విశేష వివరణ

తన 'జన్మస్థానం' పూర్వం ఘోరారణ్యమని, ఋషులు అచట తపస్సు చేసుకుని ముక్తి పొందారని, కనుక అది 'మహా పవిత్రమైన' ప్రదేశం గనుక తాను అచట జన్మించినట్లు లోకంనకు శ్రీ స్వామివారు విశదపరిచారు. స్కంధ పురాణం, శ్రీనాధుని, 'భీమేశ్వర పురాణం' (భీమవరం) కాశీఖండం తదితర గ్రంథాలు చదివితే అగస్త్యమహాముని తదితర మునులు, వ్యాసభగవానుడు తన శిష్యగణంతో గోదావరి మండలంలోని కోనసీమలోనున్న పుణ్యక్షేత్రాలు దర్శించి, అచట ధ్యానం చేసుకొంటూ కొన్ని రోజులు గడిపినట్లు తెలుస్తుంది. గౌతమి, వసిష్ట గోదావరుల కిరువైపుల వున్న పుణ్యక్షేత్రాలు గురించి చెప్పకున్నాం. కోనసీమ ప్రాంతంలో ప్రధానంగా ఎక్కువ 'శైవ' క్షేత్రాలుండడం గమనించాలి. కనుక యీ ప్రదేశమంతా చాలా పవిత్రమైనది. శ్రీ స్వామి వారి తండ్రి తాతముత్తాతల (పూర్వీకుల) నివాస స్థలం ఇళ్ళ గోవిందరావు గారి కొబ్బరి

తోటయేయని, కాలక్రమేణ మాలపల్లి ఉత్తరంగా ప్రస్తుతమున్న ప్రాంతములోనికి మారిందని పాఠకులు గమనించగలరు.

దివ్యజ్ఞాన తత్త్వోపదేశములు

ది. 27-3-49 రాత్రి శ్రీయుతులు సత్యరాజు, కృష్ణమూర్తి, అప్పారావు గార్లతో స్వీయజీవిత చరిత్ర వివరణతో నిత్యదర్శనం, శివరాత్రి దర్శనంనకు సంబంధించి శ్రీ బాలయోగీశ్వరుల వారు కొన్ని ఆదేశములు సూచనలు ఇచ్చి పిమ్మట, పై ముగ్గురు ఆధ్యాత్మికతకు సంబంధించి భక్తులకు తమ దివ్య సందేశం ఏమిటని అడుగగా, శ్రీ బాలయోగివారు యీ క్రింది 'దివ్యజ్ఞాన తత్త్వోపదేశములు' బోధించారు. వీటిని "అష్టాదశ తత్త్వోపదేశాలుగా పేర్కొనవచ్చును.

1. "భగవంతుని" ధ్యానము చేయుటకు అరణ్యమునకు వెళ్ళవలసిన అవసరము లేదు. భగవంతుడు ఇచ్చటా ఉన్నాడు. అచ్చటా ఉన్నాడు. "అంతటా ఉన్నాడు' ' అరణ్యము నకు వెళ్లవలెనంటె "శాంతము" కొరకు వెళ్ళవలెను.
2. "భక్తుల దర్శనము పాప నాశనము. ఈ జన్మలో భగవంతుని తెలిసికొనుటకు ప్రయ త్నము చేస్తేనే ముందు జన్మలో పై మెట్టుకు పోవుటకు వీలగును. లేకపోతే తిరిగి నరజన్మ వచ్చుట దర్లభము.
3. ఒక మహాభక్తుడు ముక్తిచెందితే 14 (పద్నాలుగు) తరాలవారు ముక్తి చెందుతారు.
4. జన్మరాహిత్యం చేసుకొని మహాస్వర్గమునకు (ఐక్యము) ఎవ్వరైతే వెళ్ళుదురో ఆ మహానీయునకే అంతా శాశ్వతము.
5. తనువులు శాశ్వతము కాదు. ధనము, భూములు శాశ్వతము కాదు. క్రియకు ఏదీ శాశ్వతంకాదు.
6. ఉన్నన్నాళ్ళూ, నీది, నాది అనుకొనుటయే కాని క్రియకు వచ్చేది కాదు. అంతా భగవంతునిదే.
7. ప్రపంచమందు ఒక సూర్యుడే ఇంత ప్రకాశముగా ఉన్నాడు. 'కోటి సూర్యప్రకాశము' గల భగవంతుడు ఎంత ప్రకాశముగా ఉండును? ప్రపంచ మందు ప్రజలకే ఎన్నో తెలివితేటలుంటే ఆ భగవంతునకు "ఎన్నెన్ని" తెలివి తేటలుండవు? భగవంతుడు మనకు తండ్రిగదా! ఆ మహాత్ముని పూజింపలేమేమి!
8. అన్నదమ్ములు తల్లిదండ్రులు "అంతామాయ" మనకు నిజమైన తండ్రి భగవంతుడు. ఆయన మన కన్నులకు కనిపించడు. ఆయనను మన "కన్నులతో

చూడవలెనంటే" అన్ని బాధలను జయించవలెను. మన ఆత్మలో ఉండే జీవాత్మను గ్రహించవలెను.

9. శాశ్వత కాలము ఉండే భగవంతునికి కోపము లేదు. "మూడు రోజుల ముచ్చట కొరకు ప్రజల కింత కోపమేల' కష్టము లేకుండా ఏ పూటకాపూట గడుస్తుంటే అదే మహాభాగ్యము.

10. జీవాత్మ భగవస్స్వరూపం. పంచభూతములు దానిని 'మాయ లోనికి' లాగు చుండును. "తానెవ్వరో తాను తెలుసుకొని చలించే మనస్సును కట్టి పెట్టకలిగితే' ' ఒక గురువు చెప్పినవసరములేదు. తన ఆత్మే తనకు గురువగును. ఆత్మను పవిత్రము చేస్తే ఆత్మలో ఉండే జీవాత్మ అంతా తెలియజెప్పను.

11. ఆహారము వల్ల ఇంద్రియములకు బలము కలుగును. ఇంద్రియమును లోబరచుకొనవలెనంటే ఆహారమును తగ్గించవలెను. మానవలెను. అందువలన ఇంద్రియములను లోబరచుకొనవచ్చును. అప్పుడు పంచ భూతములు ఆత్మలో అణగి పోయి 'ఎఱుక' లేక పోవును. 'ఎరుక' లేనప్పుడు ఆహారము అక్కరలేదు. అందువల్ల జీవాత్మ "పరమాత్మలో ఐక్యమగుటకు వీలు చూపును.

12. ఆహారము తీసుకొనుచు తపస్సు చేయవచ్చును. కాని దాని వల్ల చాలా బాధలున్నవి. సంసారములో నుండియు చక్రవర్తి తనము చేయుచు భగవంతుని స్మరణ చేయవచ్చును. కాని నిలకడ ఎక్కడ నుండి వచ్చును? చలనము కలుగుచుండును. ఒక్కొక్కప్పుడు అఖండమైన బాధలు కలుగుచుండును. ఆ బాధలను జయించగలిగితే భగవంతునకు అఖండమైన జాలిపుట్టును.

13. భగవంతుడు తలంచుకొంటే అందరూ మంచివారని అనిపించుకోవచ్చును. అలాగైతే అంతా అగుదురు. ప్రపంచము నడుచుటెట్లు! భగవంతుడు ఇవ్వాలంటే ముక్తిని ఇవ్వవచ్చును. కాని అలా వీలు లేదు. ఎవరిదారి వారే తెలుసుకొన వలయును. ఒకరికి ఒకరు ఏమీ చేయరు.

14. ఒకరు చేసుకొన్న పుణ్యము కొలదీ భగవంతుని అనుగ్రహం కలుగును. అపరాధము లుంటే కనికరము కలుగదు. పూర్తిగా ఎవ్వరైతే తన్ను నమ్ముతారో వారిపై భగవంతునికి కనికరము కలుగును.

15. ఎక్కువలో పుట్టినా తక్కువలో పుట్టినా తనువులు శాశ్వతము కాదు. ఎందులో పుట్టినా భగవంతుని ఎవరైతే నమ్ముతారో వారికే ముక్తి మార్గము లభించును.

- భగవంతుడు కనిపించే వరకు ఎవ్వరైనా తపస్సు చేయవలెను. ఆ చేయడము విఘ్నమైతే ఆ జన్మమట్టుకు చేసింది అంతా వృథా. కాని వచ్చే జన్మలో దానిలాభము కలిసి వచ్చును.
- తపస్సు వలన ఏది కావలసివస్తే అదే వచ్చును. చక్రవర్తి తనము గూడా వచ్చును. కాని దాని వలన గర్వము కలుగును. గర్వపడితే దిగువ జన్మలోనికి పోవలసి వచ్చును.
- సర్వము ఒక చోట కనబడాలి అంటే తపస్సు వలననే వచ్చును. మాటలతో రాదు. తల్లిదండ్రులు భార్యా పిల్లలు మీ పాపములను పంచుకొనరు. అందుచేత మీరు వాళ్ళ కొరకు పాపములు చేయుట ఎందుకు!

ఈ దివ్యతత్త్వోపదేశములు బోధించుటయే శ్రీ బాలయోగీశ్వరుల వారి తుది సంభాషణం. ాత వారు 'మౌనవ్రతం' అవలంబించారు. మరి ఆయన శివైక్యం చెందే వరకు (1985 లై 19వ తారీఖు) ఎవ్వరితోను నోరు విప్పి మాట్లాడలేదు. ఆశ్రమ కమిటీ సభ్యులతో తన పములను కేవలం 'సంజ్ఞల' తోడనే వ్యక్తం చేస్తూ వచ్చారు.

చూడడానికి చదవటానికి శ్రీ స్వామివారు తేలిక భాషలో చేసిన యీ తత్త్వోపదేశములు ామూలు' వేదాంతం కనిపించినా అనిపించినా, కాస్త ఆలోచిస్తే లోతుగా పరిశీలించినట్లైతే, వి భారతీయ ఆర్యధర్మానుసారంగా వేదవేదాంతోపనిషత్ సారాంశంగా, భగవద్గీత సుధా ంగా రుజువౌతుంది. శ్రీ బాలయోగీశ్వరులవారు చెప్పిన యీ తత్త్వోపదేశాలు, శ్రీ సత్యరాజు ృతులు పదియునెన్మిది (పద్దెనిమిది) బోధలుగా రికార్డు (నమోదు) చేయడం జరిగింది. ని 'అష్టాదశ తత్త్వోపదేశములు' గా పేర్కొనవచ్చును.

మన భారతీయ ధార్మిక సంస్కృతిలో యీ 18 కి చాలా ప్రాముఖ్యత వుంది. అష్టాదశ ాణాలున్నాయి మనకు. భగవద్గీతకు 18 అధ్యాయాలు, మహాభారతంలో 18 పర్వాలు. ుక్షేత్ర సంగ్రామం 18 రోజులు జరిగింది. అష్టాదశ మహాలింగాలు (శైవక్షేత్రాలు) పోతే ఖ్యాశాస్త్ర పరంగా చూస్తూ 18=1+8=9 అవుతుంది. ఒకే సంఖ్య గల అంకెలలో 9 పెద్దది. గ్రహాలు, నవవిధ భక్తి మార్గాలు.

శ్రీ బాలయోగి వారి తత్త్వోపదేశములు లోతుగా పరిశీలించినచో, వారు 'పరమాత్మ ం) ఉనికిని (ఆస్తికవాదం) నొక్కి చెప్పుతూ, భగవంతుడు 'సర్వాంతర్యామి' యని రించాడు. జీవుడే దేవుడని-జీవాత్మ పరమాత్మ స్వరూపమని ద్వంద్వంగా చెప్పాడు. అదే ంగా దైవం ప్రేమ స్వరూపుడని, శాంత మూర్తియనియు, పరంజ్యోతి స్వరూపుడని, గురువని

మన ధర్మ శాస్త్రాలు నొక్కి చెబుతున్నాయి గదా! శ్రీ స్వామి వారి తత్త్వోపదేశమిదేగదా!

తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఆస్తిపాస్తులు, భోగభాగ్యాలు, అన్నియు శాశ్వతము కావని, శ్రీ స్వామివారు వివరించడం భారతీయ ఆర్యధర్మానుసారంగా హైందవ వేదాంతసారంగా స్పష్టమగుచున్నది. అంటే జగన్మిథ్య బ్రహ్మసత్యం' అన్న అద్వైత సిద్ధాంతాన్ని గట్టిగా విశ్వసించారన్న మాట.

మోక్షప్రాప్తికి-సగుణ నిర్గుణోపాసనం, నిష్కామకర్మ జీవన విధానం, సజ్జన సాంగత్యం అచంచలమైన నిర్మలమైన భక్తిమార్గం, ధ్యాన (జ్ఞాన) యోగం, సర్వేంద్రియ నిగ్రహం, చిత్తశుద్ధి, చిత్తైకాగ్రతల ఆవశ్యకతను శ్రీ స్వామివారి సందేశములలో వున్నది. జీవాత్మ పరమాత్మ స్వరూపమనీ, జీవుడే దేవుడని, దైవసాక్షాత్కారానికి పురుష ప్రయత్నం అత్యంతావశ్యకమని, తపో (నిశ్చల ధ్యానం) యోగంచేత పరమాత్మ సాక్షాత్కారం కలుగుననీ, కైవల్యసిద్ధి లభించునని శ్రీ బాలయోగివారి 'తత్త్వోపదేశముల' సారాంశం. శ్రీ బాలయోగి వారు ఉపదేశించిన 'తత్త్వోప దేశముల' సారమంతా భగవద్గీతలో నున్నదే. శ్రీ బాలయోగివారి జీవితమును, వారి మహిమలను, వారి యోగసిద్ధిపై ఎన్నో రచనలు చేసిన జయంతి నాయన స్వామి గారు వారి 'తత్త్వోపదేశముల' గురించి 'ఇందలి వాక్యములు భగవద్గీత, యోగ వాసిష్టములందు గల జ్ఞానామృతముతో మిళితమై యుండెననియు' తత్త్వోపదేశములందలి ప్రతి వాక్యము వేద వాక్యమును మించిన విలువ గలిగి యున్నదనియూ లెస్సబలికాడు. ఇంకను వివరిస్తూ జయంతివారు శ్రీ బాలయోగి వారి దివ్యసందేశం పురుషోత్తమ ప్రాప్తసాధనమై భవద్గీతాసారమై మోక్ష లక్ష్మీ నిదానమై, మృదు మధురముగను, గుహ్యతరగుహ్యతమ తత్త్వ సమన్వితముగను, ప్రౌఢముగను, పరిపూర్ణముగను అర్థవంతముగనునున్న పరమ పవిత్రమైన అనుభవజన్యమైన గీతాసారమని'' (అద్భుతాధ్యాయమని) అభిభాషించియున్నాడు.

మనమిక్కడ గ్రహించవలసిన అసలు రహస్యమొకటున్నది.

నిశితంగా పరిశీలిస్తే శ్రీ బాలయోగి వారు ఉపదేశించిన 'తత్త్వోపదేశములు', వారి స్వీయ జీవితంనకే అన్వయిస్తాయి. వర్తిస్తాయి. తాము తపస్సు ప్రారంభించిన 2 సం॥ 8 మాసముల తర్వాత ప్రథమంగా సంభాషించి, స్వీయచరిత్ర గురించి వివరించి, కొన్ని తత్త్వోపదేశములు చేశారు. అయితే వారు చెప్పిన తాత్త్విక విషయాలు, దైవ సంకల్పం ప్రకారమో లేక ఆయన పూర్వజన్మ సుకృతం వల్లనో, ఆయన నిజ జీవితమునకు అన్వయిస్తాయి. తెలిసో తెలియకో వాటిని ఆయన ఆచరించి యున్నారు.

వారికి ఏ గురూపదేశం లేదు. ఏ మహానుభావుడూ ఏ మంత్రోపదేశం చేసి యుండలేదు. ఆయనకు 'ఆయన' 'ఆత్మ' గురువు అయింది. 'కృష్ణనారాయణ' నామమంత్రం తానంతటతానే

మననం చేసుకొంటూ, ఉచ్ఛరిస్తూ, 'ధ్యాననిమగ్నుడైనారు. లోక సంసారలంపటం'లో పడక ముందే, విషయ భోగభాగ్యాలు అనుభవించకుండానే, సంసార సుఖదుఃఖాలు ఏమిటో తెలియని పిన్న వయస్సులోనే, బ్రహ్మచారిగానే, తల్లిదండ్రులు, భార్య బిడ్డలు, ఆస్తిపాస్తులు, 'తనువులు' 'శాశ్వతం' కాదని, ఒక్క దేవుడు మాత్రమే శాశ్వతమైన (సత్యమైన) వాడని, ఆయన సార్వంతర్యామి అని, దేవునికి 'కోపం' లేదని తేజోమూర్తి (పరం జ్యోతి స్వరూపుడు) జ్ఞాన స్వరూపుడని (తెలివితేటలు) అని జీవాత్మ భగవత్స్వరూపమని గ్రహించిన ఆ జన్మ మహా (బాల) యోగి ఆయన. అదే విధంగా జీవరాహిత్యంనకు (బ్రహ్మైక్యం) తపస్సు (ధ్యానయోగం) తరుణో పాయమని, ఆహారం (గీతలో చెప్పినట్లు సాత్వికమితాహారం) తీసుకొనుచు, ధ్యానం తపస్సు చేయవచ్చని, కాని నిరాహారిగా దేవుని నమ్మి (భక్తి విశ్వాసములతో) తపస్సు చేసిన త్వరితంగా సత్ఫలితం ముంటుందని 'యెరిగి'న మహాయోగి. తాము తత్వోపదేశాలలో చెప్పినట్లుగానే, తాము తపస్సు ప్రారంభించిన (22-6-46) నాటి నుండి ఆచరించి, నిష్కామకర్మయోగిగా, నిరాహార్తిగా, సర్వేంద్రియ నిగ్రహుడై, నిశ్చల సమాధిలో ఘోరతపస్సు చేయుచున్న అపురూప బాలయోగీశ్వరులాయన! శ్రీ బాలయోగివారు యీ 18 (పద్దెనిమిది) వాక్యములు (ఉపదేశములు) ఉపదేశించి ది. 27-3-99కి 50 సం॥ (అర్థ శతాబ్ది) నిండిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని "స్వర్ణోత్సవ" శుభవేడుకగా ఆశ్రమ కమిటీ యీ ఉపదేశములను తెల్లని (నల్లని) పాలరాతి ఫలకంపై చెక్కించి శ్రీ పెదబాలయోగి వారి తపోమందిరం లోపల ప్రతిష్టించడం జరిగింది.

శ్రీ బాలయోగీశ్వరుల వారి నిత్య దర్శనం కొరకు చెప్పిన ఆదేశ వాక్యములు

ది. 27-3-49 రాత్రి సత్యరాజు మిగిలిన ఇద్దరు భక్తులకు తమ స్వీయ చరిత్ర తాలూకు విశేషాలు వివరించిన తర్వాత వారి కోరికపై తమ నిత్య దర్శనంనకు సంబంధించిన యీ క్రింది ఆదేశములిచ్చినారు. శ్రీ గాదెం అప్పారావు గారే యీ ఆదేశములను 'రికార్డు' చేసారు.

1. ఇక నుండి నా దర్శనమునకు వచ్చు భక్తులు ఉదయము 4 గంటలకు మందిరము దగ్గర నుండవలెను. అటులున్న వారికి నా దర్శనము దొరుకును. ఆ కాలము దాటినచో ఆ రోజునకు దర్శనము కలుగదు. నన్ను చూచుటకు వచ్చిన భక్తులకు ప్రతి రోజున ఉదయము 4 గంటలు మొదలు 5 గంటలు వరకును దర్శనము దొరుకును.

2. భక్తులు మందిరము దగ్గర ఏ విధమైన గొడవయు చేయకూడదు. ఎటువంటి భక్తులు వచ్చినను నన్ను ముట్టుకొనరాదు. నేను కూర్చున్న ఆసనము దగ్గర ఒక

బారదూరమున గుమ్మమున్నది. ఆ గుమ్మము దగ్గర నుండియే దర్శనము చేయవలెను.

3. నాతో మాటలాడుటకు ఎవరును ప్రయత్నము చేయవలదు. అటువంటి ఆశను ఎవరును పెట్టుకొనవలదు. నేను చేసే తపస్సు మాటలాడుటకు వీలులేనిది కనుక ఎవరు వచ్చినను దర్శనము చేసి వెళ్ళవలెను. ఎవరితోను మాట్లాడను. వెలుతురు చాలక దర్శనము బాగుగా కలుగకపోతే దీపమును దగ్గరకు తీసికొని వచ్చి, దర్శనమును చేయింపుమని, కోరవలెను. దర్శనము నిమిత్తము 4 గంటలకు మందిరములో నేను కూర్చున్న చోటున ఒక దీపము వెలిగించబడును. దానిని ఎవ్వరును ఆర్పకూడదు.

4. 5 గంటలకు మందిరమునకు దాళము వేయునప్పుడు గూడా ఆ దీపమును అర్పకూడదు. ఉదయమున తాళము వేయునప్పుడు బహు జాగ్రత్తగా వేయవలెను.

5. ఆరాధనకు పాలును, నీరును తీసుకొని వచ్చే మహనీయుడు ఎంత భక్తితో తెచ్చిన అంతయెక్కువగా ఆరగింపు అగును. వారికి శాంతము ముఖ్య అవసరము. మీదపడి కొట్టినను కోపము రాకూడదు.

6. భగవంతుని, భక్తుని నమ్మి పూజించువారు అపరాధముల నుండి విముక్తులగుదురు. కపటముతో నున్న యెడల రెట్టింపు కష్టములనుభవించవలసి వచ్చును.

7. కొంత కాలమునకు పాలును, గంగయు అవసరముండదు. అప్పుడు తలుపులు మూతపడిపోయి రాకుండును. దీనిని గురించి ఎవరును ఏమియు చేయనక్కరలేదు. బలవంతముగా తలుపులు తీయుటకు ప్రయత్నించవద్దు. అట్లు చేసిన యెడల శాపము తగులును.

8. తపస్సు చేసే మందిరము లోపల తపో మహిమ వలన అనేకములైన విచిత్రములు కనబడుచుండును. మందిరములోపల ఏజంతువు కనపడినను కొట్టవద్దు. ఎవరిని ఏమియు చేయవు. సామాన్యముగ ప్రజలకు కనిపించవు. కనబడిన యెడల జాగ్రత్తగా వెళ్లవలయును.

9. ఒక్కొక్కప్పుడు నా శిరస్సు యోగ నిద్రలో ఊగును. అట్టి సమయములో ఏమాత్రమును చప్పుడు చేయకుండ మందిరమునకు తాళము వేసి కుదురుగా

వెళ్ళవలెను. ఒక్కొక్కప్పుడు తలుపులు రాకపోతే ఆరోజు తీయడము మానవలెను. దర్శనమునకు వచ్చే వారిని ఎవ్వరినీ చంటిపిల్లలను గూడా తప్పుడు మాటలనరాదు.

10. మందిరము చుట్టును ఉండే పూలతోటలోని పువ్వులను ఎవరును కోయకూడదు. వాటి యంతగ అవి రాలిపోనివ్వ వలెను. పువ్వులలో గూడా జీవాత్మ యున్నది.

11. ఎవరైనను భక్తులు ఏదైనా కట్టించవలెననియున్న యెడల అట్లే కట్టించుకొన వచ్చును. అది వారి సంతోషమునకేగాని నాకేమియు అక్కరలేదు. ఏది కట్టించినను గొడవ లేకుండ చుట్టును కట్టించు కొనవచ్చును.

12. ఎవరైనా వచ్చి మందిర తాళమును తీసినయెడల కొన్నివేల ధనమిస్తామని చెప్పినను ధనమునకు ఆశపడి మందిర తాళము తీయవద్దు. ఎంతపెద్ద వారు వచ్చినను ఫరవాలేదు. నేను తీయ వద్దనినానని చెప్పవలెను. మేము గొప్పభక్తులమని తాళము తప్పక తీయమని అంటారు. అలాగున చెప్పినను తీయవద్దు. అంతమహా భక్తులైతే ఇతరులకు తెలియకుండ లోపలికి వెళ్ళుటకు వీలు కలుగును తలుపులు వాటియంతట అవే విడిపోవును.

శ్రీ స్వామివారి ఆదేశములను పరిశీలించినచో మనకు తెలిసేదేమంటే ఉషః కాలం బ్రహ్మ ముహుర్త మంటారు దైవజ్ఞులు. దేవతలు దివినుండి దివికి దిగి వచ్చి సమస్త నదీజలాలలో స్నానాధికాలు (జలకాలు) చేసుకొని మరలా దివికేగుతుంటారని భారతీయుల ప్రగాఢ విశ్వాసం. పైగా తెల్ల వారుజామున వాతావరణం ప్రశాంతంగా వుంటుంది రాత్రంతా నిద్రించి లేచే ప్రాణకోటికి హృదయనిర్మలంగా, హృదయాహ్లాదకరంగా వుంటుంది అట్టి ప్రశాంత నిర్మల ఉషోదయవేళలో దైవ దర్శనం పుణ్య ప్రదం. కనుకనే స్వామివారు తెల్ల వారుజామున 4 గం॥ నుండి 5 గం॥ ల వరకు భక్తులకు దర్శన భాగ్యం కలుగజేస్తానని సెలవిచ్చారు.

దైవారాధనకు పాలును నీరును తీసుకొని వచ్చేభక్తులకు కోపముండరాదనీ, శాంతం ప్రధానమనీ, భక్తి శ్రద్ధలు యెంత అధికంగా నున్నచో అంతగా వాటి వలన ప్రయోజనం ఉంటుందనీ స్వామి వారు సెలవిచ్చారు. తనకోపమే తన శత్రువు తన శాంతమె తనకు రక్ష అని సుమతీ శతక కారుడన్నాడు గదా;

తపో ఆశ్రమ ఆవరణలోని పూలలో గూడా జీవాత్మ వుంది కనుక వాటిని సైతం కోయ కూడదనీ, కనిపించే జంతువులను (పాములతో సహా) చంపకూడదని, పసిపిల్లలను సహితం "తప్పుడు మాటలన రాదని స్వామివారు గట్టిగా చెప్పారు. "అహింసో పరమధర్మః అని మన

శాస్త్రాలు నొక్కిచెబుతున్నాయి. ఆత్మదత్ సర్వభూతాని అని ఈశావ్యాసోపనిషత్తు చెబుతుంది. ఈ సత్యాన్ని భగవత్ గీతలో శ్రీకృష్ణుడు వివరించియున్నాడు. శ్రీ స్వామివారు నొక్కిచెప్పిందియిదే.

శ్రీ బాలయోగీశ్వరులవారు తమ 'శివరాత్రి' దర్శనంనకు సంబంధించి స్వయంగా యిచ్చిన ఆదేశములు

ది. 27-3-49న శ్రీ వ్యాసం సత్యరాజు మరియు యిద్దరు భక్తులు "సంవత్సరమున కొకసారియైనను మీ సేవకులకు (భక్తులు) దర్శనమునిండు" అని వేడగా వేడగా స్వామివారు తుదకు అంగీకరించి అదే విధంగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి మరుసటి రోజు భక్తులకు దర్శన భాగ్యం కలుగ జేస్తానని అనుగ్రహ భాషనం చేసారు. ఈ సందర్భంగా స్వామివారు కొన్ని ఆదేశాలు, సూచనలు చేసారు.

1. మహాశివరాత్రి మరునాడు మామూలుగా ఇతర పుణ్యక్షేత్రములలో జరుగునట్లే జరుపుకొనవచ్చును. ఆ రోజున ఎన్ని భజనలు చేసికొనినను పరవాలేదు. ఉదయం మొదలు రాత్రి 12 గం॥ వరకు బయట ఎవరు ఏమి గొడవ చేసినను పరవాలేదు. (కాని నిత్యదర్శన కాలములో ఏమియు గొడవ చేయరాదు. ఆ రోజున ప్రతి గంటకు ఒక నిముషము మందిరమునకు తాళమును వేయవలెను.
2. ఆ రోజున దర్శనమునకు వచ్చు భక్తులకు దక్షిణయిమ్మనియు, ఫలహార మిమ్మనియు ఎవరినీ అడగవద్దు. ఇచ్చెడి వారిని వద్దని అనవద్దు. ఆ రోజున ధనము కొరకు ఆశపడవద్దు. ఇచ్చిన డబ్బును వద్దని అనవద్దు. అలాగున వచ్చిన డబ్బును అన్నదానము క్రింద ఖర్చు పెట్టవలెను.
3. ఫలములు ఎన్ని తెచ్చినను ఒక్కటి మాత్రమే తీసుకొని మిగిలినవి తెచ్చిన వారికి 'యిచ్చివేయవలెను. తీసుకొనిన పండ్లను భక్తులకు పంచిపెట్టవలెను.

శివరాత్రికి స్వామి వారి దర్శనార్థం భక్తుల కిచ్చిన యీ మూడు ఆదేశములు 'త్రిసూత్రములు' త్రినేత్రములు వంటివి. త్రిశూల సదృశమైనవి. ఈ త్రిసూత్రములు శ్రద్ధగా పాటించి స్వామివారి దర్శనం భక్తి శ్రద్ధలతో గావించుకొనిన, సాక్షాత్తు ఆ ఆదిశంకరుని దర్శించుకొన్నంతటి పుణ్యం సంప్రాప్తిస్తుందనడంలో ఎట్టి సందేహం లేదు.

సాధారణంగా స్వామిజీలు, బాబాలు, సన్యాసులు, భక్తుల నుండి బలవంతంగా హెచ్చు మొత్తంలో కానుకలు చందాలు వసూలు చేస్తుంటారు. అలా చేయడం వలన వారికి మంచిపేరు కన్న చెడ్డపేరు వస్తూ వుంటుంది. అందుకనే మన స్వామివారు భక్తుల నుండి బలవంతంగా

ఎట్టి పరిస్థితులలోను కానుకలు చందాలు వసూలు చేయరాదని నిర్బంధించారు. పైగా వచ్చిన కానుకలు వెచ్చించి అన్న దానం చేయమన్నారు. 'అన్నం పరబ్రహ్మం' అన్నారు గదా తన దర్శనార్థం ఎంతో దూరం నుండి ఎందరో పేదా బిక్కి వస్తుంటారు కదా! వారికి అన్నదానం చేయమంటారు స్వామి వారు దానాలలో ఆకొన్నవారికి అన్నదానం చేయడం ఉత్తమోత్తమని శాస్త్రాలు నొక్కిచెబుతున్నాయి గదా.

శ్రీ బాలయోగీశ్వరుల వారి నిత్యదర్శనం

ది. 27-3-49 రాత్రి శ్రీ వ్యాసం సత్యరాజు మరియు యిద్దరు భక్తులతో మాట్లాడుతూ 'నిత్యదర్శనం'నకు సంబంధించిన భక్తులకు ప్రతి నిత్యం ఉదయం (తెల్లవారు జామున) 4 గం॥ నుండి 5 గం॥ వరకు దర్శన భాగ్యం కలుగజేస్తానని సెలవిచ్చి యున్నారు గదా. అలాగుననే శ్రీ స్వామివారు ప్రతిరోజు ఉదయం భక్తులకు దర్శనం యివ్వడం మొదలు పెట్టారు. శ్రీ బాలయోగీశ్వరులవారు నిత్యం ఉదయం పూట దర్శనం ప్రసాదిస్తున్నారన్నవార్త చుట్టుప్రక్కల గ్రామాలకు త్వరితగతిని ప్రాకిపోయింది. కనుక పరిసర గ్రామములనుండి, కోనసీమలోని యితర గ్రామాల నుండి, జిల్లాలోను, పొరుగునున్న పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు గ్రామాల నుండి భక్తులు తండోపతండాలు క్రితం రోజు రాత్రికే ముమ్మిడివరం చేరుకొని, ఆ రాత్రి అంతయు ముమ్మిడివరంలోని బంధుమిత్రుల గృహములలోగాని, లేదా స్వామివారి తపోమందిరం పరిసర ప్రాంతములలో గాని 'మకాం' చేసి ఉదయం 4 గం॥ లకు స్వామివారి దర్శనం చేసుకొనుట నిత్యకృత్యమైనది.

అయితే స్వామివారు దర్శనం 4 గం॥ నుండి 5 గం॥ వరకు ఒక గంట మాత్రమే లభించు చుండుట వలనను, స్వామివారి దర్శనంనకు వచ్చేభక్తులు వేల సంఖ్యలో యుండుట వలనను, ముందున్న వారికి దర్శనభాగ్యం గల్గినా వెనుకనున్న వారికి దర్శనం ఆరోజుకు లభించెడిది కాదు. స్వామివారి దర్శనం లభించని వారు 'నిరాశ'పడి కొందరు వెనుదిరిగి పోతే, కొందరు పట్టుదలతో మరలా ఆరాత్రి అక్కడనే పడిగాపులు గాచి, మరుసటి ఉదయం స్వామివారి దర్శనం చేసుకొని పోయెడివారు.మొత్తం మీద ప్రతిరోజూ వేలసంఖ్యలో వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం లభించేదికాదు.

స్వామివారు నిత్య దర్శనం కొరకు నిత్యం వచ్చే వేలాది భక్తుల అవసరాలను తీర్చుటకు తపోమందిరం వెలుపల, రోడ్డు ప్రక్కల తాత్కాలికంగా ఎన్నో కాఫీ హోటళ్ళు, షాపులు, వెలిసాయి. భక్తుల రద్దీ రోజు రోజుకూ అధికమగుచుండడం, తపోమందిరంలో స్వామి వారి సన్నిధిలో భక్తుల కోలాహలం, గొడవలు చేయడం, అరవడం చేయడం వల్ల తపోమందిరంలో 'అశాంతి పరిస్థితులు'నెలకొనసాగాయి. అయితే స్వామి వారికి తపోభంగం కలిగేది కాదు.

స్వామి వారి నిత్యదర్శనం ఆగిపోవుట

1949 సం॥ ఏప్రియల్, మే, జూన్, జూలై మాసాలు మాత్రం నిర్విఘ్నంగా స్వామి వా దర్శనం భక్తులకు ప్రతిరోజు ఉదయం 4గం॥ నుండి 5గం॥ వరకు లభించింది. స్వామి వార భక్తులకు దర్శనంనకు కొన్ని నిబంధనలు, ఆదేశాలు ఇచ్చారుగదా భక్తుల రద్దీపెరిగిపోయి స్వామివారి ఆదేశములను పాటించకపోవడం జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు భక్తులన అదుపుచేయడంతో విఫలమయ్యారు. భక్తుల అల్లరి, గొడవ, అవినీతి ప్రవర్తన, తో తపోమందిరం దగ్గర "అశాంతి" వాతావరణం నెలకొనడం తో స్వామి వారు తమ తపోబలంతో ఆశ్రమ తలుపులు తెరుచుకొనకుండా బంధించారు. ఈ ఆకస్మిక, విచిత్ర సంఘటనతో భక్తులకు స్వామి వా నిత్యదర్శనంనకు భంగం వాటిల్లినది. భక్తులకు నిరాశ కలిగినది.

ది 31.7.49 తేదీన తూర్పు గోదావరిజిల్లా కలెక్టరు గారగు శ్రీ డి. బాల సుందరం గారు అమలాపురం క్యాంపు వచ్చి, ముమ్మిడివరం లో శ్రీ బాలయోగీశ్వరుల వారి తపోమందిరం దగ్గర "అశాంతి" 'అపవిత్ర' వాతావరణం నెలకొన్నట్లున్నూ అందుచేతనే శ్రీ స్వామి వారు తమతపోబలంతో ఆశ్రమతలుపులు బంధించి నిత్యదర్శనభాగ్యం భక్తులకు లేకుండ చేసినట్లును తెలుసుకున్నారు.శ్రీ బాలయోగివారి దర్శనార్థం వచ్చిన వందలాది భక్తులు అశాంతితో నిరుత్సాహంతో ఆశ్రమం దగ్గర వేచియుండుట జిల్లా కలెక్టరు గారు స్వయంగా చూసారు. అయితే స్వామివారి దర్శనం యివ్వరనితెలుసుకొన్న కొందరు నిరాశతో తిరిగి తమతమ స్వగ్రామములకు వెళ్ళిపోయారు.

జిల్లా కలెక్టరు శ్రీ డి. బాలసుందరం గారు శ్రీ స్వామివారిని దర్శించుట

ది 1.8.1949 తేదీన ఉదయం 6 గం॥ లకు జిల్లా కలెక్టరు శ్రీ డి. బాలసుందరం గారు ముమ్మిడివరం బాలయోగీశ్వరుల వారి తపోమందిరం వద్దకు వచ్చారు. వేలాది మంది భక్తులు కిక్కిరిసి స్వామి వారి దర్శనం కొరకు వేచి యున్నారు. అప్పటి తపోమందిర వ్యవహారములు పర్యవేక్షిస్తున్న శ్రీ వ్యాసం సత్యరాజు చేత జిల్లాకలెక్టరు తపోమందిరం తలుపులు తీయించుటకు ప్రయత్నించారు. కాని తలుపులు తెరుచుకోలేదు. కలెక్టరు గారు భక్తులు అంతా ఆశ్చర్యపోయారు. చేసేది లేక, అంతా అక్కడే వేచియున్నారు. అంతలో శ్రీస్వామివారి తపోహిమచేత మందిరం తలుపులు వాటి యంతట అవి తెరుచుకున్నాయి. జిల్లాకలెక్టరు గారును, స్థానిక పోలీసు అధికారి, వ్యాసం సత్యరాజు యీముగ్గురు మాత్రమే ఆశ్రమ గర్భగుడిలో ప్రవేశించారు. భక్తులనెవరినీ లోనికిరానీయకుండాగట్టి పోలీసు బందోబస్తుఏర్పాటు చేయడం జరిగింది.

జిల్లా కలెక్టరు గారు స్వామి వారికి నమస్కరించి వినయంగా నిలబడ్డారు. స్వామి వారు వారిని కూర్చోమని సైగచేసి, సంజ్ఞలతో జిల్లా కలెక్టరుగారితో స్వామి వారు తపో ఆశ్రమం వద్ద గొడవలు జరుగుచున్నవని, పరిస్థితులు ఏమాత్రం బాగుగాలేవని, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచి తపోమందిరం వద్ద పూర్తి ప్రశాంత వాతావరణం చేకూర్చవలెనని చెప్పారు. భక్తులకు నిత్యదర్శన భాగ్యం యివ్వమని స్వామి వారిని జిల్లా కలెక్టరు పదేపదే వేడు కున్నారు. కాని స్వామి వారు నిత్యదర్శనంనకు అంగీకరించలేదు. ప్రతి సంవత్సరం ఒక్క మహాశివరాత్రికి మాత్రమే భక్తులకు దర్శన భాగ్యం కలుగజేస్తానని కరాఖండిగా చెప్పారు. అయితే జిల్లా కలెక్టరు గారివిన్నపం మేరకు శ్రీ బాలయోగివారు ఆ నాటి ఉదయం బయట వేచియున్న (పోయినవారు పోగా) వందలాదిమంది భక్తులకు దర్శన భాగ్యం కలుగచేసారు ఈ నాల్గు మాసములు (ఏప్రియల్ నుండి జూలై) ఆశ్రమ వ్యవహారములు శ్రీ వ్యాసం సత్యరాజు గారు స్వయంగా చూసారు. స్వామి వారి ఆజ్ఞ ప్రకారం, జిల్లా కలెక్టరు గారు తపోమందిరానికి తాళం వేసి, తాళములు తనదగ్గర వుంచుకొన్నారు. తపోమందిర వ్యవహారం గ్రామ కరణంగారగు శ్రీ చల్లా నరసింహం గారికి అప్పగించారు.

16.2.1950 మహాశివరాత్రి మరుసటినాడు శ్రీ పెదబాలయోగి వారి "ద్వితీయ" సర్వదర్శన విశిష్టత

ది 26.2.49 న శివరాత్రి మరుసటి నాడు మొదటిసారి శ్రీ పెదయోగి వారు భక్తులకు సర్వ దర్శన భాగ్యం కలుగజేసిరని తెలుసుకున్నాం. ప్రథమ దర్శనం "కొన్ని" వేల మంది మాత్రమే చేసుకున్నారని గూడ తెలుసుకున్నాం. కారణం శివరాత్రికి స్వామి వారి దర్శనం యిస్తారన్నవిషయం దూరప్రాంతాల వారికి తెలియక పోవడమే 1949 లో శివరాత్రి కి శ్రీ స్వామి వారిదర్శనం గురించి ప్రచారం గూడా అంతగా జరగలేదు. జిల్లాల్లోని, యిరుగుపొరుగు జిల్లాల్లోని ప్రజలు మాత్రం స్వామి వారి దర్శన భాగ్యం పొందగలిగారు. శివరాత్రి మరుసటి రోజున మాత్రమే అంటే సంవత్సరంనకు ఒకసారి శ్రీబాలయోగివారు భక్తులకు దర్శనం యిస్తారన్న విషయం అప్పుడు అందరికీ తెలిసి పోయింది ప్రచారం గూడా జరిగింది.

15-2-50 మహాశివరాత్రి మరుసటి రోజు అంటే 16.2.50 శ్రీ పెదబాలయోగి వారు భక్తులకు శివరాత్రి అర్థరాత్రి నుండి మరునాడు అర్థరాత్రి వరకు అంటే 24 గంటలు శ్రీ స్వామి వారు తమతపోమందిరం నుండి బయటకు వచ్చి దర్శనార్థం నిర్మించిన "దర్శనమండపం" పై ఆసీనులై సర్వదర్శనమిస్తారని ఆశ్రమకమిటీ వారు అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు గారగు శ్రీ డి. బాలసుందరం పిళ్లై గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శ్రీ స్వామి వారి "శివరాత్రి దర్శనం" గురించి బహుళ ప్రచారం చేయించారు. పత్రికా ప్రకటనలతో పాటు ఆశ్రమ కమిటీ వారు కరపత్రాల ద్వారా గూడా ఎంతగానో ప్రచారం చేయడం జరిగింది.

శ్రీ బాలయోగివారు తమ తపోమందిరంలో కూర్చొని కాక, ఆశ్రమ ముందు భాగాన (ఉత్తరభాగాన) శ్రీ బోరపోలయ్యారెడ్డి గారు నిర్మించిన ఎత్తయిన దర్శనమండపంపైకి వచ్చి ఆయన ఆసీనులగుటకు ప్రత్యేకంగా యేర్పాటు చేయబడిన శేషపీఠంపై ధ్యానముద్రలో కూర్చొని భక్తులకు దర్శన భాగ్యం కలుగ చేస్తారని ఆశ్రమకమిటీవారు ప్రభుత్వపక్షాన జిల్లా కలెక్టరు శ్రీ బాలసుందరంగారు బహుళప్రచారం చేయించారు. ఆశ్రమం చుట్టూరా వున్న పంట చేలలో రెండవ పంట వేయకుండా రైతులను రెవెన్యూ అధికారులు ఒప్పించగలిగారు. ఎందుకంటే స్వామివారి దర్శనం కొరకు లక్షలాదిప్రజలు వస్తారని కమిటీవారు జిల్లాకలెక్టరు గారు ముందు గానే వూహించారు. శ్రీ బాలయోగివారు బయట నిర్మించిన దర్శన మండపంపై నుండి దర్శనం యిస్తారని తెలుసుకొన్న పరిసరప్రాంత-దూరప్రాంత ప్రజలు సహజంగానే శ్రీ బాలయోగివారి దర్శనం కోసం అధిక సంఖ్యలో వచ్చారు.

జిల్లానుండియే కాదు, ఇరుగు పొరుగు జిల్లాల నుంచి మాత్రమే కాదు, రాష్ట్రం నలుమూలల నుండి ప్రజలు తండోప తండాలుగా శ్రీ బాలయోగివారి దర్శనార్థము ముమ్మిడివరము తరలి వచ్చారు. బర్మా, శ్రీలంక, అమెరికా, రష్యాతదితర దేశాలనుండి కూడా యాత్రికులు విచ్చేసారు. సంవత్సరము క్రిందట శివరాత్రి మరునాడు దర్శించిన బాలయోగి వారు ఇప్పుడు ఎలా దర్శనమిస్తారో చూద్దామని కొందరువస్తే అన్న పానీయాలు లేకుండా కేవలము గాలిని మాత్రమే ఆహారముగా స్వీకరిస్తూ తలుపులు బంధించిన తపోఆశ్రమములో తపస్సుచేసుకుంటున్న శ్రీ పెద్దబాలయోగి వారిని శాస్త్రీయ దృక్పథంతో చూడాలని విదేశీయులు విచ్చేసారు. ముమ్మిడివరం గ్రామమే కాదు, చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రతి గృహం కుల, మత, వర్ణ భేదాలు లేకుండా బంధు మిత్రులతో కిటకిట లాడిపోయాయి.

అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు శ్రీ డి. బాలసుందరం పిళ్ళై ప్రత్యేక శ్రద్ధతీసుకొని వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయించారు. ఆశ్రమం చుట్టూ ఉన్న పొలాల్లో రెండవ పంట రైతులు వేయించకుండా చూసారు. పొలాలలో పందిళ్ళు వేయించారు. విద్యుత్ శాఖ వారు ఆశ్రమం చుట్టూ, పొలాలలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించారు. జిల్లా బోర్డువారు, గ్రామ పంచాయితీ వారు రోడ్లు, వీధులు బాగు చేయించారు. పోలమ్మ చెరువు నుంచి, ఆశ్రమము ప్రక్కనున్న కాల్వ నుండి పంపుల ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేసారు. అక్కడక్కడ బోరింగు పంపులు కూడా వేయించారు. మహాశివరాత్రి అంటే 15-02-1950 సం॥ము సాయంత్రమునకు "లక్షలాది" మంది ప్రజలు ఆశ్రమము చుట్టూ ఉన్న పొలాలలో మకాం చేసారు. ఇసుక వేస్తే నేలపై రాలనట్లు, నేల ఈనిందా అన్నట్లు భక్తులు శ్రీ బాలయోగి దర్శనార్థము ఉత్కంఠ భరితముగా వేచియున్నారు. అధికారులు,

ఇతర ప్రముఖులు పోలమ్మ చెరువు గట్టు మీద గుడారాలు వేయించారు. ఆశ్రమము-ఆవరణ లోపల ప్రముఖులకై పందిళ్ళు వేయించారు. గట్టి పోలీసు బందోబస్తు భారీ ఎత్తున ఏర్పాటు చేయబడినది.

కాఫీ, భోజన హోటళ్లు, మిఠాయి తదితర తినుబండారాల షాపులు విరివిగా వెలసాయి. వచ్చిన భక్తులు పదిలక్షల వరకు (ఒక మిలియను) ఉంటారని ఒక అంచనా. శ్రీ స్వామి వారి దర్శనార్థము వచ్చిన జనమంతా మహాశివరాత్రి నాటి రాత్రి 'జాగరణ' చేస్తూ స్వామి వారు ఎప్పుడు దర్శనమంటపం పైకి వస్తారోనని వేయి కళ్ళతో కంటి మీద కునుకు లేకుండా వేచిచూడ సాగారు. ఎవరి తొందరవారిది. ఎవరి భక్తి వారిది. దర్శన మండపంనకు ఎంత దగ్గరగా చేరినచో, అంత దగ్గరగా స్వామివారి దర్శనం లభిస్తుంది. కనుక శివరాత్రి సాయంత్రానికే ఆశ్రమం చుట్టూ వున్న పొలాలలో ప్రజలు చేరిపోయారు. 16వ తారీఖు తెల్లవారు జామున (15వ తారీఖు అర్ధరాత్రి) శ్రీ బాలయోగివారు తపో మందిరములో ఆశ్రమ కమిటీ సభ్యులకు, ఇతర ప్రముఖులకు దర్శనమిచ్చాక, సరిగ్గా నాలుగు గంటలకు దర్శన మంటపముపైకి విచ్చేసారు. "జయ జయ బాలయోగీశ్వరా", జై-బాల శివావతారా" అంటూ లక్షలాది భక్తులు భక్త పారవశ్యంతో స్వామి వారిని దర్శనము చేసుకుంటూ చేతులు జోడించారు. దర్శన మంటపము పైకి విచ్చేస్తూ కనురెప్పపాటులో కొందరు భక్తులకు "యువ కృష్ణుడిగా" దర్శనమిచ్చారు. అంతకు ముందు డా॥ కొట్రిన్‌గారికి ఫొటోలు తీయు సందర్భంలో ఒకసారి పండు ముదుసలిగా, మరియొకసారి బాలమురళీ కృష్ణుడిగా దర్శనమిచ్చారు. దర్శన మంటపముపై శేషపాన్పు (సర్పాశనము)పై ధ్యానముద్రలో కూర్చుని నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకు భక్తులకు దర్శన మిచ్చి ఆరు గంటలకు లేచి స్వామివారు తపోఃమందిరములోనికి వెళ్ళిపోయారు. ఈ అనూహ్య పరిణామమునకు అందరూ అవాక్కు అయిపోయారు, అమిత నిరాశ చెందారు. 24 గంటలు స్వామివారు దర్శన మిస్తారు అని కలెక్టరు గారు, ఆశ్రమ కమిటీ వారు ముందుగా ప్రకటన చేసియుండగా స్వామివారు అర్థాంతరముగా ఆరు గంటలకు తమ తపో మందిరములోనికి వెళ్ళిపోవుటకు గల కారణము ఎవరికి తెలియలేదు.

శ్రీ బాలయోగి వారి దర్శనార్థము వచ్చిన లక్షలాది భక్తులలో నిరాశ, ఆందోళన ప్రారంభ మైనది. అసలు స్వామివారు దర్శనమిస్తారా? లేదా? అన్న అలజడితోపాటు కొంత గొడవ, అల్లరి మొదలైనది. జిల్లా కలెక్టరు బాలసుందరంగారు, ఆశ్రమ కమిటీ సభ్యులు ఆందోళన చెందారు. అప్పటికే వచ్చిన లక్షలాది మంది జనమునకు తోడు, స్వామివారు వాస్తవముగా ఆ రోజు దర్శనమిస్తారు కనుక పరిసర గ్రామాల ప్రజలు వస్తే జనసంఖ్య ఇంకా పెరిగి ఇంకా ఎటువంటి గొడవలు, అల్లర్లు జరుగుతాయోనని భయపడ్డారు. తపో మందిరములోనికి కలెక్టరు

గారు, కమిటీ వారు వెళ్ళి స్వామి వారిని దర్శనమంటపముపైకి వచ్చి భక్తులకు దర్శన కలుగ చేయమని మరలా మరలా మొరపెట్టుకున్నారు. కానీ, శ్రీ బాలయోగి వా మంటపముపైకి వచ్చుటకు నిరాకరించారు. కావాలంటే తన తపో మందిరము లోనే దర్శనమిస్తానన్నారు. ఇరవైనాలుగు (24) గంటల లోపల లక్షలాది భక్తులకు 'క్యూ' స్వామివారి దర్శనము చేయించుట అసాధ్యమని కలెక్టరుగారు స్వామివారికి విన్న తమ దర్శనార్థము వచ్చిన అశేష ప్రజానీకాన్ని కరుణించి దర్శన మంటపముపైకి విచ్చే భాగ్యము చేయమని కలెక్టరు గారు స్వామివారిని మరీ మరీ ప్రార్థించారు. ఎట్టకేలకు స్వా కరుణించి సాయంత్రము ఆరుగంటల నుండి, అర్థరాత్రి పన్నెండు గంటల వరకు మంటపమునకు విచ్చేసి భక్తులకు దర్శనమిస్తానని చెప్పారు. కలెక్టరు గారు, కమిటీ స మహదానందముతో స్వామివారికి కృతజ్ఞతలు తెలియచేసారు.

కలెక్టరు గారున్నూ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు బ్రహ్మ సమాజ స్థా అయిన మహర్షి బులుసు సాంబమూర్తి గారున్నూ దర్శనమంటపముపైకి విచ్చేసి ద్వారా స్వామి వారు సాయంత్రం 6 గం॥ నుంచి అర్థరాత్రి 12 గంటల దాకా దర్శన మరల మరల ప్రకటనలు చేశారు. ప్రజలలో ముందు కొంత అసంతృప్తి, అశాంతి వ్యక్త స్వామివారు సాయంత్రము దర్శనమిస్తారన్న ఆనందముతో ఎటువంటి అల్లరులు, గ చేయలేదు. లక్షలాది ప్రజలకు కాలకృత్యములు తీర్చుకొనుటకునూ, అన్నపానీయా కొంత ఇబ్బంది కలిగినను స్వామివారి మహిమ వల్లనూ, స్వామివారిపై నెలకొన్న భక్తి ప్ర వల్లనూ ఆ పగలంతా మొత్తం మీద ప్రశాంతంగా గడచి పోయినది. ఏ కొద్ది మందో ? తిరిగి వెళ్లిపోయిననూ వచ్చిన లక్షలాది మంది స్వామివారి దర్శనార్థము ఓపికగా వేచియు

తాము ఇచ్చిన మాట ప్రకారము స్వామి వారు సాయంత్రము ఆరు గంటలకు మంటపముపైకి వచ్చేసి శేషపాన్పుపై ధ్యానముద్రలో అశేష ప్రజానీకానికి ఆ రాత్రి 12 వరకు దర్శన భాగ్యము కలుగచేశారు. స్వామి వారి దర్శనము కలిగినందులకు "జయ బాలయోగీశ్వరా జై" అనుచూ లక్షలాది ప్రజలు ఆనంద ఉత్సాహాలతో క్యూలో నిలబడి మంటపముపై ధ్యానముద్రలో కూర్చున్న స్వామివారిని భక్తి ప్రపత్తులతో దర్శనము చేస తమ జన్మధన్యమైనట్లు సంభావించుకొన్నారు. అర్థరాత్రి 12 గంటలకు స్వామివారు తమ తపోః మందిరములోనికి వెళ్ళిపోయారు. స్వామివారు తిరిగి సాయంత్రము భక దర్శన మిచ్చినందులకు పగలంతా లక్షలాది ప్రజలు ఎటువంటి గొడవలు, అల్లర్లు పెట్టక కూర్చునందులకు జిల్లా కలెక్టరుగారు, ఆశ్రమ కమిటీ సభ్యులు, పోలీసు యంత్రాంగం, త ప్రభుత్వ అధికారులు ఊపిరిపీల్చుకొని స్వామివారికి తమలో కృతజ్ఞతలు తెలుపుకున్నా

ఇంతకూ, శ్రీ స్వామివారి దర్శనము ఉదయం ఆరు గంటల నుండి ఆగిపోవుటకు దర్శన మంటపము యొక్క నిర్మాణములో జరిగిన చిన్న లోపము అని తరువాత తెలియవచ్చినది. ఈ మంటపము నిర్మాణము చేయించిన వారు, రాజమండ్రి వాస్తువ్యులు తెలిసియో, తెలియకయో దర్శన మంటపమునకు ముందునున్న (ఉత్తర భాగాన) పిట్టగోడపై ముందు "శ్రీ" అక్షరము తరువాత "ఓం" అక్షరము చెక్కించడం జరిగింది. "శ్రీ" అక్షరం ప్రాపంచిక భోగభాగ్యాలకు సాంకేతం. "ఓం" కారం అక్షర పరబ్రహ్మ స్వరూపం. పారమార్థిక ధోరణికి, ఆధ్యాత్మిక చింతనకు 'ప్రణవ' జపమంత్రం! శ్రీ బాలయోగి వారు ముక్కుపచ్చలారని బాల్యదశలోనే, సంసారలంపటంలో పడక 'బ్రహ్మచర్య' వ్రతముని, ప్రాపంచిక భోగభాగ్యాలను కోరక, పారమార్థిక చింతనతో వైరాగ్య మార్గమవలంబించి, పరబ్రహ్మంపై దృష్టిసారించి, స్థిర చిత్తంతో, నిశ్చల మనస్సుతో, దీక్షతో, ఘోర తపస్సునకుపక్రమించిన దివ్య (బాల) యోగి. కనుక పైన "ఓం" కారం క్రింద "శ్రీ" కారం వుండవలయును. అలా లేదు కనుక శ్రీ బాలయోగి వారు యీ విషయాన్ని దివ్యదృష్టితో గ్రహించారు. మరొక కారణం దర్శన మండపంపై శ్రీ బాలయోగి వారు శేషపీఠంపై కూర్చొన్న స్థితిలో వారిపై 'సూర్యరశ్మి' పడడం జరిగింది.సంవత్సరాలు తరబడి సూర్యరశ్మి సోకని 'తపోమందిరం'లో తపస్సు చేయు శ్రీ బాలయోగివారికిది "అసౌకర్యం"గా వుండెను. కనుక శ్రీ స్వామివారు ఉదయం 6 గం॥ నుండి సాయంత్రం 6 గం॥ వరకు ప్రజలకు దర్శన మీయక తమ తపోమందిరంలోనికి వెళ్ళిపోయారు. ఈ విషయాలు కమిటీ వారు తర్వాత తెలుసుకొనగలిగారు. దర్శన మండపం నిర్మించిన శ్రీ బోరపోలయ్యరెడ్డి గారు పైన పేర్కొన్న రెండు స్వల్ప దోషములను తర్వాత సరిచేయించాడు. తర్వాత ప్రతి సంవత్సరం మహాశివరాత్రి మరునాడు శ్రీ బాలయోగివారు తెల్లవారు జామున 4 గం॥ నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు దర్శన మండపంపైకి వచ్చి శేషపీఠంపై ఆశీనులై లక్షలాది భక్తులకు దర్శన భాగ్యం నిరాటంకంగా కలుగజేసారు.

ప్రతి సంవత్సరం మహా శివరాత్రికి ఆశ్రమకమిటీ వారు వివిధ ప్రభుత్వశాఖలు రెవెన్యూ, పోలీసు, పంచాయితీ, ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు శ్రీ బాలయోగి వారి దర్శనం కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేసెడివారు. శ్రీ బోర పోలయ్య రెడ్డిగారు, శ్రీ కర్రి గంగరాజు రెడ్డిగారు, అన్నదానం, (సంతర్పణ) గూడా విస్తృతంగా యేర్పాటు చేసేవారు. కోనసీమలో ముఖ్యంగా ముమ్మిడివరం గ్రామం, పరిసర గ్రామాలలో మహాశివరాత్రి వస్తుందంటే ప్రతి గృహం, ప్రతి గ్రామం బంధుమిత్రులతో కిక్కిరిసి పోయేవి. కళకళలాడేవి. శివరాత్రి మరునాడు శ్రీ బాలయోగి వారిని భక్తి ప్రపత్తులతో లక్షలాది భక్తులు దర్శించుకొని ఆనందంతో, సంతృప్తిగా తమ జన్మధన్యమైనట్లు తాము తరించిపోయినట్లు సంభావించుకొనేవారు.

మహాశివరాత్రి నాడు ఉదయం పరిసరములందున్న ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రాలైన ద్రాక్షారామం, కోటిపల్లి, ముక్తేశ్వరం, ఐనవిల్లి (గణపతి) లందు పూజలు చేసుకొని, సాయంత్రానికి జిల్లాలోని ప్రజలు ముమ్మిడివరం చేరుకొనేవారు. శ్రీ స్వామివారి దర్శనం దగ్గరు నుండి చేసుకోవాలనుకున్నవారు ఒక రోజు ముందునుండే తపోమందిరం చుట్టు ప్రక్కల మకాం వేసేవారు.

మహాశివరాత్రి అర్థరాత్రి 12 గం॥లకు జిల్లా కలెక్టరు, పోలీసు అధికారులు, కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు కొందరు ప్రముఖ నాయకులు తపోమందిరం తలుపులు తీయుటకు ప్రయత్నం చేసేవారు. ఒక్కోసారి తలుపులు తెరచు కొనేవి. ఒక్కోసారి తాళం తీసి గట్టిగా తలుపులు నెట్టినా వచ్చేవికావు. అందరు ముఖద్వారం దగ్గర కూర్చొని 'భజన' చేస్తూ వేచియుండెడివారు. లేదా బయటికి వెళ్ళిపోయి తెల్లవారు జామున 3-30 గం॥లకు వచ్చి మరలా మందిరం ద్వారం తాళం తీసి తలుపులు నెట్టెడివారు. 4 గం॥ ప్రాంతంలో తలుపులు వాటి యంతట అవి తెరుచుకొనేవి. జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు, వచ్చిన ప్రముఖులు అందరు గర్భగుడి (స్వామివారు తపస్సు చేసుకొనేగది) లోనికి వెళ్ళి స్వామివారిని దర్శనం చేసుకొని, కొంచెం సేపు అందరూ కూర్చొని ధ్యానం చేసుకొనేవారు. కేవలం కమిటీ సభ్యులు మాత్రమే లోన గదిలో వుండిపోయి, మిగిలిన వారంతా ముందు గదిలోనికి వచ్చేవారు. లోని గది తలుపులు మూసి స్వామివారికి కమిటీ సభ్యులు ఆశ్రమ విషయాలు విన్నవించేవారు. కళ్ళు తెరచి స్వామివారు కమిటీ సభ్యులు చెప్పినవి వినేవారు. అవసరం అయితే సంజ్ఞలతో స్వామివారు కమిటీ సభ్యులకు సూచనలు ఇచ్చేవారు.

ఇక బయట వేయి కళ్ళతో గత రెండు మూడు రోజుల నుండి సమీప, సుదూర ప్రాంతాలనుండి వచ్చి పడి గాపులు కాస్తున్న లక్షలాది భక్తులకు దర్శనం యిచ్చేందుకు తపో మందిరంనకు ఆనుకొని ఉత్తర ప్రక్కనున్న దర్శన మంటపం పైకి సుమారు 5 గం॥ల ప్రాంతంలో శ్రీ బాలయోగీశ్వరుల వారు వచ్చి శేషపీఠంపై ఉత్తరాభిముఖంగా అర్థపద్మాసనంతో ఆసీనులయ్యేవారు. శ్రీ స్వామివారిని దర్శించగానే సాక్షాత్తు దీర్ఘ తపోనిష్ఠలో నున్న మహాశివుని దర్శించుకొన్న ఆనందానుభూతి కలిగేది. 'జయ జయ శ్రీబాలయోగీశ్వర! జయ జయ శ్రీ బాలశివావతార' అంటూ హర్షాతిరేకంతో లక్షలాది భక్తులు పరమానంద పరవశులై జయ జయధ్వానాలు చేసేవారు. క్యూలో నిలబడి, మెట్లెక్కి తపో నిష్ఠలో ధ్యాన సమాధిగ్రస్తులై దర్శన మంటపంపై రెండు మూడుమీటర్ల దూరంలో శేషపీఠంపై ఆసీనులైన స్వామివారిని దర్శించుకొని, రెండవ ప్రక్కనున్న మెట్లు నుండి దిగిపోయేవారు. ఈ విధంగా ఆ పగలు, ఆ రాత్రి సుమారు 10 గం॥ లేదా 12 గం॥ ప్రాంతం వరకు స్వామివారు శేషపీఠంపై నుండి భక్తులకు దర్శనం ఇచ్చేవారు.

స్వామివారు కళ్ళు తెరచి భక్తుల్ని చూసేవారు కాదు. ధ్యాన నిష్ఠలోనే కూర్చొని వుండేవారు. అప్పుడప్పుడు ఆయన "ఊగిపోయేవారు" అది గమనించి కమిటీ సభ్యులు మూడు ప్రక్కల (తూర్పు-ఉత్తరం-పడమర) నున్న "షట్టర్సు" మూసి వేసేవారు. మరలా పావుగంటకో, అర్ధగంటకో మరలా షట్టర్సు తెరిచేవారు. స్వామివారి దర్శనం కొనసాగేది.

దర్శనం చేసుకొనే సమయంలో భక్తులు పళ్ళుపూలు కానుకలు ప్రక్కనే వున్న (దర్శన మంటపంపై) ఒక కార్యకర్త పర్యవేక్షణలో నుంచబడిన పాత్రలో వేసేవారు. వచ్చిన ఫలపుష్పాలను భక్తులకు మరలా సగం పంచేవారు. ఏ భక్తుడూ ఏనాడూ శ్రీ బాలయోగీశ్వరుల వారిపైకి పూలు విసిరిన సందర్భం లేదు. స్వామివారి పాదపద్మములను స్పృశించిన సంఘటన లేదు. దర్శన మంటపంపై స్వామివారి పాదాల దగ్గర టెంకాయ కొట్టిన దాఖలాలేదు. అల్లంత దూరాన స్వామివారిని దర్శనం చేసుకొని తమ తమ బాధల్ని కష్టాల్ని తమ మనస్సులోనే శ్రీ బాలయోగీశ్వరుల వారికి మొరపెట్టుకొని తమను రక్షింపుమని విన్నవించుకొంటూ వేడుకొంటూ భక్తులు మెట్లుదిగిపోయేవారు.

ఆ రాత్రి 10 గం॥ లు లేదా 12 గం॥ మధ్య శ్రీ బాలయోగీశ్వరులవారు తిరిగి తమ తపో మందిరంలోనికి వెళ్ళిపోయేవారు. కమిటీ సభ్యులు మరలా తపోమందిరంలోనికి పోయి తలుపులు మూసి స్వామివారితో మాట్లాడి, వారేదైనా సంజ్ఞలతో చెబితే విని, తపో మందిరంనకు తాళములు వేసి, సీలు వేసేవారు. మొదట్లో మందిరం తాళములు జిల్లా కలెక్టరు గారి ఆధీనంలో నున్నా ఆశ్రమకమిటీ ఏర్పడిన తర్వాత తాళములు కమిటీ అధ్యక్షుల వారి ఆధీనంలో వుండేవి. మందిరంనకు తాళము వేసిన తర్వాత కమిటీ వారు తమ కమిటీ గదిలోనికి వచ్చి విషయాలు ముచ్చటించుకొని బయట ప్రాకారములకు గూడా తాళాలు వేసి వెళ్ళిపోయేవారు. మరలా శ్రీ బాలయోగీశ్వరుల వారి దర్శనం తర్వాత వచ్చే మహాశివరాత్రి మహాపర్వదినానికే గదా భక్తులు కొందరు నిరుత్సాహంతో వెళ్ళిపోయేవారు. కొందరు స్వామివారి దర్శనం బాగా జరిగిందనీ తమ కష్టాలు తొలిగి పోతాయని ఆనందాతిశయంతో సంతృప్తితో తిరిగి తమ తమ స్వగ్రామములకు వెళ్ళిపోయేవారు.

శ్రీ బాలయోగివారు భక్తకోటికి దర్శనమిచ్చేది మహాశివరాత్రి మరుసటి రోజు గదా! అయితే మహాశివరాత్రి మధ్యాహ్నం నుండే ముమ్మిడివరంలోని శ్రీ బాలయోగి వారి ఆశ్రమ పరిసరప్రాంతాలు భక్తులతో నిండిపోయేది. శ్రీ బాలయోగివారి జీవితం గురించి, వారి మహి గురించి, కీర్తనలు పాడే బృందాలు, భజన బృందాలు, కోలాట బృందాలు, సు దండకాలు, పద్యాలు పాడే పార్టీ, హరికథలు చెప్పేవారు, ఉపన్యాసాలు చేసేవార కాలక్షేపం చేసేవారు. ఆశ్రమ ప్రాంతమంతా మైకుల హోరుతో, జోరుతో మారుమ్రో

అయితే యిక్కడొక చిన్న ముఖ్యగమనిక. శ్రీ బాలయోగీశ్వరుల వారి తండ్రి గంగయ్యగారు చనిపోయిన తర్వాత తండ్రిగారి సంవత్సరీకం నాడు శ్రీ స్వామివారు తెల్లవారు జామున 4 గం॥ నుండి 6 గం॥ వరకు కుటుంబ సభ్యులకు, కమిటీ సభ్యులకు, స్వామివారు దర్శనమిస్తున్నారని తెలిసి వచ్చిన అధికారులకు, ప్రముఖులకు ముమ్మిడివరం, పరిసర గ్రామాల ప్రజలకు, కొన్నివందల మందికే దర్శనమిచ్చేవారు.

మహాశివరాత్రి పర్వదినాన అర్ధరాత్రి 12 గం॥లకు మహేశ్వరుడు"లింగాకారం"లో ఉద్భవించిన శుభఘడియలు. శ్రీ బాలయోగివారు ఆ రాత్రి తెల్లవారు జామున (శివరాత్రి మరుసటి రోజు ఉషోదయాన) అంటే బ్రహ్మముహూర్తాన దర్శనమండపంపైకి వచ్చెడివారు.

మహాశివరాత్రి మరుసటి రోజు శ్రీ బాలయోగీశ్వరుల వారు తపోమందిరం నుండి దర్శన మండపంపైకి విచ్చేసి శేషపీఠంపై ధ్యాన నిమగ్నుడై భక్త కోటికి దర్శనభాగ్యం కలుగజేసెడి వారు గదా. శ్రీ బాలయోగివారి దర్శనం సంవత్సరంనకు ఒక్కసారి మాత్రమే లభించడం వలన, మహాశివరాత్రికి ముమ్మిడివరం లక్షలాది మంది ప్రజలు వచ్చెడివారు. ప్రభుత్వం వారు గ్రామ పంచాయితీ వారు, ఆశ్రమ కమిటీ వారు లక్షలాది ప్రజల సౌకర్యార్థం చలువ పందిళ్ళు వేయించెడివారు. త్రాగునీటి వసతి, విద్యుద్దీపాలు ఏర్పాటు చేసేవారు. ఇక అనధికారికంగా ప్రజల కోసం కొందరు స్వచ్ఛంద సంస్థల వారు త్రాగునీటి సదుపాయం (చలివేంద్ర కేంద్రములు) ఏర్పాటు చేసెడివారు. ది. 27-3-49న శ్రీ వ్యాసం సత్యరాజు తదితరులతో 'శివరాత్రి దర్శనం' గురించి చెప్పిన ఆదేశాలలో భక్తులు యిచ్చే డబ్బుతో 'అన్నదానం' చేయమని చెప్పారు గదా. శ్రీ స్వామివారి సన్నిహిత భక్తులలో ఒకడైన రాజమండ్రి వాస్తవ్యుడు శ్రీ బోర పోలయ్యరెడ్డి స్వంత ఖర్చులతో తమ శక్తి మేర "అన్నదాన" సదుపాయం పేద భక్తులకు కలుగజేసెడివాడు. ఇలా ఆ రెడ్డిగారు ప్రతి శివరాత్రికి శ్రీ స్వామివారి దర్శనార్థం వచ్చెడి భక్తుల కొరకు అన్నదాన సదుపాయం ఏర్పాటు చేసెడివారు. ఇంకా మరి కొందరు స్వచ్ఛందంగా అన్నదానం చేసెడివారు. లక్షలాది మందికి అన్నపానీయాలు సదుపాయం చూడడం కష్టసాధ్యమైనపని. పోతే వ్యాపార రీత్యా, కాఫీ భోజన హోటళ్ళు, కారా, తీపి (స్వీట్సు) తదితర తినుబండారాల 'విక్రయశాలలు' వెలసి, విపరీతంగా వ్యాపారం సాగించేవి.

1949 ఆగష్టు నుండి 1950 ఫిబ్రవరి వరకు ముమ్మిడివరం గ్రామకరణం గారైన శ్రీ చల్లా నరసింహంగారున్నూ, శ్రీ గంగయ్య గారున్నూ, ప్రతి నిత్యం ఎంతగా వర్షము కురియుచున్నను లెక్కించక, ఆశ్రమానికి వచ్చి ఆశ్రమ ప్రాంగణమంతా, ప్రాకారాలు లోపల, వెలుపల శుభ్రపరచెడివారు.

1950 జనవరిలో ఆశ్రమకమిటీని జిల్లా కలెక్టరు శ్రీ బాల సుందరం గారు ఏర్పరచి,

దానిని రిజిష్టరు చేయించారు. ప్రథమ ఆశ్రమ కమిటీ గౌరవాధ్యక్షుడిగా శ్రీ సూరిశెట్టి వెంకటస్వామి నాయుడు (అప్పటి జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు) గారిని నియమించడం జరిగింది.

తపో ఆశ్రమ (ధ్యానమందిరం) పునర్నిర్మాణం

1949 ఫిబ్రవరిలో శ్రీ వ్యాసం సత్యరాజు తదితరులు శ్రీ బాలయోగివారి తపో ఆశ్రమంను పెంకుటిల్లుగా మార్చి గోడలకు సిమెంటు కాంక్రీటు వేయించి, తలుపుల యేర్పడిన సంగతి మనం ముందుగా తెలుసుకున్నాం.ఈ పెంకుటి తపోఆశ్రమంలోనే స్వామివారు దీర్ఘ కాలంపాటు తపస్సు కొనసాగించారు. అయితే ఆ పెంకుటి ఆశ్రమం రెండు గదుల చిన్నది అగుట చేతను, ప్రాతబడి పోవుట చేతను, పెద్ద వర్షం కురిసినచో, పెంకుటి పైకప్పులో నుండి వర్షపు నీరు కారుచుండుటచేతను 1971 ఏప్రియల్‌లో పెంకుటిల్లు స్థానంలో శాశ్వతమైన గట్టి సిమెంటు (రెండతస్తుల భవన నిర్మాణం చేయబడింది.)

పెంకుటిల్లు స్థానంలో పక్కా "తపో ఆశ్రమం (ధ్యానమందిరం) మహాదానకర్ణ, మహాభక్త శ్రీ బచ్చు మాధవయ్య (ఏలూరు) వారొసంగిన ద్రవ్యంతో 1971లో నిర్మింపబడింది. అప్పటి ఆశ్రమకమిటీ అధ్యక్షులు శ్రీ బాలసుందరం (ఐ.ఏ.ఎస్.) మద్రాసు వారున్నూ, శ్రీ గోవిందస్వామి నాయకర్ గారున్నూ, కొంత ఆర్థిక సహాయం చేసారు. యీ తపో ఆశ్రమ నిర్మాణానికి ఈ రెండతస్తుల తపో ఆశ్రమ భవనంపై పెద్ద గోపురం కూడా నిర్మితమైంది.

ఈ తపో మందిరం రెండతస్తుల భవనం. రీ యెన్‌ఫోర్సు కాంక్రీటు ఆచ్ఛాదనముతో యీ మందిరం శ్రీ బాలయోగివారి సూచనలు, సలహాలు ఆదేశాల ప్రకారం కేవలం 14 రోజులలో నిర్మించడం జరిగింది. స్వామివారి ప్రియ భక్తుడు శ్రీ పి.యల్. సుబ్రహ్మణ్యం గారికి (ఇంజనీరు) స్వామివారు భవనం ప్లాను వివరించేవారు. పునాదులు, గోడలు, ద్వారములు, కిటికీలు, వాటి కొలతలు, వాటిని అమర్చవలసిన, నిర్మించవలసిన స్థలం, మొదలగు సమస్త వివరాలు స్వామివారు ఇంజనీరు సుబ్రహ్మణ్యంగారికి సంజ్ఞల ద్వారా చెప్పేవారు. భవన నిర్మాణ భారం శ్రీ స్వామివారి భక్తుడు శ్రీ దారా సర్వేశ్వరరావు గారి స్వీయ పర్యవేక్షణలో జరిగింది.

ఆధునిక భవన నిర్మాణ పద్ధతి ప్రకారం మామూలుగా అయితే రీఎన్‌ఫోర్సుమెంటు కాంక్రీటు సెంటరింగు వేసి కనీసం రెండు మూడు వారాలు దానిని నీటితో తడుపుతూ వేచి వుండాలి. పై అంతస్థుపై కాంక్రీటు వేసి మరలా రెండు మూడు వారాలు వేచి వుండాలి. అంటే క్రింది పైనీ రెండు అంతస్థుల కాంక్రీటు పూర్తి చేయుటకు కనీసం 30 లేక 40 రోజులు పడు తుంది. మరి రెండు వారాలలో భవన నిర్మాణం మెలా అవుతుందో అర్థంకాక సుబ్రహ్మణ్యం గారు 'తటపటా'యిస్తుంటే శ్రీ బాలయోగివారు ఆశ్రమ ఆవరణలో నున్న యాంగ్యులర్స్ తాము

తపస్సు చేయుచున్న 'తపోపీఠం' వద్దకు తెప్పించి, వాటిని యే విధంగా అమర్చాలో వాటిపై టేకు చెక్కలు వేసి, వాటిపై యే విధంగా కాంక్రీటు పోయవలెనో సంజ్ఞల ద్వారా వివరించారు. స్వామివారు చెప్పినట్లుగా సెంటరింగ్ అవసరంలేకుండా పని ఆపకుండా భవన నిర్మాణం 14 రోజులలో పూర్తి చేయించారు. పై అంతస్తులో శేషపాన్పు గూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పై అంతస్తులోనే సిద్ధ పురుషులు యెవరికీ కనిపించకుండ, ఎవరికీ తెలియని భాషలో అప్పుడప్పుడు సమావేశాలు జరిపినట్లు జనశ్రుతి!

తపో మందిరం నిర్మాణం

మనమిక్కడొక ముఖ్య విషయం గుర్తుంచుకొనవలయును. 1963వ సంవత్సరంలో శ్రీ బాలయోగీశ్వరులవారు తపస్సు చేసుకొనెడి తపో ఆశ్రమంనకు తూర్పు యీశాన్యదిశలో, శ్రీవారి అభీష్టం ప్రకారం శ్రీ బచ్చు మాధవయ్యగారు బలమైన (గట్టి-శాశ్వతమైన) 'తపోమందిరం' ను నిర్మింపజేసారు. శ్రీ ధారా సర్వేశ్వరరావు గారు యీ మందిర నిర్మాణం పనులు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షణ చేసారు. ఈ తపోమందిర నిర్మాణంనకు అప్పటి రాష్ట్ర పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ శ్రీ నంబియార్ శంకు స్థాపన చేసారు. ప్రముఖ ఇంజనీరు శ్రీ పి.యల్. సుబ్రహ్మణ్యం గారు నిర్మాణం చేపట్టారు. ఇందులో శేషపాన్పును గూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆశ్రమ ప్రాంగణంలో ప్రప్రథమంగా నిర్మింపబడిన బలమైన సిమెంటు భవనం గూడా యీ 'తపోమందిరమే'. ఈ భవనంలో శేషపాన్పు వున్న మధ్యగదిలో అప్పుడప్పుడు సిద్ధపురుషులు సమావేశమై ఎవరికీ కనిపించకుండా, ఎవరికీ తెలియని భాషలో మాట్లాడుకొనుచుండెడివారని జనశ్రుతి. ఈ సిద్ధ పురుషుల సమావేశాలలో శ్రీ బాలయోగివారు 'సూక్ష్మ' రూపంలో హాజరయ్యేవారో కాదో తెలియదు. అసలు తాము దీర్ఘకాలంగా తపస్సు చేయుచున్న 'పెంకుటి' తపో ఆశ్రమం నుండి యీ 'తపో మందిరం'లోనికి విచ్చేసి తపస్సు కొనసాగించాలన్న తలంపు శ్రీ బాలయోగి వారికి ఏమైనా వుండేదేమో ఎవరికి తెలియదు. ఎందుకంటే శ్రీ బాలయోగివారి ఆదేశానుసారమే శ్రీ బచ్చు మాధవయ్య గారు యీ తపోమందిరం సొంత వ్యయంతో నిర్మింపజేసారు.

ఈ మందిరం చుట్టును నలుచదరపు గోడలు, మధ్య గది యందు శేషపాన్పు నిర్మించబడింది. ఈ భవనానికి, 8 ద్వారబంధాలు, 8 కిటికీలు, 8 అలమరలు వుండడం విశేషం. ఎనిమిది అరమరలన్నియు మధ్య గదిలో అమర్చబడి వుండడం గూడా విశేషం. కాని శ్రీ బాలయోగి వారీ 'తపోమందిరం'లో ఏనాడు 'తపస్సు' చేయలేదు. ఈ తపోమందిరంను ఎవరూ ఏ విధంగానూ ఉపయోగించరాదని శ్రీ బాలయోగి వారి ఆజ్ఞ. అయితే శ్రీవారి

దర్శనంనకు వచ్చెడి భక్తులు, (ఆనాడు ఆశ్రమ ప్రాంగణంలో యితర నివాసయోగ్య నిర్మాణానికి లేక పోవుటచేత) యీ తపోమందిరంలోనే ఆహార పానీయాలు స్వీకరిస్తూ, విశ్రాంతి తీసుకొని నిద్రించెడివారు. కనుకనే 1981లో రెండతస్తుల 'తపోమందిరం' నిర్మించినపుడు పై అంతస్తులో శేషపాన్పు నిర్మింపచేశారు.

పాఠకులు గమనించవలసిన విషయమేమన. ఆశ్రమ ప్రాంగణంలో నిర్మితమైన శ్రీ పెదబాలయోగివారి, శ్రీ చినబాలయోగివారి తపోమందిరములు, వాటిపైన గోపురములు, ఆ గోపురాలపై చెక్కబడిన యిరువురి యోగిసోదరుల విగ్రహాలు, తదితర మూర్తుల, దశావతార, సప్తఋషుల, పురాణ బాలమునీంద్రుల విగ్రహాలు, శ్రీ పెదబాలయోగి వారి తపోమందిరం దాని పైన నిర్మితమైన రెండవ అంతస్తు, శ్రీ పెదస్వామి వారి (నిత్యధ్యాన్) తపో మందిరానికి తూర్పు యీశాన్య దిశలో నిర్మితమైన 'తపోమందిరం' (భజన మందిరం శ్రీ చినబాలయోగి వారి తపోమందిరం, ఆశ్రమ ప్రాంగణానికి దక్షిణ భాగాన నిర్మితమైన 'శ్రీ గంగయ్య మెమోరియల్ హాలు, శ్రీ పెద బాలయోగి వారి జనన మందిరం యిత్యాది భవన సముదాయం, మొత్తం, ఏ విధంగా సిమెంటుతోనో, ఏ రాతితో, ఏ చెక్కతో, ఎన్ని గదులతో, ఎంత విశాలంగా, ఎన్ని కిటికీలు, ఎన్ని తలుపులు, ఏ విధంగా, ఏ ముహూర్తాన భవన నిర్మాణ 'భూమిపూజ' చేయవలయునో యిత్యాది విషయాలు శ్రీ పెదబాలయోగి వారి 'స్వీయ' ఆదేశాల ప్రకారమే జరిగెడివని పాఠకులు గ్రహించగలరు.

ఘోర (కఠోర) తపోభంగ వ్యర్థ ప్రయత్నాలు

తపస్సునకు కూర్చుండిన క్రితం రోజు వరకు పశువుల కాపరిగా కాయ కష్టం చేసి మూడు పూటలా కడుపార అన్నం తిన్నారు శ్రీ బాలయోగివారు. పశువులు కాస్తూ చిన్నవయస్సులో సాటి బాలురతో- తోటి పాలేరు కుర్రాళ్ళతో ఆడుతూ పాడుతూ తిరిగాడు. తపస్సు ప్రారంభించిన 22-6-46 నుండి అన్నం మానివేసి - పద్మాసనంతో కూర్చుని పిలిచినా పలకక ఏకాగ్ర చిత్తంతో ధ్యాన నిమగ్నుడగుట అసాధారణ విషయం. అది ఆబాలుని (బాలయోగి) పూర్వజన్మ సుకృతపరిపక్వ ఫలం. మనస్సు చాలా చంచలమైంది. కోతి వంటిది: చిత్తం గూడా నిగ్రహించడం చాలా కష్టం. పది- పదిహేను సంవత్సరాల బాలుడు ఇంద్రియాలను-మనస్సును చిత్తమును నిగ్రహించి ఘోరతపస్సునకు పూనుకొనడం అసాధారణమైన విషయం. అది అలా వుంచితే ఆకస్మికంగా ఆహారము మాని పద్మాసనస్థితిలో కూర్చోని రోజులు తరబడి ధ్యానం చేయడం వలన " శారీరక" మైన బాధలెన్నో వుంటాయి. ఒక రోజు కాదు ఒక పూట అన్నం తినకపోతే మానవమాత్రులమైన మనం ఎంతకష్టపడతాము. ఏదో ప్రాణమే పోయినట్లు అల్లాడి పోతాము. దానికి తోడు ఒక స్థితిలో కూర్చొనుట గూడా చాలా కష్టంగా వుంటుంది. మనం ఒకే స్థితిలో ఎక్కువసేపు కూర్చొనలేము. తెలిసో తెలియకో "అటూయిటూ" కదులుతూ వుంటాము. కాలో చేయో శరీరమో కొంచమైన కొంతసేపటికి కదుపుతూ వుంటాం. స్థిరంగా కదల కుండా కూర్చోలేం. చూడండి మనం నిద్రలో గూడా అటూ యిటూ కదలుతూ వుంటాం మరి పద్మాసనంతో కూర్చొనుట చాలా కష్టం. ఆ ఆసనం తెలియని బాలకుడిగా యోగీ వారు రోజులు, నెలలు, రాత్రింబవళ్ళు, సంవత్సరాలు కూర్చొనుట అసాధారణం. చాలాసేపు ఒకే స్థితిలో కూర్చుంటే మనలో చాలామందికి కాళ్ళు నొచ్చుతాయి. కాళ్ళు తిమ్మిర్లెక్కుతాయి (రక్తప్రసరణ సరిగ్గాలేక). మరి స్వామివారు తపస్సు ప్రారంభించిన తొలి రోజుల్లో - కొంత కాలం పాలు స్వీకరించినా పద్మాసనుడై- నిద్రాహారములు లేక ధ్యాననిమగ్నుడగుటచే - శారీరకమైన బాధలు ఎన్నో పడినా- పూర్వజన్మ పుణ్యఫలం చేతవాటిని లెక్కచేయక ఆ బాధలు తట్టుకొని ఏకాగ్ర చిత్తంతో ధ్యాననిమగ్నుడైనాడు. యోగసాధన చేసేవారు (నిశ్చలధ్యాన నిమగ్నమగుట) ఎన్నివిధములైన శారీరక-మానసిక బాధలకు, ఆందోళనలకు గురి అవుతారో యోగ సాధన చేసేవారెందరో తమ అనుభవాలను తెలిపారు.

ఇళ్ళ గోవిందరావు తోటలోను పిదప తమ గృహం వద్ద ఆ తర్వాత గవర్నమెంటు పోరంబోకు పుంతలోను తాటియాకుల పర్ణశాలలో తపస్సుచేసినపుడు (తలుపులుండేవి

కాదుగదా) పరిసరప్రాంతాలు ఊడ్చిన (నాట్లువేసిన) వరిచేలు, కొబ్బరితోటలు అవడం చేత చీమలు, విషపురుగులు (క్రిమికీటకాదులు) స్వామి వారిపై ప్రాకినను, ఆయన్ని కుట్టినను ఆయన లెక్కచేయలేదు. తేళ్ళు పాములు గూడా ఆయనపై ప్రాకి యుండవచ్చు. అయితే ఆయన కొయ్యలా, రాయిలా, బొమ్మలా, కదలక మెదలక నిశ్చల దీర్ఘతపోనిష్ఠలో యుండుట వలన ఆ విష ప్రాణులు గూడా ఆయన ఒక జీవిగా భావించి యుండకపోవచ్చును. రాయి గానో - కొయ్య గానో భావించి యుండవచ్చు. పైగా యీ విషప్రాణులు ఆయన్ని "కుట్టి" నట్లు గాని "కరచి" నట్లుగాని, ఎట్టి దాఖలాలు లేవు. పోనీ కుట్టినా కరిచినా గూడా, లోకంతో సంబంధంలేని దీర్ఘ నిశ్చల తపోసమాధి స్థితిలో వున్న మన యోగి వారికి ఏ లెక్కాలేదు. ఏప్రమాదమూ లేదూ. అట్టి బాధలను గూడా ఆయన భరించాడు.

శారీరకంగా జలాన్నములు మానుట వలన, శరీర చర్మం పొలుసులు పొలుసులుగా వూడి రావడం జరిగింది. తండ్రి గంగయ్యగారు పిన్నవయస్కుడైన తన కుమారునికి 'ప్రాణాపాయం' సంభవించునేమోయని భయపడ్డారు.

మన స్వామి వారు తపస్సు ప్రారంభించిన తొలి రోజుల్లో ఒక నెలకు పైగా మాత్రమే కేవలం 'పాలు', నీరు' మాత్రం స్వీకరించారు. అంతకు ముందు యోగసాధన అనగా ఏమిటో తెలియని వాడు యోగసాధన ప్రారంభించి ఘనాహారం మాని వేసి కేవలం "పాలు" మాత్రం స్వీకరించడం వలన అందునా పట్టుమని పదాహారు సంవత్సరాలు నిండని బాల్యయౌవనదశల మధ్య వయస్కుడు శరీరం శుష్కించిపోయి- బంగారం వంటి "పండు" పీనుగులా అయిపోయాడు. శరీరంపైని "పొట్ట" పొలుసు లేచి పోయి పాలిపోయి పొట్ట ఉబ్బి " వికృతాకారుడై" పొయారు. పాపం అన్నెంపున్నెం యెరుగని బాలుడు తపస్సని కూర్చున్నాడు. "చని" పోతాడేమోనని చాలామంది సందేహించారు. తండ్రి శ్రీ గంగయ్య గూడా తమ కుమారుడు "చని" పోతాడేమోనని భయపడ్డాడు. పూజారిగూడా అదే అనుమానపడ్డాడు. ఇదంతా స్వామి వారు తపస్సు ప్రారంభించి గవర్నమెంటు పోరంబోకుపుంతలో తపస్సు చేసిన తొలి రోజుల: సంగతి

అదృష్టవశాత్తు మన స్వామివారు " పూర్వజన్మసుకృతం"వలన తపోయజ్ఞంలో ధ్యాన దీక్ష పరీక్షలో నెగ్గాడు. నిలదొక్కున్నాడు. పూర్వజన్మ సుకృతం ఫలించి "జలహారములు" పూర్తిగా విసర్జించి "యోగబలము"చే ఆకలిదప్పులనరికట్టి తపస్సు కొనసాగించాడు. జలహారములు లేకపోయినా స్వామి వారు సంవత్సరం - సంవత్సరంనకు - వయస్సు పెరిగిన కొద్దీ- శరీరం కూడా పెరుగుతూ - తపోబలంతో ముఖంలో ముఖ్యముగా "భ్రుకృటి (త్రికుటి) నొసటి మధ్యభాగంలో బ్రహ్మతేజస్సు - శరీరానికి లేత బంగరు కాంతి సంతరించి "అపరపరమేశ్వరుడు (శివుడు) లా భక్త ప్రదర్శకులకు దర్శనమిచ్చేవాడు.

మునుపటి రక్తమాంసములు పోయెను నూతన దేహదార్ఢ్యమయ్యెను జడలన్నియు ముడి వహించెను. బాలశివావతారమో యనునట్లు తోచు చుండెను. మహాద్భుత శక్తియు నావహిల్లె" నని శ్రీజయంతి స్వామి నాయన శ్రీబాలయోగి వారి గురించి ప్రస్తుతించారు.

స్వామివారి మానసిక శారీరక సంబంధ బాధల్ని ఆయన అధిగమించడం ఒకయెత్తు కాగా, స్వామి వారు తపస్సు ప్రారంభించిన తొలి రోజుల్లో, మాసాల్లో - వారి తపోపర్ణశాల ఎవరు బడితే వారు ప్రవేశించుటకు అనువుగా నున్న తడికలతో వుండుట వలన తపస్సుచేసుకొనే 'పర్ణశాల' కు చుట్టూ గోడలుగాని, తలుపులుగాని లేక పోవుటచే కొందరు భక్తితో వచ్చి దర్శించి వారి పాదములను స్పృశించి పండ్లు పూలు వారి పాదముల చెంతపెట్టెడివారు. మరికొందరు తోటి బాలురు (తనతో పాలేరు పని చేసిన బాలురు) స్వామి వారిని పట్టుకొని వూపుతూ పెద్దగా పిలిచేవారు. కొందరు పోకిరి బాలకులు స్వామివారి జుట్టు పట్టుకొని లాగేవారు. చేతులు పట్టుకొని ఎత్తుటకు ప్రయత్నంచేసే వారు. కొందరు అగ్రకుల ఛాందసులు దైవభక్తిలేని యువకులు "వెటకారంగా" స్వామివారి "కులం" పేరెత్తి యిట్టి అస్పృశ్యకులంలో పుట్టిన వాడికి తపస్సు ఏమిటి యిదంతా దొంగనాటకమని హేళన చేసే వారు. కొందరు చదువూ సంధ్యా లేక పోయినా, హీనకులంలో పుట్టినా పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమెట్టిదో గాని పిన్న వయస్సులోనే తపస్సు చేసు కొంటున్నాడని పెద్దగాచెప్పుకొనేవారు. ఒక్కోసారి సందర్శకులు ఎక్కువగా గుంపులు గుంపులుగా వచ్చి నానాగొడవ చేస్తూ అల్లరి చేసి పెద్దపెద్దగా మాట్లాడు కుంటూ స్వామి వారిని దర్శించి పోతుండే వారు. కొందరు స్వామి వారిని మాట్లాడ మని గొడవచేసేవారు.

స్వామి వారు ఎంత ధ్యాన నిష్ఠలోనున్నా ఆయన తపస్సు ప్రారంభించిన తొలి రోజులు కనుక, ఆయన తపస్సునకు సందర్శకుల మాటలు, వారాయనను ముట్టుకొనుట తదితర వారి చర్యలు కాస్త ఆటంకంగా వుండేవి. అందు వలననే ది 6.2.49 న స్వామి వారిని దర్శనం చేసుకొన్న వ్యాసం సత్యరాజు గారితో స్వామి వారు "నా దర్శనమునకు వచ్చే ప్రజలు చేసే గొడవ తపస్సులో ఉండే నాకు వినబడకపోయినప్పటికి, కొంత మంది నన్ను ముట్టుకొనుట వల్లను, ఇతర కారణముల వల్లను నా తపస్సునకు చలనము కలుగు చున్నది. ఏకాంత పరిస్థితి సమకూర్చుట అవసరము తపోమందిరములోనికి ప్రజలెవ్వరు ప్రవేశింపకుండునట్లు తలుపులు మూయించి తాళము వేయవలెను" అని నిక్కచ్చిగా వక్కాణించి యున్నారు. ది 10.2.49 న రాజమండ్రి సబ్ జడ్జి గారైన శ్రీ గరిమెళ్ళ కృష్ణమూర్తి తోను వ్యాసం సత్తిరాజు గారితోను యిదే విషయం మరలానొక్కిచెపుతూ తమ తపస్సునకు ఏవిధమగుచలనము వాటిల్లకుండునట్లు తలుపులన్నియు మూసివేసి నిర్జనారణ్యప్రదేశము వలె ఏకాంత పరిస్థితిని సమకూర్చవలెనని గట్టిగా చెప్పియున్నారు. అదే విధంగా ది 27.3.49 న శ్రీ వ్యాసం సత్యరాజు

55804

మరియిద్దరితో తమ నిత్యదర్శనమునకు సంబంధించి కొన్ని ఆదేశములిస్తూ " నాతో మాట్లాడు టకు ఎవరును ప్రయత్నము చేయవలదు నేను చేసే తపస్సు మాట్లాడుటకు వీలు లేనిది ఎవరితోడను మాట్లాడను" అనియు నిర్ద్వంద్వంగా ఆదేశించియున్నారు. అలాగే ఎంతపెద్దవారు వచ్చినను మేము గొప్పభక్తులము తాళము తప్పక తీయుమని బలవంతం చేసినను, బెదిరించి నను, ధనాశ చూపెట్టినను మందిర తాళమును తీయవద్దనియును శ్రీ బాలయోగి వారు పై ముగ్గురు భక్తులతో గట్టిగా చెప్పియున్నారు.

శ్రీ బాలయోగివారి ఆదేశానుసారం 1949 మార్చి మాసం చివరిలో తపోమందిరమునకు బలమైన యిటుకరాళ్ళు సిమెంటు పూతతో గోడలు నిర్మించి ద్వార బంధాలు, తలుపులు బిగించి తాళము వేయడం జరిగింది. తర్వాత ఎవరెవరో వచ్చి ఎంతబలవంతం చేసిన కమిటీ సభ్యులు కుటుంబీకులు తలుపులు తీయలేదు. అయితే శ్రీ వ్యాసం సత్యరాజు మరియిద్దరు భక్తుల కోరిక మేరకు ప్రతిరోజు ఉదయం తెల్లవారుజామున 4 గం॥ నుండి 5గం॥ వరకు భక్తులకు దర్శనం యిచ్చుటకు అంగీకరించి 1949 జూలై మాసాంతం వరకు (సుమారు నాలుగు నెలలు) అలానే దర్శనం యిచ్చారు. కాని తమ దర్శనం యిచ్చిన ఒక గంట వ్యవధిలో ప్రజలు అల్లరి చేయడం వల్లను కొన్ని రకములైన అపవిత్ర చర్యలకు పాల్పడుట వలన 1.8.49 నుండి నిత్య దర్శనం గూడా యిచ్చుట మానివేసి కేవలం సంవత్సరం నకు ఒకసారి మాహాశివరాత్రి పర్వదినం మరునాడు మాత్రమే ఉదయం 4 గం॥ నుండి రాత్రి 10- 12 గం ॥ల వరకు దర్శన మండపంపైకి వచ్చి శేషపీఠంపై ఆసీనులై భక్తులకు దర్శన భాగ్యం కలుగజేసేవారు. ది 27.3.49 తర్వాత మరియెవ్వరితోను స్వామివారు నోరువిప్పి మాట్లాడలేదు. కమిటీసభ్యులతో సంజ్ఞలతోనే మాట్లాడెడివారు.

1950వ దశకం (1950-60) లో శ్రీ స్వామివారి తపస్సును అవహేళన చేస్తూ కొందరు గిట్టని' వారు కరపత్రాలు వేసారు. కమిటీ సభ్యులు గూడా వాస్తవ విరుద్ధమైన విషయాలతో, స్వామివారు త్వరలోనే కైవల్యసిద్ధి పొందుతారన్న అసత్యావార్తతో కరపత్రాలు వేశారు. స్వామివారి దర్శనార్థం వచ్చి పోయే భక్తులు 'భక్తి'తో తమ శక్తి కొలది డబ్బులు 'డబ్బీలో'' వేసిపోయేవారు. కమిటీ సభ్యులు అట్టి సొమ్మునకు 'లెక్కా డొక్కా' లేకుండా చేసేవారు. "దర్శనమునకు వచ్చు భక్తులను దక్షిణయిమ్మని, యిచ్చెడివారిని వద్దని అనవద్దని' ఇచ్చిన డబ్బును అన్నదానము క్రింద ఖర్చుపెట్టవలెనని' ది. 27-3-49నే శ్రీ స్వామివారు స్పష్టంగా చెప్పియున్నారు. అయినా డబ్బీలో డబ్బు "దుర్వినియోగ"మయ్యేదట. శ్రీ స్వామివారికి అత్యంత సన్నిహిత భక్తుడు శ్రీ స్వామివారి జీవిత చరిత్ర రాసిన శ్రీ జయంతిస్వామి నాయన గారు దీని గురించి కమిటీ వారిని 'నిలదీసినా" సమాధానం లేదు. ఇటువంటి సంఘటనలు భక్తుల హృదయాలలో "అనుమానా నకు" "తావు"నిస్తాయి. అందుకే స్వామివారు 1970 ప్రాంతంలో అదివరకున్న కమిటీని రద్దు

చేసి తమ యిష్టప్రకారమొక కొత్త కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అలానే తః తోచిన విధంగా కమిటీ వారు తన తపస్సును గూర్చి కరపత్రములు, చిన్న చిన్న పుస్తః ప్రచురింపవద్దని స్పష్టంగా ఆదేశించారు.

పద్మశ్రీ బోయి భీమన్న గారు తాను రాసిన 'బాలయోగి' నాటకం ముందు వ "నాటకం" గురించి కోనసీమలో ఒకానొకనాడు మకుటంలేని మహారాజుగా, స్వాతం సమరయోధునిగా, ప్రముఖ రాజకీయ నాయకునిగా, "ఆవులించకుండా ప్రేవులు లెక్కించ ' మంత్రిగా, 'అపర చాణుక్యుని'గా వెలుగొందిన శ్రీ కళావెంకటరావు గారు గూడా శ్రీ బాలయ వారి "తపస్సు"ను సంశయించి 'నిఘా' వేయించి విఫలమైనట్లు స్పష్టమగుచున్నది.

"నాటకం గురించి" ముందు మాటలో పై విషయం గురించి భీమన్న గారు ఇ రాసాడు. "ముమ్మిడివరం బాలయోగి గురించి నేను ఎన్నో పరిశీలనలు జరిపించాను. న నమ్మకమైన వాళ్ళను 'నిఘా' వుంచాను. ఇటు నా మిత్రులు, అటు ప్రభుత్వపు సి.ఐ.డి గూడా అతని (బాలయోగి)లో ఏ లోపాన్నీ కనుగొనలేక పోయారు. అతడి (బాలయోగి ఏదో "అతిలోక మహాత్మ్యం' వుంది. హి యీజ్ నాట్ ఎ హోక్స్" (He is not a hoax) అత మోసకారి కాడు" అని శ్రీ కళాగారు భీమన్న గారితో అన్నట్లు రాసాడు.

ఈ రచయిత ఉద్యోగరీత్యా 1971-74 మధ్య కాలంలో రాజమండ్రి, పాలకొ అమలాపురం ప్రాంతాలలో పనిచేసినప్పుడు రెండుమూడు సార్లు ముమ్మిడివరం వెళ్ళి పెదబాలయోగివారిని, శ్రీ చినబాలయోగి వారిని దర్శించుకొన్నప్పుడు ఎందరో అధికారుల అనధికారులను వ్యాపారస్తులను, మిత్రులను శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి తపస్సు చేయు గురించి వచ్చిన 'పుకార్లు'అనుమానాలు సందేహాలు గురించి అడగడం జరిగింది. ఎవరు గూ శ్రీ బాలయోగీశ్వరుల వారి తపస్సు గురించి మోసమున్నట్లు చెప్పలేదు. బాలయోగివారు తపః ప్రారంభించిన తొలి రోజుల్లో కొందరు సందేహించారని యిదేదో మోసమన్నారని వారు చెబుత తరువాత అందులో మోసమేదీ లేదని తేలిందని యోగీశ్వర సోదరులు 'తమ' తపోమందిరా లలో (తలుపులు బిగించి తాళాలు వేయబడినా) తపస్సు చేసుకొంటున్నారు. ఒక్క మహాశివరాత్రి తప్ప సంవత్సరంలో మిగిలిన దినాలలో వారు ఎవరికీ దర్శనం యీయడం లేదు కనుక వ తపస్సు గురించి యెవరూ అంతగా పట్టించుకోవడం లేదని వారి గురించి యెట్టి మోస అపవాదులున్నట్లు దాఖలాలు లేవని యీ రచయిత వివిధ వర్గాల ద్వారా విచారిం తెలుసుకున్నాడు.

మిడిమిడి జ్ఞానమున్న హేతువాదులు తలుపులు తీయుడని చాలా గొడవ చేసేర నాస్తిక నాయకుడు డా॥ కొవ్వూరు, బెజవాడ నాస్తిక కేంద్రం వారు తదితర నాస్తిక బృంద

ముమ్మిడివరం వెళ్ళి బాలయోగి వారి తపోమందిరం తలుపులు తీయుమని, జలాన్నముల లేకుండా అలా కూర్చొనుట ప్రకృతి ధర్మవిరుద్ధమనీ, శ్రీ బాలయోగికి యేదైనా శారీరక, మానసిక "రుగ్మత" వున్న దేమో డాక్టర్లచేత పరీక్ష చేయించవలెనని నానారభస చేసారు. అయినా కమిటీ వారు భక్తులు తపోమందిరం తలుపులు తీయలేదు.

ఒకసారి పుట్టపర్తి సత్యసాయిబాబా వారు అమలాపురం వచ్చినప్పుడు కొందరు శ్రీ బాలయోగివారి ప్రస్తావన తెచ్చి బాలయోగి తపోమందిరం తలుపులు తీయించి మాట్లాడమని కోరినారట. అందుకు బాబా వారు "ఘోరతపస్సు చేసే వారి దగ్గరకు పోవుటకు ప్రయత్నించుట సూర్యునిదగ్గరకు మిడుత సమీపించుట వంటిది. ఆయన (బాలయోగి) మహాత్ముడని" బహిరంగంగా చెప్పారట.

నిద్రహారములు తపస్సు చేయడం వైజ్ఞానిక శాస్త్రరీత్య- జీవశాస్త్రరీత్య విరుద్ధం కనుక, బాలయోగికి ఏమైనా శారీరక, మానసిక వ్యాధులున్నాయేమో పరిక్షించాలని కొందరు వైద్యులు విఫలప్రయత్నాలు చేసారు. అలానే ప్రముఖ నాస్తికులు హేతువులు ముమ్మిడి వరం వెళ్ళి "ఇదంతా మోసం జలాన్నములు లేకుండా ఎవ్వరైనా ఎంతకాలం బ్రతకగలరు. కొన్నిరోజులు మాత్రమే బ్రతకగలరు ఇన్నాళ్ళు గదిలో బంధింపబడడం మోసం తలుపులు తీయమని" నానా రభస చేసారు. గొడవ చేసారు. అర్ధరాత్రుళ్ళు శ్రీ బాలయోగి వారి కుటుంబసభ్యులు గాని, కమిటీవారు గాని, వారిభక్తులు గాని బాలయోగి వారికి దొంగతనంగా 'అన్నం' పెడుతున్నారేమో అనీ రాత్రిపూట ధ్యానమందిరం తలుపులు తీసి స్వామి వారిసన్నిహితులు ఆయనతో ఏమైనా రహస్యాలు గుసగుసలు మాట్లాడుతున్నారేమో యిలా అనేక సందేహాలు వెలిబుచ్చి రాజమండ్రి జీవకారుణ్య సంఘం సభ్యులు, యితరులు కొందరు తపోమందిరం వద్ద రాత్రిళ్ళు మాటు వేసి, నిఘా వేసి విఫల ప్రయత్నంచేసారు. మందిర తాళాలు తెరవమని నానా రభసచేసేవారు, అయినా వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి.అయినా, కమిటీ సభ్యులు, ఆస్తిక భక్తులు అట్టి నాస్తికహేతు వాధుల ప్రయత్నాన్ని భగ్నం చేసారు. కాని స్వామి వారి తపోమందిరం తలుపులు తీయలేదు. బాలయోగి వారి వాక్కు బ్రహ్మవాక్కు గదా. కమిటీ సభ్యులు భక్తులు స్వామి వారి ఆదేశానుసారం తపోమందిరం తలుపులు తీయలేదు.

జలాన్నములు విసర్జించినారు. కేవలం "వాయుభక్షణం" మీదనే 39 సం॥ల దీర్ఘకాలంపాటు (కఠోర) తపస్సు చేసినారన్నమాట. తపస్సు చేసుకొనే శ్రీస్వామి వారిని ప్రతి సంవత్సరం దర్శించి గమనించిన వారికి శ్రీ బాలయోగి వారి శారీరక పెరుగుదల వయస్సునకు తగ్గట్లు శారీరక మార్పులు, మొహంలో బ్రహ్మ వర్చస్సు - ఏదో భోంచేసిన వానివలె 'చిరుబొజ్జ' స్పష్టంగా గోచరించేవి.

మరి "జలం ఆహారం" లేకుండ జీవించ వచ్చా అంటే జీవించవచ్చు అని యోగ శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. విజ్ఞాన - శాస్త్రం శారీరకశాస్త్రం ప్రకారం గూడా 'వాయు భక్షణం' వలన "ప్రాణవాయువు (నత్రజని, కర్బనం యీమూడునూ గాలిలో వున్నవి కనుక) శరీరం లోనికి ప్రవేశించి తపస్సు చేయు వానికి జీవశక్తినిచ్చునని స్పష్టంగా తెలుస్తున్నది.

ఇక పతంజలియోగ శాస్త్రప్రకారం జలాహారములు లేకుండ యోగబలంతో వాటిని అరికట్టి యోగి జీవిస్తూ తపస్సుచేసుకొనగల్గునని వివరించబడియున్నది.

కణ మాపే క్షుత్పిపాసా నివృత్తిః

కంఠ కూపమందు సంయమం (నియంత్రణం) చేసినప్పుడు ఆకలిదప్పులుండవని దీని అర్థం అని శాస్త్రం స్పష్టంగా చెబుతున్నది.

స్వామివారు 'తమ యోగబలము' చేత "ఆకలిదప్పులు" అరికట్టకలిగినట్లు చెప్పి యున్నారు.

బాల్యమందే మాయామోహాలోక జీవితవిరక్తుడై మొత్తం మీద శ్రీ బాలయోగివారు ఆహారపానియాలు మాని మౌనవ్రతం ఎన్ని అడ్డంకులు వచ్చినా లెక్కచేయక దీక్షా దక్షతతో - ధ్యాననిమగ్నుడై- సర్వేంద్రియ నిగ్రహుడై - స్వచ్ఛంద (స్వీయ) గృహ నిర్బంధితుడై - ఒంటరిగా - పూర్వజన్మసుకృత సువాసనలచేత - శాశ్వత జీవబ్రహ్మైక్యం - హిరణ్యలోకప్రాప్తి - విష్ణు సాయుజ్యం - కైవల్యసిద్ధి కొరకు 39 సంవత్సరాలు సుదీర్ఘ కాలం కఠోర తపస్సు చేసిన 'మహాయోగి' తపోబ్రహ్మ.

ఘోరతపస్సు - నిర్వికల్పసమాధి స్థితి

"నేను ఉన్నస్థలమును, నాకు ఈస్థితియు నాపూర్వజన్మ సువాసనల వలన వచ్చెను" అనియు. "నాజన్మస్థానము కొన్ని (వందల) సంవత్సరములకు పూర్వం ఘోరారణ్యం ఇచట అప్పటి మహాఋషులు తపస్సు చేయుచు ముక్తి చెందెడి వారు. ఇది మహాపవిత్ర ప్రదేశమగుటచే యిచట జన్మించితిని" అనియు స్వామివారు చెప్పినారు. మరియు నా తల్లిదండ్రులు పూర్వజన్మమున చేసికొనిన మహాపుణ్యము వలన నేను వారికి బిడ్డగా పుట్టినాను". అనియు "నాజన్మపరంపరలలో ప్రస్తుత జన్మము చిట్టచివరిది. నేను కడపటిమెట్టులో తపస్సు చేయుచున్నాను చేయుచున్నది కఠోరతపస్సు" అచిరకాలంలోనే తపోసిద్ధియగును అనియు స్వామివారు చెప్పినారు.

స్వామి వారి పూర్వపుణ్యా ఫలం వల్లను, ఆయన జన్మస్థల పవిత్రత వల్లను, యీ నరజన్మలో అస్పృశ్య కులమందు జన్మించియు, నిరుపేదయింట పుట్టియు, అక్షరజ్ఞానం లేకపోయినను, పశువుల కాపరిగా (గోపాలవృత్తి) జీవనం సాగించుచూ కేవలం 15 సంవత్సరాల

ప్రాయమందుననే "పూర్వజన్మ సుకృతం" పండి "గతజన్మసువాసనల"వలన గతజన్మస్మృతి కలిగి ఆకస్మికముగా ది 22.6.46న ధ్యాన నిమగ్నుడైనాడు.

తపస్సు ప్రారంభించిన రోజు నుండే "ఘనాహారం" స్వీకరించుట మానివేసినారు. శ్రీ బాలయోగి తల్లి దండ్రులు బంధు మిత్రుల బలవంతం మీద కేవలం " గోక్షీరం" (ఆవుపాలు) మాత్రమే ఆహారంగా స్వీకరించినారు. తపస్సు ప్రారంభించిన నాటి నుండి ఎవరితోనూ మాట్లాడలేదు. కనులు విప్పి ఎవరినీ చూడలేదు. శ్రీ స్వామి వారు వివరించిన స్వీయ జీవిత చరిత్ర ననుసరించి తపస్సు ప్రారంభించిన ఒకనెల పైన ఒక వారం రోజుల వరకు మాత్రమే పాలు స్వీకరించారు. ఈ స్వల్పవ్యవధిలోనే యోగబలముచే మల జల విసర్జనలను ఆకలిదప్పులను అరికట్టినారు ఈ విషయాన్ని శ్రీబాలయోగీశ్వరుల వారే సెలవిచ్చారు.

పతంజలి యోగశాస్త్రం అష్టాంగ మార్గాన్ని నొక్కి చెపుతుంది. 1. యమ 2. నియమ. 3. ఆసన. 4. ప్రాణాయామ 5. ప్రత్యాహార. 6. ధారణా. 7. ధ్యాన. 8. సమాధి స్థితులు శ్రీ బాలయోగి జన్మతః సాత్వికుడు, సాధు స్వభావి శాంత గుణ ప్రధానుడు అయిన శ్రీ బాలయోగి వారు - శాంత్య హింసాశౌచ గుణాన్ని అవలీలగా అలవరుచుకొని పూర్వజన్మ సుకృతం చేత యమనియమ మార్గాన్ని అనుసరించగల్గారు.మరి ఆసన విషయంలో - ఆయన ముందుగా పద్మాసనం - తర్వాత వజ్రాసనం (సిద్ధాసనం) వేసుకొని తపమాచరించాడు. మరి యీ ఆసనాలు ఎవరిదగ్గరా నేర్చుకొనలేదు గదా; ఆసనాభ్యాసం ఎంత కష్టమో చలించేమనస్సును స్వాధీనం చేసుకొని - ఏకాగ్రచిత్తంతో సాధన చేయుట యెంతకష్టమో యోగ సాధన చేసి విఫలులైన వారికి - సఫలీకృతులైన వారికి మాత్రమే తెలియును.

శ్రీ బాలయోగివారు యిట్టి కష్టతరమైన "అష్టాంగమార్గాన్ని" అనుసరించారంటే అది నమ్మశక్యం కాని విషయమే అయినా కట్టెదుటే జనావాసాలమధ్య స్వచ్ఛంద గృహనిర్బంధంలో ఆయన దీర్ఘకాలం (కఠోర) తపస్సు కొనసాగించారంటే నమ్మకుండా ఎలావుండగలం! నమ్మి తీరాల్సిందే.

పూర్వాశ్రమంలో విద్యాగంధం లేక - గురూపదేశం లేక - యోగమంటే ఏమిటో తెలియక - ఆధ్యాత్మిక చింతన లేని శ్రీ బాలయోగివారు అనన్య సామాన్యమైన అచలమనస్కుడై - స్థిరచిత్తంతో - విషయ వాంఛారహితుడై - సర్వేంద్రియనిగ్రహుడై - తపస్సు చేయుట అపూర్వమే గదా!

శ్లో ॥ పూర్వాభ్యాసేవతేనై వహ్రియతే వ్యావశోపిసః

జిజ్ఞాసురప యోగస్య శబ్ద బ్రహ్మాతి వర్తతే॥(భాగః 6 - 44)

గత జన్మలో (యేకారణములచేతనైతేమి) యోగ భ్రష్టుడు తనకు తెలియకుండగనే

పూర్వజన్మము నందలి అభ్యాస బలముచే (యీజన్మమందు) యోగాభ్యాసం వైపునకు ఆకర్షింపబడుచున్నాడు. ఇట్టి గీతా ప్రమాణం చేత మన బాలయోగివారు పూర్వజన్మ లో అట్టి తపస్సును అప్రయత్నముగానే చేపట్టి కొనసాగించినాడు గదా! " పూర్వజన్మసువాసన వలన" తన కీస్థితి (యోగస్థితి) గల్గెనని శ్రీ స్వామివారే స్వయంగా చెప్పియున్నారుగదా;

శ్లో॥ యోగీ యుంజీత సతత మాత్మనాం ర హసి స్థితః
ఏకాకీయత చిత్తాత్మ నిరాశీరపరిగ్రహః॥

ధ్యాన (తపస్సు) యోగమునభ్యసించు యోగి ఏకాంత ప్రదేశమందు ఒంటరిగా మనస్సును - ఇంద్రియములను స్వాధీనపరచుకొని, విషయవాంఛా విరక్తుడై - ఎల్లప్పుడు మనస్సును ఆత్మయందే లగ్నం చేయవలయునని భగవద్గీతలో యోగాభ్యాసం గురించి చెబుతుంది

శ్లో॥ ప్రశాంతాత్మా విగత భీర్బ్రహ్మచారివ్ర తేస్థితః
మనస్సంయమ్మ మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః

యోగి ప్రశాంత హృదయుడై - నిర్భయుడై బ్రహ్మచర్య వ్రతనిష్టా గరిష్టుడై మనస్సును బాగుగా నిగ్రహించి - నాయందు (దైవమందు) చిత్తము లగ్నం చేసి - నన్నే పరమ గతిగా నమ్మి (అన్యధాశరణం నాస్తి భావనతో) ధ్యాన నిమగ్నుడు కావలయునని యోగాభ్యాసం గురించి శ్రీ కృష్ణభగవానుడు వివరించియున్నాడు.

పైరెండు శ్లోకాలలో భగవద్గీతలోని శ్రీ కృష్ణుని "గీతా ప్రవచనాలు" శ్రీ బాలయోగివారి తపో దీక్ష విషయంలో పూర్తిగా అన్వయిస్తాయి. ఈ విధంగా శ్రీ స్వామి వారు యిటు గీతా ప్రామాణికంగా యోగ శాస్త్ర ప్రమాణంగా దీర్ఘ కాలం తపస్సు చేసారు.

ఈ విధంగా లోకమోహ బంధ విషయవాంఛా విరక్తుడై ప్రత్యాహుతుడై దైవసాక్షత్కార వాంఛ దీక్ష కంకణ బద్ధుడై - బ్రహ్మచర్య నిష్ఠతో - నిర్మల హృదయంతో అచంచల మనస్సుతో ఏకాగ్రచిత్తంతో సర్వేంద్రియనిగ్రహుడై అంతర్ముఖుడై మౌనవ్రతుడై తపోనిమగ్నుడైన శ్రీ స్వామి వారు ప్రారంభ దశలో సాకారసద్గుణో పాసన మార్గమవలంభించారు.

శ్లో॥ ప్రాగ్ది శాభి ముఖం/ కౌమ్యం/ దక్షిణే/ క్రూరకర్మణః
ప్రతీచ్యో/ వశ్య/ కర్మాణిచ/ మోక్ష ముత్తరే/ లభేత్॥

అని యోగశాస్త్రం చెబుతోంది. అంటే తూర్పుముఖంపెట్టి జపతపాదులుచేస్తే ఆధ్యాత్మిక కార్యసాధకుడవుతాడని,ఉత్తరాభిముఖుడై తపస్సు చేయువాడు సంపూర్ణ వైరాగ్య చిత్తుడై మోక్ష సాధనకై తపస్సు చేయాలనీ శాస్త్రం చెబుతోంది.

మన బాలయోగీశ్వరుల వారు ప్రప్రథమంగా కొబ్బరి తోటలో ఉత్తరాభిముఖంగా కూర్చొని తపస్సు ప్రారంభించారు. తమ గృహం వద్ద యింటి ముందున్న అరుగుపై తూర్పు ముఖం పెట్టి తపస్సు కొన సాగించారు. ప్రభుత్వం వారి పోరంబోకు స్థలంలో నిర్మింపబడిన తపోమందిరంలో తూర్పు ముఖంగా తపస్సు చేసారనీ, 1953 నుండి తపోమందిరంలోను దర్శన మండపంపై కూర్చుని ప్రజలకు మహాశివరాత్రి మరునాడు ఉత్తరాభి ముఖంతో ఆసీనులై ధ్యానం చేసినట్లును స్పష్టంగా తెలియుచున్నది.

ఇక మనయోగివారు తాను తపస్సు ప్రారంభించుటకు తమ గృహంనుండి 'దక్షిణాభి' అయి దక్షిణమునకు ప్రయాణించి ఇళ్ళ గోవిందరావు గారి కొబ్బరితోటలో కొబ్బరి చెట్టునకు శ్రీ కృష్ణ నారదులున్న చిత్రపటంనకు ఆనించి - ఉత్తరాభిముఖియై ధ్యాననిమగ్నుడైనాడు. దక్షిణ దిశ యమున దిశ మరి సామాన్యంగా దక్షిణాయనంలో మంచి కార్యం తలపెట్టరు అయితే రామాయణంలో రామబంటు ఆంజనేయస్వామి దక్షిణం గా పోయి లంకలో రావణుని చెఱలోనున్న సీతమ్మ తల్లి వారిని దర్శించి వచ్చాడు. శ్రీరామచంద్రుడు గూడా తన సపరివార వానర సైన్యంతో దక్షిణమున నున్నలంకపై దండెత్తి "దుష్ట" రావణునితో యుద్ధమొనర్చి రావణుని ఓడించి చివరకు సంహరించి తన అర్థాంగి సీతా మహాసాధ్విని తెచ్చుకున్నాడు. దక్షిణదిశ యముని దిశ: మృత్యుదిశ: మృత్యువును జయించి శాశ్వత బ్రహ్మానంద జీవితం కోసం శ్రీ బాలయోగి వారు దక్షిణానికి వెళ్ళారు.

"శత్రు" జయం కోసం దక్షిణ దిశగా పయనించడం - దక్షిణాభిముఖంగా కూర్చోనడం చేస్తారు. శ్రీ బాలయోగివారు "అరిషడ్వర్గాల్ని" జయించుటకు " మాయామోహాలోక జీవితాన్ని' ' జయించటానికి దక్షిణ దిశగా వెళ్ళినట్లు గ్రహించగలరు. శ్రీబాలయోగి దక్షిణాభిముఖంగా వెళ్ళి తపస్సుచేసి 'దుష్ట' మానవజీవితాన్ని జయించటానికి వెళ్ళినట్లు మనం గ్రహించవలయును.

బాలుని (బాలయోగి) శ్రీగంగయ్య ఇంటికి తీసుకొచ్చిన తర్వాత గూడా తపస్సును కొనసాగించుట చూచి ధ్యాన కుటీరం యెక్కడ నిర్మించాలని ఆలోచించుచుండగా మనస్వామి వారే "ఉత్తరాభిముఖంగ" ఉత్తరదిశకు వెళ్ళి గవర్నమెంటు వారి పోరంబోకు పుంతలో పసుపునీరు పోసివచ్చారు. అక్కడే తల్లిదండ్రులు తాత్కాలికంగా మొదట ధ్యానకుటీరం నిర్మించారు. మరికొంత కాలంనకు శాశ్వత తపోమందిరం (ధ్యానమందిరం) స్వామి వారి తాత్కాలిక మొదటి ధ్యాన కుటీరంనకు వెనుక దక్షిణ భాగమున నిర్మించడం జరిగింది. ఈ శాశ్వత తపోమందిరం (పక్కాకట్టడం) నందు 1953 సం॥ నుండి స్వామివారు వీరాసనం (వజ్రాసనం) పై తూర్పు ముఖం పెట్టి కఠోర తపస్సు చేసినారు.

శ్రీ స్వామివారి తపోమందిరమున తనకెదురుగ శ్రీకృష్ణనారదుల చిత్ర పటముతో పాటు రెండుచిన్న శ్రీకృష్ణ విగ్రహములు గూడా వుండెడివి. ఈ విగ్రహముల చెంతనే ఒక చెంబు

గూడా నుండెడిది. మరికొన్ని చిత్ర పటములను నారదులవారి చిన్న విగ్రహం త్రిశూలము గూడా వుండెడిది. కొంతకాలం నారదులవారి చిన్న విగ్రహం గూడా శ్రీ పెదస్వామివారి చెంతవుండేది. తర్వాత అది చినస్వామి వారి చెంతకు చేరింది.

ది 18.9.49 న సాయంత్రం వేళ తపోమందిరపు ఉత్తరపు గది రంధ్రం నుండి చాలా పాలు ప్రవహించెను. శ్రీజయంతి స్వామినాయన గారునూ, అదే సమయమందు అచ్చటగల తదితర భక్తులు ఆ దృశ్యమును చూసారు. వీరంతా ఆపాలురుచి చూసారు. పిమ్మట పసుపునీరు అగరువత్తుల సువాసన గూడా వచ్చెను. ది 12.11.49న మధ్యాహ్నం ఉత్తరపుగది రంధ్రం గుండా శ్రీ లక్ష్మినారాయణస్వామి స్వరూపం బయట నుండి తలుపుల మధ్యనందులో నుండి చూచిన జయంతివారుతదితర భక్తులకు కనిపించింది. శంఖ నాదములు వినిపించెను. పాలు నీరు రంధ్రముల గుండా బయటికి ప్రవహించెను. అగరువత్తుల సువాసనలు గుబాళించెను. ది 14.11.49 కార్తీకసోమవారంనాడు చాలా పాలు ప్రవహించెను. ది 17.11.49 న శ్రీ క్ష్మినారాయణస్వామి వారి దివ్య పాదద్వయం గోచరించెను. ది 19.11.49 శ్రీ దేవీ రూపం దర్శనమిచ్చెను. ది 12.11.49 న రెండు గదులనుండి ఎక్కువగా పాలు బయటకి ప్రవహించెను. శంఖ నాదములు వినిపించెను. అగరవత్తుల వాసనలు వచ్చెను. అలానే 13.12.49 న శ్రీ లక్ష్మినారాయణస్వామి శ్రీదేవి (లక్ష్మీదేవి) తూర్పుముఖముగ సింహాసనాసీనులై యుండగా శ్రీ బాలయోగి వారు వారికి అతిసమీపమందు ఉత్తరముఖముగా కూర్చుండి పూజలోనర్చుట శ్రీ జయంతిస్వామినాయన గారు తదితర భక్తులు ఉత్తరపుగది రంధ్రం గుండా కళ్ళారా చూసారు.శ్రీ బాలయోగివారు అగరువత్తులనువెలిగించి కర్పూర హారతినిచ్చుట యీభక్తులు గమనించారు. అలానే ది 30.1.50 న తపోమందిరగది నుండి పాలు ప్రవహించెను. సువాసనలు బయలువెడలెను. పైని వివరించబడిన సంఘటనలు (దృష్టాంతములు) బట్టి, శ్రీ బాలయోగివారు "సుగుణోపాసన"- లక్ష్మినారాయణస్వామి - శ్రీదేవి ప్రభృతి దేవతా మూర్తుల నారాధించెడి వారని స్పష్టంగా తెలియుచున్నది.

శ్రీ బాలయోగి వారు తపస్సు ప్రారంభించిన 22.6.46 తపోమందిరంనకు తలుపులు బిగించే నాటివరకు తపోమందిరంనకు తలుపులు లేకపోవుట చేత అది బహిరంగ ప్రదేశంగా వుండడంచేతనో, లేక అక్షరజ్ఞానం లేని అంటరాని కులంలో పుట్టిన బాలకుడగుట చేతనో శ్రీ బాలయోగి వారి తపోమహిమల గురించి వారి సుగుణోపాసనా విధానం గురించి యెవరూపట్టించుకొన్నట్లు లేదు. అంటే ఎవరూ ఆ దిశగా ప్రత్యేక దృష్టిసారించినట్లు లేదు. లేదా ఎవరికీ తెలియకుండానే ఎవరికీ కనిపించకుండానే శ్రీ బాలయోగివారు శ్రీలక్ష్మినారాయణుణ్ణి లేదా శ్రీ కృష్ణుని ప్రత్యక్షంగా ఆరాధించే వారో తెలియదు. శ్రీబాలయోగి వారు ది 27.3.49 న పాలును, నీరును దైవారాధనకు అవసరమనీ ఒక్కొక్కప్పుడు చెంబులో నీరు తరిగి పోవుచుండునని తెలిపినారుగదా: అంటే స్వామి వారు 1.4.49 నుండి సగుణోపాసన తో ఇష్టదైవమైన విష్ణువు (శ్రీకృష్ణుని) ఆరాధించినట్లు మనం గ్రహించవలయును.

జయంతిస్వామి నాయన గారు పైనవివరించినట్లు శ్రీ బాలయోగివారి సగుణోపాసనా నిదర్శనములు నమోదు చేసి, పుస్తకరూపంలో ప్రచురించే నాటివరకు ది 22-6-46న శ్రీ కృష్ణనారదుల వారి చిత్రపటాన్ని పూజించి ఆయన తపస్సునకు కూర్చుండినట్లు మాత్రం అందరికీ తెలుసును. పైన తెలిపినవిధంగా జయంతివారు వివరించినట్లు శ్రీ బాలయోగివారు 1-4-49 నుండి దాదాపు 1950 చివరవరకు మాత్రమే సుగుణోపాసన చేసినట్లున్నూ ఆ తరువాత తమ తపోశక్తిచేత "నిర్గుణోపాసన" తో పరిపూర్ణనిర్వికల్ప సమాధి స్థితిగతుడైనట్లున్నూ మనం గ్రహించవలసియున్నది.

శ్రీబాలయోగి కారణజన్ముడు. అతడు పుట్టుకతోనే యోగి మహాయోగి అతని కుండలిని బాలశివుణ్ణి చూచిన బాలవలె తానంతట తనే లేచి, తక్కిన ఏ మజిలీలోనూ ఆగకుండా, సరాసరి సహస్రారం చేరి చిరవియోగ జనిత సమావేశంతో పరమశివుణ్ణి కౌగలించు కొన్న చరిత్ర మన ముమ్మిడివరం బాలయోగిది.అన్నీ "కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను కూడా జయించి ఆపాదమస్తకంతనొక (బ్రహ్మ) జ్ఞానరాశి" గారూపాంతరం చెంది నిర్వికల్ప సమాధి దానంతట అది సమకూడిందతనికి అని పద్మశ్రీ బోయి భీమన్నగారు చెప్పారు.

"తూర్పుదిశ " దేవేంద్రునిది. దేవేంద్రుడు దేహేంద్రియుడు. అనగా యింద్రియలోలుడు. భోగలాలసుడు. అధికారపిపాసి. తపస్సుచేయు యోగులకు బద్ధవిరోధి: తపస్సు చేసిన వారు తమ స్వర్గలోకంనకు అధిపతులౌతారేమోన్న భయంతో తపసుల తపోభంగం చేయడం ఇంద్రుని నిత్యకృత్యం. బ్రహ్మర్షి కావాలని దీర్ఘకాలం తపస్సు చేయుచున్న విశ్వామిత్రుని తపోభంగం గావించుటకు దేవేంద్రుడు మేనకను ఎఱగా పంపి - విశ్వామిత్రుని తపోభంగం చేయించిన గాధ అందరికీ తెలిసిందే. అందుకే శ్రీ బాలయోగి వారు 'దేవేంద్రియాలను' జయించుటకు తపోబలం నిరూపించుటకు కొంతకాలం ప్రాగ్దిశా ముఖంగా తపస్సుచేసాడు. సర్వదేవేంద్రియాలను స్వాధీనం చేసుకొన్నారు శ్రీ బాలయోగివారు. పురాణాలలోని గాథలలో వున్నట్లు దేవేంద్రుడనే వాడొకడుండి - శ్రీబాలయోగివారి తపస్సును భంగం చేయించుటకు యెవరినైనా దేవవేశ్యని అదృశ్యంగా సూక్ష్మరూపంలో పంపించియున్నాడేమో మనకు తెలియదు. అలాంటి ఋజువులు లేవు గూడా శ్రీబాలయోగి వారికీ జన్మలో తపోభంగం కలుగలేదు. శ్రీబాలయోగివారు (కఠోర) తపస్సు 39 సం॥ పైగా నిర్విఘ్నంగా కొనసాగించారు. ఉత్తరదిశ 'ఊర్ధ్వదశకు ఊత్తమస్థితికి - ఆధ్యాత్మికంగా' మోక్షమార్గానికి ప్రతీక! శ్రీబాలయోగివారు మెక్షగామి కనుకనే ఉత్తరదిశలో ప్రయాణించాడు. 1953 నుండి 1985 వరకు ఉత్తరాభి ముఖంగా నిర్వికల్ప సమాధి స్థితిలో ఉపవిష్టుడై ఘోరతపస్సు చేసాడు.

యోగశాస్త్రం ప్రకారం - సాత్వికమితాహారం చేస్తూ యోగ(ధ్యాన) సాధన చేయవలయును. భగవద్గీతగూడా యీవిషయాన్ని ధృవీకరిస్తుంది! కాని శ్రీబాలయోగివారు తపస్సు ప్రారంభించిన నాటి నుండి "ఘనాహారం" స్వీకరించడం మాని వేసారు. పాలు మాత్రమే ఒకనెలరోజులుపైగా

తీసుకున్నారు. 27.3.49న శ్రీ బాలయోగివారు ఉపదేశించిన 'తత్త్వోపదేశాల'లో 'ఇంద్రియములను లోబరచు కొనవలెనంటే ఆహారమును తగ్గించవలెను - మానవలెను. అప్పుడు పంచభూతములు ఆత్మలో అణిగిపోయి ఎఱుక లేకపోవును. ఎఱుక లేనప్పుడు ఆహారము అక్కరలేదు. అందువల్ల జీవాత్మ పరమాత్మలో ఐక్యమగుటకు వీలుకల్గును అని వివరించి తాము పూర్తిగా "ఘనాహారం" స్వీకరించుట మానివేసినారు. 39 సం॥లు ఘోరతపస్సు చేసారు. అది అసాధారణమైన విషయం ! పూర్వజన్మసుకృతం వల్లనే శ్రీ బాలయోగివారికి సాధ్యమైనది. బోయి భీమన్నగారన్నట్లు శ్రీ బాలయోగివారు కారణజన్ములు జన్మతః ఆయన మహాయోగి.

అయితే పతంజలియోగశాస్త్ర ప్రమాణంగా " కంఠ కూపేక్షుత్పిపాసానివృత్తి" (30) అనీ "కేర్మడాడ్వాం స్థైర్యమ్" అని వున్నది. కంఠం క్రింద వుండే కూర్మనాడిని సంయమనం చేసినచో స్థిరత్వం సిద్ధిస్తుందనీ కంఠబిలమందు సంయమం చేసి ప్రాణస్పర్శ లేకుండా చేసినచో ఆకలిదప్పులుండవని యోగ శాస్త్రం చెబుతుంది. ఇలా కంఠ బిలమందు వుండే కూర్మ నాడిని సంయమం చేసినచో శిరస్సుపై భాగమందుండే బ్రహ్మరంధ్రం నుండి ఒకవిధమైన ద్రవం కంఠం ద్వారా నిదానంగా ఒక్కొక్క బొట్టు ఉదరంలోనికి ప్రవహిస్తుంది. ఈ ద్రవమే అమృతం. ఈ అమృతం వలన యోగికి ఆకలిదప్పులుండవు.

కనుకనే శ్రీ బాలయోగీశ్వరుల వారు 6-2-49 న 'యోగబలముచే మల జల విసర్జనలను అరికట్టినాడు. అట్టి పరిస్థితులలో ఆకలిదప్పులుండవు" అని వివరించియున్నారు. ప్రాణికి ఆహారం జీవాధారం - ఇదిప్రకృతి ధర్మం. అలానే నోరుతెరచి అరవడం మాట్లాడడం జీవికి ప్రకృతి ధర్మం శ్రీయోగివారు యీరెండు ప్రకృతిధర్మాలను తమ 'తపోశక్తి' వలన జయించగలిగారు అది ఈయన పూర్వజన్మలో 'అనంపూర్ణంగా' చేసిన యోగబలమహత్యం వల్లనే సాధ్యమైనది.

మరొకవిషయమేమంటే శ్రీబాలయోగివారు పద్మాసనం వేసుకొని రెండుచేతులు ఒకచోట చేర్చి (జోడించి) తపస్సు చేసారుగదా! పద్మాసనం వేసి కూర్చొనుటవలన - అరికాళ్ళు - భూమివైపుకాక - ఆకాశంవైపు చూస్తూ (తిరిగి) వుంటాయి కనుక 'భూమాకర్షణశక్తి' కి శరీరం లోను కాదు కనుక కొంత "శక్తి" శరీరంలోనే వుండిపోతుంది. అలానే అరచేతులు కలిపి యుంచుటచేతను శక్తి వృధాకాక - శరీరంలోనే వుండిపోతుంది. 1953 తర్వాత శ్రీ స్వామి వారు వీరాసనం (వజ్రాసనం - అర్ధపద్మాసనం) వేసుకొని తపస్సు చేసాడు. అంటే అప్పటికి ఆయన 'యింద్రియనిగ్రహం' వజ్రసంకల్పంగా దేహం 'వజ్రకాయం'గా అయిందని మనం గ్రహించవలెను.''మౌనవ్రతం అవలంబించుట వలన నోరు విప్పిమాట్లాడ్డం వుండదు అందు వలన గూడా కొంత 'శక్తి' వృధా కాదు. శ్రీ బాలయోగివారు పద్మాసన స్థితిలో కొంతకాలం (కొన్ని సంవత్సరాలు) దీర్ఘకాలం (39సం॥) కఠోర తపస్సు చేసినంతకాలం మౌనవ్రతం పాటించి తపస్సు చేసినారు పైగా శ్రీ బాలయోగి ఆజన్మబ్రహ్మచారి. లోకంపాపపుణ్యాలు - భార్యాబిడ్డల

'సంసార'లంపటం యెరుగని పిన్నవయస్సులోనే తపస్సునకుపక్రమించారు బ్రహ్మచర్యం వలన కొంత శక్తి వృధా కాకుండ దేహమందే యుండి - శారీరక - మానసిక శక్తి వృద్ధి చెందును. కనుకనే "శక్తి" సంపన్నుడైనారు! తపోమహిమాన్వితులైనారు.

శ్రీ బాలయోగివారు 27.3.49 న చెప్పిన తత్త్వోపదేశాలలో తపస్సు వలన ఏదికావలసి వస్తే అదే వచ్చును. చక్రవర్తితనముగూడా వచ్చును. కాని దానివలన గర్వము గలుగును. గర్వపడితే దిగువ జన్మలోకి పోవలసి వచ్చును. అనియు "సంసారములో వుండియు చక్రవర్తితనము చేయుచు భగవంతుని స్మరణచేయ వచ్చును. కాని నిలకడ ఎక్కడ నుండి వచ్చును". అని వివరించియున్నారు గదా! చక్రవర్తితనం అంటే అధికారం! అధికారం వలన దురహంకారం పెచ్చుపెరిగి పోతుందిగదా అల్పాయుష్కుడైన మార్కండేయుడు చిరంజీవి కావాలని తపస్సుచేసాడు : ధ్రువుడు తన పిన తల్లి తనకు చేసిన అవమానం భరించలేక తపస్సుచేసాడు. పురాణఋషులలో అధికులు ఏదో లోకసంబంధమైన లక్ష్యసిద్ధి కోసం "వాంఛలు" తీరేందుకు తపస్సు చేసారు శ్రీ బాలయోగి వారికి లోక సంబంధమైన 'వాంఛాదృష్టి' లేదు. అందుకే ప్రాగ్దిశా ముఖంగా కూర్చొని తపస్సుచేసి దేవేంద్రవిజయం (యింద్రియ విజయం) సాధించాడు". కనుక శ్రీ బాలయోగి వారు ఏదో లోక సంబంధమైన భోగభాగ్యాల కోసమో - చక్రవర్తి తనం కోసమో కాక - తన జీవన్ముక్తి కోసం - జన్మరాహిత్యం కోసం - " శాశ్వత" మైన హిరణ్యలోక సంప్రాప్తికొరకు - పరబ్రహ్మైక్యసిద్ధి కొరకు - కైవల్య సిద్ధికొరకు మాత్రమే దీర్ఘకాలం పాటు ఘోరతపస్సు చేసారన్న విషయం నిర్వివాదాంశం! యధార్ధమైనది.

ఈవిధంగా శ్రీ బాలయోగివారు ఉత్తరాభిముఖంగా 22.6.46 న తపస్సు ప్రారంభించి, తర్వాత, స్వగృహమందును, పర్ణశాలయందును 1953 వరకు తూర్పుముఖంగా కూర్చొని తపస్సు చేసారు. 1953 నుండి తపోమందిరంలో తాము కైవల్యసిద్ధి పొందిన 1985 జూలై 19 వ తారీఖువరకు ఉత్తరాభిముఖంగానే కూర్చొని తపస్సు చేసారు.

తపస్సు ప్రారంభించిన నాటి నుండి 1950 వరకు సుమారు నాల్గు సంవత్సరాలు పద్మాసన స్థితిలో కూర్చొని శ్రీ బాలయోగి వారు తపస్సు చేసినారు. త్రిమూర్తులలో ఒకడైన పరమేశ్వరుడు ఆదిశంకరాచార్యుల వారు పద్మాసనం వేసుకొని తపస్సు చేసినట్లు చెబుతారు. వేదకాల ఋషులు - పురాణ ఋషులు ' పద్మాసనం పైనేతపస్సు చేసారు.స్థిర చిత్తం - మనో నిగ్రహం సంప్రాప్తించిన తర్వాత శ్రీ బాలయోగి వారు వజ్రాసనం (వీరాసనం - అర్ధపద్మాసనం) వేసుకొని 1950 నుండి 1985 జూలై వరకు తపస్సు చేసినారు. వజ్రాసనంతో వజ్రసంకల్పుడు - వజ్రదేహుడు గూడా అవుతాడని యోగశాస్త్రం చెబుతుంది. వజ్రాసనం వేసుకొని ధ్యానం చేసిన వారిలో ఆదిశంకరుడు, గౌరాంగుడు ప్రముఖులు. ఆధునిక అవధూతలు, స్వామిజీలు, మహర్షులు 'వీరాసనం' వేసుకొనే ధ్యానం చేసారు. "వజ్రాసనాత్ - వజ్రదేహభకత్" అని శాస్త్రప్రమాణం గదా!

ఇకపోతే - అన్నపానీయాలు విసర్జించి కేవలం వాయుభక్షణతోనే శ్రీ బాలయోగి వారు సుదీర్ఘకాలం పాటు కఠోర తపమాచరించారు గదా! పైగా 1949 ఏప్రియల్ నుండి "మౌన" వ్రతం బూని తపస్సు చేసారు. "మౌనం భాగవిధ్విభతి భేతే" అని శాస్త్రం ప్రమాణం మౌనవ్రతం చేత దైవీయసిద్ధి పొందవచ్చునని భావం ఆది శంకరాచార్య విరచిత " దక్షిణా మూర్తి స్తోత్రం' ప్రథమ శ్లోకంలోనే మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతద్వంయు వానం అనినొక్కిచెప్పబడింది. అంటే " మౌనం పరబ్రహ్మతత్త్వానికి అతిసన్నిహితమైనదనీ ఆచరించగల్గితే అతిశక్తి వంతమైనదనీ ఆత్మోపరతుడైన దక్షిణామూర్తి "మౌనం" ద్వారానే బ్రహ్మనిష్టులైన ఋషులకు పరబ్రహ్మతత్త్వం ఉపదేశించాడని అర్థం.

'నేను కడపటి మెట్టులో తపస్సు చేయుచున్నాను. చేయుచున్నది ఘోర తపస్సు. అచిరకాలములోనే తపోసిద్ధియగును" అని స్వామి వారు 27-3-49లో చెప్పియున్నారు. అలాగే ది. 12-2-83వ తేదీ మహాశివరాత్రి మరునాడు సర్వ (ధర్మ) దర్శనానంతరం కమిటీ సభ్యులతో శ్రీ బాలయోగివారు "నేను తపస్సు ప్రారంభించినప్పుడు 'కృష్ణనారాయణ' అని జపించి తపస్సులో కూర్చున్నాను. కూర్చున్న మరుక్షణమే "నిర్వికల్ప సమాధి"లో ప్రవేశించి అందే స్థిరపడి పోతిని' ' అని స్పష్టపరిచారు. ది. 22-6-46న తపస్సు ప్రారంభించింది. దీర్ఘకాలం ఘోరతపస్సు చేస్తూ 1985 జూలై 19వ తారీఖున (అధిక శ్రావణ శుద్ధ విదియ శుక్రవారం) శ్రీ స్వామివారు కైవల్యసిద్ధి, బ్రహ్మైక్యం, దైవ సాయుజ్యం పొందారు. శ్రీ స్వామివారు 39 సంవత్సరములు దాటి 27 రోజులు "ఘోర తపస్సు" చేసారన్న మాట. ప్రముఖ సాహితీవేత్త బ్రహ్మ శ్రీ వేలూరి శివరామశాస్త్రి గారు శ్రీ జయంతి స్వామి నాయన వారితో ఏకీభవిస్తూ "యీ కలియుగంలో యిది విన్నదియును, కన్నదియును కాదు". అంటే మనకు తెలిసి (పురాణాలు-శాస్త్రాలలో ఋషులు-మునులు వందలు వేలు సంవత్సరాలు తపస్సు చేసినట్లు గాథలున్నవి. ఈ కలియుగంలో యీ యాంత్రిక ఆధునిక యీ యిరవయ్యో శతాబ్దంలో గూడా హిమాలయ పర్వతాలలో తపస్సు చేసే వారున్నారని వింటుంటాం. చదువుతుంటాం పత్రికల్లో. వీరంతా కొన్ని, కొన్ని నెలలు మాత్రమే ధ్యాన సమాధిలో వుంటారని జనశ్రుతి. శ్రీ స్వామి వారి వలె సుమారు 39 సంవత్సరములు చేసిన వారు లేరేమో. శ్రీ స్వామి వారి సోదరులు శ్రీ చినబాలయోగి వారు మాత్రం 39 సంవత్సరములు తపస్సు చేసారు. ఇది జగద్విదితం.

శ్రీ బాలయోగీశ్వరుల వారి తపో మహిమలు-భక్తుల అనుభవాలు

తపస్సు చేసేయోగులకు కొన్ని దివ్యశక్తులు, అద్భుత మహిమలు సిద్ధిస్తాయని మన పురాణాలలో, ఇతిహాసముల నిండా ఎన్నో గాథలు, ఉదాహరణలున్నాయి. యోగాభ్యాసం వలన "అణిమా'ది అష్టసిద్ధులు సంతరిస్తాయని పతంజలి యోగశాస్త్రం స్పష్టంగా వివరిస్తుంది. సూక్ష్మ శరీరంతో యెచ్చటకైనా క్షణంలో పోయి వచ్చుట, దివ్యదృష్టితో, ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏమి జరుగుతుందో చూడగల్గుట, అ శరీరవాణిగా భక్తులకు సలహాలిచ్చుట, స్వప్నంలో కనిపించి భక్తులకు సూచన లిచ్చుట, మారురూపంలో వచ్చి పరకాయ ప్రవేశం చేసి భక్తుల నాదుకొనుట, మొదలగు శక్తులు యోగులకు యోగబలంతో సిద్ధిస్తాయి. భక్తులు వాటిని 'మహిమ'లు గా సంభావించుకొంటారు. ఇటువంటివి మన పురాణగాథలలో కోకొల్లలు. ఈనాడు గూడా, రామకృష్ణపరమహంస, రమణ మహర్షి, సత్యసాయిబాబా వంటి దివ్యపురుషులు తమ భక్తులకెన్నో, 'మహిమ'లు చూపించి, వారి నాదుకొనుట చారిత్రక సత్యాలు. అట్టివి స్వీయానుభూతులే తప్ప, చెబితే వినేవారు నమ్మలేని నిజాలు.

యోగబల మహాత్యం

ది. 6-2-49న శ్రీ సత్యరాజు గారితో "యోగబలంచేత మల, జల విసర్జనాలు అరికట్టి నాయి. అట్టి పరిస్థితుల్లో ఆకలి దప్పులుండవు. పాలు నీరు దైవారాధనకు మాత్రమే. నా దేహమునకు అవసరం లేదు" అని బాలయోగివారు చెప్పారు. అప్పటికి స్వామివారు తపస్సులో కూర్చున్నది 2 సం॥ 8 మాసములు మాత్రమే. "స్వీయ చరిత్ర" వివరణలో బాలయోగివారు చెప్పిన దానిని బట్టి ఆయన యింటివద్ద ఒక వారం, గవర్నమెంటు పోరంబోకు స్థలంలో తండ్రి గంగయ్యగారు వేసిన పాకలో ఒక నెల వరకు ప్రతిరోజు ఉదయం స్నానం చేసి పాలు పుచ్చుకొనుట, దంతధావనం, మల, మూత్ర విసర్జన చేసినట్లు మనం గ్రహించవచ్చు. అంటే 6-2-49 నాటికి ఆయన తపస్సులో కూర్చున్న తర్వాత సుమారు 21 సంవత్సరాలు దంతధావనం, మలమూత్ర విసర్జనం, పాలు పుచ్చుకొనుట మానివేశారన్నమాట. అంటే బాలయోగీశ్వరుల వారు తపస్సులో కూర్చున్న ఒకనెల మీద వారం రోజులు మాత్రమే (సుమారు 40 రోజులు పాలు (గో క్షీరం) పుచ్చుకున్నారు. అంటే 40 రోజుల తపోబలంచేత ఆయన ఆకలి దప్పులు నరికట్టగలిగారు.

నిజంగా యిది నమ్మలేని నిజం! ధ్యానమంటే ఏమిటో, తపస్సు అంటే ఏమిటో తెలియని విద్యాగంధంలేని ఒక 15 సం॥ల బాలుడు కేవలం 40 రోజుల్లో ఆకలిదప్పులు అరికట్టడం అపూర్వం. అసాధారణం. ఏదో పురాణాల్లో, ఇతిహాసాల్లో, చిన్నతనంలోనే మార్కండేయుడు,

ధ్రువుడు మొదలగు 'బాలురు' తపస్సు చేసి అష్టసిద్ధులు సాధించి, తమ యిష్టదైవాన్ని ప్రసన్నం గావించుకొన్నట్లు చదువుతాం. కాని, కలియుగంలో ఒక 'పంచమకులం'లో పుట్టిన బాలుడు చదువురాని బాలుడు, యోగాభ్యాసం లేని బాలుడు, ఏ గురువు దివ్యోపదేశం లేకుండ తపస్సులో కూర్చోవడం, కూర్చున్న 40 రోజుల్లోనే తన తపోశక్తివలన ఆకలిదప్పులు నరికట్టడం కలియుగ "మహాత్మ్య"మనే చెప్పాలి.

తపోమందిరం లోపలను, బయట ఆయాభక్తుల అనుభవంలో జరిగిన 'మహిమ లను గురించి కమిటీ సభ్యులు శ్రీ యోగివారి దృష్టికి తీసుకొని వెళ్ళినప్పుడు అవన్నియును శ్రీకృష్ణపరమాత్మకు సంబంధించినట్టివి అని శ్రీ బాలయోగి వారు స్పష్టంగా చెప్పారు.

తపోమందిరము తలుపులు తెరచు కొనుట

డి. 27-3-49న శ్రీ బాలయోగివారి తపో మందిరమును పర్ణశాలగా నున్న కారణమున దానిని పెంకుటి మందిరముగ మార్పు చేయుటకు శ్రీయుతులు వ్యాసం సత్యరాజు, గాదెం అప్పారావు, గరిమెళ్ళ కృష్ణమూర్తి గారు ఆ రోజు ఉదయం దగ్గరుండి పర్ణశాల పైకప్పును తీయించారు. ఉత్తర ద్వారంనకు తాళంవేసి భోజనంనకు వారి మకాంనకు వెళ్ళారు. మధ్యాహ్నం స్వామివారి దర్శనార్థం భక్తులు వందలు కొలది వచ్చారు. మందిరంనకు తూర్పునున్న ద్వారం తలుపులు వాటి అంతట అవి స్వామివారి తపోమహిమచే తెరువబడడం, భక్తులు దర్శనం చేసుకున్న తర్వాత తలుపులు వాటి అంతట అవి మూసుకొనిపోయి లోపల గడియపడి పోవడం, అక్కడప్పుడున్న ప్రజలందరూ యీ వింత సంఘటన కనులారా చూసారు. వీరిలో శ్రీ బులుసు బుచ్చిరాజు గారును ముమ్మిడివరం గ్రామ కాపురస్తుడున్నాడు. వీరు తర్వాత "శ్రీ బాలయోగీశ్వర దివ్య చరిత్ర"ను గూడా రచించారు. స్వామి వారికి పరమభక్తులై స్వామివారిని జీవితకాలం సేవించారు. ఈ విషయం తెలుసుకున్న వ్యాసం సత్యరాజు తదితరులు పరుగు పరుగున వచ్చి మందిర తాళములు తీసి, శ్రీస్వామివారితో మాట్లాడి, నిత్య దర్శనంనకు ఏర్పాట్లు చేశారు. స్వామి వారి నిత్యదర్శనం నాల్గు మాసములు మాత్రం దొరికింది. అది గూడా ఆగిపోయింది.

తపోమందిరం తలుపులు తెరచుకొనుట, తెరచుకొనక పోవడం అనేది శ్రీ బాల యోగీశ్వరుల వారి "సంకల్పాన్ని" బట్టి వుంటుంది. డి. 1-8-49 జిల్లా కలెక్టరు శ్రీ బాలసుందరం గారు వస్తే వెంటనే తపో ఆశ్రమ తలుపులు తెరచుకొనలేదు. 6-2-49 న శ్రీ వ్యాసం సత్యరాజుతో రాజమండ్రి సబ్‌జడ్జి శ్రీ గరిమెళ్ళ కృష్ణమూర్తి గారి పేరు చెప్పి వారిని 10-2-49 రాత్రికి తీసుకొని రమ్మని చెప్పిన శ్రీ స్వామివారు, వారితో 10-2-49 మరలా 27-3-49 న స్వయంగా స్వీయ చరిత్ర, తత్వోపదేశాలు వివరించారు. అట్టి కృష్ణమూర్తిగారు మరొక సందర్భంలో కుటుంబ సభ్యులతో శ్రీ స్వామివారి దర్శనార్థం ఆశ్రమానికి వస్తే వెంటనే తలుపులు తెరచుకొనలేదు. శ్రీ జయంతిస్వామి నాయన గారు వచ్చి వేడుకొనగా, తలుపులు తెరచుకొన్నాయి. ఇక మహాశివరాత్రి

అర్ధరాత్రి ఆశ్రమ కమిటీ సభ్యులు ఆశ్రమ తలుపులు తెరచుటకు ప్రయత్నిస్తే ఒక్కొక్కసారి వెంటనే తెరచుకొనేవి. ఒక్కోసారి ఎంత ప్రయత్నించినా ఫలితముండేదికాదు. తెల్లవారు జామున మరలా ప్రయత్నం చేస్తే తలుపులు తెరచుకొనేవి. ఈ విషయం ఆయా సందర్భాలలో ముందు ముందు మరలా చర్చించడం జరుగుతుంది.

పెంకి పాడియావులో వచ్చిన పెనుమార్పు

శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు తపస్సు ప్రారంభించిన తొలి రోజుల్లో ఆయన 'ఘనాహారం' తినుట మానివేసి కొంతకాలం 'పాలు' త్రాగిరనియు, "పాలు (ఆవుపాలు) నీరు" తో దైవారాధన చేసెడివారనియు తెలిసికొన్నాం. ఆశ్రమ కమిటీ ఉపాధ్యక్షులైన శ్రీ ముత్యాల జానకిరామన్నగారు నాలుగైదు 'జాతి' ఆవులను శ్రీ బాలయోగి వారి 'పాల' నిమిత్తం ఆశ్రమంనకు యిచ్చి యున్నారు. ఈ ఆవులనే శ్రీ పెదబాల యోగివారి మారు తమ్ముడు శ్రీ భూషణం (చిన బాలయోగీశ్వరులె తరువాత తపస్సు చేసినారు) చిన్నతనంలో మేపెడివారనియు తెలుసుకొన్నాం.

ఈ ఆవులలో కాస్త 'పెంకి' స్వభావంగల ఒక ఆవు నొక క్రొత్త దానిని ఆశ్రమంనకు యివ్వగా అది 'ఆశ్రమ వాతావరణం' క్రొత్తది అగుటచేతనో పాలు తీయు మనిషి మారుట చేతనో, మరే కారణం చేతనో 'బెదిరి' పోయి, పాలు తీయు మనిషికి అలవి కాక తన్నుచూ పాలు సరిగ్గా యివ్వక పోవడం మొదలు పెట్టింది. కొన్ని దినములిట్లు ఆ ఆవు పాలివ్వక యిబ్బంది కలిగించుటచేత 'చివరకు యిక లాభము లేద'ని తేల్చుకొని జానకిరామన్నగారు ఆ ఆవును ఆశ్రమం నుండి తీసుకొని పోయి, మరియొక ఆవును పంపుటకు నిశ్చయించుకొన్నాడు. ఈ నిర్ణయం జరిగిన మరుక్షణం నుండి ఆ ఆవులో మార్పు వచ్చినది. అది శ్రీ స్వామివారి మందిరం వైపునకు ఒక ఆవును పోగొట్టుకొని దీనముగా చూడసాగెను. అది మందిరం వైపునకే అదే పనిగ 'దీనము'గా చూచుచుండుట ఆ ఆవులో వచ్చిన ఆ పెను మార్పునకు జానకి రామన్నగారు తదితరులు సంభ్రమాశ్చర్యములతో గమనించిరి. ఆవులో వచ్చిన మార్పును గమనించి, దానిని ఆశ్రమమందే శ్రీ స్వామివారి 'పాల' కొరకు నుంచ మరలా నిశ్చయించిరి. ఆ క్షణము నుండి ఆ ఆవు 'పరమ' శాంత స్వభావిగా మారిపోయి, పాలు తీయుటకు ఎవరు వచ్చినను, ఏమియు యిబ్బంది పెట్టక, పాలు సేపుతూ ప్రతిరోజూ పాలు ఈయడం ప్రారంభించింది. ఆ పెంకి ఆవులో వచ్చిన ఆ 'పెను' మార్పు శ్రీ బాలయోగి వారి తపో మహిమ వలన వచ్చినదని శ్రీ జానకిరామన్న తదితరులు గ్రహించిరి.

శ్రీ బాలయోగీశ్వరుల వారి అసదృశ స్నాన విధానం

బాలయోగి వారు తపస్సు ప్రారంభించిన రెండు మూడు నెలల వరకు దంత ధావనం, స్నానం చేసారు. అయితే ఆయన ఎప్పుడు తమ ఆసనం నుండి లేచేవాడో, ఎప్పుడే దిశకు

నడచి వెళ్లి ఎక్కడ, ఏ నదిలో, ఏ తటాకం, లేక ఏ సముద్రమందు స్నానం చేసి మరల ఎప్పుడు తిరిగి వచ్చి తన తపోనిష్టలో నిమగ్నమయ్యే వారో యెవరికిని తెలిసేది కాదు. ప్రజ కదొక వింతగా వుండేది. ఎందుకంటే ఆయనెప్పుడూ తన తపోపీఠంపై ఆ సీనులై వుండి తపస చేసుకొనుచున్నట్లే కనిపించేవాడు. కాని ఉదయం వారిని దర్శించిన వారు, ఆయన స్నాన చేసినట్లు పరిశుభ్రంగా శిరోజాలు దువ్వినట్లుగా , తాజాగా కనిపించేవారు. ఆయన మొలక ధరించిన అంగవస్త్రం తపో మందిరంలోపల ఆరవేసి వుండేది. ఈ రహస్యమేమిటని యెందర ఎన్నో విధాల తెలుసుకోవాలని పరీక్షించి ప్రయత్నించారు కాని ఫలితం లేకపోయింది. శ్రీ స్వామి వారు జీవిత కాలంలో ధరించిన "అంగవస్త్రం" ఒక్కటే అది ఎప్పుడూ శుభ్రంగా వుండేది.

వారు సమీపమందున్న సముద్రమందో లేక పవిత్ర గోదావరిలో స్నానమాచరించేవాడన మనం గ్రహించాలి. తపశ్శక్తి సంపన్నులు సూక్ష్మ రూపంలో ఎవరికీ కనిపించకుండా తెలియకుండా వెళ్ళి సముద్రమందో, గోదావరియందో స్నానం చేసి వచ్చేవాడని అనుకోవాలి. ఇంజనీరు శ్రీ పి.యల్. సుబ్రహ్మణ్యంగారు ఒకనాడు స్వామివారితో "స్వామీ" తమరు కాశీలో (వారణాసి) గంగ యందు స్నానము చేయుచుండగా జూచితిమని కొందరు నాతో నిశ్చయంగా చెప్పినారు నిజమేనా" అని అడిగినపుడు స్వామివారు "అదియొక గొప్ప విషయం కాదు మేమెచ్చటికైనను పోగలమ'ని సైగలతో చెప్పారు. శ్రీ తాళ్ళూరి కామేశ్వరరావుగారి యింటి గదిలో శ్రీ స్వామివారి మొలకు కట్టుకొనెడి అంగవస్త్రము మాత్రం (శ్రీ బాలయోగివారు కనిపించకుండ) చుట్టును తిరుగుచున్న దృశ్యమును అనేక పర్యాయములు చూచెను. అంటే స్వామివారి శరీరం మాత్రం కనిపించకుండ అంగవస్త్రం మొలకు చుట్టుకొనినది మాత్రమే అలాగే కనిపించేదన్న మాట.

1949 మార్చి వరకు శ్రీ బాలయోగివారు 'అంగ వస్త్రం ధరించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి భక్తకోటికి సర్వదర్శన భాగ్యం కలుగజేయునపుడు గూడా అంగవస్త్రం ధరించెడివాడు. మందిర తాళములు వేసిన తర్వాత ఆయన 'దిగంబరుడు' గానే కూర్చొని తపస్సు చేసేవాడని కొందరి భావన. హిమాలయ ప్రాంతమందు పావనిగంగా నదీతీరమందు శ్రీ స్వామి తరుచు తిరుగు చుండెడివారట. ఒకసారి "హరిద్వార్" సమీపమందున్న స్వామి శివానందుల (గీతాకృష్ణునికి అధిక ప్రాధాన్యమిచ్చెడివాడు) వారి దోసిట అపూర్వదివ్యశ్వేత పుష్పములు పోసి వచ్చారట మన స్వామివారు. (మోతే కృష్ణారావు యీ విషయం చెప్పినట్లు శ్రీ వంకల అప్పారావు గారు గ్రంథస్థం చేసారు.

బాల శివస్వరూపం : ది. 1-5-49 తెల్లవారు జామున బాలయోగివారి దర్శనార్థం మందిరం తలుపులు తీసి భక్తులు లోనికి ప్రవేశించుసరికి మందిరంలో సువాసనలు, ప్రకాశవంతమైన వెలుగు వ్యాపించి యుండెను. శ్రీ బాలయోగీశ్వరులు వారి శిరోజములు శివుని జటాజూటము వలె తీర్చిదిద్దినట్లు ముడివడి యుండెను. మందిరంలోపల ఆవునేతితో దీపములు వెలిగింపబడి

యుండెను. నూతన ధవళ వస్త్రధారియై శ్రీ బాలయోగీశ్వరుల వారు పద్మాసనులై తపో నిష్ఠాగరిష్టులై బ్రహ్మ తేజం ముఖమున ఒప్పారుచుండెను. స్నానము చేసిన గుర్తుగా తడిబట్టలు మందిరంలో కనిపించెను. కొంతసేపటికి ఆ సువాసనలు, ఆ కాంతి కిరణాలు క్రమముగ తగ్గిపోయినవి. ఈ అద్భుత దృశ్యం దర్శించిన వారిలో శ్రీ జయంతి స్వామి నాయనగారును ఉన్నారు. శ్రీ నాయన గారు ముమ్మిడివరంలోని హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు, కవి పండితుడును. దరిమిలా బాలయోగీశ్వరుల వారి మహిమలెన్నో స్వయముగా చూచి, బాలయోగి వారికి పరమభక్తుడై "శ్రీ భగవాన్ శ్రీ పెద్దబాలయోగీశ్వరుల పూర్ణ చరిత్ర" మని ఉద్గ్రంథం బాలయోగి వారి మీద వందలాది పద్యాలు రాసిన ధన్యజీవి. 1953 సం॥లో శివరాత్రికి శ్రీ స్వామివారు భక్తకోటికి సర్వధర్మ దర్శనమిచ్చే సమయంలో శ్రీ స్వామివారు దర్శన మంటపంపై శేషపీఠంపై కూర్చొని యుండగా శ్రీ స్వామివారి జటాజూటము నుండి సన్నని గంగధార ప్రవహించటం దర్శనమంటపం సమీపమందున్న భక్తులకు స్పష్టంగా కనిపించినట్లు గంగరాజను భక్తుడు చెప్పినట్లు శ్రీ స్వామివారిపై వసుదైక దివ్యచైతన్యమూర్తి అనే ఉద్గ్రంథం వ్రాసిన శ్రీ వంకల అప్పారావుగారు పేర్కొన్నారు. మన స్వామివారిని "గంగాధరుని"గా 'శివావతారు'నిగా వంకల అప్పారావు పేర్కొన్నాడు. "ఈతడు కొష్టమౌని, పరమేశ్వరునంతటి వాడగున్ మహాభూతములెల్ల వశ్యములు, బూర్గుడు" అంటూ శ్రీ స్వామినాయనగారు శ్రీ బాలయోగి వారిని త్రిలింగపత్రిక (1912-49)లో 'బాలయోగి-బాలశివావతారము' పేర 'నవరత్నహార' పద్యాలతో సంస్తుతి చేశాడు.

నిత్యదర్శనం ఆగిపోవుట

ది. 27-3-49 తేదీన శ్రీ వ్యాసం సత్యరాజు ప్రభృతుల కోరికపై భక్తులకు ప్రతినిత్యం తెల్లవారు జామున ఉదయం 4 గం॥ నుండి 5 గం॥ వరకు దర్శనమిస్తానని స్వామివారు అనుమతినిచ్చారు గదా. అదే విధంగా భక్తులకు ప్రతి రోజు ఉదయం స్వామివారు దర్శనం యివ్వసాగారు. రోజు రోజుకూ భక్తుల రద్దీ పెరగడంతోపాటు, వచ్చే ప్రజల అవినీతి ప్రవర్తన, అల్లరి గొడవలు చేయడం వల్ల, ది. 31-7-49 తేదీన శ్రీ బాలయోగీశ్వరుల వారు తమ తపో మహిమచేత మందిరం తలుపులు వాటియంతట అవే బంధింపబడునట్లు చేసినారు. భక్తులెంతగా ప్రయత్నించినా మూసుకొన్న తలుపులు తెరుచుకోలేదు. స్వామివారి దర్శనం కొరకు వచ్చిన భక్తులలో నిరాశ, చెంది ఏమీ తోచని స్థితిలో వుండిపోయారు.

జిల్లా కలెక్టరు గారి అనుభవం : అమలాపురం క్యాంపునకు విచ్చేసిన జిల్లా కలెక్టరు శ్రీ డి. సుందరంగారికి శ్రీ బాలయోగి వారు భక్తులకు దర్శనం యివ్వకుండా తలుపులు బిగించి వేసారని తెలుసుకొని, ఆయన తన రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బందితో ముమ్మిడివరం వచ్చి, వ్యాసం సత్యరాజు గారిని పిలిపించి, మందిర తాళములు తీయించే ప్రయత్నం చేసారు.

కాని తలుపులు తెరచుకొనలేదు. చేసేది లేక, కలెక్టరు గారు మందిర ద్వారం దగ్గరనే కొంతసేపు నిలుచొని వేచియున్నారు. అంతలో శ్రీ బాలయోగి వారి తపో మహిమచే మందిరం తలుపులు వాటి యంతట అవి తెరుచుకొన్నాయి. జిల్లా కలెక్టరు గారు స్వామివారిని భక్తులకు నిత్యదర్శన భాగ్యం కొనసాగించమని వేడుకొన్నాడు. కాని, తమ తపో మందిరం దగ్గర, ప్రజల అవినీతి ప్రవర్తన, అశాంతి వాతావరణం కారణంగా నిత్య దర్శనం యిచ్చుటకు స్వామివారు నిరాకరించారు. సంవత్సరంలో ఒక్క మహాశివరాత్రి పర్వదినంనాడు (మరుసటి రోజు) మాత్రమే భక్తులకు "సర్వధర్మ దర్శనం" ఇస్తామని నిక్కచ్చిగా సైగలతో చెప్పియున్నారు.

పాలు ప్రవహించుట :

ది. 18-9-49 మధ్యాహ్నం శ్రీ జయంతి స్వామి నాయనగారునూ, శ్రీ నంబూరి సుబ్బరాజు గారునూ ఉత్తర ప్రాకారంలో ప్రవేశించారు. ఉత్తరపు గది రంధ్రం నుండి పాలు మిక్కలిగా ప్రవహించెను. అక్కడనున్న భక్తులు ఆపాలు రుచి చూసారు. పాలు చిక్కగాను మధురాతి మధురముగను నుండెను. కొంచెం సేపటికి పాలు ప్రవహించుట ఆగిపోయింది. ఆ తర్వాత ఆ రంధ్రం వెంట పసుపు నీరును, దాని వెంట పొగబారులు వచ్చెను. పిమ్మట అగరు పత్తుల సువాసన అధికంగా, పరిసర ప్రాంతమంతా వ్యాపించెను. ఆ సువాసన పీల్చిన అచటి వారికొక అనిర్వచనీయమైన ఆనందానుభూతి గల్గింది. మందిరంలో స్వామివారు తపస్సు చేసుకొనుట తప్ప ఆ గదిలో పాలు, పసుపు, అగరవత్తులు ఎవరును, ఎప్పుడును పెట్టియుండలేదు. అలా ఏమీ మందిరంలో పెట్టరాదని గూడా స్వామివారి ఆజ్ఞ. మరి పాలు, పసుపు, నీరు కారుట అగరవత్తుల సువాసన చూచి, అనుభవించిన అచ్చటి భక్తులు అది స్వామివారి తపోమహిమ అని చెప్పుకొని ఆనందించారు.

అలానే ది. 14-11-49 న కార్తీక సోమవారము నాడు రెండు శేర్లకు పైగా పాలు ఉత్తరపు గది రంధ్రం నుండి ప్రవహించెను. ఆ సమయమున అక్కడున్న భక్తులు ఆ పాలను రుచిచూసారు. అవి చాలా రుచికరంగా వుండెను.

ది. 31-1-59 ఉదయమున జిల్లా కలెక్టరు శ్రీ బాలసుందరం పిళ్ళై మందిరంనకు వచ్చి స్వామివారిని దర్శించి వెళ్ళిన తర్వాత ఉదయం 8 గం॥ల ప్రాంతంలో ఉత్తరపు వైపు గది రంధ్రం ద్వారా పాలు ప్రవహించెను.

తపో మందిరం నుండి పాలు ప్రవహించుట, అగరు సువాసనలు రావడం, పసుపు నీరు కారడం, భేరీధ్వనులు వినుట, దీపారాధన జరుగుట, యిత్యాది వింతలు గూర్చి శ్రీ జయంతి వారు "శ్రీ బాలయోగీశ్వర స్తవము (దశావతారములు) పేర ఎన్నో పద్యాలు రాసి ప్రచురించియున్నారు.

విచిత్రమైన చీటీ కథ

దీ. 11-4-49 సోమవారం నాడు ఒక విచిత్ర సంఘటన జరిగింది. బాలయోగివారి ఆదేశం ప్రకారం కొద్ది నెలలపాటు దేవతా నివేదనం కోసం ప్రతి రోజు మందిరంలో పాలు ఉంచేవారు. ఆ రోజు (11-4-49) అలానే పాలు చెంబునుంచారు. విచిత్రంగా ఆ చెంబునకు ఒక 'చీటి' నంటియుండుట మందిరం అజమాయిషీ చేయువారి దృష్టిలో పడింది. ఆనాటి బాలయోగి ట్రస్టు కమిటీ ప్రెసిడెంటు గారగు శ్రీ సూరిశెట్టి వేంకటస్వామి నాయుడు గూడ దానిని చూసాడు. "బాలయోగి సంగతులన్నియు జయంతి స్వామి నాయన గారికి తెలియును. అతని సేవలకే మందిర తాళములు, వెంటనే అతని స్వాధీనంలో వుంచవలెను" అని అందులో వున్నది. ఇంతకీ ఎవరీ చీటి రాసిరనీ, అది యెలా మందిరంలోనికి వచ్చెనని తర్క వితర్కములు జరగడం మొదలిడెను. స్వామి నాయుడు చేసిన పన్నాగమా యిది అని కొందరికనుమానం గూడా వచ్చెను. దీ. 19-4-49 మంగళవారం బాలయోగివారు తన నేత్రములను తెరచి "అది శ్రీకృష్ణుడు వ్రాసి యుంచెనని సంజ్ఞలు ద్వారా తెలిపిరి. అందరికి అనుమానాలు తీరెను. స్వామినాయన పెదబాలయోగి భక్తుడయ్యెను.

రెండు చిత్తరువులు : దీ. 15-10-49 తేదీన ఆశ్రమ వెనుకటి ప్రాకారం లోపల పడమర వైపు గోడ మీద శ్రీ బాలయోగివారి తపోమహిమ వలన, సృజింపబడిన రెండు చిత్తరువులు లభ్యమైనాయి. ఈ చిత్తరువులపై ఆశ్రమ కమిటీ సభ్యులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు వీటిని నూతన మందిర నిర్మాణానికై 'బిల్డింగు ప్లాను' అని దాని కిటికీలు, గుమ్మాలు, ప్రాకారాలు, మెట్లు మొదలగు విషయాలు యీ చిత్తరువులలో సూచిస్తాయని అభిప్రాయం వెలిబుచ్చారు. మరికొందరు భక్తులు దీనిని తాత్త్విక దృష్టితో పరిశీలించి, శరీరత్రయం, 24 తత్త్వములు తెలిపెడి 'ప్లాను' ఒకటి యనియు, 52 సాంఖ్య తత్త్వములను (ప్రకృతి పురుషుల సంబంధం) తెలిపెడి 'ప్లాను' రెండవది అనియు భావన చేశారు. జయంతి స్వామి నాయన గారీ తాత్త్విక దృక్పథమునే బలపరచుచున్నారు. జ్ఞానేంద్రియాలు 5ను, కర్మేంద్రియాలు 5ను, శబ్దాది విషయాలు 5ను, ప్రాణాది వాయువులు 5ను, అంతఃకరణ చతుష్టయము అనగా మనోబుద్ధి చిత్తాంకారాలు 4ను, మొత్తము 24 తత్త్వములు గల స్థూల శరీరమని జయంతి వారి నిశ్చతాభిప్రాయం పైగా, ఆ రెండు చిత్తరువులు నిజంగా 'బిల్డింగు ప్లానులే' యైనచో, శ్రీ బాలయోగివారు తనకు మొత్తము పది (10) చిత్తరువులను చూపినారనియు, అవియన్నియు 'బిల్డింగు ప్లాను' లే కావలయును గదా అని జయంతి వారు తమ సంశయాన్ని వెలిబుచ్చారు. కనుక రెండింటిలో యొక చిత్తరువు 'తత్త్వసిద్ధిని' నిశ్చయించుచున్నదనియు, శ్రీ బాలయోగివారు 'నిర్వికల్ప స్థితి' యందుండుటచేత, ఆయన పరబ్రహ్మ సిద్ధుడని శ్రీ జయంతి నాయన స్వామి సిద్ధాంతీకరణ.

శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి దర్శనం

ది. 12-11-49 తేదీ మధ్యాహ్నం తపో మందిరపు ఉత్తరపు గది రంధ్రం ద్వారా, కొందరు భక్తులు, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామివారి రూపాన్ని దర్శించారు. మందిరం నుండి అగరవత్తుల సువాసనలు ఘుమ్మని గుబాళించాయి. మరికొంత సేపటికి మందిరంలోపల నుండి కరతాళ ధ్వనులు, భేరివాద్యములు బయటి భక్తులకు వినిపించాయి. శంఖ చక్రములు కని పించాయి. మందిరంలో ఎవ్వరో నడుచుచున్నట్లు అడుగులు గూడా బయటి భక్తులు కొందరు చూసారు. అడుగుల సవ్వడి స్పష్టంగా బయటికి గూడా వినిపించింది. తర్వాత దక్షిణపు గది రంధ్రం నుండి నీరు బయటకు ప్రవహించెను. పిమ్మట రెండు రంధ్రముల నుండి "ధూమములు" (పొగ) బయటికి వచ్చెను.

ది. 17-11-49 లక్ష్మివారం సాయంత్రం 4 గం॥ ప్రాంతంలో శ్రీ బాలయోగీశ్వరుల వారి తండ్రి శ్రీ గంగయ్య గారు, బులును బుచ్చిరాజు గారు, జయంతి స్వామి నాయనగార్లకు, మందిరం లోపల నుండి కొన్ని ధ్వనులు వినిపించాయి. తలుపుల రెక్కల సందులో గుండా లోనికి చూడగా వీరికి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి పాదద్వయం కనిపించాయి. అవి శ్రీ బాలయోగివారి పాదములని వారు భ్రమపడ్డారు. మరల, మరలా తలుపుల రెక్కల సందులో నుండి లోనికి చూడగా, ఒకసారి శ్రీ బాలయోగి వారి పాదద్వయం కనిపించాయి. తర్వాత శ్రీ దేవి పాదద్వయంగా కనిపించాయి. మరొకసారి శ్రీమన్నారాయణుని పాదపద్మములుగా కనిపించాయి. వారు చూచిన పాదద్వయం బంగరు రంగుతోను, నీల మేఘచ్ఛాయతోను, కనిపించాయి. శ్రీ గంగయ్య బుచ్చిరాజు గార్లకా 'పాదద్వయం' శ్రీ బాలయోగీశ్వరుల వారివని పించగా, శ్రీ జయంతి స్వామి నాయన గారికి మాత్రం బంగారు రంగుతో కనిపించిన పాదద్వయం శ్రీదేవివనియు, నీలమేఘచ్ఛాయతో కనిపించిన పాదద్వయం శ్రీమన్నారాయణుని వనియు గట్టి నమ్మకం కలిగెను. శ్రీ బాలయోగివారి కాలివ్రేళ్ళు పొడుగాటి గోరులున్నాయి కాని నీలి మేఘచ్ఛాయతో కనిపించిన పాదద్వయంనకు అట్టి పొడుగాటి గోరులున్నాయి కాని నీలి మేఘచ్ఛాయతో కనిపించిన పాదద్వయంనకు అట్టి పొడుగాటి గోరులు లేవు కనుక అవి ముమ్మాటికీ శ్రీమన్నారాయణుని పాదపద్మములే అని జయంతి వారి నమ్మకం. శ్రీ జయంతి వారు "పాదపద్మ సందర్శనము" పేరిట ఎన్నో పద్యాలు రాసాడు!

దేవీ స్వరూప సందర్శనం

ది. 19-11-49 సాయంత్రం 3 గం॥ల ప్రాంతంలో జయంతి స్వామి నాయన గారు మరి కొందరు భక్తులు తపోమందిరం సింహద్వారం దగ్గర కూర్చొని యున్నారు. ఉన్నట్లుండి ద్వారం తలుపు లోపలి గడియ సడలినట్లు అలికిడి అయ్యింది. ద్వారం రెండు తలుపులకును నిలువుగ కొంచెం 'సందు' యేర్పడింది. ఆ సందులో నుండి లోనికి చూడగా అరటావు తెల్లని కాగితంపైన

రంగులతో గడులతో రాసియున్న 'చిత్రరుపులను' లోపలి నుండి యెవ్వరో బయట కూర్చున్న వారికి స్పష్టంగా కనిపించాయి. కాని వాటిని పట్టుకొన్న వారు గాని, కనీసం వారి చేతి వ్రేళ్ళు గాని కనిపించలేదు. ఏమిటీ విచిత్రమని బయట కూర్చున్న భక్తులు అనుకొనుచుండగా తళుక్కుమని ఒక్క క్షణ కాలం మెరిసి తేజోవంతమైన ఒక దివ్యసుందర రూపంలో జగన్మాత క్షణం దర్శనమిచ్చి అంతలోనే అదృశ్యమైపోయింది. జయంతివారు, బుచ్చిరాజును ఆ దేవీ దివ్యరూపంను దర్శించారు. పులకాంకితులైనారు. జయంతి వారు భక్తి పారవశ్యంతో గొంతెత్తి బిగ్గరగా దేవీస్తుతి గానం చేయడం మొదలెట్టాడు. మందిరం తలుపులు అదే పనిగా వడివడిగా అటూ యిటూ కదలుతూ పెద్ద శబ్దం వినిపించసాగింది. ఆ శబ్దంనకు జయంతి వారు తదితర భక్తులు భయకంపితులై పోయారు. జయంతి వారు శ్రీ బాలయోగీశ్వరుల వారి తపో మహిమలను కొనియాడుతూ ప్రార్థించాడు. వెంటనే తలుపుల శబ్దం మెల్లగా తగ్గిపోయింది. తలుపుల రెక్కలు కదలుట గూడా ఆగిపోయింది. "అమ్మా" అని అక్కడి భక్తులెల్లరు 'ఊపిరి' పీల్చుకున్నారు.

దర్శన మండపం ప్లాను

1949 మహాశివరాత్రికి శ్రీ బాలయోగి వారి దర్శనం భక్తులకు వారి 'తపోశాల' లోనే జరిగింది. భక్తుల రద్దీ యెక్కువగుట చేత శ్రీ స్వామివారి తపోశాల చిన్నది యగుట చేతను శ్రీ స్వామివారు తమ తపోశాలలోనే భక్తులకు దర్శనమిచ్చుట కష్టసాధ్యమగుట చేత రాజమండ్రి వాస్తవ్యులు శ్రీ స్వామివారి పరమభక్తులలో ఒకరైన బోరపోలయ రెడ్డి గారు శ్రీ స్వామివారి తపోశాల ముందు భాగాన, యెత్తైన ఒక దర్శన మండపం నిర్మింపనెంచి, అందుకు ఒక ప్లాను గీయించి, ముమ్మిడివరం వచ్చి, శ్రీ గంగయ్య శ్రీ బులుసు బుచ్చిరాజు గార్లతో తమ ప్లాను విషయం మాట్లాడారు. వారి సలహాపై ఆ ప్లాను కాగితం తపో మందిరం వెనుకటి ఆవరణలో ది. 27-11-49 తెల్లవారు జామున రెడ్డిగారు వుంచడం జరిగింది. విచిత్రమేమంటే మరునాడు చూడగా ఆ ప్లాను కాగితం రెడ్డిగారుంచిన చోట కనిపించలేదు.

తరువాత ప్రాకారాలు లోపల శుభ్రపరచుచుండగా తూర్పు ప్రాకారంలోని తూర్పు గుమ్మంనకున్న 'సందు' (కన్నము) గుండా ముందుగా కొంతనీరు బయటికి రావడం అచట నున్నవారు గమనించారు. తర్వాత గుమ్మంపై భాగాన తలుపుల లక్ష్మీ కమ్మికిగల కాళీలోనుండి ఒక పులిగోరు పడిమీద పడింది. ఆ పిమ్మట ఆ కాళీలో నుండి ఆ ప్లాను కాగితం బయటకు వచ్చినది. అచటనున్న పెద్దలు ఆనంద సంభ్రమాశ్చర్యాలతో దానిని తీసుకొని చూసారు. దానిని పరిశీలనగా చూడగా రెడ్డిగారు గీయించినప్లానులో లేని 'శ్రీ, ఓం' అక్షరాలు లుండడం, ఓంకార మందున్న బిందువు విష్ణు చక్రం వలె వుండడం గమనించారు. ఈ అక్షరాలకు ఎరుపురంగు పాతిక అంగుళం వెడల్పుగ ప్రస్ఫుటంగా నున్నది. రెడ్డిగారు గీయించిన ప్లాను, అందులో

చేర్చబడిన శ్రీకార ఓంకార అక్షరాలు శ్రీ బాలయోగి వారి అంగీకారంగా భావించడం జరిగింది.

ది. 3-12-49 న శ్రీ రెడ్డిగారు 'మహర్షి' శ్రీ బులుసు సాంబమూర్తి (ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు-జాతీయ నాయకుడు) గారిచే శంఖుస్థాపన చేయించి, (శ్రీ ఎ.బి. నాగేశ్వర రావుగారు (మాజీమంత్రి) గూడా వచ్చారు. దర్శన మండప నిర్మాణం శ్రీ రెడ్డిగారు 1950 జనవరి మాసంలో పూర్తి చేయించాడు! 16-2-50 మహాశివరాత్రి మరుసటి రోజు శ్రీ బాలయోగి వారు ప్రథమంగా యీ దర్శనమండపం పైకి విచ్చేసి ధ్యానముద్రలో కూర్చొని లక్షలాది ప్రజలకు దర్శన భాగ్యం కలుగజేసారు. దురదృష్టవశాత్తు ఆ రోజు (16-2-50) స్వామివారు తెల్లవారు జామున 4-6 గం॥లకునూ మరలా సాయంత్రం 6 గం॥లకు రాత్రి 12 గం॥ వరకున్నూ భక్తులకు దర్శనం యిచ్చారు. స్వామి వారి దర్శనం ఆనాడు పగలంతా ఉ॥ 6 గం॥ నుండి సాయంత్రం 6 గం॥ వరకు లేదు. కారణం దర్శనమండపంపైని శ్రీకార ఓంకార అక్షరాలలో 'ఓం' అక్షరం మొదట లేక పోవడం, రెండవది మండప నిర్మాణంలో కొంత లోపం వుండడం (స్వామివారిపై సూర్యరశ్మి పడడం) కారణం తర్వాత రెడ్డిగారు ఆ లోపాలు సరిచేయించారు.

శ్రీ బాలయోగీశ్వరుల వారు శ్రీ లక్ష్మీ నారాయణుని పూజించుట

ది. 13-12-49న మధ్యాహ్నం 4 గం.ల ప్రిమ్మట ఉత్తరపు గది రంధ్రం నుండి జయంతి వారును మరికొందరు భక్తులు లక్ష్మీనారాయణులు తూర్పు ముఖముగ సింహాసనాసీనులై యుండిరి. స్వామి వారు నీలవర్ణం గాను, అమ్మవారు బంగారు వర్ణంగాను కనిపించారు. వారి శిరములపై రత్నములు పొదిగిన బంగారు కిరీటములు గలవు. ఇరువురు సర్వాభరణాలం కృతులై, దివ్య వస్త్రధారులై దర్శనమిచ్చారు. బాలయోగివారు వీరి సమీపమున ఉత్తర ముఖముగ కూర్చుండి వీరికి పూజలొనరించుచుండెను. అగరువత్తులు వెలిగించి యుండెను. బాలయోగి వారు కర్పూర హారతి శ్రీవారికి శ్రీదేవికి నిచ్చుచుండెను. శ్రీమన్నారాయణులు అప్పుడప్పుడు కొంచెం నటునిటు కదలుచున్నట్లు తోచెను. ఎవరో మందిరంలో దక్షిణవైపు నుండి ఉత్తరంనకు నడిచిపోయినట్లు తోచెను. ఆ నడిచిన వారి పాదములు తామ్రవర్ణం బోలియుండెను. మందిరములో అగరవత్తులు వెలిగించుటచేత, ఆ సువాసన బయటనున్న భక్తులు ఆఘ్రాణించిరి. పూజానంతరం బాలయోగివారు ముకుళిత హస్తుడై ధ్యానంలో నిమగ్నమై పోయెను.

సినీ నిర్మాత డా॥ కోట్నీసు విచిత్ర అనుభవం

బాలయోగీశ్వరుల వారిమీద ఒక చిన్న సినిమా తీయుటకు ఆశ్రమకమిటీవారు కోరగా ది.16-2-50న సినీనిర్మాత (బొంబాయి) డా॥ కొట్నీసు మందిరంలోనికి ప్రవేశించి బాల యోగీశ్వరుల కేసి కెమేరా అమర్చినారు. కొట్నీసుగారి స్వీయవివరమునే చూస్తాం.

"కెమేరాను అమర్చితిని. ఆయనకును నాకును బారెడు దూరము గూడా లేదు. సరిగా ఫోకసు చేసితిని. "వ్యూఫైండర్"లోంచి చూతునుగదా. ఒక ముసలి వృద్ధ తాపసిని గాంచితిని. నేనా ప్రక్కనున్న ఏ ఋషిప్రతిమనైనా ఫోకసు చేసితినాయని పైకి చూచితిని. అక్కడేదీ లేదు. యోగి మాత్రమే యున్నాడు. మరల లెన్సులోనుండి చూచితిని. పదేండ్లకు లోపు వయస్సు గల పిల్లవాడు నవ్వుతూ గంతు వేయుచుండెను. తిరిగి పైకి చూచితిని. బాలయోగి! దానితో నాకాశ్చర్యమెంతో కలిగెను. ఏమిటీ చిత్రమని ఖంగారు పడితిని మరల లెన్సులో చూచితిని! బాలకృష్ణుడు నుదిటిపైన నెమలి ఫించము, చేతిలో పిల్లనగ్రోవి, దానితో నాకేదో గాబరా కలిగినది. ముచ్చెమటలు పోసినవి. భయము వేసినది. ధైర్యం సడలింది. నేనేమి చేస్తున్నానో నాకు తెలియదు. నావల్లనేమైనా పొరపాటు జరిగిందా స్వామీ అని అనుకొన్నాను. అప్పుడు తిరిగి కంగారుగా (వణికిపోతూ) 'వ్యూఫైయిండరులో చూసాను' బాలయోగియే! ఉత్సాహం గలిగింది. దానితో గబ గబ ముందు వెనుకలు చూడక అక్కడ నున్న సమస్తమును ఫిల్ములో కెక్కించేసాను.

ఫిల్ము తీయాలని వచ్చిన చిత్ర నిర్మాత కోట్నీసు పరమ నాస్తికుడు. మందిరంలో బాలయోగి వారు కూర్చున్న చోటనే ధ్యాననిమగ్నమైయున్నాడు. మరి కొట్నీసు గారి కన్నీ, 'కన్నుల'కు మాత్రం 'బాలయోగి' అలానే కనిపించాడు. కాని 'కెమేరా కంటికి' మాత్రం వృద్ధ యోగిగా, తర్వాత ఒక పిల్లవాడిగా, ఆ తర్వాత బాల కృష్ణుడుగా, యిలా కొద్ది సమయంలో వివిధ రూపాలలో "కనిపించింది". నిజంగా 'కలయో మాయయో' అన్నట్లు తోస్తుంది. "బాల మురళీ కృష్ణుని" దర్శించు కొన్న కోట్నీసు ఎంత పుణ్యం చేసుకొన్నాడో. అదే రోజు (16-2-50) శ్రీ స్వామి వారు భక్తకోటికి సర్వ ధర్మ దర్శనమిచ్చుటకు దర్శనమంటపం పైకి సినిమా కృష్ణునివలె వచ్చెను. సమీపమందున్న భక్తులకు శ్రీ కృష్ణపరమాత్మ దివ్యదృశ్య దర్శన భాగ్యం లభించింది (వేణుగోపాల కృష్ణ దృశ్యం)

కోట్నీసు గారు ఫిల్ముతీసిన తర్వాత బాలయోగీశ్వరులవారు, ఆరోజు (రాత్రి) శివరాత్రి కనుక, తన తపస్సు చేసుకొను మందిరం నుండి లేచి, దర్శన మంటపంపైకి వచ్చి, లక్షలాది భక్తులకు ఆరోజు (శివరాత్రి మరుసటిరోజు) (పదిలక్షల మంది వచ్చినట్లు ఒకఅంచనా) దర్శనమిచ్చాడు.

ఈ అద్భుత సంఘటన గూర్చి శ్రీ దామెర్ల వేంకటరావు అనే ఒక భక్తుడు "An Eye witness Account wonder boy" అనే శీర్షికలో " ఇండియన్ రిపబ్లిక్" పత్రికలో 23.4.59 న ఒక వ్యాసం రాస్తూ " ఎవరో పెద్దవయస్కుడు రంగస్థల (బాల) కృష్ణుని వేషం తయారుచేసిన రీతిగా, ఆబాలుడు (బాలయోగి) అప్పటికి బాలయోగి వయస్సు సుమారు ఇరవైసంవత్సరాలు. పేటంచు ధోవతిని షోకుగా ధరించి శ్రీకృష్ణునివలె పైకి వచ్చెను అని అభివర్ణించాడు. అంటే మందిరంలో బాలయోగివారు కోట్నీసుగారికి బాలమురళీ కృష్ణునివలె దర్శనమిచ్చాడు గదా: మరి ఆ వెంటనే సర్వదర్శనమొసంగుటకు దర్శనమందిరంపైకి వస్తున్న బాలయోగి శ్రీ దామెర్ల

వారికిన్నీ "కృష్ణవేషధారి గా కనిపించాడన్నమాట. మిగిలిన లక్షలాది భక్తులకు మామూలు బాలయోగిగానే దర్శనమిచ్చాడు. శ్రీ దామెర్ల వారు గూడా చేసుకున్న పూర్వపుణ్యమెట్టిదో - శ్రీకృష్ణ దర్శనం గావించుకొన్నారు.

శ్లో॥ యేభజంతి తుమాం భక్త్యమయితే తేషుచాప్యహమ్ (భగవద్గీత - 9- 29) లో శ్రీకృష్ణుడు అర్జునునితో " ఎవరైతే నన్ను భక్తితో సేవించుచున్నారో వారు నాయందుందురు వారి యందును నేనుందున" ని స్పష్టంగా చెప్పిన రీతిగా బాలయోగి నిర్మల నిష్కామ నిశ్చల తపస్సులో (భక్తితో ధ్యానం) నుండి శ్రీకృష్ణుని దర్శించి - శ్రీకృష్ణునితో సాయుజ్యం పొంది నిజమైన భక్తులకు శ్రీకృష్ణుని వలె దర్శనమొసంగినాడు.

28-7-50న సర్వీసు కమిషను బోర్డు మెంబరు శ్రీ.పి.వి నరసింహరాజు గారు మందిరము లో శంఖ చక్ర ధారియగు శ్రీకృష్ణుని(అంటే గీతాకృష్ణుడు-మహావిష్ణువు) దర్శించాడు. అదే దినమున అమాలాపురం కో అపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ప్రెసిడెంటు శ్రీ పి.సత్యనారాయణ రాజు గారు శ్రీ సీతారాముల వారిని దర్శించుకొన్నారు. అదే రోజు శ్రీ జయంతి స్వామినాయన గారున్నూ శంఖచక్ర ధారియగు శ్రీకృష్ణుని దర్శనం చేసుకొన్నాడు.

గరుడ పక్షిరూపం

శ్రీయుతులు వ్యాసం సత్యరాజు, గాదెం అప్పారావు మరియొకరు ఒకనాడు శ్రీస్వామి వారిని దర్శింప వచ్చి, ప్రార్థనలు చేసినా మందిర ద్వారం తలుపులు తెరుచుకొనలేదు. కనుక వారు బయటనే ద్వారం సమీపమున, గోడకు చేరగిలబడి కూర్చుండిరి. అది అర్ధరాత్రి వేళ. ఇంతలో ఒక విధమైన శబ్దం విన్నారు. ఆశ్చర్యంతో చూడసాగారు. అంతలో ఒక పెద్ద గరుడపక్షి (పెద్ద గ్రద్ద) పైనుండి దిగివచ్చి ఆ ముగ్గిరిలో మధ్యనున్న వ్యక్తిపై కాళ్ళుమోపి రెండురెక్కలను యిరువైపులకూర్చున్న వారిపై ఆన్చెను. ఆ ముగ్గురు చాలా భయపడిరి. అయితే అంతలోనే ఆ పక్షిపైకెగిరి మాయమైపోయెను. పక్షిమాయమైన కొద్దిక్షణములలో మందిరం తలుపులు తెరుచుకున్నాయి. ముగ్గురు స్వామి వారిని దర్శించు కొన్నారు. స్వామి వారి ముఖ్యభక్తులలో నొకడగు శ్రీ కామేశ్వరరావు గారే విషయం స్వామి వారి జీవిత చరిత్ర రాసిన వంకల అప్పారావు గారికి వివరించారు స్వామివారే గరుడ పక్షిరూపంలో (పరకాయ ప్రవేశం - ప్రాకామ్యం) వచ్చియుందురని ఆ ముగ్గురు భక్తులును శ్రీ వంకల అప్పారావు గారున్నూ భావించారు. ఆదిశంకరాచార్యుల వారు మరణించిన అమర మహారాజు శరీరంలో ప్రవేశించి వారిని సజీవునిచేసి, తన శిష్యులకు తన నిర్జీవ కాయమును కాపాడవలసిందిగా చెప్పిన సంఘటన లోకవిదితమే. చివరకు శంకరాచార్యుని 'శవదహన' సమయానికి అమరమహారాజు దేహంవీడి స్వీయ శరీరంలో ప్రవేశించి అందర్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తినారు గదా:

ఆనంద బాల యోగీంద్రుల సందేహ నివృత్తి

శ్రీ ఆనంద బాల యోగీంద్రుల వారికి తన తపోప్రారంభదశలో ఏదో సందేహమొచ్చింది. దానిని ముమ్మిడివరం బాలయోగీంద్రులే తీర్చగలడని ఆయనకు తోచింది. ముమ్మిడి వరం ప్రయాణమౌచుండగా శ్రీబాల యోగీశ్వరుల వారే స్వయంగా శ్రీ ఆనందబాల యోగీంద్రుల వారి మందిరమందు "సూక్ష్మరూపం" లో (అణిమా) దర్శనమిచ్చి వారి సందేహనివృత్తి గావించాడు. ఈ విషయం బాలయోగివారి భక్తురాలు (ఆశ్రమ ఆవరణలో తులసికోట నిర్మాత) శ్రీమతి దొమ్మేటి సత్యవతిగారి ద్వారా తెలిసినది.

అపూర్వ సుగంధ పరిమళాలు - మంగళధ్వనులు

ఆశ్రమంలో తపోమందిరంలో అప్పుడప్పుడూ అపూర్వ సుగంధ పరిమళ 'సువాసనలు' వస్తూంటాయి. ఇది సర్వసాధారణ విషయం ఇట్టి సువాసనలు భక్తులకు దివ్యానుభూతి గలిగించేవి. ఇటు వంటి సుగంధ సువాసనలు, తాము తమ జీవితంలో యెన్నడూ ఆఘ్రాణించి యుండలేదని భక్తులెందరో చెబుతుంటారు. ఆ సుగంధపరిమళసౌరభాలు దివ్యమైనవి. అపూర్యమైనది. శ్రీ కె.యస్.ఆర్. మూర్తి గారికి ఇటువంటి సుగంధ పరిమళసౌరభాఘ్రాణ దివ్యాను భూతి కలిగినట్లు చెప్పారు. ఇప్పటికీ శ్రీయాలివాడపల్లి గారి గృహంలో యిటు వంటి సుగంధ సువాసనలు వెలువడుతుంటాయని, శ్రీయాలి వాడపల్లి గారి కుటుంబానికి శ్రీ బాలయోగి వారే "దైవం" శ్రీస్వామివారి ఆత్మీయభక్తుడైన సద్బ్రాహ్మణుడు శ్రీ స్వామివారి విచిత్ర జీవిత చరిత్రపై యెన్నో గ్రంధాలు వెలువరించిన శ్రీజయంతి స్వామినాయనగారి స్వీయాను భవం: శ్రీబాలయోగివారి తపోమందిరము తలుపులు సంవత్సరమునకొకసారి, మహా శివరాత్రికి గదా తెరిచేది. తలుపులు తెరవగానే ఉత్తరపుగదిలోను స్వామివారు ధ్యానంచేసుకొనే దక్షిణపు గదిలోను 'సువాసనలు'(సుగంధ పరిమళాలు) వెదజల్లుతూ రెండుగదులూ ఎంతో పరిశుభ్రంగా వుండేవని శ్రీమూర్తిగారు తదితర ప్రముఖులు యీరచయితకు చెప్పడం జరిగింది.

అలానే తపోమందిరంలో అప్పుడప్పుడు శంఖునాదాలు తద్వారా దివ్య మంగళ వాద్య ధ్వనులు భక్తులకు వినిపిస్తూ వుండేవి. శ్రీజయంతి స్వామినాయనగారిట్టి దివ్యమంగళ ధ్వనులెన్నో సార్లు విన్నారు. ఇతరకమిటీ సభ్యులు గూడా యిట్టి మంగళ వాద్యధ్వనులు విన్నట్లుచెప్పేవారు.

దివ్యపురుషుల సమావేశాలు

తపోమందిరం పైఅంతస్థులో శేషపాన్పు ఉన్న విశాలమైన గదిలో అప్పుడప్పుడు రాత్రు లందు ఏవో సమావేశాలు జరుగుచున్నట్లు అస్పష్టదివ్య పురుషుల ఆకారాలు (సిద్ధపురుషులు) తిరుగుతూవున్నట్లు సామాన్యమానవులకు అర్థంకాని ఏవోభాషల్లో ఆది పురుషుల ఆకారాలు మాట్లాడుకొనుచున్నట్లు ఎందరోభక్తులు అనుభవ పూర్వకంగా గ్రహించారు.

బాలయోగి వారి పాదముద్రలు

1950వ దశకంలో మాట. శ్రీ స్వామివారు శివరాత్రికి దర్శన మంటపంపైకి వచ్చి శేషపీఠంపై ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చేవారు గదా. ఆ రోజుల్లో స్వామి వారి దర్శనార్థం లక్షలాది ప్రజలు వచ్చేవారు. స్వామివారు దర్శన మండపంపైకి వెళ్ళి దిగి వచ్చే మార్గం ప్రజలచే 'కసబిస' త్రొక్కిన అరటి పండ్ల గుజ్జుతోను, అరటి తొక్కలతోను నిండిపోయి వుండేది. ఆ మార్గ మట్లా వుండే స్వామి వారు దర్శన మంటపంపైకి ఎలా వస్తారని "పిచ్చి" ఆలోచన పోలయ్యరెడ్డి గార్కి వచ్చింది. ఆ మార్గం శుభ్రం చేయించి నీళ్ళతో కడిగించాడాయన. మార్గం తడిగా వున్నం దున స్వామివారు ఆ అర్థరాత్రి పూట దర్శన మండపం నుండి తపో మందిరంలోనికి దిగివచ్చే సమయంలో స్వామి వారికి కాలు జారుతుందేమోయని సందేహం వచ్చింది. కనుక మెట్లపై శుభ్రమైన తెల్లటి వస్త్రం పరిస్తే స్వామి వారికి సౌకర్యంగా వుంటుందనీ, స్వామివారి పాదాలు ఆ వస్త్రంపై తప్పక పడతాయి కనుక, స్వామివారి పాదముద్రలు పడిన వస్త్రం తాను పవిత్రంగా తన పూజా గృహంలో వుంచుకోవచ్చునని ఆలోచించాడు. స్వామివారు వచ్చేమెట్ల దారిపై వస్త్రం పరిచాడు. స్వామివారు దర్శన మండపం నుండి తపోమందిరంలోనికి వెళ్ళి పోయి తన తపోపీఠంపై ఆసీనులైనారు. పోలయ్య రెడ్డిగారు ఎంతో కుతూహలంతో ఆ వస్త్రం పరికించి చూసాడు. కాని స్వామి వారి పాదముద్రలు ఆ వస్త్రంపై పడలేదు. నిరాశతో పాటు ఆశ్చర్యపోయాడు. ఈ విషయం మిత్రులతో చెప్పాడు. ఒక పెద్ద అంగవేసి అంగవస్త్రంపై కాలు మోపకుండా వచ్చే చిన్న మార్గం కాదు. స్వామివారు నడిచి వచ్చిన ఆ వస్త్రంపై తప్పక అడుగులు పడి వుండవలసిందే. అంటే స్వామివారు నడవకుండా తన తపోమహిమచేత సంకల్ప బలంచేత (సంయమనం చేత ఉద్యావాయుస్తంభనం) దర్శన మంటపం నుండి తపో మందిరంలోనికి వెళ్ళిపోయారన్న మాట. కనుకనే మెట్ల మార్గంలో పరిచిన తెల్లని వస్త్రంపై స్వామి వారి పాదముద్రలు పడలేదు. స్వామివారి తపోశక్తి ఎరుగని పోలయ్య రెడ్డిగారు ఆశపడ్డారు. నిరాశ చెందాడు.

అయితే ఆశ్రమ కమిటీ వైస్ ప్రెసిడెంటు గారగు శ్రీ ముత్యాల జానకిరామయ్యగారి అనుభవం తెలుసుకొందాం. మరొక సంవత్సరం శివరాత్రి దర్శన సమయంలో పోలయ్య రెడ్డిగార్కి వచ్చిన ఆలోచన జానకిరామయ్యగారికిన్నీ కలిగింది. మెట్ల మార్గం పొడవునా ఒక కొత్త గ్లాస్కో చాపు (రెండు పంచెలు) జానకిరామయ్యగారు పరిచాడు. శివరాత్రి మరునాడు భక్తులకు "సర్వదర్శనం" యిచ్చిన తర్వాత ఆ రాత్రి స్వామివారు యథావిధిగా దర్శన మండపం నుండి తపోమందిరంలోనికి వెళ్ళిపోయి తమ తపోపీఠంపై ఆసీనులై ధ్యాననిమగ్నులైరి. జానకి రామన్నగారు, 'ఆతురత'తో మెట్లమార్గంలో తాను పరిచిన పంచెలను పరికించి చూసారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే స్వామివారి పాదముద్ర ఒక్కటి మాత్రమే పడింది. జానకిరామయ్య గారు అదృష్టవంతులు. పోలయ్యరెడ్డిగారున్నూ జానకిరామయ్య గారున్నూ

స్వామివారి ముఖ్య భక్తులు. ఆశ్రమ అభివృద్ధికి తమ శక్తివంచన లేకుండా యిద్దరూ కృషి చేశారు. అయితే పోలయ్యరెడ్డిగారి కన్న జానకిరామయ్య గారు అదృష్టవంతుడు, ధన్యుడు. బహుశా జానకిరామయ్యగారు పూర్వజన్మలో చేసుకొన్న సుకృతం అది! అందువల్లనే స్వామివారు జానకిరామయ్యగారు పరిచిన పంచెపై తన పాద ముద్ర ఒకటి మాత్రం వేశారు.

దివ్యకాంతి పుంజము

బాలయోగివారు తపస్సు ప్రభావం వలన తపోమందిరంలో ఆశ్రమ ఆవరణలో ఎన్నో వింతలు-అద్భుతాలు జరుగుచుండేవి. అందులో అప్పుడప్పుడు "దివ్యకాంతి" క్షణకాలం మెరుపులా తళుక్కుమని అదృశ్యమవడం చాలా తరుచుగ జరుగుచుండేది. మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలు తెలుసుకుందాం.

1959 సం॥లో ఎన్నికలు సమయంలో శ్రీ బొక్కా తాతయ్యగారున్నూ, అభ్యర్థిన్నీ మరికొందరు ఎన్నికల ప్రచారం నిమిత్తం పరిసర గ్రామాలు తిరిగి బాగా ప్రొద్దుపోయిన తర్వాత (అర్ధరాత్రి మించిన సమయం) జీపులో బాలయోగి వారి తపో ఆశ్రమం ప్రక్కనున్న కాల్వగట్టుపై వస్తున్నారు. సరిగ్గా ఆశ్రమ సమీపంనకు రాగానే జీపుపై గొప్ప దివ్యతేజః పుంజం (కాంతి కిరాణాలు) ప్రసారమయ్యింది. అది ఎన్నో వందల వేల కరెంటు 'వాట్'ల శక్తి గల 'బల్బు' కాంతిగా కనిపించింది. జీపు నడుపుచున్న శ్రీ తాతయ్యగారి కళ్ళపై ఆ కాంతిపడుటచే కంగారెత్తిపోయాడు. జీపు ముందునకు నడుపుటకు కాలు చేతులాడలేదు. అంటే దారికనిపించలేదు. దానికితోడు కంగారు పడ్డాడు. డ్రైవరే మాత్రం అజాగ్రత్తగా నుండిన జీపు కాలువలో పడిపోయేది. జీపులోని వారందరికీ ప్రాణాపాయం కలిగివుండేది. అంతలో ఆకాంతి మాయమైనది. తాతయ్యగారు, అభ్యర్థి, జీపులోని వారు 'సంభ్రమాశ్చర్యాల'కు తోడు అసలా దివ్యకాంతి గురించి తెలుసుకుందామని ఆశ్రమానికి వెళ్ళారు. శ్రీ గంగయ్య గారిని లేపి, ఆశ్రమ ముఖద్వారం తాళాలు (తపోమందిరం) తీయించి ఆశ్రమం చుట్టూ చూసారు. అంతా చిమ్మచీకటి. పిట్టపీచు మనడం లేదు. అందరూ ఆశ్చర్యంతో పాటు ఆనంద పరవశులయ్యారు. అభ్యర్థికి శుభ సూచికంగా బాలయోగివారి తపోమహిమ వలన ఆ కాంతి కనిపించిందనుకొన్నారు. అలానే ఎన్నికలలో ఆ అభ్యర్థి గెలుపొందాడు.

నారదమహర్షి దర్శనం 0

శ్రీ బాలయోగి వారు తపస్సు ప్రారంభించినప్పుడు శ్రీ కృష్ణుడు, నారద మహర్షి యున్న చిత్రపటానికి పూజచేసినట్లు తెలుసుకొన్నాం. శ్రీ కృష్ణుని (మహావిష్ణువు అవతారం) మోక్షదాతగా, నారదమహర్షిని 'గురువు'గా సంభావించి శ్రీ బాలయోగివారు అలా పూజించారని కొందరి

విజ్ఞుల సదభిప్రాయం. ఏకలవ్యుడు ద్రోణుణ్ణి (ద్రోణుడు నిరాకరించినా) గురువుగా సంభావించి స్వయం కృషితో అర్జునుని మించిన విలుకాడయ్యాడు. అలానే శ్రీ బాలయోగి నారద మహర్షిని 'గురువు'గా సంభావించాడు. ధ్రువుడు, ప్రహ్లాదులకు 'నారద మహర్షియే' మంత్రోపదేశం చేసిన తర్వాతనే వారు కఠోర తపస్సు చేసారు. నారదుడు త్రిలోక సంచారి. దేవర్షి, నిత్యం 'నారాయణ' నామం జపిస్తుంటాడు గదా! కలహభోజకుడని ఆయనపై అపవాదొకటి యున్నది గదా! అదాలా వుంచితే శ్రీ బాలయోగివారు శ్రీకృష్ణుని మోక్షదాతగా సంభావించి తపస్సు ప్రారంభించాడు. కనుక తపోమందిరంలో ఆయన శ్రీ లక్ష్మీనారాయణుల వారిని పూజించినట్లు జయంతి స్వామి నాయన తదితరులు ఆ దృశ్యం చూసిన అదృష్టవంతులు చెప్పడం వలన, 'విష్ణుప్రియుడైన' నారదమహర్షి శ్రీ బాలయోగి వారి ఆశ్రమ ప్రాంగణంలో శ్రీ పెదస్వామి శ్రీ చినస్వామి వారి 'తపో మందిరములకు మధ్యనున్న కల్పవృక్షం వంటి కొబ్బరి చెట్టుక్రింద తాను దర్శనం చేసు కొన్నట్లు నిత్యం ఆశ్రమ ప్రాంగణంలో జీవించిన, తమిళనాడుకు చెందిన 'మౌనస్వామి'గా పేరు పొందిన ఒక బైరాగి చెప్పినట్లు తెలియుచున్నది. నారదుల వారి పాదములకు నమస్కరిం చవలెనని ఆ మౌనస్వామి శిరస్సువంచగానే నారదుల వారు అదృశ్యమయ్యారట. నారదుల వారు త్రిలోక సంచారి త్రికాల చిరంజీవి కనుక శ్రీ బాలయోగి వారిని దర్శించుటకు వచ్చి యుండుననుటలో సందేహం వుండనక్కరలేదు. శ్రీ పెదస్వామి వారి ధ్యానమందిరంనకు ఈశాన్యదిశలో నిర్మితమైన 'తపోమందిరం' (భజన మందిరం)లో నున్న శేషపాన్పు చెంత సహజ సుందరమైన జీవముట్టి పడే ఒక నారదుల వారి విగ్రహం మొదట వుండేది. దరిమిలా అది శ్రీ చినస్వామి వారి తపోమందిరంలో శ్రీ చినస్వామి చెంతకు చేర్చబడినది. అలా శ్రీబాలయోగి వారి ఆశ్రమంలోనికి వచ్చిన నారద మహర్షి శ్రీ మహావిష్ణువు ఆదేశానుసారం వచ్చాడో, లేదో శ్రీ బాలయోగివారితో సంభాషించుటకు వచ్చాడో తెలియదు.

శ్రీ జయంతి స్వామి నాయన అనుభవాలు

ముమ్మిడివరంలో నున్న ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన శ్రీ జయంతి వారు శ్రీ పెదబాలయోగి వారిని 22-2-48 నుండి దర్శించుకొన్నాడు. ది. 11-4-49న శ్రీ స్వామివారి తపోమందిరమున పాలచెంబునంటి యున్న చీటీలో "శ్రీ బాలయోగివారి సంగతులన్నియు జయంతి స్వామి నాయనగారికి తెలియుననియు, అతని సేవలకై మందిర తాళములు వెంటనే ఆయనకు స్వాధీనం చేయవలయుననియు, ఆ చీటీని "శ్రీకృష్ణుడు వ్రాసియుంచె" ననియు కమిటీ సభ్యులకు శ్రీస్వామివారు వివరించినారు. అదే విధంగా అప్పటి వరకు శ్రీ వ్యాసం సత్యరాజు ఆధీనంలో వున్న మందిరం తాళాలు జయంతి వారికి అప్పగించడం జరిగింది. (1-8-49న జల్లా కలెక్టరు బాలసుందరం గారు స్వాధీనం చేసుకొనేటంత వరకు) ది. 1-5-49న

శ్రీ స్వామివారి కురులు ముడివడి యుండి 'బాల శివావతారుని'గాను ది. 12-11-49న శ్రీ స్వామివారి మందిరంలో 'లక్ష్మీ నారాయణ' స్వరూపమును, ది. 17-11-49న శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారి పాదద్వయమును, ది. 19-11-49న దేవీ స్వరూపమును దర్శించినట్లున్నూ ది. 13-12-49న శ్రీబాలయోగివారు శ్రీ లక్ష్మీదేవీ సమేత లక్ష్మీనారాయణులను పూజించిన దృశ్యమున్నూ తనతోపాటు మరికొందరి భక్తుల 'అనుభాలను' జయంతి వారు తన 'బాలయోగీశ్వర మహా మహిమలు' అనే గ్రంథంలో పేర్కొన్నారు. ఇంతియేకాక, శ్రీస్వామివారి తపో మందిరం నుండి ఎన్నోసార్లు చిక్కని పాలు రంధ్రం గుండా బయటికి ప్రవహించినట్లు ఆ పాలు తాను మరికొందరు రుచిచూసినట్లునూ, అలానే ధూపదీప పరిమళాలు, ఆఘ్రాణించినట్లు ఓంకార, భేరీ శంఖ మృదంగ వేణు నాదములు, తపో మందిరం నుండి తాము విన్నట్లు పేర్కొన్నారు. శ్రీ స్వామివారిని 'శ్రీకృష్ణరూపం'లో తాను దర్శించుకొన్నట్లున్నూ చెప్పియున్నాడు. ది. 22-12-50న శ్రీ పెదస్వామి వారు జయంతి వారిని పిలిపించి తమ తండ్రి 'అమాయకులని' చెప్పినట్లును, తనను, మందిరం సమస్త విషయాలు గమనిస్తూ, "శాంతి వాతావరణం' నెలకొనునట్లు చూడవలయుననియు "సంజ్ఞ"లతో తనతో మాట్లాడినట్లు "బాలయోగి విచిత్ర చరిత్ర-2 భాగం'లో వ్రాసినాడు. శ్రీస్వామివారి 'అనుమతి'తోనే జయంతి వారు శ్రీ స్వామివారిపై అనేక రచనలు చేశారు.

ఇక్కడొక విషయం చెప్పాలి. 6-2-49న శ్రీ వ్యాసం సత్యరాజుతో 10-2-49 రాత్రి రాజమండ్రిలో సబ్-జడ్జిగా పనిచేస్తున్న శ్రీ గరిమెళ్ళ కృష్ణమూర్తిగారిని తీసుకొని రమ్మని శ్రీ స్వామివారు చెప్పారుగదా. అలానే సత్యరాజు కృష్ణమూర్తి గారిని తీసుకొని రావడం, వారు శ్రీ స్వామివారిని దర్శించుకోవడం, స్వామివారు వారికి 27-3-49న తమ స్వీయ చరిత్ర గురించి, నిత్యదర్శనం గురించి శివరాత్రి దర్శనం గురించి వివరించి 'తత్త్వోపదేశములు' గూడా యిచ్చి యున్నారు. అట్టి గరిమెళ్ళ కృష్ణమూర్తి గారు కుటుంబ సమేతంగా 27-4-49లో శ్రీ స్వామివారి దర్శనార్థం ముమ్మిడివరం వచ్చి ఆశ్రమంనకు వెళ్ళగా శ్రీ పెదబాలయోగి తపోమందిరం తలుపులు తెరుచుకొనక పోవడం, అప్పుడు కృష్ణమూర్తిగారు జయంతి వారిని ఆశ్రమంనకు తీసుకొనిరాగా తపోమందిరం తలుపులు తెరచుకొన్నట్లు, కృష్ణమూర్తిగారు కుటుంబ సమేతంగా శ్రీ బాలయోగివారిని భక్తి శ్రద్ధలతో దర్శనం చేసుకొన్నట్లు జయంతి వారు బాలయోగి విచిత్ర చరిత్రలో చెప్పాడు. అలానే కమిటీ సభ్యులు అనుమతించినా, లేకున్నా శ్రీ బాలయోగి వారి జీవిత విశేషాల గురించి, మహిమల గురించి, యెన్ని అడ్డంకులు వచ్చినా, వ్రాసి ప్రచారం చేయవలసిందిగా కృష్ణమూర్తి గారు జయంతి వారికి సలహా యిచ్చినట్లును రాశాడు. ఎంత విచిత్రం. ఒకానొకనాడు అనగా 10-2-49న గరిమెళ్ళ కృష్ణమూర్తి పేరు చెప్పి తమ వద్దకు రప్పించుకొని, ఆనాడు ఆయనతోను వ్యాసం సత్యరాజుతోను, తపోమందిరంనకు తలుపులు యేర్పాటు చేసి, తలుపులు బిగించమనియు, 27-3-49న తమ స్వీయ చరిత్రతోపాటు, తమ

నిత్య దర్శనానకు సంబంధించిన ఆదేశములు, మరికొన్ని దివ్యతత్త్వోపదేశములు వివరించిన శ్రీ బాలయోగి వారిని సందర్శింప కృష్ణమూర్తి కుటుంబ సమేతంగా 1950లో ఆశ్రమంనకు వెళ్ళినప్పుడు, ఆశ్రమ తలుపులు తెరచుకొనక పోవడం, స్వామివారి దర్శన నిమిత్తం శ్రీ కృష్ణమూర్తి జయంతి వారి సహకారం తీసుకొనడం నిజంగా చిత్రంగా వుంది. దైవలీలలు చిత్ర విచిత్రాలు గదా!

శ్రీ జయంతి వారు శ్రీ పెదబాలయోగివారిని గురించి ఎన్నో గ్రంథములు రాశాడు. (1) బాలయోగీశ్వరుల చరిత్ర-యోగ సిద్ధి నిరూపణము (2) బాలయోగీశ్వర-మహామహిమలు (గద్య పద్యాత్మక రచనలు) (3) బాలయోగీశ్వర విచిత్ర చరిత్ర (మూడు భాగములు) (4) మోక్ష విద్య మొదలగు రచనలు చేసియున్నారు. శ్రీ పెదబాలయోగీశ్వరుని గురించి, యిన్ని రచనలు చేసిన ఏ ఒక్క కవియు, రచయితయును లేడు. శ్రీ బాలయోగి వారి తపో మహిమ గురించి తన రచనల ద్వారా ఆంధ్రదేశంలో జన బాహుళ్యంలో బహుళ ప్రచారం గావించాడు శ్రీ జయంతి వారు.

తపోమందిరంలో నీటి చెంబుచెంత వున్న "చీటి" (విషయములన్నియు ఆయనకు (జయంతి వారికి)మందిర తాళములు స్వాధీనం చేయవలయునని కమిటీ సభ్యులు సందేహించుట, కమిటీ వారు శ్రీ స్వామివారి సందేశములను కొద్దిగా 'తారుమారు' చేసి ఇంగ్లీషులోనికి అనువాదం చేసి చిన్న పుస్తక రూపంలో ప్రచురించి, శ్రీ బాలయోగివారు ముందు ముందు త్వరలో జీవన్ముక్తుడగునని' తప్పుడు ప్రచారం చేయుట, శ్రీ బాలయోగి వారి దర్శనార్థం వచ్చే భక్తులు తమ నగదు కానుకలు 'డబ్బీ' వేసిన దానికి కమిటీ వారు లెక్క చెప్పక పోవుటచే వారి నీవిషయమై శ్రీ జయంతి వారు 'నిలదీయుట' మొదలగు కారణములచేత, శ్రీ స్వామివారితో అత్యంత సన్నిహితంగా మెలిగిన భక్తులు, అదృష్టవంతులైన సర్వశ్రీ బచ్చుమాధవయ్య, ముత్యాల జానకిరామన్న, దారా సర్వేశ్వరరావు, బోరపోలయ్యరెడ్డి, యీలివాడపల్లి ప్రభృతుల 'అనుభవాలు' వారి జీవితంలో శ్రీ స్వామివారి ప్రభావంచేత గల్గిన 'మహిమలు' శ్రీ జయంతి వారు తన రచనలలో పేర్కొనలేదని నమోదు చేయలేదని నాకనిపిస్తుంది. పైన పేర్కొన్న వారందరున్నూ మరికొందరున్నూ జయంతి వారికి సమకాలీనులు. వారీనాడు జీవించిలేరు. వారి అనుభవాలు ఏమిటో యిదమిద్ధంగా తెలియడం లేదు. కేవలం స్వామివారి జీవిత చరిత్ర, యోగసిద్ధి నిరూపణం, స్వామివారి విచిత్ర చరిత్ర తన దృష్టితో, 'తన' అనుభంలోని సంగతులు జయంతి వారు రాసారని నాకనిపిస్తుంది. పైన పేర్కొనబడిన స్వామివారి 'పరమభక్తుల' అనుభవాన్ని గూడా నమోదు చేసి, తన రచనలలలో చేర్చి ప్రచురించియుంటే లోకానికి ఎంతో ఉపయుక్తంగా వుండేదనిపిస్తుంది. శ్రీ కంకల అప్పారావుగారు తాను చేసిన రచనల్లో ఆయన శ్రమించి స్వామివారి భక్తులు కొందరిని కలిసి, వారి అనుభవాలు, స్వామివారి ప్రభావం చేత వారి జీవితంలో జరిగిన

మహిమలు నమోదు చేయడం పాఠకులు తెలిసికొనగలందులకు మనవి. ఇలా అని జయంతి వారికి 'స్వామివారి' పట్ల నున్న భక్తి విశ్వాసాలను శంకించినట్లు కాదు. అదే సమయంలో స్వామివారి గురించి తన రచనల ద్వారా శ్రీ జయంతి వారి వలన లోకంలో బహుళ ప్రచారం జరిగిందన్న వాస్తవాన్ని గూడా తక్కువ అంచనా వేయటానికి వీలులేదు!

ఏదియేమైనా జయంతి వారు శ్రీ బాలయోగీశ్వరుని కపిల, జడభరతుడు, శ్రీశుకుడు. ప్రభృతి మహాయోగులతో పోల్చాడు. శ్రీ బాలయోగీశ్వరుల వారిని "ఘోరతపస్వి"గా 'మహాయోగి'గా, పరమహంసగా మహాసిద్ధునిగా, పరబ్రహ్మమూర్తిగా జీవబ్రహ్మైకసిద్ధునిగా, సచ్చిదానంద పరబ్రహ్మ మూర్తిగా బహుధా శ్లాఘించాడు.

స్వవిషయం రాస్తూ జయంతి వారు 'దీ. 22-2-48 నుండి నేను బాలయోగివారిని వినయ విధేయులతో, భయభక్తులతో సంతత సేవా సంక్తతతో సచ్ఛాత్ర భావముతో నాశ్రయించుకొనియున్న పూర్వాచార బ్రాహ్మణుడన"నియు శ్రీబాలయోగి సేవయందు కొంత కాలముండే సరికి నాకు తెలియకుండగనే నా నోటి వెంట కవితాధార వెలువడసాగెను. నాకు కవిత్వము చెప్పు సామర్థ్యమును గద్య గ్రంథములు వ్రాయుశక్తియును శ్రీ బాలయోగీశ్వరుని సేవాఫలముగ లభించినవే" అనియు సవినయంగా చెప్పాడు! శ్రీ జయంతి వారు శ్రీ బాలయోగీశ్వర "విచిత్ర చరిత్ర"తోపాటు తన స్వీయానుభవంలో దర్శించిన శ్రీ బాలయోగీశ్వరుల వారి "మహా మహిమలు", "పాదద్వయ సందర్శనము" "బాల శివావతారము", శ్రీ బాల యోగీశ్వరస్తవము" "గురుస్తవము" అనే కవితా ఖండికలు వెలయించాడు.

శ్రీ వంకల అప్పారావు (రేణు) అనుభవం

రాజమండ్రి వాస్తవ్యుడు ఉపాధ్యాయుడైన శ్రీ వంకల అప్పారావు, శ్రీ బాలయోగి వారి ఆశ్రమాభివృద్ధికి శ్రమపడిన వారిలో ఒకడైన, శ్రీవారి భక్తుడైన శ్రీ బోర పోలయ్యరెడ్డిగారితో పరిచయం వుండడం వలన రెడ్డిగారి సలహాపై ముమ్మిడివరం పోయి 1969లో మహాశివరాత్రికి శ్రీ పెదబాలయోగి వారిని 'చూసి' వస్తామని మరొక మిత్రునితో బస్సులో ప్రయాణమైనాడు. మార్గమధ్యలో ఒక లారీ ఎదురుగావచ్చి బస్సును ఢీకొన్నది. అయితే దైవవశాత్తు, శ్రీ బాలయోగివారి మహిమచేత బస్సు వెనక భాగం కొంత దెబ్బతిన్నను, బస్సులోని ప్రయాణీకులకు ఎటువంటి ప్రాణాపాయం జరుగలేదు. శ్రీ అప్పారావు కుటుంబం శైవ సంప్రదాయం అయినా ఆయనకు శ్రీ బాలయోగి వారిమీద భక్తి భావం లేదు. కారణం "ఒక మానవుడు మరియొక మానవునికి దైవ భావముతో మ్రొక్కరాద'న్న స్థిరమైన అభిప్రాయ మాయనిది. కాని ఆయన తల్లిగారు శ్రీ బాలయోగివారి భక్తురాలు కావడం విశేషం! అయితే 16-2-69 (మహా శివరాత్రి మరుసటి రోజు) దర్శన మంటపంపై శేషపీఠంపై ధ్యానముద్రలో

ఆశీనులై యున్న శ్రీ పెదబాలయోగివారిని శ్రీ అప్పారావు దర్శనం చేసుకొన్నప్పుడు "శ్రీ యోగీశ్వరుల వారు సాక్షాత్తు దయామయుడగు శంకర భగవానుని వలెనే దర్శనమిచ్చిరి. శంకరుని వలెనే శ్వేతవర్ణ (తెల్లగ)నిగను, అత్యంత సౌమ్యునిగను, దయామయునిగను, లోకోద్ధరణకై అవతరించిన లోక రక్షకుని వలెను, దైవ తేజముతో నిండిన దివ్య పురుషునివలెను, సంక్షుభిత హృదయులను శాంతింప జేయగల ప్రశాంతమూర్తివలెను దర్శనమిచ్చిరి. నా హృదయ మందు శ్రీ యోగీశ్వరుని యెడల సంపూర్ణ దైవభావము సేవ్య, సేవక భావము అనగా దాస్యభక్తి ఉదయించినది. ఇంతటి మహాపురుషుని యెరుంగక యిన్ని సంవత్సరముల వరకు దర్శించక పోయితినే, యెంతటి మందభాగ్యడను' అని వాపోయాడు. వంకల వారిలో "హృదయ పరివర్తన' ' వచ్చింది. తదనంతరం శ్రీ పెదబాలయోగి వారి 'దివ్యత్వం' గురించి మహిమలు గురించి వారి శేష జీవితం గురించి యెందరెందరి ద్వారానో తెలుసుకొని, తనకున్న సందేహములను నివృత్తి చేసుకొని, శ్రీ అప్పారావు శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి భక్తకోటిలో ఒకడై పోయాడు. కొన్ని సంవత్సరాల క్రితం అంటే శ్రీ అప్పారావు బాల్యమందు తమ గృహంలోని 'వంటగది'లో కౌపీనం (గోచిపాత) ధరించిన ముని బాలకుని రెండు మూడుసార్లు చూచినట్లు, ఆ బాలుని రూపం స్వామివారి తపోమందిరం పైని ఆగ్నేయ దిశలోనున్న బాలయోగివారి విగ్రహంను బోలియున్నదట. అంతేకాదు శ్రీ పెదబాలయోగీశ్వరుల గూర్చి 'వసుధైక దివ్యచైతన్యమూర్తి' అనే గ్రంథం రచించాడు. 27-3-49 న శ్రీ వ్యాసం సత్యరాజు మరియిద్దరికి శ్రీ బాలయోగివారు బోధించిన "తత్త్వోపదేశముల'ను భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన తాత్త్విక (ఆధ్యాత్మిక) బోధనలతో సరిపోల్చి 'శ్రీ బాలయోగీశ్వరుల తత్త్వోపదేశములు, వివేచన, గీతాప్రామాణికత' అనెడి మరొక గ్రంథం గూడా రాసాడు. పైగా శ్రీ అప్పారావు 'హిందీ భాషా ప్రవీణ అగుటచేత శ్రీ బాలయోగి వారి జీవితాన్ని 'హిందీ'లో గూడా రచించి తెలుగు, ఇంగ్లీషు భాషలు రాని 'ఔత్తరాహులు' శ్రీ బాలయోగి వారిని గురించి తెలుసుకొనే సదవకాశం కల్పించాడు. అదే విధంగా శ్రీ అప్పారావు "కలియుగ మందు కృతయుగ మానవుడు" అనే మరొక రచన చేశాడు. శ్రీ బాలయోగీశ్వరుల వారు "శివ స్వరూపులు' 'మానవ రూప మాధవుడ'ని తేల్చాడు. శ్రీ బాలయోగివారు త్రిమూర్త్యాత్మక అవతారమని' అభిప్రాయపడ్డారు.

తాళ్ళూరి కామేశ్వరరావు గారి అనుభవం

శ్రీ బాలయోగి భక్తకోటిలో తాళ్ళూరి కామేశ్వర రావు గారొకరు. వారి యింటిలో శ్రీ బాలయోగి వారు ధరించెడి 'అంగవస్త్రం' మాత్రమే (శ్రీ బాలయోగి వారు మాత్రం కనిపించ కుండా) గది అంతటా కలియ తిరుగుచున్న దృశ్యం ఆయన కనేకసార్లు కనిపించింది. చినబాలయోగివారి మాతృమూర్తి శ్రీమతి వెంకమ్మగారు (గంగయ్య గారి తృతీయ కళత్రం) 21-2-71 తేదీన పరమపదించారు. అంటే మహాశివరాత్రి పర్వదినంనకు ఒక రోజు ముందు

ఆమె పరమపదించింది. 'మహాశివరాత్రి రేపు గదా! రేపు ముమ్మిడివరం వెళ్ళి స్వామివారిని దర్శనం చేసుకొందామ'ని శ్రీ కామేశ్వరరావు అనుకొనుచుండగా "రేపుకాదు-నేడేరమ్ము" అన్న మాటలు ఆయనకెవరో స్పష్టంగా పెద్దగా చెప్పినట్లు వినబడింది. ఆయన అటూ యిటూ చూడగా ఆ చెప్పిన వ్యక్తి యెవరూ కనిపించలేదు! తాను విన్న 'మాటల' ప్రకారం కామేశ్వరరావు వెంటనే బయలుదేరి ముమ్మిడివరం వెళ్ళడం జరిగింది! ముమ్మిడివరం చేరిన తర్వాత శ్రీమతి వెంకమ్మ గారి మరణవార్త విని కామేశ్వరరావు నిర్ఘాంతపోయాడు. మరొకనాడు కామేశ్వర రావుగారికి శ్రీ పెదబాలయోగివారున్నూ, శ్రీ చినబాలయోగి వారున్నూ స్వప్నంలో దర్శనమిచ్చి చినస్వామి వారినచట వదలి, శ్రీ పెదస్వామివారు అదృశ్యమై, మరికొంత సమయానికి తిరిగి వచ్చి చినస్వామిని వెంటబెట్టుకొని శ్రీ పెదస్వామి వారు వెళ్ళిపోయినట్లు దృశ్యం కనిపించింది. తెల్లవారిన తర్వాత శ్రీ కామేశ్వరరావు తన పొలమునకు వెళ్ళి తిరిగి వచ్చుచుండగా శ్రీ బాలయోగి వారి భక్తులలో ఒకరైన 'రాజబాబు' గారి మరణవార్త ఆయన చెవిని పడింది. రాజబాబు పెద్దాపురం నివాసి, యింజనీరుగా పనిచేసి యున్నారు. ఆయన కామేశ్వరరావుకు స్నేహితుడు. బాలయోగి వారి భక్తుడు. ఒక సందర్భంలో ఆయన పెదబాలయోగివారి 'ఫొటోలు' ఆరు (6) కొన్నారట. ఆరు ఫొటో లెందుకని "కామేశ్వరరావు గారు రాజబాబు గారిని నడిగితే" చేతిలో డబ్బు వుండినచో ఆరు కాదు ఆరువేల ఫొటోలు కొని నా గృహమందున్న అన్ని గదుల గోడలకు సందులేకుండా స్వామివారి ఫొటోలు అంటించియుండునని" అన్నారట. అటువంటి బాలయోగి వారి భక్తుడు 'రాజబాబు' మరణించిన రాత్రి శ్రీ కామేశ్వరరావు స్వప్నంలో శ్రీ పెదస్వామి శ్రీ చిన్నస్వామి దర్శనమిచ్చి అదృశ్యమగుట విచిత్రంగా తోస్తుంది. కామేశ్వరరావున్నూ, రాజబాబున్నూ 'బాలయోగి వారి' భక్తులు ఇద్దరున్నూ ఆప్తమిత్రులు. అందుకే కాబోలు రాజబాబు మరణించిన రాత్రి కామేశ్వరరావు స్వప్నంలో శ్రీ పెదబాలయోగి వారు శ్రీ చినబాలయోగి వారితో కలిసి దర్శనమిచ్చారు.

శ్రీ డి. బాల సుందరం గారి దివ్యానుభూతి

శ్రీ బాలసుందరం గారు జిల్లా (తూర్పు గోదావరి) కలెక్టరుగా నుండగా 1953 ఆగష్టు సెప్టెంబరు ప్రాంతంలో గోదావరికి గొప్ప వరద వచ్చింది. తుఫాను వచ్చి కోస్తా జిల్లాల్ని అతలా కుతలం చేసింది. చెట్లు చేమలు కూలి పోయాయి. పూరిండ్లు నేలమట్టమయ్యాయి. ఫంట పొలాలు గంగపాలయ్యాయి.

అప్పుడు శ్రీ బాలయోగివారు 'పెంకుటింటి' పర్ణశాలలో తపస్సు చేసుకొనే వాడు. జిల్లా కలెక్టరుగా శ్రీ బాలసుందరంగారు శ్రీ బాలయోగి ఆశ్రమ కమిటీ ప్రెసిడెంటుగా వున్నారు. కాకినాడలో వున్న శ్రీ బాలసుందరంగారు యీ తుఫానుకు, యీ వరదకీ శ్రీ బాలయోగి పర్ణశాల

పడిపోయి వుంటుందని, దీర్ఘతపస్సులో శ్రీ బాలయోగి వారెలా వున్నాడో అని ఆందోళన చెందాడు.

తుఫాను తగ్గినాక శ్రీ బాలసుందరం గారు ముమ్మిడివరం బయలుదేరారు. వరదనీరు, పడిపోయిన చెట్లు దారీడొంక కనిపించక పోయినా, తన క్రింది రెవెన్యూ అధికారుల సహాయంతో సాయంత్రానికి ముమ్మిడివరం చేరుకొన్నారు శ్రీ బాలసుందరంగారు. శ్రీ బాలయోగి వారి ఆశ్రమమనకు చేరి నీటమునిగియున్న తపోపర్ణశాల తాళములు తెరచుటకు ప్రయత్నించగా తలుపులు తెరువబడలేదు. నిచ్చెన సాయంతో శ్రీ బాలసుందరంగారు స్వయంగా పర్ణశాల పైకి కొంచెమెక్కి రెండు మూడు పెంకులు మెల్లగా జాగ్రత్తగా తొలిగించి మెల్లగా పర్ణశాలలోనికి తొంగిచూసాడు. ఆయనకు కనిపించిన దివ్య దృశ్యం చూచి తన కళ్ళనే తాను నమ్మలేక పోయాడుట. కనులు నలుపుకొని మరలా చూసాడు. ఆ చిన్న పర్ణశాలలో పెద్దనది (గోదావరి) ప్రవహిస్తోంది. శ్రీ స్వామివారు ఆ నదిలో స్నానమాడి పైకివచ్చి, చేతులు చాపగా ఏదో దివ్య శ్వేత పుష్పములు వారి దోసిట నిండాయి. ఆయన యెదుట కనపడీ కనపడని 'దివ్యస్త్రీ పురుష' పాదద్వయంనకు 'పుష్పాంజలి' సమర్పించాడుట. ఆ దివ్యపాదాలు ఆ నదీ అంతలోనే అదృశ్యమయ్యాయట. శ్రీ స్వామివారు తమ తపోపీఠంపై ధ్యాననిమగ్నుడైనాడట.

తమ సహోదరుడే చిన్న బాలయోగీశ్వరులు వారు 'అన్నగారగు' పెద బాలయోగీశ్వరుల వారిని 'గురువు'గా భావించి ఆయన గూడా ఘోర తపస్సు చేసారు. అదే విధంగా పెదబాలయోగీశ్వరుల వారి తపో మహిమ వలన పంచమ కులంలో విద్యాగంధం లేక నిరుపేదలైన (1) అర్జున బాలయోగి (కొత్తపేట) (2) నాగేంద్ర బాలయోగి (కేదరాశిపల్లి) (3) గంగాధర బాలయోగి (గోడి) (4) శివబాలయోగి (ఆదివారపు పేట (దేవాంగి) (5) ఓంకార బాలయోగి (పెనుమదం) (వీరందరూ తుర్పు గోదావరి జిల్లా వారు) (6) నాల బాలయోగి-గరగపర్రు (7) వీరరాఘవ బాలయోగి (వెలమగరగపర్రు) యీ చివరియిద్దరు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవారు. వీరందరూ పెదబాలయోగి వారిని "స్ఫూర్తి"గా తీసుకొని తపస్సు చేశారు. వీరిలో చాలామంది స్వల్పకాలం మాత్రమే తపస్సు చేసారనుకొండి. అయినా వీరి వలన యెందరో భక్తులైన తమ జీవితాలను భక్తిమార్గం ద్వారా సక్రమ మార్గంలో నడుపుకొన్న వారు వందలు వేలుంటారు. ఇదంతా నిస్సందేహంగా పెదబాలయోగివారి తపో ప్రభావమే!

అలానే స్వామితో ప్రత్యక్ష సన్నిహిత సంబంధం యేర్పడి, కమిటీ సభ్యులుగానో, ఆశ్రమ నిర్మాణ కార్యక్రమంలోనో, ఆశ్రమాభివృద్ధి కొరకు చేయు పనులందో పాల్గొన్న ధన్యజీవులు. వ్యాసం సత్యరాజు, డి. బాలసుందరం పిళ్లై (ఆనాటి జిల్లా కలెక్టరు) వారి కుమారుడు నటరాజన్. సర్వశ్రీ జిల్లా కలెక్టరుగా (Service Commission Member) పనిచేసినది బాల సుందరంగారు

బచ్చు మాధవయ్య, ధారా సర్వేశ్వర శ్రేష్ఠి, ముత్యాల జానకిరామన్న బోరపోలయ్యరెడ్డి, శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారు, సూరి శెట్టి వెంకటస్వామి (యిలా చెప్పుకుపోతే వారిపేర్లే ఒక గ్రంథ మౌతుంది) యిలా ఎందరో స్వామివారికి పరమభక్తులైనారు. వారే కాదు వారి కుటుంబ సభ్యులు, వారి సంతానం, యిలా ఎందరో స్వామివారి తపో ప్రభావం వలన ఆధ్యాత్మిక మార్గంలో "పెద బాలయోగీశ్వరులు" వారే తమ "దైవం"గా భావించి భక్తిప్రవత్తులతో పూజించారు.

ఈలి వాడపల్లి కుటుంబ అనుభవం

బాలయోగీశ్వరుల యందు అమితమైన భక్తిప్రవత్తులు గల వారిలో తూ.గో. జిల్లా రామచంద్రాపురం వాస్తవ్యులు ఈలి వాడపల్లిగారు వారి కుటుంబ సభ్యులు, మనస్వామివారు ఆ కుటుంబానికి "దైవం" స్వామివారు నిర్యాణం చెంది దాదాపు పది సంవత్సరాలు అవుతున్నా, వారి గృహంలో యిప్పటికీ ఒక్కొక్కసారి చెప్పలేని "అమోఘమైన సుగంధ పరిమళాలు" (సువాసనలు) వ్యాపిస్తాయని, ఆ కుటుంబ సభ్యులకు ఎనలేని పరమానందాన్ని కలిగిస్తాయని వాడపల్లి గారి కుమారుడు "బాలయోగి ఆశ్రమంతో ఎంతో సన్నిహితమున్న" 'ప్రేమ్‌ప్రసాద్' చెప్పాడు. శ్రీ ఈలి వాడపల్లి గారు బాలయోగి ఆశ్రమ కమిటీకి చాలాకాలం సెక్రటరీగా వున్నాడు. ఈలి వాడపల్లి వారు పోయిన తర్వాత గూడా వారి కుటుంబ సభ్యులు స్వామివారిని దైవంగా ఆరాధిస్తారు. ఎన్నో క్లిష్టసమయాల్లో స్వామి వారు తనను కాపాడారని వాడపల్లి గారి అబ్బాయి ప్రేమ్‌ప్రసాదు (ఇంజనీరు) చెప్పారు. తనకు క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం అయిందంటే అది స్వామివారి మహిమే అని ప్రేమ్‌ప్రసాద్ నమ్మకం. స్వామివారు జీవించియుండగా శివరాత్రికి భక్తులకు దర్శనం ఇవ్వటానికి స్వామివారు తపోమందిరం నుండి దర్శన మంటపంపైకి ఎలా వెళ్ళతారో అని ప్రేమప్రసాద్, దారా సర్వేశ్వరరావు గారు మెట్ల దగ్గర కూర్చుంటే "రివ్వున సుడిగాలి" వచ్చినట్లు అనుభూతి గలిగేది స్వామివారు పైకి వెళ్ళేవారు.

ఒకసారి శ్రీ దామోదరం సంజీవయ్య గారు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో (1959-61) ఈలి వాడపల్లిగారు శ్రీ సంజీవయ్య గారికి ఘనంగా సన్మానం ఏర్పాటు చేసారు. శుభప్రారంభ సమయానికి ఆకాశం దట్టమైన మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కుంభవృష్టి కురుస్తుందన్న భయంకర వాతావరణ పరిస్థితులు గోచరమయ్యాయి. చిటిపొటి సన్నటి చినుకులు కూడా పడసాగాయి. అందరూ చాలా భయపడ్డారు. సంజీవయ్య గారికి తలపెట్టింది గొప్ప సన్మాన కార్యక్రమం! ఈలివాడపల్లి గారు పెద బాలయోగిగారికి పరమభక్తుడు కనుక స్వామివారిని యీ క్లిష్ట పరిస్థితుల నుండి కాపాడమని వేడుకొన్నాడు. అంతే. కొన్ని నిమిషాలలో మేఘాలు పటాపంచలమై, ఉరుములు, మెరుములు తగ్గిపోయి ఆకాశం

నిర్మలమైనది. అందరూ, ఊపిరి పీల్చుకున్నారు. ఆనందపడ్డారు. శ్రీ సంజీవయ్య గారి ఘన సన్మానం నిరాటంకంగా, బ్రహ్మాండంగా ఘనంగా జరిగింది. అదంతా స్వామివారి మహిమ వలన గదా.

స్వామి వారు శివరాత్రి మరుసటి రోజు భక్తులకు 'సర్వదర్శనం' యిచ్చేవారుగదా. తపోమందిరం నుండి దర్శన మంటపం పైకి వెళ్లి ఆసీనులై భక్తులకు దర్శన భాగ్యం కలిగించేవారు. తపోమందిరం నుండి దర్శనమంటపంనకు మెట్లదారి వుంది. తెల్లవారు జామున నాల్గు గంటల ప్రాంతంలో (శివరాత్రి మరుసటి రోజు) పైకి పోవుట జరుగుతుండేది. ఈలివాడపల్లి వారి కుమారుడు ప్రేమ్‌ప్రసాదు గారు దారా సర్వేశ్వరరావు గారు ఇద్దరు స్వామివారు పైకి ఎట్లా మెట్లు మీదుగా వస్తారో చూడాలని మెట్లప్రక్కన కాపు వేసేవారుట. ఒక్కసారి పెద్దసుడిగాలి వచ్చినట్లు పెద్ద శబ్దంతో గాలి వచ్చిన అనుభూతి కలిగేది వారిద్దరికి. స్వామివారు క్రింద తపోమందిరంలో వుండేవారు కాదు. పైన దర్శన మంటపంపై శేషపాన్పుపై ఆశీనులై వుండేవారు. అంటే "నరమానవుడి" కంటికి కనిపించకుండా స్వామివారు "సుడిగాలి" రూపంలో మెట్లమీదుగా క్రింద నుండి పైకి వెళ్ళారన్నమాట. ఇలానే కమిటీ అధ్యక్షులు జానకిరామయ్యగారు, పోలయ్యరెడ్డి గారు కూడా "పరీక్షించి" విఫలులయ్యారు. ఆ విషయం మరొక చోట చెప్పుకున్నాం.

స్వామివారు దర్శన మండపంపైకి రాగానే మూడు దిశలవున్న "షట్టర్స్" వాటి అంతట అవే పైకి లేచేవట. అలానే స్వామివారు దర్శన మంటపం నుండి తపోమందిరానికి తిరిగి వెళ్ళే సమయంలో గూడా షట్టర్సు వాటి అంతట అవి క్రిందికి పడేపోయేవట.

శ్రీ పి.ఎల్. సుబ్రహ్మణ్యం శ్రీ స్వామివారిపై ఆంగ్ల రచన

ఆశ్రమ కమిటీ కార్యదర్శియు, శ్రీ స్వామి వారి ధ్యానమందిర పథక నిర్మాత (ప్లాను) యైన శ్రీ పి.ఎల్. సుబ్రహ్మణ్యం గారు శ్రీ పెదబాలయోగి వారి జీవితమును సంగ్రహముగ ఆంగ్లభాషయందు రాసారు. దానిని ముద్రించి ప్రకటించుటకు ముందుగా, స్వామివారికి దానిని స్వయముగ వినిపించి, వారి అనుగ్రహ పూర్వక అనుమతి పొందవలయునని ఆయన అనుకొన్నాడు. శ్రీ స్వామివారికీ విషయం విన్నవించుకొనగా, "సరే అలానే వినుపించు" మన్నట్లు శ్రీ స్వామి వారు తలవూపి సౌజ్ఞ చేసినారు. సుబ్రహ్మణ్యం గారు ఆంగ్లంలో తాను రాసిన శ్రీ స్వామివారి సంగ్రహ జీవిత చరిత్రనంతయు శ్రీ స్వామివారికి వినిపించారు. శ్రీ స్వామి వారు దానినంతయు ఆసక్తిగా ఆసాంతం విని, అది 'బాగుగా' వున్నట్లును, దానిని ముద్రించి ప్రకటించుటకును సుబ్రహ్మణ్యంగారికి దయతో అనుమతించారు. లోకసంబంధమైన యేభాషా పరిజ్ఞానం లేని శ్రీ స్వామివారు తమ తపో మహిమ వలన 'అక్షర పరబ్రహ్మ' తత్త్వజ్ఞానియై-సర్వజ్ఞులైనట్లు పాఠకులు గ్రహింపవలయును.

శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి గారి అనుభవం

లండన్‌లో ఉద్యోగం చేసి ఇండియా తిరిగి వచ్చిన తర్వాత మూర్తిగారు కుటుంబ సభ్యులతో ఆనాడు రాష్ట్రమంత్రిగా వున్న శ్రీమతి కృష్ణవేణీ సంజీవయ్య గార్లతో 1974-75 సం॥లో ముమ్మిడివరం వెళ్ళి 'క్యూ' లో నిలబడి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అదే మూర్తిగారు స్వామివారిని ప్రథమంగా దర్శించుకోవడం, తర్వాత సంవత్సరం జస్టిస్ పున్నయ్య గారితో వచ్చినపుడు కమిటీవారు వీరిద్దరికీ "తపోమందిరం"లో కమిటి వారితో సంభాషించే సమయంలో (తెల్లవారు జామున) స్వామివారి దర్శనం చేసుకొనే అదృష్టం కలిగింది. ఇలా ప్రతి సంవత్సరం ముమ్మిడివరం వెళ్ళి స్వామివారిని దర్శనం చేసుకొనేవారు.

1980లో రాష్ట్ర పంచాయితీ రాజ్ (ముఖ్య) కార్యదర్శి అయిన తర్వాత మూర్తిగారు ముమ్మిడివరంలో బాలయోగి ఆశ్రమ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు.

ఆశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం వారు, ఏ అధికారీ, ఏ నాయకుడు పట్టించుకోలేదు. పంచాయితీరాజ్ సెక్రటరీ అయిన తరువాత వూళ్ళో నుండి ఆశ్రమానికి కాల్వ ప్రక్కా రోడ్డు, ఆశ్రమం నుండి స్వామి వారి జన్మస్థలం వరకు రోడ్డు, అమలాపురం, ముమ్మిడివరం వరకు రోడ్డు విస్తరణ చెరువు దగ్గర రెండు గెస్టుహౌసులు (విశ్రాంతి గృహాలు) నిర్మించుటకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. శివరాత్రికి స్వామివారి దర్శనానికి వచ్చే లక్షలాది భక్తులు ముమ్మిడివరం గ్రామస్థుల సౌకర్యం కోసం నీటి కుళాయిలు, మరుగుదొడ్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు భారీయెత్తున చేయించారు మూర్తిగారు.

1982లోను మూర్తిగారు తన అర్ధాంగి అనసూయాదేవితో ముమ్మిడివరం వెళ్ళి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. పంచాయితీ రాజ్ సెక్రటరీ ముమ్మిడివరం గ్రామం రోడ్లు మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయించాడు. శివరాత్రికి స్వామి దర్శనార్థం వచ్చే లక్షలాది భక్తులకు "సకల" సౌకర్యాలు చేయించారు మూర్తిగారు.

1982 శివరాత్రి నాడు (శివరాత్రి మరుసటి తెల్లవారు జామున) సర్వదర్శనంనకు ముందు కమిటీ వారితో మాట్లాడుతూ మూర్తిగారి కోసం స్వామి వారు కబురు పెట్టించారు. స్వామివారి తపోమందిరం (గది)లో ప్రవేశించే మూర్తిని స్వామివారు కళ్ళు తెరచి చూస్తూ మహానందం మొఖంలో తాండవిస్తూ వుండగా చిరునవ్వుతో మౌనంగా పలకరించారు. చాలాకాలం ఎడబాటుతో దూరదేశాల నుండి వచ్చిన తన బిడ్డను చూడగానే తల్లి పరమానంద భరితులైనట్లు స్వామివారు మూర్తిగారినలా కన్నెత్తి చూసాడు. మొదటిసారి శ్రీరామకృష్ణ పరమహంస నరేంద్రుని (స్వామి వివేకానందుని చూచినపుడు గూడా యిటువంటి ఆనందానుభూతిని పొందాడు.

మూర్తిగారు తపోమందిరం గదిలో ప్రవేశించేసరికి స్వామివారి నేత్రాలు 'సూర్యచంద్ర' దివ్యతేజస్సుతో మిరుమిట్లు కొలుపుతూ దేదీప్యమానంగా కనిపించాయి. మూర్తిగారిని చూస్తూనే 'యెంతకాలానికి వచ్చావయ్యా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఇన్నాళ్ళకు వచ్చావు, సంతోషం' అని సైగలతో అనడం జరిగింది. శ్రీ బాలయోగివారితో మూర్తిగారికి పూర్వజన్మలో వున్న ఆత్మీయానుబంధమేమిటో మరి. శ్రీ రామకృష్ణ పరమహంస కూడా వివేకానందుని మొదటిసారి చూచినపుడు యిలానే అన్నారు. అటువంటి దివ్యకాంతిని మూర్తిగారు అంతకు పూర్వం చూచియుండలేదట. పైగా గదిలో ప్రవేశించిన మూర్తిగారికి ఆ గదినిండా ఏదో అమోఘమైన సుమధుర సుగంధ సౌరభాలు గుబాళించాయి. అటువంటి 'సువాసనలు' 'పరిమళాలు' మూర్తిగారు అంతకు పూర్వం "ఆఘ్రాణించి" (వాసన చూచుట) యుండలేదట. చిరునవ్వుతో దివ్యతేజస్సుతో-సుగంధభరిత సువాసనల గుబాళింపులతో స్వామి వారి దర్శనం చేసుకొన్న మూర్తిగారు ఎంతో పరవశించిపోయారు. ఆ ఆనందాను భూతి మాటల్లో చెప్పలేకపోయారు. స్వామివారు తనవంక కనులు తెరచి చూచిన విషయం మూర్తిగారు తపోమందిరం ప్రవేశించినంతనే వచ్చిన ఆ అమోఘమైన "సువాసన" గురించి అపుడచట నున్న ఆశ్రమ కమిటి సభ్యుల్ని కొందరిని మూర్తిగారు అడిగారు. తమకెలాంటి 'సువాసనలు' రాలేదని చెప్పారు. అయితే మూర్తిగారు తపోమందిరం ప్రవేశించగానే స్వామివారి ముఖంలో ఎప్పుడూ-ఎన్నడూలేని "ఆనందం" సంతోషం మాత్రం ద్యోతకమైనదని వారన్నారు. అలా స్వామి వారు అంత సంతోషంగా, ఆనందంగా యిదివరకెన్నడూ తామెవరమున్నూ చూచి యెరుగమని కమిటీ సభ్యులు మూర్తిగారితో అన్నారు. మూర్తిగారు తాను అదృష్టవంతుడనని మహానందా భరితుడయ్యాడు.

స్వామివారి దర్శనం చేసుకొని, స్వామివారు తెల్లవారు జామున 4 గం॥ల ప్రాంతంలో భక్తకోటికి శివరాత్రి దర్శనం యివ్వడానికి దర్శన మండపం పైకి వచ్చాక, మూర్తిగారు 6 గం॥ల సమయంలో తామున్న గెస్టు హౌసుకు వచ్చాడు. ఆ రాత్రంతా నిద్ర లేదు. భోజనం చేయలేదు. ఎంతో అలసినట్లుండాలి. కాని మూర్తిగారి ముఖం తాజాగా తేజుగా కనిపిస్తుందే మిటని ఆయన సతీమణి అనసూయాదేవిగారడిగారు. మూర్తిగారు జరిగిన సంగతి వివరిం చాడు. మూర్తిగారు 'అదృష్టవంతుడ'ని తమకా "భాగ్యం" రాలేదని ఆమె కాస్త బాధపడింది. ఆ రోజు అక్కడనే వున్న జస్టిస్ పున్నయ్య గారికి మూర్తిగారీ విషయం గురించి చెబితే, మీరు అదృష్టవంతులు. స్వామివారి ఆశీస్సులు మీకు లభించాయి. మీరు ధన్యులు అని మూర్తిగారిని మెచ్చుకున్నారు జస్టిస్ పున్నయ్యగారు. మూర్తి గారికి మరలా తర్వాత స్వామి వారు అటువంటి "సువాసన" రావడం తర్వాత మరెప్పుడు మూర్తిగారు "అనుభూతి" పొందలేదు.

స్వామివారు కమిటీ సభ్యులతో యిదివరలో అప్పుడప్పుడు ఆశ్రమాభివృద్ధి విషయం ప్రస్తావన వచ్చినప్పుడు, రాష్ట్ర రాజధాని పట్టణం నుండి గొప్ప కిరీటధారి (అధికారమున్న వాడు) అయిన ఒకాయన వచ్చి తన ఆశ్రమం అభివృద్ధి పరుస్తాడని సైగలతో చెబుతూవుండేవాడట. కమిటీ వారికి ఆ కిరీటధారి ఎవరా అని ఆలోచన వచ్చేదట. అయినా బోధపడేదికాదట. చివరకు ఐ.ఏ.ఎస్. అధికారి, రాష్ట్ర పంచాయితీ రాజ్ సెక్రటరీ వున్న శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి గారు ఉద్యోగరీత్యా లండన్‌లో వుండి ఇండియాకు వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉద్యోగం చేస్తూ ముమ్మిడివరం బాలయోగి వారి దర్శనం చేసుకోవడం. అప్పటి నుండి స్వామివారి మీద మూర్తిగారికి భక్తి కలగడం, ఆ భక్తి దిన దిన ప్రవర్ధమానవడం, మూర్తి గారే ఆశ్రమ అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం, స్వామివారి దయకుపాత్రుడై దివ్యదర్శన మొసగడం జరిగి పోయాయి. అప్పుడు గాని కమిటీ సభ్యులు కిరీటధారి శ్రీ మూర్తి గారన్న విషయం తెలిసిరాలేదు. పంచాయితీరాజ్ సెక్రటరీగా మూర్తిగారు ఆశ్రమాభివృద్ధి పనులు తనంతట తానుగా చేపట్టిన విషయం తెలుసుకొన్న స్వామివారు, కమిటీ వారిని మూర్తిగారు కమిటీ మెంబరు కావాలన్న ఆకాంక్ష వెలిబుచ్చారు. ప్రభుత్వం వారి పర్మిషన్ తీసుకొని, మూర్తిగారు ఆశ్రమ కమిటీలో, స్వామివారి కోరిక ప్రకారం సభ్యుడైనాడు. మూర్తిగారు ఆశ్రమ కమిటీ మెంబరు అయిన తరువాత కమిటీ అధ్యక్ష, సెక్రటరీ లెవరున్నా ఆశ్రమ విషయాలన్నీ మూర్తిగారే పర్యవేక్షించేవారు. కమిటీ సభ్యులేకాదు ఇతరులు గూడా ఆశ్రమ విషయాలు మూర్తిగారితోనే సంప్రదించేవారు. మూర్తిగారు స్వామివారిపైనున్న భక్తి ప్రపత్తుల చేత ఆశ్రమ విషయాలు శ్రద్ధగా స్వయంగా చూసేవారు.

స్వామివారి ఆదేశానుసారం ఆయన జన్మించిన స్థలం (హరిజనవాడ)లో ఒక చిన్న "జన్మ మందిరం" (గుడి) నిర్మాణం చేయటానికి మూర్తిగారు వారి సతీమణి శ్రీమతి అనసూయాదేవి "శంకుస్థాపన" చేసారు. చిన్న జన్మమందిరమొకటి (గుడి) నిర్మించడం జరిగింది. స్వామివారి ఆజన్మ మందిరం (గుడి) లోనే కీ॥శే॥ అనసూయామూర్తి చిన్న విగ్రహమొకటి నెలకొల్పారు.

న్యాయమూర్తుల అనుభవం

1982 (1983) లోనే ఆనాటి మన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. పున్నయ్య గారు, అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరదరాజన్ గారు అప్పటి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. రామస్వామి గారు (దరిమిలా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు) శివరాత్రికి ముమ్మిడివరం శ్రీ పెదబాలయోగివారి దర్శనార్థం "కారు"లో వస్తుండగా అమలాపురం దాటి ముమ్మిడివరం గ్రామ శివార్లలో "ట్రాఫిక్ జామ్" అయింది. లక్షలాది భక్తుల రాకతో వందలు వేలు వాహనాలు (కార్లు బస్సులు) రాకతో రాకపోకల రద్దీ ఎక్కువై సదరు

న్యాయమూర్తుల "కారు" ట్రాఫిక్‌లో చిక్కుకొని పోయింది. శివరాత్రికి సర్వధర్మ దర్శనం భక్తకోటికి యిచ్చేముందు, శ్రీ స్వామివారు కమిటీ సభ్యులకు, జిల్లా కలెక్టరు, పోలీసు ఉన్నతాధికారులకు, తదితర రాష్ట్రస్థాయి, దేశ (కేంద్ర) స్థాయి "అగ్రశ్రేణి" నాయకులకు, ముఖ్యాధికారులకు, ప్రముఖ వ్యక్తులకు, తాము నిత్యం తపస్సు చేసుకొనే "తపోమందిరం"లో "కొంచెం సేపు" దర్శనం యివ్వడం పరిపాటి కాని ఆ రోజు యీ ముగ్గురు సమయానికి రాలేక పోయారు. తపోమందిరంలో కమిటి సభ్యులు తదితర వి.ఐ.పి.లు (ప్రముఖ వ్యక్తులు) దర్శనం చేసుకొంటున్నారు. అప్పుడు శ్రీ స్వామివారు కమిటీ సభ్యులతో యీ న్యాయమూర్తులు దారిలో వాహనాల రాకపోకల రద్దీవల్ల వారి కారు మార్గమధ్యమున "చిక్కుకున్న" విషయం గుర్తుచేసారు. వెంటనే యీ విషయం పోలీసు అధికారులకు "మెస్సేజి" పోవడం, పోలీసు బలగం రంగప్రవేశం చేసి "ట్రాఫిక్" ను క్రమబద్ధం చేయడం, యీ ముగ్గురు న్యాయమూర్తుల కారు "కొద్ది ఆలస్యంగా" నైనా ఆశ్రమానికి చేరుకోవడం. న్యాయమూర్తులు శ్రీ స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకోవడం క్షణాల మీద జరిగింది. అదంతా ఒక సినిమా సీనులాగా, ఒక దైవలీలగా "క్షణాల' ' మీద జరిగి పోవడం, శ్రీ స్వామివారి 'కరుణాకటాక్ష' వల్లనే. ఈ సందర్భంలో జస్టిస్ రామస్వామిగారి విషయం ఒకటి చెప్పుకోవాలి. అప్పుడాయన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి. రామస్వామిగారు కూడా శ్రీ బాలయోగి వారి 'గోత్రీకుడే'. అంటే 'కటికదల' గోత్రమన్నమాట. కటికదల గోత్రీకులు దేశంలో గొప్ప పేరు, ప్రతిష్టలు, ఉన్నత పదవులు పొందుతారని శ్రీ స్వామివారు శ్రీ రామస్వామిగార్కి దర్శనమిచ్చినప్పుడన్నారు. రామస్వామి గారు సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు గదా.

ఈ రచయిత స్వీయానుభవం

1971/72 సం॥ మహాశివరాత్రికి నేను (యీ రచయిత) 1971-72 దర్శనం చేసుకోవడం జరిగింది. అదే శ్రీ బాలయోగివారిని నేను ప్రథమంగా దర్శించుకోవడం. అప్పుడు నేను ఉద్యోగరీత్యా, పాలకొల్లు, అమలాపురం ప్రాంత అధికారిగా పనిచేసాను. ఆ రోజు సాయంత్రం 4 గం॥ ప్రాంతం శ్రీ బాలయోగివారు తపోదీక్షలో దర్శనమండపంపైని ఆశీనులై ప్రజలకు దర్శన భాగ్యం కలుగజేస్తున్నారు. భక్తులు 'క్యూ'లో నిలబడి శ్రీ స్వామివారిని దర్శనం చేసుకొం టున్నారు. అధికారినగుట చేతనో, మరి అదృష్టం వల్లనో, శ్రీ స్వామివారు ఆశీనులైన 'శేషపీఠం' సమీపంలో దర్శన మండపంపై కూర్చొనే సదవకాశం దొరికింది. ఎవరో ఒక స్త్రీ (బహుశా శ్రీ స్వామివారి కుటుంబీకురాలని నేననుకొన్నాను). మరొక బైరాగి (సన్యాసి) ఒక పోలీసు ఆఫీసరు దర్శన మండపంపై నున్నారు. శ్రీ స్వామివారికి కేవలం ఒక గజం, గజమున్నర దూరంలో నేను కూర్చొన్నాను. కొంచెం సేపు ధ్యానం చేసుకొన్నాను. తర్వాత శ్రీ స్వామివారిపై దృష్టి సారించి

వారి వంకే చూస్తున్నాను. అప్పుడప్పుడు కనులు మూసుకొని వున్న వారి కనులపై రెప్పలు మాత్రం కొంచెం కొంచెం కదలుతున్నట్లు అనిపించింది. అలాగే అర్థ పద్మాసనం స్థితిలో కూర్చొన్న వారి కుడి కాలి బొటనవ్రేలు అప్పుడప్పుడు కొంచెం కదలుతున్నట్లు నాకు కనిపించింది. శ్రీ బాలయోగివారి "దివ్యపాదాలను" తాకి వందనం (పాదాభివందనం) చేయాలనిపించింది. అయితే 27-3-49 న శ్రీ సత్యరాజును మరియిద్దరు భక్తులతో "తమ నిత్యదర్శనం"నకు సంబంధించిన ఆదేశములలో "ఎటువంటి భక్తులు వచ్చినను నన్ను ముట్టుకొనరాదు" అని ఖరాఖండిగా ఆదేశంచియున్నారు గదా! మరి స్వామి వారి పాదాలను తాకితే ఏమవుతుంది. ఆయన నన్ను శపిస్తాడా! లేదా అట్టి మహాయోగివారి ఆజ్ఞ (ఆదేశం) ధిక్కరించి వారిని "ముట్టు' కొంటే చచ్చిపోతానా! ఒక వేళ అలా చచ్చిపోతే అంతటి దివ్యపురుషుని 'తాకి' నందువల్ల నాకు పుణ్యగతులే సంప్రాప్తమవుతాయి గదా! అని నాలో యిటువంటి ఆలోచనలే! దర్శన మండపంపై కూర్చున్న గంటకుపైబడ్డ సమయంలో అదే ఆరాటం! పోనీ నాకిటువంటి 'దురాలోచనలు' వస్తున్నందుకు, స్వామివారి సమీపంలోనే కూర్చున్న నాకేసి 'కన్నెత్తి' చూస్తారేమో అని స్వామివారి వంకకేసి చూస్తూ కూర్చున్నాను. కాని స్వామివారు కన్నెత్తి చూడనేలేదు. స్వామివారును తమను 'ముట్టుకోవద్ద'న్నారు కనుకనే, స్వామివారు కన్నెత్తి చూడడం లేదు కనుకను, పోనీ ఒక చిన్న రాయి ముక్కను స్వామివారికి తగిలేటట్లు వేస్తే, అప్పుడైనా 'కన్నెత్తి' నా వంకచూస్తారేమో, చూసి నన్ను శపిస్తారేమో, లేక స్వామి వారు నాకేసి 'కోపం'తో చూస్తే నేను చచ్చిపోతానేమో; యిటువంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు వచ్చాయి. స్వామివారి పాదాలు తాకాలని తాపత్రయం! పోనీ ఓ చిన్న రాయి ముక్క అయినా వారిపై విసిరివేయాలన్న పిచ్చి ఆలోచనా, స్వామివారి సన్నిధిలో కూర్చున్నంత సేపు నాకివే ఆలోచనలు! స్వామి వారి పాదాలు తాకాలన ప్రయత్నం గాని, లేదా స్వామివారిపై చిన్నరాయి ముక్క విసిరివేయాలన్న ప్రయత్నం గాని 'ఎంత బలవత్తరం' మనసులో పనిచేసినా, అందుకు బలవంతంగా ప్రయత్నించినా ఏమి చేయలేకపోయాను. మరో ప్రక్క ఏదో చెప్పలేని భయం! చివరకు నాలో రేగిన 'పిచ్చి' చెడ్డ ఆలోచనలకు సిగ్గు పడ్డాను. లెంపలేసుకున్నాను. స్వామివారిని నన్ను క్షమించవలసిందిగా మనసులో వేడుకొని దర్శన మండపం నుండి దిగివెళ్ళి పోయాను. అసలు స్వామివారికి చాలా సమీపంలో సన్నిధిలో కూర్చొని కూడా ప్రాణాలు పోయినా పుణ్యలోకానికి పోతాను కనుక మరియెందుకు వారిని తాకలేకపోయాను అని తర్వాత ఎంతో ఆలోచించాను. చివరకు నేను గ్రహించింది ఏమంటే, స్వామివారి 'తపోశక్తి' యే నన్ను వారిదరికి చేరనీయలేదని, అందువల్లనే వారిని 'తాక'లేక పోయానని తెలుసుకున్నాను. ఏదో కొంత పూర్వ జన్మ సుకృతం చేసుకొని వుండడం వలన, కనీసం స్వామివారి సన్నిధిలో అతి సమీపంలో కూర్చునే భాగ్యం, అదృష్టం నాకు అబ్బింది అని గ్రహించి తెలుసుకొని నాలో నేను ఆనందించాను. సంతృప్తి చెందాను. అటువంటి 'అదృష్టం' కలుగజేసిన స్వామివారికి నాలో నేను కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

శ్రీ బాలయోగి వారి 'దివ్యదృష్టి

యోగసాధనలో విజయం సాధించిన వారికి 'అణిమాది' అష్టసిద్ధులు లభిస్తాయని పతంజలి యోగశాస్త్రం ఘంటాపథంగా నొక్కి వివరిస్తోంది. అందు దివ్య దృష్టి యొకటి. శ్రీ బాలయోగి వారికీ దివ్యదృష్టి సంపూర్ణంగా సంతరించినదనుటకు ఎన్నో సంఘటనలు, ఉదాహరణలున్నాయి. తమ తపస్సును శంకిస్తూ తమపై "తప్పుడు" ప్రచారం చేస్తూ కొందరు 'కరపత్రాలు' ప్రచురించినప్పుడు శివరాత్రికి తమ దర్శనార్థం వచ్చిన లక్షలాది భక్తులలో అప్పుడప్పుడు 'త్రొక్కిసలాటలు' జరిగిన కొందరికి గాయాలు తగిలినప్పుడు లేదా యేవైనా ప్రమాదాలకు గురి అయినప్పుడు హైకోర్టు న్యాయమూర్తులైన జస్టిస్. పున్నయ్య, జస్టిస్ రామస్వామి సుప్రీంకోర్టు జడ్జి వరదరాజన్ గారలు 'ట్రాఫిక్ జామ్' అయి అమలాపురం, ముమ్మిడివరం మధ్య ఆగిపోయినప్పుడు, శ్రీ స్వామివారు 'సర్వదర్శనం' ముందుగా తమ తపోమందిరంలో కమిటీ సభ్యులకు దర్శన మొసగెడి సమయంలో వారికీ సంఘటనల గురించి స్వామివారు హెచ్చరించెడివారు. అట్టి దురదృష్ట సంఘటనలు జరిగినప్పుడు, కమిటీ వారు తీసుకొనవలసిన తరుణోపాయాల గురించి తక్షణ చర్యల గురించి స్వామివారు సభ్యులకు సూచించెడివారు.

అదే విధంగా 1972లో జరిగిన బంగ్లాదేశ్ (తూర్పు పాకిస్తాన్) యుద్ధం గురించి, శ్రీ బాలయోగివారు. ఈశాన్య దిశను చూపిస్తూ 'అగ్నివర్షం' కురియుననియు, అలానే 1970లో అదే ప్రాంతంలో (చిట్టగాంగ్) పనె తుఫాను (ఉప్పెన)లో వేలాది మంది మరణింతురనియు సూచించియున్నారు.

తాను తపస్సు మాని ఆధ్యాత్మిక ప్రచారం చేయవలసిన పనిలేదని "నేనిక్కడ నుండియే అన్నియు చక్కబెట్టగలనని' స్వామివారు కమిటీ సభ్యులతో సౌజ్ఞలతో చెప్పినట్లు శ్రీ బోరపోలయరెడ్డి ద్వారా తెలియుచున్నది.

మనమిక్కడొక ముఖ్య విషయం గమనించాలి. శ్రీ పెదబాల యోగివారు 1946 నుండి 1985 వరకు ఘోర తపస్సు చేసియున్నారు గదా! ఈ కాలంలో ఆంధ్రతీరంలో ప్రత్యేకించి కోనసీమ ప్రాంతంలో 'ఘోరవిపత్తు' లేమియును సంభవించలేదు. 1953లో భారీవర్షాల వలన, గోదావరి నదికి అధికంగా వరదలు వచ్చిన, కోనసీమకు కొంత నష్టం జరిగింది కాని మొత్తం మీద 'పెను. విపత్తు' తప్పింది. అలానే 1977లో ఉప్పెన వచ్చి కృష్ణా జిల్లా 'దివసీమ' సర్వం తుడిచి పెట్టుకొని పోయింది కాని శ్రీ శ్రీ బాలయోగీ వారి మహిమవలన కోనసీమ ప్రాంతంలో నష్టమేమియు జరగలేదు. (తూర్పు దిశగా వెళుతున్న పెనుతుఫాను వెనుతిరిగి ఉప్పెనగా మారి దివసీమను కబళించిన విషయం గమనించదగింది) పోతే 1996 డిశంబరులో (అపూర్వ యోగిసోదరు లిద్దరు కైవల్య సిద్ధి పొందిన తర్వాత) భారీ వర్షాలు కురిసి-గోదావరికి

మునుపెన్నడూ లేనంతగా విపరీతమైన వరదలు వచ్చి, కోనసీమలో ఎంతో ప్రాణ నష్టం, పంటల నష్టం జరిగింది.

కమిటీ సభ్యులు ఒకరిద్దరితో నా పూర్వ జన్మమిత్రులు దేశ విదేశాలందు గలరు. వారు నన్ను దర్శించవత్తురని చెప్పినారట. గత జన్మలో తమకు తమ కన్నతల్లిదండ్రులకున్న 'అనుబంధం' గురించి స్వామివారు స్వయంగా చెప్పారు. స్వామివారు ప్రథమంగా మాట్లాడిన సర్వశ్రీ వ్యాసం సత్యరాజు గారు, గరిమెళ్ళ కృష్ణమూర్తిగారు, గాదెం అప్పారావు గారును పూర్వజన్మలో స్వామివారికి మిత్రులై యుందురు. అలానే ఆశ్రమ కమిటీ సభ్యులు, ఆశ్రమ భవన సముదాయ నిర్మాణం-ఆశ్రమ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలందించి, స్వామివారికి సన్నిహిత భక్తులైన, సర్వశ్రీ బచ్చుమాధవయ్య, ముత్యాల జానకిరామన్న, ధారా సర్వేశ్వరరావు, డి. బాలసుందరం, వి. బాలసుందరం, ఎ. నటరాజన్, ఈవివాడపల్లి, సూరిశెట్టి వెంకటస్వామి నాయుడు గారు, ఇంజనీరు పి.ఎల్. సుబ్రహ్మణ్యం, బోరపోలయ్యారెడ్డి, కె.ఎస్.ఆర్. మూర్తి గారు, శ్రీ బాలయోగిగారి జీవితం గురించి రచనలు చేసిన సర్వశ్రీ జయంతి స్వామి నాయన, శ్రీ బాలయోగి వారిని 'శ్రీకృష్ణుని' గా దర్శనం చేసుకొన్న నాస్తికుడు డా॥ కోట్నీసు వంకల అప్పారావు, పద్మశ్రీ బోయి భీమన్న, బులుసు బుచ్చిబాబు, ఆకుల వినాయకుడు ప్రభృతులు గత జన్మలో శ్రీ బాలయోగివారు 'మిత్రులై' యుందురని నా విశ్వాసం. బర్మాలోని రంగూన్‌లో బాలయోగి భక్త సమాజం నెలకొల్పబడింది. బాల్యమందు శ్రీ దొమ్మేటి బాపన్న (వారి భార్య సీతమ్మ) శ్రీ దొమ్మేటి వెర్రియ్య (సత్తెయ్య) (వారి భార్య రామలక్ష్మమ్మ-వెర్రిమ్మ) శ్రీ మట్టపర్తి వెంకన్న (వారి భార్య గౌరమ్మ) దగ్గర శ్రీ బాలయోగివారు 'గోపాల వృత్తి (చినపాలేరుతనం) చేసియున్నారు గదా! శ్రీ స్వామివారికిని, వీరికిని పూర్వజన్మ మందు గల 'ఋణానుబంధమేమిటో గదా! అట్లే ప్రతిసంవత్సరం శివరాత్రి మరుసటి రోజు శ్రీ బాలయోగివారు భక్తులకు 'సర్వదర్శనమిచ్చెడి వారు కనుక జిల్లాలోనే కాదు, రాష్ట్రమంతట నుండియు, యిరుగుపొరుగు రాష్ట్రముల నుండి ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రముల నుండియే కాక విదేశముల నుండి శ్రీ బాలయోగి వారిని భక్తిభావంతో దర్శించుటకు వచ్చేవారు. విద్యాగంధం లేనివాడు. బాల్యం నుండియే 'అన్నపానీయాలు' మాని కేవలం 'వాయుభక్షణ' తో సంవత్సరాలు తరబడి ఘోర తపస్సు చేయుట 'వింత'గా తోచి కొందరు, ప్రకృతి విరుద్ధమైన రీతిలో తపస్సు చేయుట 'విజ్ఞాన శాస్త్ర' రీత్యా ఎట్లు సాధ్యమన్న సందేహంతో మరి కొందరు విదేశీయులు శ్రీ స్వామి వారి భక్తితో దర్శించుటకు లేక 'వింత' ను కనులారా చూచుటకు వచ్చెడివారు. దురదృష్టవశాత్తు అలా వచ్చిన 'వేలాది' మంది దేశవిదేశీయ 'ప్రముఖుల' పేర్లు, వారి అభిప్రాయాలు ఆశ్రమ కమిటీ వారు సేకరించక పోవడం విచారకరం.

సిక్కిం భక్తులు

సిక్కిం ఎక్కడ, ముమ్మిడివరం ఎక్కడ. శివరాత్రికి ముమ్మిడివరం వెళ్ళి ఘోరతపస్సు చేయుచున్న శ్రీ బాలయోగి వారి దర్శనం చేసుకొనవలసిందిగా యిద్దరు సిక్కిం వాసులకు ఎవరో 'అజ్ఞాత' వ్యక్తి తెలిపాడు. సిక్కిం రాష్ట్రం తప్ప దేశంలో యితర ప్రాంతాలకు వెళ్ళని వారిద్దరికి 'ముమ్మిడివరం' ఎక్కడని ఆలోచించుకొనుచూ నిద్రించిరి. ముమ్మిడివరంనకు రెండు రైలు టిక్కెట్లు, ముమ్మిడివరం ఎక్కడగలదో, 'దారి' యెటులో తెల్పెడి ఒక 'ప్లాను' వారి తలగడ దిండు క్రింద వుంచడమైనది. నిద్ర నుండి లేచి అవి చూచి సంభ్రమాశ్చర్యాలు చెంది ముమ్మిడివరం వెళ్ళి శ్రీ బాలయోగివారిని శివరాత్రికి దర్శనం చేసుకొన్నారు. వారి పేర్లు తదితర వివరాలు తెలియక పోయినా, వారీ విషయం ముమ్మిడివరంలో కొందరు తెలియజేశారు. ఎవరో జర్మన్ లేడియో మరెవరో స్వామివారిపై ఒక పుస్తకం రాసి, హైదరాబాదులో రవీంద్ర భారతిలో కార్యక్రమమొకటి నిర్వహించియున్నారు. షిరిడీ ఎక్కడో తెలియనివారికి యీ విధంగానే షిరిడీ వెళ్లి సాయిబాబా వారి దర్శనం చేసుకొన్న సంఘటనలున్నాయి.

శ్రీ బాలయోగివారు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి అవతారమా! శ్రీ పెదబాలయోగి వారు భక్తులకు 'బాల శివావతారుని'గా బాలమురళీ కృష్ణుని'గా దర్శనమిచ్చారు. కొందరు శ్రీ పెదబాలయోగివారిని 'పోతులూరి' వీరేంద్రస్వామి వారి అవతారం'గా భావిస్తారు. శ్రీ బ్రహ్మంగారు, తన కాలజ్ఞానంలో 'నేను కడజాతి మాలవాని యింట విశ్వనాథుడనై జన్మింతునని' చెప్పినట్లు కొందరంటారు. కలియుగాంతానికి 'వీరభోగవసంతరాయలు'గా అవతరిస్తానని బ్రహ్మం 'కాలజ్ఞానం'లో చెప్పినట్లు అందరికీ తెలిసిన విషయమే. ఏది ఏమైనా శ్రీ బాలయోగి వారు కందిమల్లాయపాలెంలో నున్న 'బ్రహ్మంగారి మఠం' సమీపమందున్న చిన్న కొండపై గుట్టపై కొందరికి దర్శనమిచ్చినట్లు చెబుతారు. శ్రీ బాలయోగివారి తపోమందిరంలో వారి చెంత భగవద్గీతతోపాటు బ్రహ్మంగారి 'కాలజ్ఞానం' గ్రంథం గూడా వుండడం గమనార్హం. శ్రీ బాలయోగి వారి సన్నిహిత భక్తులలో ఒకరు, ఆశ్రమ కమిటీ మెంబరు, ప్రస్తుతం కమిటీ అధ్యక్షులు అయిన శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తితో (ఐ.ఏ.ఎస్. రిటైర్డు, మాజీ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మాజీపార్లమెంటు సభ్యులు) శ్రీ స్వామివారు కైవల్యసిద్ధి పొందక పూర్వం, ఒకసారి, ఆయన్ని 'బ్రహ్మంగారి మఠంనకు వెళ్ళి బ్రహ్మంగారి సమాధి దర్శించి రావలసిందిగా చెప్పారు. ఇకపోతే స్వామివారి భక్తులలో ఒకరు ఆశ్రమ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలందిన శ్రీ బోరపోలయ్యరెడ్డి ఒకసారి 'స్వామి'. నాకొకసారి కాశీకి వెళ్ళి విశ్వనాథుని (శివుడు) దర్శించిరావలెనని కోరిక యున్నద'ని చెప్పగా అందుకు స్వామి వారు 'అక్కడకు వెళ్ళడమెందుకు. ఇక్కడ (ఆశ్రమం) ఆ విశ్వనాథుడు లేడా''యని తమను విశ్వనాథుని పరోక్షంగా రెడ్డిగారికి సూచించారట. భక్తులకు శ్రీ పెదబాలయోగివారు 'శివావతారుని' గా

(జటా జూట ధ్యాననిమగ్నమైన శంకరుడు) గా దర్శనమిచ్చిన సత్యం జగద్విధితం! కనుక బ్రహ్మంగారు తాను కడజాతి మాలవాని యింట విశ్వనాథునిగా జన్మింతునని' చెప్పి యున్నారనుటలో సందేహించవలసిన పనిలేదు. ఆశ్రమంలో ప్రతి సంవత్సరం జరిగే ముఖ్య కార్యక్రమాలలో (పండుగలు-వేడుకలు) శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం గూడా ఒకటిగా వుండడం పాఠకులు గ్రహించగలరు.

గంటి వెంకటరమణ అనే అతిసామాన్యుడు (లారీడ్రైవర్) ఏనాడూ ఏ గుడికీ పోయి యెరుగడు. ఏ దేవుడికి మ్రొక్కి ఎరుగడు. అంటే నాస్తికుడన్న మాట. అట్టి వెంకటరమణకు శ్రీ పెదబాలయోగి వారే 'దేవుడు'. రోజూ స్వామి వారిని మనస్సులో తలచుకొనే 'లారి' ఎక్కుతాడు. అతని భార్య అకాల మరణంపాలైతే, ఆమె 'చావుకు' 'వెంకటరమణే కారణమని' కేసు పెట్టారు ఆమె తాలూకా వారు. స్వామివారిని నమ్ముకొని '41 రోజులు' మౌనవ్రతమాచరించాడు. కలలో స్వామివారు కనిపించి 'ఏమీ భయం లేదు. వెళ్ళిపో' అన్నారు. చివరకు 'కోర్టుకేసు'లో వెంకటరమణ 'నిర్దోషి' అని తేలింది. 'పాండురంగరాజు' అనే భక్తుడు 'స్వామివారిని' ధ్యానించుకొంటే బాధలన్నీ తొలగి పోతాయి. ఈ విధంగా వేలాది, లక్షలాది మంది శ్రీ బాలయోగి వారిని యీనాడున్నూ దేవుడిగా విశ్వసించుచు నిత్యం పూజిస్తూ సకల 'శుభాలు' పొందు తున్నారు.

శ్రీ పెదబాలయోగి వారికి 'సన్నిహిత (పరమ) భక్తులు, ఆశ్రమ తపోమందిరాల నిర్మాణానికి ఎంతో ఆర్థిక సహాయ సహకారాలందించి, ఆశ్రమాభివృద్ధికి ఎంతో కృషి చేసిన సర్వశ్రీ బచ్చు మాధవయ్య, జానకిరామన్న, ప్రభృతులు స్వానుభవంలో అనుభూతి పొందిన శ్రీ పెదబాలయోగి వారి మహిమల గురించి, ఆశ్రమ ఆస్థాన శ్రీ జయంతి స్వామి నాయన గారు గాని, శ్రీ వంకా అప్పారావు గారు గాని, 'రికార్డు' చేయలేదు. కీ॥శే॥ బోరపోలయరెడ్డి గారి అనుభవములు కొన్ని మాత్రం వ్రాసినారు. కారణం తెలియదు. వారీనాడు జీవించిలేరు. ఆశ్రమ భవన సముదాయ నిర్మాణానికి ఎంతో కృషి చేసి, శ్రీ బాలయోగీశ్వరుల వారికి పరమభక్తుడైన శ్రేష్టి శ్రీ ధారా సర్వేశ్వరరావుగారు జీవించి యున్నారు. శ్రీ స్వామి నాయనిగారు గాని, శ్రీ అప్పారావు గారు గాని, 'శ్రీధారా' వారి అనుభవాన్ని ప్రత్యేకించి పేర్కొనలేదు. ఈ రచయిత (నేను) శ్రీ ద్వారా వారికి వారి 'అనుభవాల' గురించి వ్రాసి పంపమని జాబు వ్రాయగా, 'శ్రీయోగీశ్వరులు నన్ను దగ్గర కూర్చుండబెట్టుకొని వారి గత జన్మ నుండి యీ జన్మ వరకు వివరంగా మౌనభాషలో తెల్పినారు'' అని మాత్రం చెబుతూ, శ్రీ యోగీశ్వరుల వారిని 1954 నుండి దర్శించుకొనుచున్నను 1963 నుండి స్వామివారి ఆజ్ఞ ప్రకారం ఆశ్రమ కమిటీ సభ్యుల సహకారంతో ఆశ్రమ భవన నిర్మాణం పనులు తాను 'వినయ విధేయతలతో' నిర్వహించి నానని‌యు 'శ్రీ వారి అనుగ్రహం'పాటు ఆశ్రమ భవన నిర్మాణ పనులు చేసే 'భాగ్యం' సదవకాశం గురించి రాసారు గాని యోగీశ్వరుల వారి 'మహిమలు' పై తన అనుభవాలు రాయలేదు.

తుదిజన్ముడైన తపోబ్రహ్మ

నా జన్మపరం పరలలో ప్రస్తుత జన్మము చిట్టచివరిది. నేను కడపటి మెట్టులో తపస్సు చేయుచున్నాను. అచిరకాలములోనే తపోసిద్ధియగునని శ్రీ స్వామివారు చెప్పిన సత్యమును బట్టి వారు పూర్వ జన్మములో గూడ తపస్సు చేసినారని ఇ ే కారణం వల్లనో అట్టి తపస్సు భంగమై - పూర్తి కాకపోవుట వలన యీ "చిట్టచివరి" జన్మములో "కడపటిమెట్టులో తపస్సు చేసారనియు మనకు స్పష్టంగా తెలియుచున్నది.

శ్లో॥ పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోపినః
జిజ్ఞాను రపి యోగస్య శబ్దబ్రహ్మాతి వర్తతే॥

- యోగ భ్రష్టుడు పూర్వజన్మలోని అభ్యాసబలం మూలంగా తాను తలపెట్టకపోయినా మళ్ళీ యోగసాధనవైపుకు లాగబడతాడు. అట్టి యోగ సాధకుడు వేద కర్మలు ఆచరించే వాడిని మించి పోతాడు.

శ్లో॥ బహూనాంజన్మ నామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసు దేవస్సర్వమితి సమహాత్మా సుదుర్లభది॥

- అనేక జన్మలందు సముపార్జించిన మహాజ్ఞాన సంపత్తిచే (తపోశక్తి-యోగబలం) అంతిమజన్ముడగు యోగి వాసుదేవుడే (నేనే) పరమగతియని ఎఱింగి నన్నే ఆశ్రయించి నన్నే పొందుచున్నాడు. అట్టి వాడు మహాత్ముడు (యోగిశ్రేష్టుడు)

మహాత్ముడు లభించుట దుర్లభమ్ కాదు మహాదుర్లభము అని గీతాచార్యుడు సెలవిచ్చాడు."నాజన్మపరంపరలలో ప్రస్తుత జన్మము చిట్టచివరిది. నేను కడపటి మెట్టులో తపస్సు చేయుచున్నాన"ని శ్రీ బాలయోగివారు చెప్పినది గీతాప్రమాణం అనుసరించియే యున్నది.

"దుర్లభోమకు ష్యోదేహేహః ప్రాణినాం క్షణభంగురం" - క్షణ భంగురమైన ప్రాణుల్లో మానవజన్మ లభించడం దుర్లభం అలానే గీతా ప్రమాణంగా పైనపేర్కొన్న 7-19 శ్లోకాల్లో వివరించినట్లు అనేక జన్మల యోగ సాధనచే పరమేశ్వరుని పొందడం గూడా మహాదుర్లభమని మనం తెలుసుకోవాలి.

అట్టి దుర్లభమైన ప్రాణికోటిలో మహోన్నతమైన జన్మలలో చేసిన యోగబలంతో - యీ (నర) జన్మలో మరలా కఠోర పరంగా తపస్సు చేసి వాసుదేవుని (పరమేశ్వరుని) చేరుట - పరమాత్మలో ఐక్యమగుటకు శ్రీ స్వామి వారు "ఘోరతపస్సు" చేసినట్లు వారి మాటలను బట్టి తెలియుచున్నది."



బాలయోగి ఆశ్రమ కమిటీ హాలులో పెట్టబడిన స్వామివారి వివిధ ఫొటోలు



టి.టి.డి. వారిచ్చిన రు.25 లక్షలతో నిర్మించబడిన వసతి గృహాలు



శ్రీ పెయ్యల పల్లయ్యగారు శ్రీబాలయోగీశ్వరులవారి ఆశ్రమమునకు 28సం॥లు సేవ చేసిన కష్టజీవి. మల్లాయిపాలెం

శ్రీ వి. బాలసుందరంగారు IAS ఆశ్రమ కమిటీ 4వ మాజీ ప్రెసిడెంటు

శ్రీ డి. బాలసుందరం పిళ్లేగారు IAS ఆశ్రమ కమిటీ 2వ మాజీ ప్రెసిడెంటు



బాలయోగీశ్వరుల తండ్రిగారైన గంగయ్యగారి పేరుపైన నిర్మించిన మెమోరియల్ హాల్

మందిరము ముందు
భాగమున ప్రతిష్ఠించబడిన
శ్రీకృష్ణ భగవానుని విగ్రహం



శ్రీశ్రీశ్రీ పెద్ద బాలయోగి వారు
కొబ్బరి చెట్టు క్రింద తపస్సును
ప్రారంభించుట



పెద్ద బాలయోగి వారి జనన మందిరము



జననమందు త్రిమూర్తులచే దీవించబడుతున్న భగవాన్ శ్రీశ్రీశ్రీ పెద్ద బాలయోగి వారు



జనన మందిరమందు తల్లిదండ్రులతో భగవాన్ శ్రీశ్రీశ్రీ పెద్ద బాలయోగివారు

పెద్ద బాలయోగి వారి మాతృమూర్తి శ్రీమతి రామమ్మ గారు .
పెద్ద బాలయోగీశ్వరుల వారి తండ్రి శ్రీ గంగయ్య గారు
చిన్న బాలయోగీశ్వరుల వారి మాతృమూర్తి శ్రీమతి వెంకమ్మగారు



శివరాత్రినాడు దర్శనం కొరకు వచ్చిన భక్త జనసందోహం



పండుగనాడు జరిపిన పంక్తి భోజన దృశ్యం



శ్రీ స్వామి వారితో కె.ఎస్.ఆర్. మూర్తిగారు ఐ.ఏ.ఎస్.
కమిటీ ప్రెసిడెంట్

వి. నటరాజన్ ఐ.ఏ.ఎస్.
మాజీ కమిటీ ప్రెసిడెంట్

బాలయోగీశ్వరుల వారి
ఆదేశానుసారం
జననమందిరం కొరకు
శంకుస్థాపన చేయుచున్న
శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి, ఐ.ఏ.ఎస్.
ఆయన సతీమణి
శ్రీమతి అనసూయమూర్తి గారలు

ప్రస్తుతజన్మలో గంగయ్యగారి పుత్రుడిగా తన "పూర్వజన్మసుకృతము ఫలించి" సుబ్బారావు పేరుతో పెరిగి ఆకస్మికముగ తపస్సు ప్రారంభించి - బ్రహ్మచారిగా - లోకబంధవిముక్తుడై - సర్వేంద్రియములను నిగ్రహించి - మనస్సును నిలకడచేసుకొని - ఏకాగ్రచిత్తముతో - కర్మసన్యాసంతో - ఆత్మసంయమనంతో - అంతర్ముఖుడై - పరమేశ్వరునిపై మనస్సు-చిత్తము - హృదయం లగ్నంచేసి ఆహారనియమములను విసర్జించి కేవలం వాయుభక్షణముతో - మౌనవ్రతంతో - 39 సం॥లు దీర్ఘ కఠోర తపస్సుచేసారు.

తపస్సు ద్వారానే జన్మరాహిత్యమొనర్చుకొని శాశ్వత బ్రహ్మైక్యంచెందిన వారు మన పురాణాలలో కొల్లలు. ప్రహ్లాదుడు - జడభరతుడు, శ్రీశుకుడు, ఉద్ధాలకుడు, కర్కటికుడు, దాశూరుడు - పరిఘాదుడు మొదలగు యోగులు తపస్సు వలననే నిర్వికల్ప సమాధి స్థితినొందిరి. జీవన్ముక్తులైరి. బ్రహ్మవిద్వర్యులైరి. అలానే ధ్రువుడు - కపిలమహాముని, దధీచిమహాముని, పుండరీక మహాముని, యాజ్ఞవల్క్యుడు -అటువంటివారే.

ధ్రువుడు అతిపిన్నవయస్సులోనే కేవలం ఐదు సంవత్సరాల వయస్సు నందే తపస్సునకు కూర్చుండెను. అయితే ధ్రువుడు మంత్రసిద్ధుడు - నారదమంత్రోపదేశంతో తపస్సు చేసాడు. కేవలం మూడు మాసములకే జలాన్నములు మాని వాయు భక్షణంతో తపస్సు చేసి శ్రీమన్నారాయణుని సాక్షాత్కరింపజేసుకున్నాడు. ధ్రువుడు లక్ష్యసిద్ధుడు పినతల్లి అవమానమును భరింపలేక తనకు గూడా తండ్రి దగ్గర పిన తల్లి కుమారుని కున్నంత హక్కున్నదని తేల్చుకొనుటకు తపస్సు చేసెను. కార్యసిద్ధుడాయెను. తర్వాత రాజ్యమేలెను. చివరకు బ్రహ్మవిద్వర్యుడై బ్రహ్మైక్యంచెందెను. ఘోరతపస్సుచేసిన జడభారతుడు రాజర్షి - రాజ్యపాలకుడై తర్వాత తపోయోగసాధన చేసిబ్రహ్మర్షియై - ఘోరతపమాచరించి తుదకు బ్రహ్మైక్యంపొందెను. విశ్వామిత్రుడు గూడా వందలు వేలాది సంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మర్షి అయ్యెను. కాని విషయలోలుడగుట చేత తపోభంగం కలుగుతూవచ్చింది. ఈతడును రాజర్షి ఘోరతపస్సు చేసి బ్రహ్మర్షియై చివరకు పరబ్రహ్మైక్యం చెందెను. ప్రహ్లాదుడు ఐదువేలసంవత్సరాలు తపస్సు చేసెను. అతనికి పిన్నవయస్సునందే సృష్టి అంతటా ప్రతివస్తువు నారాయణమయంగా గోచరించింది. విష్ణుద్వేషియగు తండ్రికి బాలుడైన ప్రహ్లాదుడు అందుకే మహావిష్ణువు "ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండ" ని ధైర్యంగా చెప్పాడు. అయితే ప్రహ్లాదుడు రాజ్యపాలన చేసిన వాడు. చివరలో ఘోరతపస్సుచేసి పరబ్రహ్మైక్యంచెందినాడు. రాక్షసరాజులైన రావణాదులు ఘోరతపస్సు చేసి "హరిహరాదు' లమెప్పించి వరాలు పొందినట్లు మన పురాణ ఇతిహాసాలద్వారా తెలియచున్నది.

శ్రీశుకుడు - కపిలుడు జైగీషవ్యులు మహాయోగులు వీరు ఘోరతపస్సు చేసినవారు విషయ వాంఛా నిగ్రహులు శాశ్వత బ్రహ్మ పదమునందిన వారు. మన శ్రీ బాలయోగీశ్వరుల వారును అట్టి వారే!.

మనమిపుడు చెప్పుకొన్న వారంతా కలియుగం వారు కాదు కృత - ద్వాపర -త్రేతాయుగం వారు. వీరంతా పురాణ పురుషులు హేతువాద దృష్టితో చూస్తే పైన చెప్పినవారి విషయాలు కొన్నింటిని నమ్మవచ్చును. కొన్ని నమ్మజాలమనిపించును. కృతయుగం తపస్సునకు పెట్టింది పేరు. మన శ్రీ బాలయోగీశ్వరుల వారు కలియుగం వారు. మిగిలిన మూడు యుగాలలో ధర్మం నాల్గు పాదాల మీద నడిచింది. ధర్మయుగాలవి. పుణ్యయుగాలవి. కాని కలియుగంలో అధర్మం - పాపం పెచ్చరిల్లుతోంది. ఈయుగంలో భక్తికి ప్రాధాన్యత యివ్వబడింది. అట్టి అధర్మ - పాప కలియుగంలో పుట్టాడు ఈ బాలయోగీశ్వరుల వారు. పైగా నిరుపేద-పంచమ కులంలో పుట్టాడు. చదువు సంధ్యలు లేవు అయినా పూర్వజన్మ సుకృతం వలన ఘోరతపస్సు చేసాడు.

ఈ కలియుగంలో - చారిత్రిక ఆధారాలను బట్టి బుద్ధభగవానుడు రాజవంశంలో పుట్టి భార్యాబిడ్డలు కలిగి విరక్తుడై ఘోరతపస్సు చేసాడు. జ్ఞానోదయం అయిన తర్వాత భిక్షాటనచేస్తూ జ్ఞానభోద చేసాడు. చివరకు మహాపరి నిర్యాణం చెందాడు. మరి క్రీస్తు ప్రవక్త దైవకుమారునిగా - అవతారపురుషుడిగా పాపవిమోచనార్థమై యీలోకంనకు వచ్చి - కొంత కాలం ధ్యాన (తపస్సు) నిమగ్నుడైనట్లు చెబుతారు. ఆదిశంకరాచార్యులు వారు ఆజన్మ బ్రహ్మచర్యమూని - జ్ఞానయోగమేతరుణోపాయమంటూ ''జగన్మిథ్య బ్రహ్మసత్యమని'' అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించి దేశమంతా తిరిగి ప్రచారం చేసాడు. శ్రీరామానుజాచార్యుల వారు విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వీరు కొంతకాలమే ధ్యానం చేసారు. రామకృష్ణ పరమహంస మహాదివ్యజ్ఞాని. బాల్యమందే విషయవాంఛా విరక్తుడైనాడు. భార్యలోనే తనయిష్టదైవమగు దేవీ సాక్షాత్కారం పొంది తన అర్ధాంగినే పూజించాడు. రామకృష్ణపరమహంసయు కొంత కాలం మాత్రమే ధ్యానంలో వుండేవారు. అలానే రమణ మహర్షియు సర్వసంగ పరిత్యాగి. ధ్యానంలో వున్నప్పుడు - తపస్సులో వున్నప్పుడు శరీరంపై పాములు పాకినను తెలియని సమాధి స్థితిలో వుండేవాడు.

బుద్ధ భగవానుడు, చైతన్య మహాప్రభు, ఆదిశంకరాచార్యులు, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, స్వామి శివానంద - యోగి వేమన - కబీరు - ప్రకృతి అవధూతలు, మహాధ్యాన యోగులు, కొంత కాలం మాత్రమే 'నిశ్చలధ్యానసమాధి' లో వుండేవారు. వీరంతా సగుణ సాకార దైవారాధకులు, బుద్ధుడు తప్ప జ్ఞానయోగులు, నిష్కామకర్మయోగులు. హిమాలయ

పర్వత గుహలలో రోజులు తరబడి లేదా నెలలు ధ్యానం చేసియోగిపుంగవులున్నారని చూసిన వారు చెబుతారు. వీరంతా ఏదో ఆహారం స్వీకరించినవారే మరి మన స్వామివారు వీరందరికంటే భిన్నమైన తపోయోగమార్గం అవలంబించారు. మన స్వామివారి లక్ష్యం - తపస్సు ద్వారా - జీవన్ముక్తి జీవబ్రహ్మైక్యం - కైవల్యసిద్ధి - హిరణ్యలోక ప్రాప్తి! జన్మ(పునర్జన్మ) రాహిత్యం ఘోర తపస్సు కృత యుగమందున మాత్రమే మునులు, ఋషులు ఆచరించే వారుట. ఈ మునులు, ఋషులు గూడా భార్యా బిడ్డల సంసారలంపటులు, ఏకొద్ది మంది తప్ప కలియుగం నామ స్మరణ, సంకీర్తన ముక్తి మార్గాలని పెద్దలు చెపుతారు. మన బాలయోగివారు నామస్మరణ దైవ సంకీర్తనాది ముక్తి మార్గాలు అవలంభించక, కృతయుగ మోక్ష ధర్మ మార్గమైన 'తపస్సు' నే మోక్షమార్గంగా అవలంభించడం అపూర్వం ఈ తపోయోగంలోను జనావాసాల మధ్య "స్వచ్ఛంద గృహం (తపోమందిరం) లో ఘోర తపస్సు చేయడం మరీ విచిత్రం, విశేషం - విలక్షణం:

తపోయోగం ద్వారా జీవరాహిత్యం చెంది జీవన్ముక్తి కైవల్యసిద్ధి సాధించి ఆమూలం, "పరబ్రహ్మం"లో ఐక్యమవడ లీనమవడం మన స్వామి వారి ప్రత్యేక విశిష్టత: నిర్గుణ - నిరాకార సచ్చిదానందమయ మూల పరమాత్మ - ప్రకృతి (శక్తి) పురుషులుగా సాకార గుణాత్మకంగా యీ అనంత విశ్వాన్ని పాలిస్తున్నారుగదా. ఈ సాకార పురుషుడు మరలా - లోకం మనుగడకై-బ్రహ్మ విష్ణు శివులుగా - సృష్టి స్థితి (పోషణ) లయ కారకులుగా - త్రిగుణాత్మకంగా శ్రమ విభజన జరిగి - అండపిండ బ్రహ్మాండాన్ని సృష్టిస్తూ - పోషిస్తూ - లయం చేస్తున్నాడు త్రిగుణాత్మక త్రిమూర్తి సాకారరూపంలో కనుక యీ త్రిమూర్తులు ప్రాణకోటికి మానవకోటికి ఆరాధ్యదైవా లయ్యారు. అలానే బుద్ధభగవానుడు, ఆదిశంకరుడు, రామకృష్ణ పరమహంస భృతులు జన్మతః లోకమోహ విరాగులై పరబ్రహ్మ సత్యాన్వేషకులై తమతమ ధార్మిక మార్గాలలో నడచి జీవన్ముక్తులయ్యారు. సృష్టి స్థితి లయకారకులుగా చెప్పబడుతున్న పురాణ అవతార పురుషులైన బ్రహ్మ - విష్ణు - మహేశ్వరులు (త్రిమూర్తులు) కంటెను శ్రీ బాలయోగి వారు "గొప్ప" వారని శ్రీ జయంతిస్వామి నాయనగారున్నూ, కాశీ పండితబ్రహ్మశ్రీ ఆకొండి వ్యాసమూర్తి గారున్నూ విస్పష్టంగా విశదీకరించియున్నారు.

సృష్టి స్థితి లయ కారక సచ్చిదానందమయ మూల 'పరబ్రహ్మం'లో ఐక్యమైన శ్రీ బాలయోగి వారిని మానవకోటి తమ సంస్కారాన్ని బట్టి, తమ భక్తి ప్రపత్తులను బట్టి, తమ కులదైవారాధన సంప్రదాయాన్ని బట్టి, శ్రీ కృష్ణుని గానో, మహాశివునిగానో, లేదా దేవీ మూర్తిగానో (అంబ) మహావిష్ణువుగానో, లేదా లక్ష్మీ నారాయణ స్వామిగానో సంభవించి "దైవం"గా విశ్వసించి ఆరాధించడంలో తప్పులేదు. కొందరు శ్రీ బాలయోగి వారిని మాత్రమే "దైవంగా (యిష్టదైవం,

యిలవేల్పు) నమ్మి పూజించడంలోను తప్పులేదు. కారణం మన శ్రీ స్వామివారు తమ దీర్ఘ తపోబలంచేత జన్మరాహిత్యమొనరించుకొని హిరణ్యలోక ప్రాప్తి బొంది శాశ్వతంగా అమూల "పరమాత్మ"లో ఐక్యమయ్యారు (బ్రహ్మైక్య) కనుక.

బ్రహ్మశ్రీ ఆకొండి వ్యాసమూర్తి సిద్ధాంతిగారు మన స్వామివారిని "సచ్చిదానంద స్వరూపుడు'గా 'తపోబ్రహ్మ'గా అభిభాషించాడు. శ్రీ వంకల అప్పారావు గారు శ్రీ స్వామి వారిని "వసుదైకదివ్య చైతన్య మూర్తి"గా శివావతారునిగా అభివర్ణించాడు. శ్రీ స్వామి వారి 'పూర్ణచరిత్ర' విచిత్ర చరిత్ర పేర పలు గ్రంథాలు రాసిన బహుగ్రంథకర్త. తత్త్వవేత్త అయిన శ్రీ జయంతిస్వామి నాయనగారు శ్రీ స్వామివారిని "బ్రహ్మవిద్వరీయుడు"గా సగుణ బ్రహ్మైక్యసిద్ధునిగా' 'జీవబ్రహ్మైక సిద్ధుని"గా, "విదేహుడు"గా శ్రీకృష్ణావతారునిగా శ్రీ లక్ష్మీనారాయణావతారునిగా అభివర్ణించాడు.

"బాలయోగి కారణజన్ముడు, అతడు పుట్టుకతోనే యోగి మహాయోగి! ఈ కాలానికే ఒక భగవత్ ప్రతీక ఒక శివసాక్షాత్కృతి' అని పద్మశ్రీ బోయి భీమన్నగారు అభిభాషించాడు" ఈయన ప్రారంభమందు ఒక మహాయోగి, ఆ తరువాత తపో సాధకుడు. తదనంతరం ఒక ముని తదుపరాంతం ఒక ఋషి. తదుపరి ఒక యోగి తత్పశ్చాత్ ఒక మహాయోగి. ఆ మీదట ఒక కేవల పురుషదర్శి అనగా కైవల్య స్థితిని బొందిన వాడు" అని శ్రీ వంకల అప్పారావు వివరించాడు. ది. 27-2-1949 తేదీ రాత్రి శ్రీ వ్యాసం సత్యరాజు మరి యిద్దరితో "తత్త్వోప దేశములు" బోధించుతూ, "తపస్సు వలన ఏది కావలసివస్తే అదే వచ్చునని"యు "సర్వము ఒక చోట కనబడాలి అంటే తపస్సు వలననే వచ్చున"నియు, "భగవంతుడు కనిపించే వరకు ఎవ్వరైన తపస్సు చేయవలెను" అనియు "తపస్సు" యొక్క గొప్పతనం గూర్చి "ప్రాశస్త్యం" ప్రాముఖ్యత గురించి శ్రీ బాలయోగీశ్వరుల వారు నొక్కి చెప్పియున్నారు గదా! తాము చెప్పినట్లు ఘోర తపస్సు" చేసారు శ్రీ బాలయోగి. అక్షర జ్ఞానం లేనివాడు, నిరుపేద కడజాతిలో పుట్టినవాడు, 'లోకజ్ఞానం' అంతగాలేనివాడు, ధ్యానమంటే, తపస్సు అంటే ఏమిటో, పద్మాసనం వేయడం ఎరుగనివాడు, ఏ 'గురూపదేశం', ఏ యోగి ద్వారా 'యోగ మంత్రోపదేశం' లేనివాడు, పది పదారేళ్ళ వయస్సులో, చంచలమైన మనస్సును, సర్వేంద్రియాలను నిగ్రహించి, చిత్తైకాగ్రతతో, అన్నపానీయాలు లేక కేవలం 'వాయుభక్షణం' తో కలియుగంలో అపూర్వం. కలియుగంలో బుద్ధభగవానుడు కొన్ని సంవత్సరాలు మాత్రం తపస్సు చేశాడు. రమణ మహర్షిగాని, పోతులూరి వీరబ్రహ్మంగాని, రామకృష్ణ పరమహంస గాని, షిర్డీ సాయిబాబాగాని, మరే యితర 'అవదూత' లు గాని కొన్ని రోజులు, కొన్ని నెలలు మాత్రమే 'ధ్యాన' నిమగ్నులైనారు. శ్రీ పెదబాలయోగివారు 39 సం॥లు "ఘోరతపస్సు" చేయడం విశేషం. అపూర్వం. శ్రీ వంకల అప్పారావు గారు శ్రీ పెదబాలయోగివారిని 'వసుదైక దివ్యచైతన్య మూర్తి' గా అభవర్ణించారు. శ్రీ జయంతి స్వామి నాయన గారు శ్రీ పెదబాల యోగీశ్వరుల వారిని 'ఆకారమౌని'గా "కాష్టమౌని"గా అభిభాషించారు.

మాట్లాడని కొయ్య, (చెక్క) బొమ్మలా 'నిర్జీవ ప్రతిమ'లా దీర్ఘకాలంపాటు తపస్సు చేసినారు శ్రీ పెదబాలయోగివారు. పురాణాల 'మునుల' సంగతి అలా వుంచితే. కలియుగంలో యిన్ని సంవత్సరాలు తపస్సు చేసినవారు మరొకరు లేరు. వారితోపాటు వారి తమ్ముడు చినబాలయోగివారు తప్ప. కనుకనే శ్రీ పెదబాలయోగివారిని "కలియుగ లోకైక తపో బ్రహ్మ' ' అని నిశ్చయంగా చెప్పవచ్చును.

శ్రీ పెదబాలయోగి వారి గురించి మూడు, నాల్గు గొప్ప రచనలు చేసిన శ్రీ వంకల అప్పారావు 'శ్రీ బాలయోగి వారి గురించి కలియుగమందు కృతయుగ మానవుడు" అనే చిన్న పుస్తకాన్ని గూడా రచించాడు. కృతయుగమందు జీవించిన మానవునికి (1) రసోల్లాసం (2) తృప్తి (3) ఉత్తమ ధర్మం (4) తపస్సు (5) పవిత్రత (6) దానము (7) తుల్యాయువు (పూర్ణా యుష్కులు గా జీవించుట) యీ గుణాలు లేక ధర్మాలు ప్రధానంగా వుండేవని శ్రీ వంకల అప్పారావు వివరించాడు. మరి యీ కవి కాలంలో స్వార్థం, భోగ విలాసాలకు తృప్తి లేకపోవుట (దురాశ), అధర్మంగా ప్రవర్తించుట వ్యక్తిలో త్రిగుణ శుద్ధిగా' 'అపవిత్రత' నెలకొనుట, భక్తి వున్నా అది స్వార్థచింతనతో గూడినదగుట, దానం చేసిన త్యాగబుద్ధితో కాక కీర్తికండూతితో చేయుట విజ్ఞులైన వారందరెరిగిన సత్యమే. కృతయుగం సత్త్వగుణ ప్రధానమైనది. ఆ యుగంలో ధర్మం నాల్గు పాదాలుపై నడించిందంటారు. ఆ యుగంలో 'తపస్సు' (ధ్యానం)నకు అత్యధిక ప్రాధాన్యత నివ్వబడింది. కృతయుగం నాల్గు యుగాలలో 'ప్రథమ' యుగం ఇక కలియుగం నాల్గవ యుగం (చిట్ట చివరిది). కలియుగాంతం సమీపిస్తుందని అంటారు. కలియుగం ముగియగానే మరలా 'కృతయుగం' వస్తుందని భారతీయుల విశ్వాసం. కలియుగంలో ధర్మం 'ఒక పాదం' మీదనే నడుస్తుంది. అధర్మం మూడు పాదాలపై స్వారీ చేస్తుందని. కలియుగం 'తామస' గుణ ప్రధానమైనది. స్వార్థం, భోగలాలస, దౌర్జన్యం, పరపీడనం, అవినీతి, పెచ్చరిల్లి వుంటాయి.

శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు, వారి సహోదరులైన శ్రీ చినబాలయోగీశ్వరుల వారు ' యీ కలియుగం'లో నిరుపేద నిమ్నజాతి వారింట 'సాత్విక' స్వభావం గల్గిన మానవజన్మనెత్తి, భార్యా బిడ్డల 'సంసారలంపటం'లో పడకుండానే, మాయామేయ లోక సుఖ దుఃఖాలంటే ఏమిటో అంతగా తెలియని ఆ పిన్నవయస్సు నందే 'తపస్సు'నకుపక్రమించి సుమారు నాల్గు దశాబ్దాలు సుదీర్ఘకాలం పాటు ఘోర (కఠోర) తపస్సు చేసి కైవల్యసిద్ధి పొందారు. అంటే కృతయుగంలో పుట్టవలసిన శ్రీ సహోదర యోగీశ్వరులు యీ కలియుగంలో జన్మించి, ఘోర తపస్సు చేసారు. శ్రీ పెదబాలయోగి వారిని "కలియుగ మందలి కృతయుగ మహాయోగీశ్వరుల' ని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చును. ఇరువురు యోగిసోదరులను "కలియుగ మందలి కృతయుగ మహాయోగ సహోదరులని" పేర్కొన వచ్చును.

ధర్మం ఒక పాదం పైననే నడుస్తున్న కలియుగంలో, దానం, నామజపమే ముక్తికి సోపాన మార్గాలైన, యీ కలికాలంలో శ్రీ పెదబాల యోగివారు (వారి సవతి సోదరుడు చిన బాలయోగివారున్నూ) నిరుపేద నిమ్నజాతి వారింట 'సాత్త్విక' స్వభావం గల్గిన మానవజన్మనెత్తి, భార్యాబిడ్డల 'సంసారలంపటం' లో పడని బాల్యమందే, లోక భోగభాగ్య మోహానుబంధులై ముఖ్యవైరాగ్య భావంతో, మాయామేయ లోకసుఖదుఃఖాలంటే ఏమిటో అంతగా తెలియని పిన్న వయస్సులో ఘోర తపస్సునకుపక్రమించి, సుమారు నాల్గు దశాబ్దాలు సుదీర్ఘ కాలంపాటు కఠోర తపస్సు చేసి కైవల్యసిద్ధి పొందారు. శ్రీ బాలయోగివారి జీవిత లక్ష్యం, తపోదీక్ష కేవలం జన్మరాహిత్యమైన కైవల్యసిద్ధి కొరకు మాత్రమే. కలియుగంలో ధ్యానం చేసిన వారు చేసే తపోధనులైన సన్యాసులు, మహర్షులు స్వామిజీలు చాలామంది వున్నారు. కాని నాల్గు దశాబ్దాలు తపస్సు చేసినవారు లేరనుట నిస్సందేహం. తపస్సునకు అధిక ప్రాధాన్యత నిచ్చిన కృతయుగంలో కాక, కలియుగంలో జన్మించి, పైన వివరించినట్లు 'తపస్సు' యొక్క గొప్ప తనం, వెలలేని విలువ నెరిగినవాడై తపస్సు ద్వారానే జీవరాహిత్య బ్రహ్మైక్య సిద్ధి పొందిన కలికాలమందలి కృతయుగ మహాయోగీశ్వరులు' తపోబ్రహ్మ భగవాన్ శ్రీ పెదబాలయోగి వారు. పైగా 'తన జన్మపరంపరలలో ప్రస్తుత జన్మ చిట్టచివరిదని, తాను కడపటి మెట్టులో 'ఘోర తపస్సు చేయుచున్నానని త్వరలోనే తమ తపోసిద్ధి అవుతుందని శ్రీ బాలయోగివారు వివరించి యున్నారు. కనుక గత జన్మపరంపరలలో చేసిన తపస్సు, ప్రస్తుత జన్మలో కొనసాగించి, నాల్గు దశాబ్దాలు ఘోరతపస్సు చేసి, జన్మరాహిత్యం చేసుకొని తుదిజన్ముడై, జీవ బ్రహ్మైక్య సిద్ధి, కైవల్య ప్రాప్తి పొందిన వారు శ్రీ బాలయోగి వారు. శ్రీ జయంతి వారు 'నీసరివచ్చు సాత్వికముని ప్రవరుడెవడీయ! శాస్త్ర విశ్వాసముతోడ పల్కెదను సంస్తుతి కాదిది" యనియు "లీనినిన్ బోలెడివాని నెందుగనబోను, పురాణములందును నున్నచో వ్రేలును జూపి చూపుడని వేడుదుదెల్పుడు పండితోత్తములో" అని సాధికారికంగా వివరించాడు.

హరిహర భేద రహిత తత్త్వం

పంచమ కులంలో పుట్టిన బాలయోగీశ్వరుల వారు చిన్న నాట తమ హరిజనవాడలో అప్పుడప్పుడు పిన్నలు పెద్దలు చేసే "హరి" భజనలో పాల్గొనెడివాడు. తపస్సు ప్రారంభమునకు ముందు లంక తల్లెమ్మ తీర్థంలో శ్రీకృష్ణభగవానుడు, నారదమహర్షి యున్న చిత్రపటమును కొనుకొన్నాడు. తపస్సునకు కూర్చున్నప్పుడు సదరు శ్రీ కృష్ణ, నారద చిత్రపటాన్ని పూజించియే తపస్సు ప్రారంభించాడు. "కృష్ణ, నారాయణ" అంటూ ధ్యాననిమగ్నుడైనాడు. తపస్సు ప్రారంభించుటకు ముందు "రాముని పూజించుదామా కృష్ణుని పూజించుదామా లేక మరి యెవరినైనా పూజించుదామా అని ఆందోళన వుండేది" అని స్వామివారే వివరించాడు.

ది. 19-4-49న తపోమందిరములో పాలచెంబు చెంత "చీటీ"ని శ్రీకృష్ణుడు వ్రాసి యుంచె"నని స్వామివారే స్వయంగా సంజ్ఞలతో తెలిపారు. ది. 1-5-49 తపస్సులో వున్న బాలయోగి వారి కురులు "శివ జటా జూటము" వలె ముడివడి "బాల శివావతారుని"గా దర్శనం యిచ్చారు. ది. 12-11-49 మరియు 13-12-49న శంఖ చక్రదారియైన లక్ష్మీ నారాయణస్వామిని మనస్వామి వారు పూజించుట జయంతి స్వామి నాయనగారు మరికొందరు మందిరం తలుపుల సందులో నుండి చూసారు. ది. 16-2-50న నాస్తికుడైన కోట్నీసు (సినిమా డైరక్టరు) కెమెరాలో శ్రీ బాలయోగీశ్వరులు మురళీధరుడైన బాలకృష్ణునిగా దర్శనమిచ్చారు. స్వామివారు ప్రతి మహాశివరాత్రి రేయి శివలింగోద్భవ పుణ్యగడియలు (రాత్రి 12 గంllలు) నుండి మరుసటి రాత్రి 12 గం. వరకు భక్తకోటికి సర్వదర్శనమిచ్చేవారు. స్వామివారి జీవిత చరిత్ర రాసిన జయంతి స్వామి నాయనగారు బాలయోగి వారు "కృష్ణావతార"మని వర్ణించాడు. వంకల అప్పారావు గారు "శివావతారం"గా అభివర్ణించాడు. స్వామి వారు తామునేరుగా చెప్పవలసింది ఏమీ లేదని, అంతా శ్రీకృష్ణ పరమాత్మ గీతలోనే చెప్పారని గూడా వారు చెప్పారు. ది. 27-3-49న వ్యాసం సత్యరాజు ప్రభృతులతో తమ 'స్వీయచరిత్ర' ను వివరిస్తూ శ్రీ పెదబాలయోగివారు "కొన్ని రోజులు రాముని పూజించుదామా, కృష్ణుని పూజించుదామా లేక యింకెవరినైనా పూజించుదామా అని ఆందోళన యుండేది. ఒక రోజున శ్రీ కృష్ణ, నారద మహర్షులున్న బొమ్మను (చిత్రపటం) కొని, యింటికి తీసుకొచ్చి ది. 22-6-46 శనివారమున మా గ్రామ సమీపంలో దక్షిణముగా నున్న కొబ్బరి తోటలో నా సుకృతము ఫలించి తపస్సునకు కూర్చున్నాను" అని వివరించి యున్నారు గదా!

అదే విధముగా ది. 10-2-49న శ్రీయుతులు వ్యాసం సత్యరాజు గరిమెళ్ళ కృష్ణమూర్తిలతో "నేను కడపటి మెట్టులో తపస్సు చేయుచున్నాను. నా జన్మపరంపరలలో ప్రస్తుత జన్మము చిట్టచివరిది. చేయుచున్నది ఘోర తపస్సు. అచిరకాలములోనే తపోసిద్ధియగును" అని చెప్పియున్నారు గదా!

శ్లో॥ పూర్వాభ్యాసేన తేనై వహ్రియతేహ్యవశోపినః
జిజ్ఞాసు రపియోగస్యశబ్ద బ్రహ్మాతి వర్తతే (భగ-6-44)

శ్లో॥ బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసు స్సర్వమితి సమహాత్మానుదుర్లభః (భగ67-19)

యోగసాధకుడు (యోగభ్రష్టుడు) తన అనేక గత జన్మములందు సముపార్జించిన జ్ఞాన మహిమచే తన అంతిమ జన్మయందు, యిహపరములకు సర్వస్వమైన వాసుదేవుడేయని యెరిగి, నన్ను పొందుచున్నాడు అని గదా గీతా ప్రమాణం! అంటే జన్మరాహిత్యమైన బ్రహ్మైక్యసిద్ధి

కొరకు తుది జన్మడిగా శ్రీ బాలయోగి దీర్ఘకాలం, ఘోర తపస్సు చేసాడని మనం తెలుసు కోవలెను.

గీతా ప్రమాణం ప్రకారం, విష్ణురూపుడైన శ్రీ కృష్ణుని ఆరాధ్య (ఉపాస్య) దేవునిగా శ్రీ బాలయోగి సంభావించి, జన్మ రాహిత్యం కొరకు బ్రహ్మైక్యసిద్ధి కొరకు 'పూర్వజన్మ సువాసనల' సుకృతం ఫలించి 'శ్రీకృష్ణుడు, నారదుల' చిత్ర పటానికి మొదట పూజచేసి 'సాకార' సగుణో పాసనతో తపస్సునకు ఉపక్రమించినాడని స్పష్టమగుచున్నది. కమిటీ సభ్యులు లోకంనకు తమ సందేశం ఏమిటని అడిగితే "అంతా భగవద్గీతలోనే వుంది" అని అంటూ తాను ప్రత్యేకించి చెప్పవలసింది ఏమీ లేదని శ్రీ బాలయోగివారు చెప్పేవారట. తపో మందిరంలో తపస్సు చేసు కొనుచున్న స్థలంలో తమ చెంతనే శ్రీకృష్ణుని విగ్రహం, భగవద్గీతలు వుంచుకొన్నారు. తపో మందిరం లోపలను, భక్తుల అనుభవములో జరిగిన 'మహిమల' గూర్చి శ్రీ స్వామివారి దృష్టికి తెచ్చినప్పుడు, అవన్నియు శ్రీకృష్ణభగవానునికి సంబంధించినవి కాని తనకెట్టి సంబంధంలేదని, అనేక సార్లు కమిటీ సభ్యులతో శ్రీ బాలయోగి వారి విశదపరిచారు.

శ్రీ పెదబాలయోగి వారి తపోమందిరములో పెద్ద పెద్ద సర్పములు సంచరించినట్లు, వారి సమీపమందు, సంచరించినట్లున్నూ, రాత్రివేళ, సర్పముల 'బుసలు' వినిపించినట్లును, సర్పముల 'కుబుసములు' ఆశ్రమ ప్రాంగణమందు కనిపించినట్లు కొందరి భక్తుల అనుభవం. అందు స్వామి వారి భక్తుడు బోర పోలయ్యరెడ్డి గారొకడు. 27-3-49న వ్యాసం సత్యరాజు ప్రభృతులతో శ్రీ బాలయోగివారు (నిత్య దర్శనంనకు సంబంధించి యిచ్చిన ఆదేశములలో) "మందిరము లోపల ఏ జంతువు కనబడినను కొట్టవద్దు. ఎవరిని ఏమియు చేయవు. సామాన్య ముగా ప్రజలకు కనిపించవు. కనబడిన యెడల జాగ్రత్తగా వెళ్ళవలెను" అని చెప్పియున్నారు. శ్రీ పెదబాలయోగి వారి అసలు నామం (పూర్వాశ్రమంలో తల్లిదండ్రులు పెట్టిన పేరు) సుబ్బారావు. అంటే సుబ్రహ్మణ్యం. అంటే సర్పమని అర్థం. శ్రీ స్వామి కన్నతల్లి శ్రీమతి రామమ్మ గారికి కలలో ఆదిశేషుడు కనిపించినట్లు, నాగులచవితికి పుట్టలో పాలు పోయువేళ పుట్టలో నుండి ఆ శరీరవాణి (ఆదిశేషుడు) ఆమెతో తాను ఆ గర్భమున పుట్టబోవుచున్నట్లు జనశ్రుతి యొకటి యున్నది.

శ్రీ బాలయోగి వారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు 'సుబ్బారావు' గదా! సుబ్బారాయుడంటే సుబ్రహ్మణ్యం (తమిళ సంప్రదాయం) అంటే సర్పం! సర్పం, వాయు భక్షణతోనే జీవిస్తుంది. (దేవతా సర్పం). మన బాలయోగివారు దీర్ఘకాలంపాటు "వాయు భక్షణం" చేతనే జీవించి ఘోర తపస్సు చేసారు! ఆశ్రమంలో ప్రతి సంవత్సరం జరుపబడు ముఖ్యకార్యక్రమాలలో, శ్రీ సుబ్రహ్మణ్యషష్టి గూడా ఒకటి కావడం గమనార్హం. శేషపీఠం శేషపాన్పు శ్రీ బాలయోగీశ్వరుల వారి ఆదేశానుసారమే ఏర్పాటు చేయడం జరిగింది. మహాకవి పద్మశ్రీ బోయి భీమన్నగారు

తాను రాసిన 'బాలయోగి' నాటకంలో ధ్యాననిమగ్నుడైన శ్రీ సుబ్బారావునకు ఒక తెల్లని త్రాచు (దేవతా సర్పం) పడగవిప్పి ఆచ్ఛాదనంగా నీడపట్టినట్లు రాసాడు. కవి ఋషి, ద్రష్ట గదా! ఏమో ఎవరెరుగుదురు, ఎవరు చూసారు, శ్రీ సుబ్బారావు తపస్సు ప్రారంభించినప్పుడు కొబ్బరితోటలో దేవతా సర్పమేదైనా ఆయనకు పడగవిప్పి నీడపట్టిందేమో!

శ్రీ పెద బాలయోగివారి ఆదేశానుసారమే, దర్శన మండపంలో మహాశివరాత్రి మరునాడు స్వామివారు భక్తులకు దర్శన మిచ్చునప్పుడు తాము ఆసీనులగుటకు 'శేషపీఠం' యేర్పాటు చేయడం జరిగింది. అలానే వారి ఆదేశానుసారమే వారి తపో మందిరానికి తూర్పు, ఈశాన్య దిశలో నిర్మింపబడిన 'తపోమందిరం' (భజన మందిరం)లో శేషపాన్పు, స్వామివారి ధ్యాన మందిరం పైఅంతస్తులో మరియొక శేషపీఠంను యేర్పరచడం జరిగింది. శ్రీస్వామివారి తపోమందిర గోపురాగ్రమందును, శేషపీఠంపై శ్రీవారి విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీ పెదబాలయోగి వారు 'లక్ష్మీ నారాయణులను పూజించినట్లును, స్వామివారు 'శ్రీకృష్ణుని'గా భక్తులకు దర్శనమిచ్చినట్లు తెలిసికొన్నాం గదా! అదే విధంగా శ్రీ స్వామివారి దీర్ఘకేశములు శివుని జటాజూటముల వలె ముడివడి ఆ జటాజూటముల నుండి కొంచెం కొంచెంగా గంగ క్రిందికి కారినట్లు కనిపించి, బాల శివావతారునిగ భక్తులకు దర్శనమిచ్చిన సందర్భములున్నవి.

శ్రీ మహావిష్ణువు శేషసాయి. ఆదిశంకరుడు ఫణిభూషణుడు. శ్రీ బాలయోగి వారి మందిరంలో వారి దేహంపై సర్పములు సంచరించుట, వారి ఆదేశానుసారం తపోమందిరంలో, దర్శన మండపంలో, శేషపీఠం, శేషపాన్పులు యేర్పాటు చేయడం పరిశీలిస్తే, వారు 'శివకేశవ' స్వరూపులని స్పష్టంగా తెలుస్తుంది. "హరిహరభేద రహితు'నిగా మనం సంభావించవలసి యున్నది! "శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే" శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చా హృదయగ్ం శివః" అని గదా శాస్త్ర ప్రమాణం! నామరూప (సాకార) భేదాలుండవచ్చు. కాని సృష్టిస్థితి లయ కారణ భూతమైన" నిరాకార నిర్గుణ పరబ్రహ్మ" మొక్కటే గదా! అట్టి పరబ్రహ్మంలో ఐక్యం చెందడమే మోక్షం. కైవల్యసిద్ధి! శ్రీ బాలయోగీశ్వరుల వారు మొదట, కృష్ణ పటం పూజించి, కృష్ణనామం జపించినా, బాల శివావతారునిగా, బాలకృష్ణుడిగా దర్శనమిచ్చినా, అంతిమంగా ఆయన చేసిన సుదీర్ఘ కఠోర (ఘోర) తపస్సు యొక్క లక్ష్యం 'కైవల్యసిద్ధి' పొందడమే. జన్మరాహిత్యమైన బ్రహ్మైక్యం చెందడమే. హిరణ్యగర్భలోక ప్రాప్తి పొందడమే.

కృష్ణావతారం, శివావతారం 'సాకారసగుణ' స్వరూపాలు. వీరు అవతార పురుషులు. దేవుళ్ళు. కాని బాలయోగీశ్వరుల వారు, శైవ-వైష్ణవ "ద్వంద్వ" తీత పరబ్రహ్మంను ధ్యేయంగా పెట్టుకొని దీర్ఘ ఘోరతపస్సు చేసారు. ఆయనది "ద్వంద్వాతీత" పరబ్రహ్మతత్త్వం. అంటే ఏ

రూపంలో కొలిచినా, ఏ పేరుతో పిలిచినా, మూలబ్రహ్మమొక్కటే. అదే పరమాత్మ, పరబ్రహ్మం! శ్రీ బాలయోగీశ్వరుల వారు మొదట సగుణసాకారోపాసనతో తపస్సు ప్రారంభించినా, చివరకు నిర్గుణ నిరాకార పరబ్రహ్మనే ఉపాదించారు.

కొంత మంది భక్తులు మన స్వామివారు "వీరబ్రహ్మేంద్ర స్వామి వారి" అవతారమని నమ్ముతారు. తాను "కడజాతి" వారింట విశ్వనాధుడిగా జన్మింతునని బ్రహ్మంగారి "కాలజ్ఞాన తత్త్వాల"లో చెప్పారంటారు.

బ్రహ్మంగారి మఠం సమీపమందున్న కొండగుట్టలపై మనస్వామివారు దర్శనమిచ్చినట్లు బ్రహ్మంగారి మఠాధిపతి చెప్పారు. మన బాలయోగీశ్వరుల వారు బ్రహ్మంగారి అవతారమను కొన్నా, అనుకోక పోయినా, బ్రహ్మంగారు ఏ శైవ-వైష్ణవ-శాక్తేయ-మత శాఖలను సమర్థించలేదు. బ్రహ్మంగారు పరబ్రహ్మ తత్త్వం గురించే సామాన్య జన బాహుళ్యానికి సులభంగా అర్థమయ్యే విధంగా సరళమైన భాషలో "తత్త్వాలు" చెప్పాడు. జానపద పాటలలో, గేయాలలో పాడాడు.

స్వామివారిది కృష్ణతత్త్వమా లేక శైవతత్త్వమా అనేది భక్తుల మానసిక, దైవీయ భావనను బట్టి వుంటుంది. ఈ విషయం "మానసిక శాస్త్రం" స్పష్టంగా శాస్త్రీయంగా చెబుతుంది. స్వామివారు ఆ విషయంలో ఏమి చెప్పలేదు. శ్రీ బాలయోగి వారు "భగవంతుని" ప్రస్తావన తెచ్చినా "జీవాత్మ భగవత్స్వరూపమని" చెప్పినా 'భగవంతుడు కనిపించే వరకు ఎవ్వరైనా తపస్సు చేయవలెను' అని చెప్పినా "జన్మరాహిత్యము చేసుకొని మహా స్వర్గమునకు (ఐక్యము) ఎవ్వరైతే వెళ్ళుదురో ఆ మహనీయునకే అంతా శాశ్వతము అని నిర్ద్వంద్వంగా చెప్పియున్నారు. అంటే జన్మరాహిత్యం చేసుకొని "బ్రహ్మైక్యం" చెందడమని శ్రీ స్వామివారి ఉద్దేశం. "జన్మరాహిత్యం" చేసుకొనినచో అంతా శాశ్వతమని "బ్రహ్మైక్యం" సిద్ధిస్తుందని, యిట్టి బ్రహ్మైక్యసిద్ధి "తపస్సు" ద్వారానే లభిస్తుందని, వారి తత్త్వబోధల్ని బట్టి స్వామివారి నిజజీవితాన్ని బట్టి మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఎందులో పుట్టినా, ఎవరిని కొలిచినా "తపస్సు" ద్వారా జీవాత్మ పరమాత్మలో కలిసి పోతుందని బ్రహ్మైక్యం సిద్ధిస్తుందని స్వామివారి జీవితం మనకు ప్రత్యక్ష సాక్ష్యం. ప్రబల నిదర్శనం.

శ్రీ బాలయోగీశ్వరుల వారి సందేశమేమిటి

(1) నిత్య దర్శనంనకు సంబంధించిన ఆదేశములలో "తపస్సు చేసే మందిరము లోపల ఏ జంతువు కనబడినను కొట్టవద్దనియు, మందిరము చుట్టును ఉండే పూలతోటలోని పువ్వులను ఎవరును కోయకూడదు. పూవులలో గూడా జీవాత్మ యున్నదనియు, శ్రీ బాలయోగి వారు వివరించారు గదా. అంటే ఈశానోపనిషత్తులో "ఆత్మవత్ సర్వభూతాని" అనే సత్యాన్ని భగవత్ గీతలో యీ సత్యాన్ని మరింతగా విపులీకరించినట్లు (ఆత్మరూపంలో భగవంతుడు (తాను) చరాచర జీవకోటిలో వ్యాపించియున్నానన్న సత్యాన్ని శ్రీ స్వామివారు జనబాహుళ్యానికి

సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పారు. అలానే 'జీవహింస' తగదని, "అహింసా పరమోధర్మః' అన్న సత్యాన్ని గూడా శ్రీ స్వామి వారు నొక్కి చెప్పారు.

2. 27-3-49న శ్రీ వ్యాసం సత్యరాజు మరి యిద్దరితో శ్రీ పెదబాలయోగి వారు తమ 'స్వీయ చరిత్ర' గురించి చెప్పిన "తత్వోపదేశాలు" వివరించియున్నారు గదా. వాటిని మనం పరిశీలించినచో "జీవులకు" అనేక జన్మలున్నట్లు (పునర్జన్మ) దైవమొకరు (పరమాత్మ) ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. అక్షర జ్ఞానం లేక, నిరుపేద నిమ్నజాతిలో పుట్టిన శ్రీ బాలయోగివారు "పూర్వజన్మ సుకృతం" వలన తపస్సు చేస్తూ, 2 సం॥ 8 మాసములకు, యీ విషయాలు చెప్పడం అపూర్వం, అసాధారణం. అనన్య సామాన్యం. నాస్తికవాదం పెరిగి పోతున్న యీ రోజుల్లో బాలయోగి నిరుపేద నిమ్నజాతి కుటుంబంలో జన్మించి తపస్సు చేసి, దేవుని 'ఉనికి' గూర్చి పునర్జన్మ గూర్చి, తపస్సు యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనం గురించి నొక్కి చెప్పడం గమనార్హం. నాస్తికవాదుల కొక గట్టి హెచ్చరిక! యెదురులేని ఒక సవాలు. సమాధానం దొరకని ప్రశ్న. ది. 27-3-49 రాత్రి వ్యాసం సత్యరాజు మరి యిరువురు భక్తులతో, స్వీయచరిత్ర, నిత్యదర్శనమునకు సంబంధించిన ఆదేశములు, తత్వోపదేశములు, శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు వివరిస్తూ, (1) శాంతము ముఖ్య అవసరమని (2) మీదపడి కొట్టినను కోపము రాకూడదని (3) కపటముతో ఉన్న యెడల రెట్టింపు కష్టములు అనుభవింపవలసి వచ్చునని (4) చంటి పిల్లలను గూడ తప్పుడు మాటలనరాదని (5) మందిరంలోపల ఏ జంతువు (ప్రాణి) కనపడినను కొట్టవద్దని (6) తపస్సు వలన చక్రవర్తితనము కూడ వచ్చును. కాని దాని వలన గర్వము కలుగును. గర్వపడితే దిగువ జన్మలోకి పోవలసి వచ్చునని, శ్రీ బాలయోగివారు చెప్పియున్నారు.

హింస-అశాంతి, పదవీ వ్యామోహం (చక్రవర్తితనం), కామక్రోధాది అరిషడ్వర్గములు, కపటం, మోసం, పెచ్చు పెరిగిపోతున్న నేటి సమాజంనకు శ్రీ బాలయోగి వారి ఆదేశములు, సందేశములు గొప్ప హెచ్చరికలు. ఆచరించవలసిన సందేశములు. విశ్వశాంతికి లోక కళ్యాణానికి వారి సందేశములు శిరోధార్యములు.

(1) ఆరాధనకు పాలును నీరును తీసుకొని వచ్చే మహనీయుడు ఎంత భక్తితో తెచ్చిన అంత ఎక్కువగా ఆరగింపు యగునని (2) పూర్తిగా ఎవ్వరైతే తన్ను నమ్ముతారో వారిపై భగవంతునికి కనికరము కలుగునని (3) ఎందులో పుట్టినా భగవంతుని ఎవ్వరైతే నమ్ముతారో వారికే ముక్తి మార్గము లభించునని (4) ఎవరిదారి (ముక్తిమార్గం) వారే తెలుసుకోవలయును (5) దర్శనమునకు వచ్చు భక్తులను దక్షిణ యిమ్మని అడగవద్దనియు వచ్చిన డబ్బును అన్నదానము క్రింద ఖర్చు చేయవలయుననియు, శ్రీ బాలయోగివారు ఉపదేశించారు.

ఈనాడు నిజమైన భక్తి ప్రజల్లో లేదు. భోగభాగ్యాలు కోసం దైవాన్ని ఆరాధించడం ఎక్కువై పోయింది. ప్రజల మూఢ విశ్వాసాల్ని ఆసరా చేసుకొని వారి 'కోరికలు' నెరవేరుస్తామని, ముక్తిప్రసాదిస్తామని చెప్పే దొంగ స్వాములు యీనాడు పెచ్చుపెరిగి పోయారు. దేవుళ్ళకు గుళ్ళు గోపురాలు కట్టిస్తామని, దేవుని పేర చందాలు వసూలు చేసి "భోంచేసే" ప్రబుద్ధులు గూడా ఎక్కువైనారు. ఇట్టి సామాజిక పరిస్థితుల్లో శ్రీ బాలయోగివారి సందేశములు "మూఢ భక్తులకు" కనువిప్పు కావాలని, నిర్మలమైన, నిశ్చలమైన భక్తి విశ్వాసాలు ప్రజల్లో పెంపొందాలని, ఎవరి 'ముక్తి' మార్గం వారే అచంచల భక్తితో చూసుకోవాలని, దేవునిపేర ప్రజల్ని 'దోచుకొన' కూడదని శ్రీ బాలయోగివారి సందేశం.

శ్రీ బాలయోగీశ్వరుల వారు జన్మించి తపస్సు ప్రారంభించిన నాటికి దేశంలో కులతత్త్వం, అంటరానితనం పెచ్చరిల్లి పోయివున్నాయి. ఒక్క ప్రక్క డా॥ అంబేద్కర్ నిమ్నజాతుల సాంఘిక, ఆర్థిక న్యాయబద్ధ రాజకీయ హక్కుల కొరకు ఉద్యమం నడుపుతుంటే మరొక ప్రక్క మహాత్మాగాంధీ దేశస్వాంత్ర్యోద్యమంతోపాటు హరిజనోద్ధరణ కార్యక్రమం చేపట్టాడు. ఇంకోవైపున కష్టజీవుల 'శ్రమ'ను దోచుకొని ధనిక భూస్వాములు నోరులేని పేదల్ని నానా బాధలు పెడు తున్నారు. పేద కష్టజీవుల 'జీవితాలు' 'కూడ-గుడ్డా-కొంపా లేక' దుర్భరంగా తయారయ్యాయి.

ఇట్టి సామాజిక, రాజకీయ, ఆర్థిక 'దుస్థితుల్లో శ్రీ బాలయోగివారు పంచమకులంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. దైవ దృష్టిలో ఉచ్ఛనీచ, రాజా పేదా అన్న బేధభావం లేనేలేదన్న పరమ సత్యం లోకమునకు విశదపరచడం కోసమే మనస్వామి వారు అంటరాని కులంలో, పేదకుటుంబంలో జన్మించడం లోని పరమ రహస్యం! అది దైవసంకల్పం.

శ్లో॥ విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని
శునిచైవ శ్వపాకేచపండితా స్వమదర్శనః *(గీత - 5-18)*

విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, కుక్కను, కుక్క మాంసం తిను చండాలుని (పంచమ జాతివాడు) సమబుద్ధితో సంభావించు వారే. "జ్ఞాను"లని 'ఆత్మానుభవం గల్గిన వారని గీతా ప్రమాణం ఈ సత్యంను ఋజువు పరచుటకు, ఆచరణలో పెట్టుటకే శ్రీ బాలయోగివారు 'పంచమ' కులంలో జన్మించుట దైవసంకల్పం. "ఎక్కువలో పుట్టినా తక్కువలో పుట్టినా తనువులు శాశ్వతం కాదు. ఎందులో పుట్టినా భగవంతుని యెవరైతే నమ్ముతారో వారికే ముక్తిమార్గం లభించు"నని స్వామివారు చెప్పినారు. అగ్రకులంలో పుట్టినా తక్కువ కులంలో పుట్టినా, పేదగా పుట్టినా, ధనవంతుడిగా పుట్టినా ఎవరూ శాశ్వతం కాదు. భగవంతునికి ఒకరంటే యిష్టం మరొకరంటే అయిష్టం (ద్వేషం) అంటూ వుండదు. ఏ కులంలో పుట్టినా, ఏ ఆర్థిక స్థాయిలో పుట్టినా" ఎవరైతే భగవంతుని నమ్ముతారో వారికే ముక్తి మార్గం

లభిస్తుంది. "రానున్న కాలంలో వీరే (పంచమ జాతుల వారు) పాలకులౌతారని శ్రీ పెదబాలయోగి వారొక సందర్భంలో కమిటీ సభ్యులతో అన్నారట. ఏనాడో వీరబ్రహ్మేంద్రస్వామి వారు "మాలలకు మంచాలు, బ్రాహ్మలకు పీటలు"న్నారు. డా॥ అంబేద్కర్ గూడా నిమ్నజాతులవారు "పాలితులు"గా గాక "పాలకులు"గా వుండగోరి అందుకు ఉద్యమం నడిపాడు. శ్రీ స్వామివారు చెప్పినట్లు, యీనాడు శ్రీ కె.ఆర్.నారాయణన్ రాష్ట్రపతి అయ్యాడు. మన రాష్ట్రంలో శ్రీ దామోదరం సంజీవయ్య ముఖ్య మంత్రి అయ్యాడు. ఎందరో ఐ.ఏ.యస్., ఐ.పి.యస్., అధికారులు న్యాయమూర్తులు, డాక్టర్లు, ఇంజనీర్లు ప్రొఫెసర్లు అయ్యారు.

క్రీస్తు ప్రవక్త గూడా నిరుపేదగానే పుట్టాడు. ఆదిశంకరాచార్యుడు, కబీరు, రామకృష్ణ పరమహంస ప్రభృతులు, నిరుపేద కుటుంబాలలోనే జన్మించారు. పూర్వం భక్తనందనార్ పంచమకులంలోనే జన్మించారు. లోకోత్తమ పురుషోత్తములన్నారు. లోకోద్ధారకులయ్యారు అందర్నీ కులమత రహితంగా, సమంగా చూసారు. ముక్తిమార్గం చూపించారు. మానవసేవలో, దైవసేవలో తరించిపోయారు. ధన్యులయ్యారు. మన పెదబాలయోగీశ్వరులు, చిన బాలయోగీశ్వరులు గూడా యిదే కోవకు చెందిన లోకోత్తర పురుషోత్తములు, యోగి సత్తములు, తపోబ్రహ్మలు, లోకోద్ధారణార్థం, ముక్తి మార్గం జూపించారు. మానవసేవలో, దైవసేవలో తరించిపోయారు. ధన్యులైనారు. వైయుక్తికంగా జీవన్ముక్తులయ్యారు. బ్రహ్మైక్యం చెందారు.

బాలయోగీశ్వరుల వారి నిజజీవతమే ఒక దివ్య సందేశం! మన స్వామివారు చేసిన దీర్ఘకాల కఠోర తపః ప్రభావం వలన లోకమునకు (కొందరికి అనుభవ పూర్వకంగా) (మరి కొందరికి తెలియకుండా) ఎంతో మేలు జరిగింది. లోక కళ్యాణం సంతరించింది.

శ్రీ బాలయోగి వారు జన్మతః సాధుస్వభావి, శాంత మూర్తి. పరులను పల్లెత్తుమాట లాడలేదు. అందరితో 'మంచి'గా మెలిగారు. కోపమెరుగని వాడు. నిష్కామ కర్మయోగి. దేవుని యందు అచంచలమైన భక్తి విశ్వాసములు గలవాడు 'భగవద్గీత'ను ప్రమాణంగా చేసుకొని తపస్సు చేసినవారు. గీతలో లౌకిక పారమార్థిక మార్గాలు రెండూ వున్నాయి. అందుకే 'భగవద్గీత' ను పాటించమని ఆయన లోకులకు బోధించాడు. ఇలా స్వామివారు నిజ జీవితం, భగవద్గీత ప్రామాణికత, మానవకోటికి, లౌకిక, పారమార్థిక జీవన విధానాలకు మార్గదర్శకాలు.

అయితే స్వామి వారు వ్యక్తిగత కారణాల వల్ల గాని, మరే యితర కారణాల వల్ల గాని "మౌనవ్రతం" పూనడం మన దురదృష్టం "మౌనవ్రతం" బూనకుండా తపోనిష్ఠలో వుంటున్నా వచ్చిపోయే భక్తకోటికి తన మహిమాన్విత తేజోమయ నేత్రాలతో వీక్షించి, తన అమృత హస్తము లతో వారికి 'ఆశీస్సులందించియుంటే' 'పిచ్చి' భక్తకోటి 'అల్పసంతోషం' తో ఆనందించే వారు.

తమ కష్టాలన్నీ మటుమాయమైనట్లు భావించే వారు. ఎందుకంటే జనబాహుళ్యానికి ప్రత్యక్షంగా తమ అనుభవంలోనికి వచ్చిన ఆనందమే ముఖ్యం కనుక! పరోక్షంగా ఎంతమేలు జరిగినా గ్రహించుకోలేదీ మూఢ లోకం కనుక.

శ్రీ బాలయోగీశ్వరుల వారిని భక్తి శ్రద్ధలతో సేవిస్తూ సన్నిహితంగా మెలిగిన కమిటీ సభ్యులు కొందరు, "స్వామి"తమరు మౌనవ్రతం బూని తపోమందిరంలో తపస్సు చేస్తున్నారు. బాలయోగివారు లోకానికి (భక్తకోటికి) యిచ్చే సందేశమేమిటని" అడిగితే అందుకు స్వామివారు "అంతా శ్రీకృష్ణపరమాత్మగీతలోనే చెప్పాడు. ఇక నేను వేరుగా చెప్పవలసిందేమిలేదు" అని తమ ప్రక్కనే వున్న 'గీత'ను చూపిస్తూ సంజ్ఞల ద్వారా తెలియజేసారు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ ఇచ్చిన బోధలు పాటించని వారు, తాను చెప్పినా వింటారా! పాటిస్తారా అని స్వామి వారు అన్నారట. నిజమే! భారతీయ తాత్త్విక దృక్పథమంతా, వేదవేదాంతసారమంతా 'భగవద్గీత' లోనే వుంది గదా! నిష్కామ కర్మయోగం ద్వారా లోక జీవితం కొనసాగిస్తూనే, జీవన్ముక్తి కొరకు భక్తి, ధ్యాన, జ్ఞాన యోగాల ద్వారా ప్రతివారు తమ ఆధ్యాత్మికచింతన చేస్తూ, సాధన చేస్తూ తరించాలని గదా భగవద్గీత చెబుతోంది. మరి అంతకంటే వేరే సందేశమేముంటుంది.

పోతే, స్వామివారు ది. 6-2-49, మరలా 10-2-49న చివరగా 27-3-49న వ్యాసం సత్యరాజు గారు మరి ఇద్దరు భక్తులతో చెప్పిన "స్వీయ చరిత్ర" నిత్యదర్శన ఆదేశాలు తత్త్వోపదేశాలలో "తరచి చూచినచో భక్తలోకానికి, భావితరాల వారికి శ్రీ స్వామివారి సందేశ మేమిటో స్పష్టమౌతుంది.

డా॥ బోయి భీమన్నగారు శ్రీ పెదబాలయోగి వారు కైవల్య సిద్ధి చెందిన తర్వాత "బాలయోగీయం" అనే కావ్యం రాశాడు. శ్రీ స్వామివారు బ్రహ్మైక్యం చెందిన తర్వాత భీమన్న గారు తప్ప మరెవ్వరూ మరేవిధమైన రచనలు చేసి యుండలేదని నా (రచయిత) అభిప్రాయం. భీమన్న గారు తన కావ్యమునకు రాసిన "ముందుమాట'లో శ్రీ బాలయోగి వారి 'నిరసన యోగదీక్ష (తపస్సు) యొక్క ప్రయోజనాలు (ఆశయాలు) గురించి యీ క్రింది విధంగా పేర్కొన్నాడు.

(1) ఇతర మతాల ప్రచారానికి భయపడి ఆధునిక విద్యావంతులు యువకులు విగ్రహారాధన పట్ల చూపుతున్న నిరసన భావాన్ని తొలగించుట.

(2) సత్యదర్శనాన్ని పునరుద్ధరించడానికే బాలయోగి, భగవంతుడు, యోగి" సంబంధాన్ని "కృష్ణ-నారద" చిత్రపటం ద్వారా కల్పించుకొని తన తపస్సును ప్రారంభించాడనుకోవచ్చు.

(3) తాను పుట్టిన వర్గానికి కులం కారణంగా సంక్రమించిన దాస్యాన్ని తొలగించి హైందవ

జాతిలో సాంఘిక సమానత్వాన్ని సాధించడం, అనాదిగా వస్తున్న తన ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిరూపించడం.

(4) జీవ బ్రహ్మైక్యాన్ని సాధించిన మహాయోగి ఎంతకాలమైనా నిరాహారిగా బ్రతకగలడని రుజువు చేయడం. నిత్యం పరమాత్మలోనే ఐక్యమై వున్న జీవుడు జీవించడానికి అన్నంతో పనిఏమిటి.

(5) బ్రహ్మపథంలో హరి నాభికమలంలోని మధుకోశంలో జీవరహస్యందాగి వున్నదని, నిజమేనని నిరూపించడం.

(6) ఆధ్యాత్మిక శక్తి ద్వారా ప్రదర్శించగలిగిన అద్భుతాలన్నింటికంటే మించిన పరమాద్భుతం నలభయేళ్ళ పాటు నిరాహారిగా జీవించడం.

(7) తన యోగశక్తిని భారతీయ సమైక్యం కోసం విశ్వమానవశ్రేయస్సు కోసం వినియోగించడం.

(8) వ్యక్తిగత మోక్షానికి సంబంధించిన స్వార్థం బాలయోగికి వున్నట్టు లేదు. తనచుట్టూ వున్న భక్తుల కోరికను మన్నించి ఏడాది కొకసారి సమాధి నుంచి మేల్కొని బైటికి రావటానికి అంగీకరించాడంటే ఆయన ఎంత సాంఘిక స్పృహ కలవాడో మనం అర్థం చేసుకోవచ్చు.

(9) బాలయోగి ఆశించింది తన సొంత మోక్షం కాదనీ జీవ సమాధిలోకి పోయి శాశ్వత పూజలందు కోవడం కూడా కాదనీ, దళిత ప్రజల ఉద్ధరణ హైందవ సమాజ సమైక్యం మాత్రమే ఆయన లక్ష్యాలని మనం నిరభ్యంతరంగా చెప్పుకోవచ్చు. యోగ లక్ష్యం మోక్షం కాదనీ, అపరోక్ష బ్రహ్మజ్ఞానం ద్వారా పొందిన శక్తుల్ని ప్రజా శ్రేయస్సు కోసం వినియోగించడమే యోగప్రయోజనమనీ యిక్కడ మనం జ్ఞాపకం వుంచుకోవాలి.

శాశ్వత జీవ బ్రహ్మైక్య సిద్ధి - కైవల్యసిద్ధి

అసతోమా సద్గమయా
తమ సోమా జ్యోతిర్గమయా
మృత్యోర్మా అమృతం గమయ

శ్లో॥ కవిం పురాణ మనుశాసి తార మణో రణీయాం సమనుస్మరేద్యః
సర్వస్య ధాతార మంచింత్య రూప మాదిత్య వర్ణం తమసః పరస్తాత్
(భగ 8:9)

సర్వజ్ఞుడు, సనాతనుడు, సర్వనియామకుడు, (సమస్త లోకశాసకుడు) సూక్ష్మాతి సూక్ష్మమైన వాడు, కోటి సూర్య 'ప్రభా' పరంజ్యోతి స్వరూపుడు, అఖిల జగదాధారుడు, వూహ కందని వాడు, అజ్ఞానాంధకారతీత జ్ఞానస్వరూపుడగు, దివ్య పరమ పురుషుని (పురుషోత్తముని) మనోనిగ్రహంతో యోగాభ్యాసంతో నిరంతరం ధ్యానించే యోగి అట్టి దివ్యపురుషోత్తముని పొందుతాడు.

ఆ రోజు 'ఆకాశం చిల్లులు పడిందా అన్నట్లు' జోరున కుండపోతగా వర్షిస్తోంది. ఆషాడ, శ్రావణ నీలి మేఘాలు గుండె పగిలి రోదిస్తున్న రోజది! పంచభూతాలు, పరలోక దివ్యాత్మల పరమానంద బాష్పాలా! లేక కన్నీరు మున్నీరుగా హృదయావేదనా భరిత కవోష్ణ బాష్పాలా! భూలోకవాసులు గాఢాంధకారంలో తపోనిద్రలో మునిగి వున్నారు. చుట్టూ ఉన్న ప్రాపంచిక మానవ జనసందోహం అది. మేఘ వర్షమను కొన్నారు. కళ్ళుండీ చూడలేని గుడ్డిలోకమిది గదా! ఒక జీవాత్మ తపోసిద్ధి పొంది, పాంచ భౌతిక లోకం విడిచి పోతున్నందుకు, యిన్నాళ్ళు, యిన్నేళ్ళ 'బంధం' తెంచుకొని పోతున్నందుకు "పంచభూతాలు" గుండె లదర గుండెలు బాదుకొంటూ (ఉరుములు-మెరుపులు రూపం) లో వర్షంగా కన్నీరు మున్నీరుగా రోదిస్తుంటే, మరో లోకం పరలోక దేవతా గణం-దివ్యాత్మల సందోహం, యిన్నాళ్ళుగా, యిన్నేళ్లుగా, మాయా కాయ బంధ బద్ధమైనా, ఆలోక మోహబంధ విముక్తికై దీర్ఘ కాలం కఠోర తపస్సు చేసి, తపస్సిద్ధి బొంది పాంచభౌతిక మాయాకాయ బంధ విముక్తమై, భూలోక జీవన్ముక్తి చెంది, "పరలోక" దివ్యలోకంలో తమతో తమ "సహచారి"గా శాశ్వతంగా జీవించేందుకు భూలోకం నుండి వచ్చిన ఒక "దివ్య జీవాత్మ"ను చూచి ఆనంద పారవశ్యంలో అప్రయత్నంగా తమ కనుగొనల నుండి వర్షరూపంలో కారుతున్న దివ్యానంద బాష్పకణాలా! ఏది సత్యం! ఏది అసత్యం! రెండూ సత్యమే!

అదే ఆరోజు ఆంగ్లేయ కాలమానం ప్రకారం 19-7-85 భారతీయ కాలమాన ప్రకారం ఆరోజు క్రోధన నామసంవత్సర శ్రావణ శుక్రవారం (శుద్ధ) విదియా నక్షత్రం! ఆ రోజు ఒకందుకు శుభదినం. మరొకందుకు దుర్దినం! లోకం దృష్టిలో, భక్త కోటి దృష్టిలో అది దుర్దినమే. నాల్గు దశాబ్దాల పాటు తన దీర్ఘకాల కఠోర తపోశక్తి చేత, తపోబలం చేత, వందలు వేలు కాదు, యిన్నేళ్ళు, లక్షలు కోట్లాది భక్తుల బాధలు తీరుస్తూ, భక్తకోటిని తరింపజేస్తూ తన జీవన్ముక్తితో పాటు పరోక్షంగా లోక కళ్యాణమునకు, పాంచభౌతిక దేహంతో జీవించి, ఆ రోజు తనువు చాలించాడు కనుక. మరొక విధంగా ఆ రోజు మహా శుభదినం. ఎందుకంటే, ఏ లక్ష్యంతో అయితే సుమారు నాల్గు దశాబ్దాలు ఘోర తపస్సు ఆచరించాడో, ఆ తపస్సు ఫలించి, జీవన్ముక్తి బొంది, పాంచభౌతిక శరీరంలో బంధింపబడిన 'దివ్య జీవాత్మ' లోకబంధ విముక్తమై పరమాత్మలో సాయుజ్యం పొందింది కనుక. ఆ మహాయోగిలోని దివ్యజీవాత్మ జ్యోతి పరం జ్యోతిలో లీనమైపోయింది కనుక.

అదే శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు కైవల్య సిద్ధి-పరబ్రహ్మైక్యం చెందిన రోజది. అది శుక్రవారం. క్రీస్తు ప్రభువు గూడా శుక్రవారమే సజీవంగా శిలువపై మరణించాడు. ఆయనపై ద్వేషంతో, ఆయన్ని సజీవ శిలువచేసిన యూదులు అది తమకు "శుభశుక్రవారమ"నుకొని పండుగ జరుపుకొన్నారు. (Good Friday) మతపరంగా, పారమార్థిక దృష్టితో, క్రైస్తవమతస్థులు గూడా దానిని శుభశుక్రవారమని గుర్తించారు. కారణం, పాపజనోద్ధారణకై భువి నుండి దివికేతెంచిన క్రీస్తు ప్రభువు తన పరిశుద్ధరక్తాన్ని శిలువపై ధారపోసి తన రక్తధారలతో లోకజన పాపాల్ని ప్రోక్షించాడని కనుక అది మతపరంగా గూడా "శుభశుక్రవారమే" అనుకొంటారు.

అట్టి శుభ శుక్రవారం రోజున శ్రీ స్వామివారు మహా నిర్యాణం చెందడం మనం గుర్తిం చాలి. ఆ రోజు విదియా తిథి విచిత్రం. విశేషమేమంటే, శ్రీ స్వామివారు జన్మించింది గురువారం (కార్తీక మాసం) విదియా తిథి రోజునే. అలానే పాంచ భౌతిక దేహం చాలించింది గూడా శ్రావణ శుక్రవారం. విధియ తిథి. కార్తీకం లాగా శ్రావణ మాసంలో వచ్చే యీ తిథి పరమ పవిత్రమైన దినం.

బుద్ధ భగవానుడు గూడా వైశాఖ పూర్ణిమ నాడు జన్మించి మరలా వైశాఖ పూర్ణిమనాడే. మహాపరినిర్యాణం చెందాడు. షిరిడీ సాయి బాబా గూడా విదియ నాడు జన్మించి, మరలా విజయదశమినాడు మహా నిర్యాణం చెందాడు. మన భగవాన్ పెదబాలయోగీశ్వరుల వారు గూడా విదియా తిథిన జన్మించి, మరలా విదియా తిథినాడే కైవల్యసిద్ధి పొందాడు. అవతార పురుషులు, అవధూతలు, పురుషోత్తములు లోక కళ్యాణకారులు యిలానే జన్మనెత్తి, జన్మచాలిస్తుంటారు.

"కొన్ని సంవత్సరాలు పూర్వం" మహా ఋషులు తపస్సు చేసి ముక్తి చెందిన "మహా పవిత్రమగు ప్రదేశమైన" ముమ్మిడివరంలో "పూర్వ జన్మలో మహాతపస్వి", మహాపుణ్యం చేసు కొన్న శ్రీ గంగయ్య (ద్వితీయ కళత్రం) రావమ్మలకు తృతీయ సంతానంగా యీ భూలోకమందు జన్మించి 23-10-1930 (తన "జన్మ పరంపరలో ప్రస్తుత జన్మం చిట్ట చివరిది"గా సుబ్బారావు (పండు) నామంతో బాల్య మందు గోపాలునిగా జీవితం గడిపి, స్థల ప్రభావం వలన తల్లిదండ్రుల మహాపుణ్యబలం వలన తన "పూర్వజన్మ సువాసన' తన (పూర్వజన్మ) సుకృతము ఫలించి తపస్సు ప్రారంభించి (22-6-46) బ్రహ్మచర్యవ్రతమూని, అచంచల మనస్కుడై సర్వేంద్రియ నిగ్రహుడై, కర్మ సన్యాసం చేసి (నిష్కామకర్మయోగ మాచరిస్తూ) ఏకాగ్రచిత్తంలో, నిర్మల హృదయంతో, ఆత్మసంయమనంతో, అంతర్ముఖుడై, పరమాత్మయందు మనస్సు లగ్నం చేసి, 'కడపటి మెట్టులో తపస్సు' ప్రారంభించి యోగబలంతో మలజల విసర్జనలను అరికట్టి "తానెవరో తాను తెలుసుకొని" తన ఆత్మే తనకు గురువుగా తన ఆత్మను పవిత్రం చేసుకొని, దాదాపు నాల్గు దశాబ్దాలుపాటు ఘోరతపస్సు చేసి 'జన్మరాహిత్యం చేసుకొని' (ది. 19-7-85) పరమాత్మలో ఐక్యమైన అపూర్వ మహాయోగి పుంగవుడు-బ్రహర్షి-దివ్య తపస్వి-శ్రీశ్రీశ్రీ భగవాన్ ముమ్మిడివరం పెద బాలయోగీశ్వరుల వారు!

భూలోకంలో యీ జన్మలో కటికిదల గంగయ్య గారి కుమారుడుగా సుబ్బారావు పేరున 16 సంవత్సరములు, పెదబాలయోగీశ్వరునిగా 39 సంవత్సరములు కఠోర తపస్సు చేసి, మొత్తం 55 సంవత్సరాలలో జీవిత నాటకరంగంలో పాత్రధారిగా నటించి, శ్రీ స్వామివారిలోనున్న 'ఆత్మ' పరమాత్మలో ఐక్యమైనది. శ్రీ స్వామివారిలో తపోమహిమచే పవిత్రమైన దివ్య జీవాత్మ 19-7-85న పరబ్రహ్మంలో-పరంజ్యోతిలో లీనమైంది. శ్రీ పెదబాల యోగివారు జీవన్ముక్తుడై "కైవల్య సిద్ధి" "బ్రహ్మైక్యం" చెందారు.

ఇలా శ్రీ స్వామి వారి దివ్య జీవాత్మ, మృత్యోర్మా అమృతం గమయా పరమాత్మలో శాశ్వతంగా ఐక్యమై పోయింది.

మరి యిన్నాళ్ళూ యిన్నేళ్ళు 55 సంవత్సరాలు లోకంలో సుబ్బారావుగా, శ్రీ పెద బాలయోగీశ్వరులుగా లోకజీవిత నాటకరంగంలో పాత్ర వహించిన పాంచ భౌతికదేహం మాటేమిటంటారా! మన్నుతో చేయబడిన మట్టికాయం మన్నులో కలిసిపోవలసిందేగదా! ఈ భూమ్మీద శరీర ధారులై పుట్టిన రాజులు గాని, రౌడీలు గాని, కష్టజీవులు గాని, కళాకారులు గాని, అవతార పురుషులు గాని, అవధూతలు గాని, మహాయోగులు గాని, ఎవరైతేనేం యీ శరీరాన్ని విడిచి పోవలసిందేగదా! అలానే శ్రీ స్వామివారి కాయం గూడా! అవతార పురుషులు, దైవ స్వరూపులనుకొన్న శ్రీరామచంద్రుడు శ్రీకృష్ణ పరమాత్మ ప్రభృతులు తమ 'పాంచభౌతిక' శరీరాన్ని విడిచి పోలేదా. అయితే దాదాపు 39 సంవత్సరాలు తపోమందిర స్వయం నిర్బంధితుడై,

ోకంతో సంబంధం లేకుండా తపోమందిరం తలుపులు బిడాయింప జేసుకొని తపోసమాధిలో ్నన్న శ్రీ స్వామివారు, నిజంగా చెప్పాలంటే 'జీవసమాధి'లో వున్నట్లే గదా! శ్రీ స్వామివారిలోని ివ్య జీవాత్మ పరమాత్మలో లీనమైన రోజు అనగా 19-7-85 అంటే లోక వ్యవహారంలో పరమ ిదించిన రోజు, మహా నిర్యాణం చెందిన రోజు. సామాన్య భాషలో చెప్పాలంటే 'చనిపోయిన' ోజు గదా!

శ్రీ స్వామి వారి జీవాత్మ పరమాత్మలో లీనమై వారు నిర్యాణం చెంది, కైవల్య సిద్ధి ొంది, బ్రహ్మైక్యం చెంది, వారి కాయం నిర్జీవమై, జీవముడిగి, "కట్టె"గా "శవంగా" మారిన ంగతి, స్వయం తపోమందిర నిర్బంధితుడైతే, లోకానికి ఎలా తెలుస్తుంది. తలుపులు తెరిచేది వరాత్రికి గదా! కనుక వెంటనే తెలియరాలేదు.

హైదరాబాదులో మూర్తిగారికి ఎవరో స్వాముల వారు దర్శనమిచ్చి, "ఇంకా ఆఫీసు ని తెమల లేదా" అని చిరునవ్వు నవ్వారు! మూర్తిగారు చిన్నతనంలో పెద్దగా భక్తిగా లేకపోయినా, ారి సతీమణి తన ప్రాణం కన్న మిన్నగ ప్రేమించిన శ్రీమతి అనసూయమూర్తి దీర్ఘకాలం ్యాధిగ్రస్తురాలైన తర్వాత, దైవభక్తి యెక్కువ పూజించని గుడులు లేవు. దేవుళ్ళు లేరు. దర్శించని ్వాములవార్లు లేరు. కనుక తన కొచ్చిన కలను సీరియస్‌గా తీసుకోలేదు. కాకినాడలో శ్రీ ేమ్‌ప్రసాద్‌కు శ్రీ స్వామి వారు స్వప్నంలో కనిపించి 'ఆశ్రమం' జాగ్రత్త అన్నారు. ప్రేమ్ ‌సాద్ కుటుంబ సభ్యులకు, శ్రీ స్వామి వారు యిలా స్వప్నంలోనో మరో విధంగానో దర్శన ువ్వడం సర్వసాధారణం. కనుక ప్రేమ్‌ప్రసాద్ గూడా తన కల గురించి సీరియస్‌గా తీసుకోలేదు. ీ భీమయ్యకు కలలో శ్రీ స్వామివారు కనిపించి "అక్కడెందుకు ఇక్కడ వుండు" అన్నారు. శ్రీ ్వామివారికి పరమభక్తుడైన శ్రీ భీమయ్యకు శ్రీ స్వామి వారు స్వప్నంలో దర్శనమివ్వడం ిరిపాటి కనుక "స్వామివారు కలలో వచ్చారు. ముమ్మిడివరం పోయి రావాలి. వర్షాలు జోరుగా ురుస్తున్నాయి. వర్షాలు తగ్గగానే రేపో మాపో ఆశ్రమానికి పోవాలి" అని తన శ్రీమతితో అన్నాడు. ీ స్వామివారు "పోయారన్న" వార్త తెలిసిన తర్వాత గాని భోరున విలపిస్తూ తమకు వచ్చిన ల గురించి, వాటిలోని అంతరార్థం గ్రహించ లేకపోయారీ ముగ్గురు స్వామి వారి ిరమభక్తులు.

ఈ గ్రంథ రచయిత సతీమణి రత్న జ్యోతికి ఆ రాత్రి శ్రీ బాలయోగివారు చనిపోయి ట్లును, మూర్తిగారు తదితరులంతా శ్రీ స్వామివారి 'శవం'ను క్రింద పెట్టి చుట్టూ భోరున ెద్దగా ఏడుస్తున్నట్లు కలవచ్చింది. ఈ రచయిత ఆ సమయంలో ఉద్యోగరీత్యా నెల్లూరులో ున్నాడు. తన కల గురించి మరునాడు ఉదయమే యీ రచయితకు చెప్పింది. "నీ కలా, నీ ిచ్చిగాని, బాలయోగివారు పోవడమేమిటి, వూరుకో, ఎవరైనా వింటే నవ్వుతారు. ఈ మాట ుంకెవరితోనైనా పొరపాటుగానైనా చెప్పకు" అంటూ తన అర్ధాంగిని సున్నితంగా మందలించాడు ీ రచయిత.

ఇక్కడ నిజం చెప్పాలి. తప్పు ఒప్పుకోవాలి. ఈ రచయిత, ఈయన భార్య, శ్రీ బాలయోగి వారికి పరమభక్తులు కారు! ఈ రచయిత కంటే ఆతని సతీమణికి శ్రీ బాలయోగి వారి మీద మంచి "గురి" నమ్మకం! సన్యాసులు, యోగులు ఇలా వుండాలి అంటూ యీనాడు దేశంలో అట్టహాసంగా, వైభోగంగా భక్తుల సేవలంటూ సర్వసుఖాలు, సకల మర్యాదలు పొందుతున్న, బాబాలంటే, అమ్మవార్లంటే యీ రచయిత భార్యకు ఎంతో మంట. కోపం! ఆమెకు శ్రీ బాలయోగి వారంటే అంతటి గొప్ప సద్భావం! అయితే నాలుగైదు రోజులు తర్వాత పేపర్లో శ్రీ ముమ్మిడివరం పెదబాలయోగి వారి నిర్యాణం వార్త విని యీ రచయిత, ఆతని సతీమణి నిశ్చేష్టులయ్యారు. ఆమె తనకు వచ్చిన కల గురించి ప్రస్తావించి చాలా దుఃఖించింది. అదలావుంచుదాం.

శ్రీ స్వామివారు బ్రహ్మైక్యం చెందిన 4, 5 రోజులకు తాళాలు వేసి వున్న తపోమందిరం నుండి దుర్గంధం రావడం, నిత్యం మందిరానికి వచ్చి మందిరం చుట్టూ ప్రదక్షణం చేసి పోయే భక్తులకు, శ్రీ స్వామి వారి సోదరులకు, అనుమానం వేసింది. హైదరాబాదు శ్రీ మూర్తిగారికి ఫోను వెళ్లింది. ఆశ్రమ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీ ముత్యాల జానకిరామయ్య గారికి, తన ఆస్తిలో అధికభాగం ఆశ్రమ భవన నిర్మాణాలకు వెచ్చించిన పరమభక్తుడు శ్రీ బచ్చుమాధవయ్య గారికి, ఆశ్రమ భవన నిర్మాణ కార్యక్రమం చేపట్టిన శ్రీ దారా సర్వేశ్వరరావు యిలా అందరికీ ఆఘమేఘాల మీద కబుర్లు వెళ్ళాయి. జోరున వర్షాలు.

శ్రీ మూర్తిగారు, యితర కమిటీ సభ్యులు అందరూ ముమ్మిడివరం ఆశ్రమానికి చేరుకున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు, వైద్యులు సమక్షంలో శ్రీ స్వామివారి తపోమందిరం తలుపులు తెరిచి, శ్రీ స్వామి వారి పవిత్రకాయం 'శవమై దుర్గంధభూయిష్టం' గా దర్శన మిచ్చింది. శ్రీ ప్రేమ్ ప్రసాద్, శ్రీ భీమయ్యలు పసిపిల్లల వలె భోరున ఏడ్చారు. శ్రీ మూర్తిగారు, కమిటీ సభ్యులు నిశ్చేష్టులై కంటతడిపెట్టారు. శ్రీ స్వామివారి సోదరులు యితర కుటుంబ సభ్యులు బావురుమంటూ గుండెలు బాదుకున్నారు.

ఫిబ్రవరి, మార్చి మాసంలో వచ్చిన శివరాత్రి నాడు శ్రీ స్వామివారు కమిటీ సభ్యులతో మాట్లాడుతూ, ఏదో పని చెప్పి దానిని పూర్తి చేసి, మూడు మాసముల తర్వాత వచ్చి తనను కలుసుకోమని శ్రీ స్వామి వారు కమిటీ సభ్యులను ఆదేశించారు. శ్రీ స్వామివారు పురమాయించిన 'పని'ని పూర్తిచేయలేదు. మూడు నెలల తర్వాత వచ్చి శ్రీ స్వామి వారిని కలుసుకోలేదు. ఇంతలో యీ ఘోరం జరిగిపోయింది. ఇదంతా చెబుతూ కమిటీ సభ్యులు భోరున విలపించారు. 1985 ఫిబ్రవరి, మార్చిలో వచ్చిన శివరాత్రికి శ్రీ స్వామివారిని దర్శించుకొన్న జస్టిస్ పున్నయ్య గార్ని జూన్‌లో తమ జన్మదిన వేడుక తప్పక రమ్మని అన్నారు. కాని జస్టిస్ పున్నయ్య వెళ్ళలేదు. జూలైలో స్వామివారు పోయారు. జస్టిస్ పున్నయ్య గారెంతో బాధపడ్డారు.

శ్రీ స్వామివారి భౌతిక కాయాన్ని అదే తపోమందిరంలో, యిన్నేళ్ళుగా తపస్సు చేసిన చోటనే "సమాధి" (భూస్థాపితం) చేసారు. 1946 నుండి 1985 వరకు అంటే 39 సం॥లు తపస్సు చేసుకొంటూ నిర్వి కల్ప జీవసమాధి (స్వయం తపోమందిర నిర్బంధింతం) లో వున్న శ్రీ స్వామివారి జీవాత్మ బ్రహ్మైక్యం చెందిన తర్వాత, నిర్జీవమైన శ్రీ వారి కాయమును ఆ స్థల మందే శాశ్వత సమాధి చేసారన్న మాట. ఆ సమాధిపైననే శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారు పూనుకొని శ్రీ స్వామివారి తపో ముద్రలో వున్న నిలువెత్తు పాలరాతి విగ్రహం నెలకొల్పారు. శ్రీ స్వామివారి ప్రతిమకు నిత్యం పూజలు జరుగుతునే వున్నాయిప్పుడు.

షిరిడీలో శ్రీ సాయిబాబా నిర్యాణం చెందిన పిమ్మట శ్రీబాబా నిర్మించిన ద్వారకామాయి అనే మందిరంలో సమాధి చేయడం జరిగింది. ఆ సమాధి వెనుక ప్రక్కనే నిలువెత్తు శ్రీసాయి పాలరాతి ప్రతిమ నెలకొల్పారు. ఇప్పుడా సాయి పాలరాతి ప్రతిమయే నిత్యం వేలాది భక్తులు దర్శించి పూజలొనరిస్తున్నారు. ముమ్మిడివరంలో గూడా శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి పాలరాతి విగ్రహంను గూడ నిత్యం వందలాది భక్తులు దర్శించి పూజలొనరిస్తున్నారు.

నిర్జీవమైన కాయాల్ని కొందరు అగ్నికి ఆహుతి చేసారు (చితిలో తగులపెట్టుట) కొందరు భూ సమాధి చేస్తారు. కొందరు యోగుల, సన్యాసుల శవాల్ని రాయిరప్పతో బరువు పెట్టి పవిత్రజీవ నదుల్లో వదిలిపెడతారు. జీవాత్మ పరమాత్మలో లీనమైనప్పుడు, జీవుడి ప్రాణం అనంతవాయువుల్లో లీనమైపోతే, కాయాన్ని మన్నులోనో, అగ్నిలోనో, నీటిలోనో 'ఆహుతి' చేస్తారు. పాంచభౌతికమైన శరీరమిట్లు పంచభూతాల్లో కలిసిపోతుంది.

శ్రీ సుందర చైతన్యానందస్వామి వారి ఆశయం

శ్రీ పెదస్వామివారు కైవల్య సిద్ధిచెందినట్లు వార్త వెలువడగానే, (రాజమండ్రి సమీపమందున ధవళేశ్వరంలోని శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు, ముమ్మిడివరం బాలయోగి ఆశ్రమ బాధ్యత తన భుజస్కందాలపై మోస్తున్న శ్రీ కె.యస్.ఆర్. మూర్తి (అప్పుడాయన రాష్ట్ర పంచాయితీరాజ్ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు) గారి కోసం హైదరాబాదు ఫోను చేయించారు. శ్రీ మూర్తిగారు "విమానంలో" బెజవాడ పోయారని తెలిసింది. బెజవాడ "కాంటాక్టు" చేసినా మూర్తిగారి ఆచూకీ తెలియదు.

మూర్తిగారికి శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారితో అప్పటికి పరిచయం లేదు. పెదబాలయోగి వారు మహాతపస్వి, గొప్ప యోగి కనుక ఆయన "సమాధి" తగినట్లు ఉన్నతంగా చేయించాలని తనకు తలంపు వచ్చి, ఆ విషయం మూర్తిగారితో చెప్పాలన్న తాపత్రయంతో శ్రీ సుందర చైతన్యానందస్వామి వారు మూర్తిగారితో స్వయంగా చెప్పాలన్న ఉద్దేశ్యంతో కబురు పెట్టారన్నమాట. అయితే పైన చెప్పినట్లు మూర్తిగారు అందుబాటులో లేరు. ఆ విషయం శ్రీ చైతన్యానంద స్వామి వారు మరెవరితోను చెప్పలేదు.

శ్రీ పెదబాలయోగి వారు కైవల్యసిద్ధి పొందిన (1985) రెండు మూడు సంవత్సరాల తర్వాత సికింద్రాబాదులో శ్రీ చైతన్యానంద స్వామివారి కమనీయ కంఠం, సుభోదక విషయ వివరణ, వారి మందస్మిత వదనారవిందం, మొఖంలో ఉట్టిపడే దివ్యతేజస్సు, శ్రీ మూర్తిగారినిట్టే ఆకట్టుకొన్నాయి. వారం పదిరోజులు, శ్రీ చైతన్యానంద స్వాముల వారి దివ్యోపదేశాలు ఉదయం సాయంత్రం విన్న మూర్తిగారు చివరలో వారి ప్రత్యేక దర్శక సంభాషణ కోరి (Special Personal Interview) వారిని కలుసుకొనగానే చిరునవ్వుతో శ్రీ మూర్తిగారిని సాదరపూర్వకంగా దీవించి "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు వచ్చావయ్యా! ఎంత కాలానికొచ్చావయ్యా" నీ కోసమే ఎదురు చూస్తున్నాను. చివరకీ నాటికి నిన్ను చూడగలిగాను. మహాదానందంగా వుంది. రా" అంటూ మూర్తిగారికి ప్రత్యేక దర్శన భాగ్యం, ప్రత్యేక వ్యక్తిగత సంభాషణాభాగ్యం కలుగ చేసారు శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారు. శ్రీ స్వామివారిని దర్శించగానే మూర్తిగారు గూడా శ్రీ పెదబాలయోగివారిచ్చిన దివ్యదర్శన భాగ్యం కలిగినంతటి పరమానంద భరితుడయ్యాడు.

శ్రీ ముమ్మిడివరం పెదబాలయోగివారు మూర్తిగారికి దివ్యదర్శన భాగ్యమొసంగిన శుభసందర్భంలో కూడా "యెంతకాలానికి వచ్చావయ్యా! నీ కోసమే ఎదురు చూస్తున్నా"ని మూర్తిగారితో సంజ్ఞలతో అన్నారు. మూర్తిగారికి, శ్రీ సుందరచైతన్యానందస్వామివారి సాదర పూర్వక పలుకులు, శ్రీ పెదబాలయోగివారి సాదర పూర్వక పలుకుల్ని స్మృతిపథంలో చటుక్కున మెదిలాయి. అటు శ్రీ పెదబాలయోగివారు, యిటు శ్రీ సుందర చైతన్యానంద స్వామివారు మూర్తిగారిని ఆత్మీయంగా దగ్గరకు రావించడం, ఆత్మీయంగా సంభాషించడం, అతిసన్నిహితంగా మెలగడం బట్టి మూర్తిగారికిన్నీ యీ యిద్దరి స్వాముల వారికిన్నీ పూర్వజన్మ అనుబంధమేదో ఉన్నట్లు అనిపిస్తుంది. నరేంద్రుని (శ్రీ వివేకానంద స్వామి వారిని ప్రప్రథమంగా శ్రీ రామకృష్ణ పరమహంస చూచినప్పుడు "ఎంతకాలానికి వచ్చావయ్యా! నీ రాక కోసమే ఎదురు చూస్తున్నా. రా" అంటూ సాదరంగా పిలిచి సంభాషించాడు. ఆ సన్నివేశం గుర్తుకొస్తుంది కదూ, శ్రీ పెదబాలయోగి వారు, శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారు, మూర్తిగార్ని మొట్టమొదటసారి దర్శనమిచ్చినప్పుడు అన్నమాటలు చూస్తే!

ప్రథమ దర్శన సంభాషణ సందర్భంగా శ్రీ సుందర చైతన్యానంద స్వామివారు మూర్తిగారితో, ముమ్మిడివరం శ్రీ పెదబాలయోగి వారు కైవల్యసిద్ధి పొందినప్పుడు ఆయన పవిత్ర దేహాన్ని ఎలా సమాధి చేయాలో తనకున్న తలంపు మూర్తిగారితో చెప్పాలన్న ఆకాంక్షతో మూర్తిగారి కోసం వారు విఫలప్రయత్నం చేసిన సంగతి గుర్తు చేసారు

(కొసమెరుపు: యీ రచయిత యింట్లో జరిగిన సంఘటన, శ్రీ స్వామివారి "దివ్యజీవ సమాధి-బ్రహ్మైక్యం" అధ్యాయం రాస్తున్న రోజది. అది 19-7-95 ఇంగ్లీషు కాలెండరు ప్రకారం.

ఈ రచయిత కంటే యీతని ధర్మపత్నికి శ్రీ స్వామివారిపట్ల భక్తి ప్రపత్తులెక్కువని చెప్పాడు గదా. శ్రీ స్వామివారు కైవల్యసిద్ధి జరిగిన రోజు (రాత్రి) తనకు వచ్చిన "కల" సంగతి, తదితర విషయాలు వారి గృహంలో ప్రస్తావనకు వచ్చాయి. శ్రీ మూర్తిగారి అనుభవం, తదితరులు చెప్పిన తమ అనుభవాలు, యీ అధ్యాయంలో కొంత లిఖించేరు. అధ్యాయం యింకా పూర్తి కాలేదు. రాత్రి సుమారు 11 గం॥లు అయ్యింది. మిగిలిన అధ్యాయం మరుసటి రోజు పూర్తి చేయవచ్చునని నిద్రకు ఉపక్రమించుటకు సిద్ధమయ్యారు. గృహంలోని లైట్లన్నీ ఆర్పివేసి యీ రచయిత అర్ధాంగి వచ్చి తన మంచం మీద పండుకొన్నది. ఇంట్లో పుస్తకాలు (యీ రచయితకు పుస్తకాలే సమస్త సంపదలు కనుక) ఎక్కువగా వుండుట వలన, ఎలుకలు వాటిని కొట్టి వేస్తూ వుంటున్నాయి. విలువైన పుస్తకాల్ని ఎలుకలు కొట్టివేయడం చేత బాధపడుతున్న యీ రచయిత ఇంట్లో ఎలుకల బోను పెట్టించాడు. వారి శ్రీమతి లైట్లు ఆర్పివేసి పండుకొన్న తర్వాత ఐదు పది నిముషాల్లో బోనులో ఎలుకపడింది. వారి శ్రీమతి లేచింది. వారి పెద్దమ్మాయి నిద్రించే గదిలోని "బెడ్‌లైటు" విపరీతంగా వెలుగుతూ ఆరిపోతూ ఉండటం చూసిందామె. ఏమీ అర్థంకాలేదు. ప్రక్క గదిలోని ఫ్రిజ్‌పైన వున్న లైటు గూడా అంతే. తీరా అన్ని గదులు పరీక్షగా పరిశీలిస్తే, ఇంటి ఆవరణలోని బయటి స్టోరు రూంలోని విద్యుత్‌తీగ కాలిపోతోంది. ఆమె కేక వేసింది. మేమంతా లేచాం. మా అబ్బాయి (చినబాబు) మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, ధైర్యం చేసి కాలిపోతున్న తీగను త్రెంచి వేసాడు. బహుశా బోనులో పడ్డ ఎలుక కోసం వారి సతీమణి లేవకపోతే ఒక పావుగంటలో యిల్లంతా కరెంటు మంటలతో తగలబడి పోయేది. ఈ కుటుంబ సభ్యులకు గూడా ప్రాణాపాయం జరిగేది. ఇంతకీ యీ హడావుడిలో బోనులో పడ్డ ఎలుక తప్పించుకొని పారిపోయింది. శ్రీ స్వామివారి దయ వలన (యీ రచయిత శ్రీ స్వామి వారి జీవిత చరిత్ర రాస్తూ, వారి కైవల్యసిద్ధి అధ్యాయం ఆరోజున కొంతరాస్తూ తన భార్యతో శ్రీస్వామి వారి గురించి చాలా విషయాలు ముచ్చటించుకొన్నారు కనుక) యీ రచయిత వారికుటుంబ సభ్యులు ప్రాణ గండం తప్పించుకొని బయట పడ్డారు. ఇది ముమ్మాటికీ శ్రీ స్వామివారి మహిమయే)

శ్రీ శివానంద స్వాముల వారి దివ్యదృష్టి

పూర్వాశ్రమంలో పోలీసు శాఖలో ఉద్యోగం చేసి, రమణ మహర్షి పరమభక్తుడై, పిదప సన్యాసం స్వీకరించి యోగిగా మారి, ఆధ్యాత్మిక చింతనతో ప్రస్తుతం ఢిల్లీలో ఆశ్రమం నడుపుతూ తన బోధలతో భక్తులకు మనశ్శాంతి కలుగజేస్తున్నారు శ్రీ శివానంద స్వాములవారు. వారొకసారి హైదరాబాదు జూలై 1985లో విచ్చేసినపుడు జస్టిస్ పున్నయ్యగారు (రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి) జిల్లా జడ్జి యం.యస్. శర్మగారి సలహాపై దర్శించుకోవడం జరిగింది. మాటల సందర్భంలో

జస్టిస్ పున్నయ్యగారు పెదబాలయోగి వారి ప్రస్థావన తేవడంతో శ్రీ శివానందస్వాములవారు. "శ్రీ బాలయోగివారు మూడు రోజుల క్రితం దేహం చాలించారు. మీకింకా తెలియదా. ప్రపంచానికింకా తెలియదా! పత్రికల్లో ఆ వార్త రాలేదే" అని అన్నారు. "లేదు స్వామీ" అన్నారు. జస్టిస్ పున్నయ్య గారు సంభ్రమాశ్చర్యాలతో విచిత్రమేమంటే శ్రీ బాలయోగి వారు కైవల్యసిద్ధి పొందినట్లు ఆ మరుసటి రోజు పత్రికల్లో వార్త పెద్ద శీర్షికలతో రానే వచ్చింది. జస్టిస్ పున్నయ్య గారు ఆ రోజు మరలా శ్రీ శివానంద స్వాముల వారిని దర్శించినపుడు శ్రీ ముమ్మిడివరం పెదబాలయోగివారి నిర్యాణ వార్త పత్రికల్లో వచ్చిన సంగతి వారి దృష్టికి తీసుకొని వెళ్ళారు.

"అవును నేను ముందే చెప్పాను గదా" అన్నాడు శ్రీ శివానందగారు. "స్వామీ, శ్రీ బాలయోగీశ్వరుల వారు గొప్పయోగులు గదా! దాదాపు 40 సం॥ రాల నుండి తపస్సు చేస్తున్నారు గదా! తన నిర్యాణం గురించి కమిటీ సభ్యులకు గాని, పోనీ ఆయనకు పరమభక్తులైన ఎవరికైనా గాని సూచనప్రాయంగా చెప్పి యుండవచ్చు గదా. మరియెందుకు చెప్పలేదు" అని జస్టిస్ పున్నయ్యగారు శ్రీ శివానంద స్వాముల వార్ని అడిగారు. అందుకాయన ఎందుకు చెప్పాలి? చెబితే ఆ రోజున ఎన్నో లక్షల మంది ముమ్మిడివరంలో పోగవుతారు గదా. అంతమంది వస్తే ఎన్ని సమస్యలు. శ్రీ బాలయోగివారికి మనశ్శాంతి వుంటుందా" అని సమాధానం చెప్పారు.

శ్రీ బాలయోగీశ్వరుల వారి సందేశమేమిటి?

"శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు మౌనవ్రతం బూని తమ తపోమందిరంలో తమ జీవన్ముక్తి, కైవల్య సిద్ధికొరకు దీర్ఘకాలం ఘోర తపస్సు చేసుకొన్నారు కాని వారు లోకానికి భావితరాల వారికి యిచ్చిన సందేశమేమిటి"! అని సందేహం వెలిబుచ్చిన వారున్నారు.

ఎవరైనా గొప్ప యోగీశ్వరుల వారో లేదా గొప్ప వేదాంత పండితుడో ఏ పీఠాధిపతియో తమ పాండితీప్రకర్షతో తమ వాక్చాతుర్యంతో ఉపన్యాసం యిస్తే" ఓహో! ఎంత గొప్పగా చెప్పారు. ఎంత బాగా చెప్పారు. ఒక పట్టాన అర్థంకాని వేదాంతాన్ని అరటికాయ వొలిచి నోట్లో పెట్టినట్లు ఓహో ఎంత బ్రహ్మాండంగా వివరించారంటూ" తెగ మురిసిపోతారు. బలే మెచ్చు కొంటారు. "వినన్న చెప్పిన వేదం, విన్నంతసేపూ వినోదం" అన్న చందంగా వుంటుంది! ఇంటికి పోయిన తర్వాత మరలా అంతా మామూలే భార్యా బిడ్డలు-సంసార లంపటం కథంతా షరా మామూలే. విన్నంత సేపూ వేదాంతం, వైరాగ్యం ఒలకపోస్తారు. అదే పురాణ వైరాగ్యం! ఆచరణలో అంతా శూన్యమే. ఎవరు ఎంత గొప్పగా చెప్పినా భార్యాబిడ్డలు, సిరిసంపదలు మాయ అని, అశాశ్వతమని, యీ లోకమాయా మోహబంధం నుండి బయటపడి శాశ్వతమైన స్వర్గలోక ప్రాప్తి కొరకు ముక్తి కొరకు యిష్టదైవాన్ని భక్తి, జ్ఞాన మార్గాలతో ఆరాధించమనీ భారతీయ వేదాంత, సర్వమత సారాంశం! ఈ కనీస వేదాంత సత్యం భారతీయులందరూ ఎరిగిందే.

అయితే ఎవరైనా తమ వాక్చాతుర్యంతో వివరిస్తే 'ఓహో' అని తలలూపుతారు. తెలిసిన పారమార్థిక చింతనా సత్యాన్ని ఆచరణలో పెట్టరు. పరులెవ్వరైనా చెప్పితే మెచ్చుకొనే స్వభావం మానవులది. మన స్వామివారు 'మౌనవ్రతం' తో ఏమీ చెప్పక పోయినా ది. 27-3-49న చెప్పిన నాల్గు మాటల్లోనే వేదాంత సత్యమంతా వుంది. పైగా చెప్పిన నాల్గు మాటల్ని మాటల్లోకాక ఆచరణలో పెట్టి "యిలా చేసుకొండీ" అని మార్గదర్శకుడయ్యారు. అది గ్రహించక బాలయోగి వారు లోకానికి యిచ్చిన సందేశమేమిటని "అల్పబుద్ధితో" ప్రశ్నిస్తుంటారు.

శ్రీ బాలయోగివారు 'తనవు' చాలించిన విషయమై వదంతులు ఖండన:

ఇక్కడొక విషయం గూడా చెప్పాలి. శ్రీ బాలయోగివారు 'తనువు' చాలించి, బ్రహ్మైక్యం చెందిన మూడు, నాలుగు రోజులకు ఆశ్రమానికి వచ్చిన కొందరు 'స్వామి వారి ధ్యానమందిరం నుండి' దుర్వాసన రావడం గమనించి, అనుమానంతో ఆ విషయం అక్కడున్న యితరులకు, కుటుంబ సభ్యులకు తెలియజేయడం, ఆ తరువాత ఆ విషయం అధికార యంత్రాంగానికి, కమిటీ సభ్యులకు, హైదరాబాదులోని శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తిగారికి, మద్రాసులోని శ్రీ నటరాజన్ (మాజీ జిల్లాకలెక్టరు) తదితరులకు ఆఘమేఘాలమీద తెలియపరచడం, వారంతా వచ్చి, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో ఆశ్రమ కమిటీ సభ్యులు, కుటుంబీకులు శ్రీ బాలయోగివారి తపో (ధ్యాన) మందిరం తలుపులు తీసి చూడగా, శ్రీ స్వామివారి దేహం కొంత కుళ్ళి పోయి, దుర్వాసన రావడం గమనించడం జరిగింది. తర్వాత అధికారుల సమక్షంలో 'పంచనామా' జరిపి, కమిటీ వారు, శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తిగారు శ్రీ స్వామివారి 'భౌతిక కాయానికి' స్వామివారు దీర్ఘ కాలంపాటు ఘోర తపస్సు చేసిన పవిత్రస్థలమందే సమాధి చేయడం జరిగింది.

శ్రీ స్వామి వారి విగత దేహం నుండి దుర్వాసన వచ్చిన సంగతి గమనించిన కొందరు ఆ విషయం అందరికీ తెలపడంతో, ఆ విషయం పత్రికలలో పతాక శీర్షికలలో ప్రచురించబడడం జరిగింది. కొన్ని పత్రికలు ముమ్మిడివరం శ్రీ బాలయోగి పరమపదించారని, కొన్ని పత్రికలు, భగవాన్ శ్రీ బాలయోగి కైవల్యసిద్ధి పొందారని, కొన్ని పత్రికలు బాలయోగి తనువు చాలించడనో, మరణించాడనో, యీ విధంగా వార్తలు ప్రచురించగా మరి కొన్ని పత్రికలు 'బాలయోగి హత్య చేయబడ్డాడనీ, ఆ బాలయోగిని యెవరో చంపారని 'శీర్షిక'తో వార్తలు ప్రచురించాయి.

శ్రీ బాలయోగి బ్రహ్మైక్యం చెందాడనో, పరమపదించాడనో, తనువు చాలించాడనో పోనీ 'చనిపోయాడ'నో వార్తలు ప్రచురించడంలో కొంత ఔచిత్యం వుంది. కాని, బాలయోగిని ఎవరో చంపారనో, బాలయోగి హత్య గావింపబడ్డాడనో వార్త ప్రచురించడం దారుణం! లోకులు కాకులు! రకరకాలుగా చెప్పుకుంటారు. పత్రికలవారు ఇంతంటే, మరికొంత కలిపి గోరంతలు

కొండంతలు చేసి రాయడం పరిపాటి. పత్రికల వారికి నిజా నిజాలు తెలుసుకోవడం కన్న ప్రచారం ముఖ్యం కదా! బాలయోగిని ఎవరో చంపారని ఎవడో పోకిరి వాడు అని వుంటాడు. పత్రికలకది' షడ్రశోపేత భోజనం! అది అలావుంచండి.

శ్రీ బాలయోగి వారు స్వచ్ఛంద గృహ నిర్బంధంలో తలుపులు బిడాయించిన (తాళం వేసిన) తపో మందిరంలో 1949 ఏప్రియల్ నుండి ఏకాంతంగా తన 'మానాన' తాను కఠోర (ఘోర) తపస్సు చేసుకొంటూ వచ్చారు. 6-2-49న శ్రీ వ్యాసం సత్యరాజుతోను, 10-2-49న శ్రీయుతులు, సత్యరాజు గరిమెళ్ళ కృష్ణమూర్తిలతో తాను, కడపటి మెట్టులో 'ఘోర తపస్సు చేయుచున్నట్లు' తన దర్శనార్థం (ఆనాడు ఆయన తపోపర్ణశాలకు తలుపులు లేవు) వచ్చే ప్రజలు చేసే 'గొడవ' వల్లను తనను 'ముట్టు' కొనుట వలనను తన 'తపస్సునకు చలనము' కలుగుచున్నదని, కనుక తన "తపోమందిరంలోనికి ప్రజలెవ్వరు ప్రవేశింపకుండునట్లు తలుపులు మూయించి తాళం వేయవలయును" తానిక ఎవరితో మాట్లాడననీ, అని ఖచ్చితంగా ఆదేశించియున్నారు. అదే విధంగా 27-3-49న ఎంత గొప్పవారు వచ్చి బలవంతం చేసినా తపోమందిరం తలుపులు తీయవద్దని, భక్తుల నుండి కానుకలు, డబ్బులు బలవంతంగా వసూలు చేయవద్దని, ఎవరైనా యిస్తే దానిని 'అన్నదానం'నకు ఖర్చు చేయుమని చెప్పారు. ఎవరు వచ్చినా, ఎంత గొప్ప వారు వచ్చి బలవంతం చేసినా, తమ తపో మందిరం తాళాలు తీసి తలుపులు తెరవవద్దని ఖచ్చితంగా 1949లోనే ఆదేశించి యున్నారు కనుక ఎవరు వచ్చి, బలవంతం చేసినా, ఆశ్రమ కమిటీ వారు, కుటుంబ సభ్యులు శ్రీ స్వామివారి తపో మందిరం తాళాలు తీయలేదు. శ్రీ స్వామివారు తపస్సు ప్రారంభించిన మొదట్లో ఆయన తపస్సుకు శంకించిన వారు, అదంతా నాటకమన్నవారున్నారు. శ్రీ బాలయోగి వారికేదో "వింతవ్యాధి' పట్టుకొన్నట్లుంది కనుక వారిని పరీక్షించాలని, తలుపులు తీయమన్న వైద్యులు. ఆహారపానీయాలు లేకుండా ఏండ్ల తరబడి జీవించడం 'జీవశాస్త్ర రీత్యా' అసాధ్యం కనుక శ్రీ బాలయోగికి దొంగతనంగా ఆయన కుటుంబీకులో, ఆయన్ని నమ్మిన 'మూఢ' భక్తులో ఆయన అభిమానులో, ఆయనకు 'రాత్రిపూట' అన్నపానీయాలు అందచేస్తున్నారన్న అనుమానంతో 'దొంగ చాటుగా' ఆశ్రమ ప్రాంతంలో మాటువేసి ఎందరో పరీక్ష చేసి శ్రీ బాలయోగి చేసే తపస్సులో 'మోసమేమీ' లేదని తేల్చుకొన్న వారున్నారు. శ్రీ బాలయోగితో మాట్లాడాలని తలుపులు తీయమని పట్టుబట్టిన మిడిమిడి జ్ఞానం గల హేతువాదులున్నారు. కాని రాను, రాను శ్రీ బాలయోగి తపస్సును ఎవరూ శంకించనూలేదు. సందేహించనూ లేదు. అనుమానించనూలేదు. యోగశాస్త్రం ప్రకారం అన్న పానీయాలు లేకుండా కేవలం వాయుభక్షణతోనే సంవత్సరాల తరబడి తపస్సు చేయవచ్చని, ధ్యాన నిమగ్నులు కావచ్చని యోగశాస్త్ర పండితులు ప్రకటించడంతో శ్రీ బాలయోగి

వారి తపస్సును గురించి పట్టించుకున్నవారు, సందేహించిన వారు లేరు. పైగా కొందరు సందేహించినట్లు ఆయన దొంగతనంగా వేలు, లక్షలు ధనం వసూలు చేయడంలేదని, కనీసం ఆయన కుటుంబీకులు సహితం శ్రీ బాలయోగివారి పేరు చెప్పి, అధిక మొత్తంలో ధనం వసూలు చేయడం లేదని తేలడంతో శ్రీ బాలయోగివారి 'తపస్సు'ను అనుమానించడం మానివేసారు. శ్రీ బాలయోగివారి ఆశ్రమ ప్రాంగణంలో, శ్రీ స్వామివారిపై నున్న భక్తి విశ్వాసాలతో శ్రీ స్వామివారి మహిమలు స్వీయానుభవంలో గ్రహించినవారు. అగ్రకులాలకు చెందిన శ్రీయుతులు బచ్చు మాధవయ్య, ముత్యాల జానకిరామన్న, ధారా సర్వేశ్వరరావు, బోర పోలయ్యరెడ్డి, జిల్లా అధికారులు బాల సుందరం, నటరాజన్ తదితర ప్రభృతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తపోమందిరాలు, గోపురాలు, తదితర కట్టడాలు నిర్మించారు. అగ్రవర్ణాలకు చెందిన సర్వశ్రీ జయంతి స్వామినాయన, వంకల అప్పారావు, బులుసు బుచ్చిరాజు, శ్రీ వినాయక రావు బ్రహ్మశ్రీ ఆకొండి వ్యాసమూర్తి ప్రభృతులు శ్రీ బాలయోగివారి జీవితం గురించి, వారి తపో మహిమల గురించి పలు రచనలు చేసారు.

సంవత్సరానికి ఒక్కసారి, మహా శివరాత్రి మరుసటి రోజున, తమ తపోమందిరం నుండి బయటికి వచ్చి, భక్తులు నిర్మించిన దర్శన మండపంపై ధ్యానముద్రలో కూర్చొని తమ దర్శనార్థం వచ్చిన లక్షలాది భక్తులకు దర్శన భాగ్యం కలుగజేసెడివారు కాని ఎవరితోనూ, ఏనాడూ ఏ విషయమూ మాట్లాడలేదు. కమిటీ సభ్యులతో గూడా! మూగసైగలతో, సౌంజ్ఞలతోనే వారడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పెడివారు. ఏ పూర్వ జన్మ సుకృతం వల్లనో బాల్యమందే తపస్సు ప్రారంభించాడు. ఆహార పానీయాలు విసర్జించాడు. లోక జీవితంపై బాల్యమందే వైరాగ్య భావం కలిగిందాయనకు. ఆయన కోరుకొన్నది జీవబ్రహ్మైక్యం! జన్మరాహిత్య కైవల్య సిద్ధి!

ఇటువంటి 'మౌన యోగిపై' 'కాష్టమౌని'పై తన తపో మందిరంలో స్వచ్ఛంద గృహ నిర్బంధంలో పూర్వజన్మ సుకృత ఫలితంగా జీవ సమాధిలో సంవత్సరాలు తరబడి 'కఠోర తపస్సు చేసుకొన్న మహాయోగిపై ఎవరికి ఎందుకు ద్వేషముంటుంది'. తమ దేహం మీదనే తమకు అభిమానం లేదాయనకు! ఎవరి నుండీ ఏమీ ఆశించలేదాయన! మౌనవ్రతంలో కఠోర తపస్సు చేసుకొనే శ్రీ బాలయోగి వారు ఎవర్నీ పల్లెత్తు మాట అని ఎరుగడు. ఆ జన్మ మహాయోగి అయిన శ్రీ బాలయోగి వారు 'విదేహుడు' (దేహరహితుడు) ప్రకృతిలయుడు, భూతేంద్రియ విజయుడు కనుకనే డా॥ భీమన్న గారన్నట్లు బాలయోగి నిరాహారిగా తన శరీరం గురించే పట్టించు కోలేదు. అది వున్నా, లేక పోయినా స్థితి ఒక్కటే కదా! బ్రతుకూ, చావూ రెండూ ఒకే రూపమైన ఒక మహాయోగి వాటి గురించి పట్టించుకోడు" అని డా॥ బోయి భీమన్న గారు అన్నారు. ఆహార పానీయాలు శరీర పోషణార్థమే కదా. వాటిని విసర్జించిన యోగికి తన 'దేహం'

పై 'మోహ'మెందుకుంటుంది! తన స్వీయ దేహంపైననే కాదు. లోక జీవితంపై, మాయామేయ లోక భోగ భాగ్యాలపై అణుమాత్రమైన 'వ్యామోహం' 'దురభిమానం' లేని శ్రీ బాలయోగి వారిని 'చంపాలనో' లేదా హత్య చేయాలనో ఎవరికైనా ఎందుకు దుర్బుద్ధి పుడుతుంది'. ఒక వేళ అట్టి దురుద్దేశం వుంటే అది ఆయన తపస్సు ప్రారంభించిన (1946 ప్రాంతంలో) తొలి రోజులలోనే వుండి వుండాలి.

మనుధర్మశాస్త్ర ప్రకారం, శూద్రులు, పంచమ కులస్థులు, వేదాలు, శాస్త్రాలు చదవకూడదు, వినకూడదు. వేదానుసారంగా, శాస్త్రానుసారంగా జీవనం సాగించకూడదు. ఈ యిరవయ్యో శతాబ్దంలో విజ్ఞాన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోపాటు మానవతా దృక్పథంలో చాలా మార్పులు వచ్చాయి. అగ్రవర్ణాలకు చెందిన మానవతావాద సంస్కర్తలే, శూద్రుల్ని, అస్పృశ్యులు ఉద్ధరించడానికి ఉద్యమించారు. అగ్రవర్ణాలకు చెందిన వారే శ్రీ బాలయోగివారికి ఆత్మీయ భక్తులైనారు. ఆశ్రమాభివృద్ధికి తపోమందిరాది భవనాల్ని నిర్మించారు. అగ్రవర్ణాలకు చెందిన శ్రీయుతులు జయంతి స్వామినాయన, బ్రహ్మశ్రీ ఆకొండి వ్యాసమూర్తి, వేలూరి శివరామశాస్త్రి వంటి వారే శ్రీ బాలయోగి వారి తపస్సును మెచ్చుకొన్నారు. అయినా సనాతన ఛాందస సంకుచిత భావాలున్న అగ్రవర్ణాలవారు కొందరుంటారు గదా. వారికి అస్పృశ్యకులస్థుడైన శ్రీ బాలయోగివారు శాస్త్ర సమ్మతంగా తపస్సు చేయడం గిట్టక పోవచ్చు. అట్టివారు శ్రీ స్వామివారిని చంపి వేయించటానికి దురాలోచన చేసి వుండవచ్చు. 1949 ఏప్రియల్‌కు ముందు స్వామి వారి మందిరానికి తలుపులు లేవు కనుక, ఆనాడే శ్రీ స్వామి వారిని చంపించటానికి ప్రయత్నించి యుండేవారు. కాని అలా జరగలేదు. అంటరాని వాడు తపస్సు చేయడం గురించి ఏ అగ్రవర్ణం వాడు "సీరియస్"గా తీసుకోలేదు. పోనీ 1985లో శ్రీ స్వామివారిపై "హత్యా ప్రయత్నం" చేసారనుకుంటే, తపోమందిరం తలుపులు తీసిన దాఖలాలు లేవు! తాళాలు పగులకొట్టిన దాఖలాలు అసలే లేవు. కనుక శ్రీ బాలయోగివారిని "ఎవరో చంపారనో" లేక ఎవరో హత్య చేసారనో, ఎవడో ఆకతాయి పుట్టించిన పుకారు వట్టి అభూత కల్పన మాత్రమే. శ్రీ బాలయోగివారి కఠోర తపోశక్తివలన మందిర తలుపులు తెరచుకొనుట సాధ్యపడదు. తాళాలు పగులగొట్టే ప్రయత్నం ఎవరూ చేయలేరు. అంతకన్నా శ్రీ బాలయోగివారిని "సమీపించి" వారిపై హత్యా ప్రయత్నం ఎవరునూ చేయలేరు. ఇది ముమ్మాటికి సత్యం! ఇక్కడ మనం గుర్తుంచుకొనవలసిన ముఖ్యమైన వాస్తవమేమిటంటే శ్రీ బాలయోగి వారి తపో ఆశ్రమం తలుపులు ఎప్పుడూ బిగించి తాళము వేయబడి వుంటాయి గదా! ఒక్క మహాశివరాత్రికి మాత్రమే కమిటీ వారు ఆశ్రమం తలుపులు తెరుస్తారు. మరి 1985 జూలై 17న గాని 19న గాని మందిరము తలుపు తెరచిన దాఖలాలు గాని, తాళాలు పగులగొట్టి, తలుపులు తీసిన దాఖలాలు గాని

లేవు గదా! మందిరం తలుపులు తీయకుండా ఆయన్ని ఎవరైనా ఎలా చంపగలరు? హత్య చేయడం ఎలా సాధ్యమౌతుంది! మందిరం నుండి దుర్గంధం వెలువడుతున్నట్లు ఆశ్రమానికి వచ్చిన భక్తులు ఆ విషయం అక్కడున్న వారికి, గ్రామస్థులకు తెలుపుట వలన, ఆ వార్త హైదరాబాదులోని శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారికినీ, వివిధ గ్రామాలలో ఉంటున్న యితర కమిటీ సభ్యులకు, కుటుంబ సభ్యులు వెనువెంటనే తెలియజేయడం వలన, వారంతా వచ్చి, స్థానిక రెవెన్యూ పోలీసు అధికారుల సమక్షంలో మందిరం తలుపులు తీయడం జరిగింది. శ్రీ బాలయోగివారి దేహం కొంత కుళ్ళిపోయి, దాని నుండి దుర్గంధం వెలువడడం వారంతా గమనించారు. తమ కళ్ళతో చూసారు. ముక్కులతో ఆ దుర్వాసన చవి చూసారు. నిశ్చేష్టులై దుఃఖ సముద్రంలో మునిగిపోయారు. తర్వాత తేరుకొని, తమాయించుకొని, అధికారులు, పెద్దలు, కమిటీ సభ్యుల సమక్షంలో "శవ పంచనామా" జరిపించారు. కనుక కమిటీ వారు వచ్చి, అధికారుల సమక్షంలో మందిరం తలుపులు తీసే వరకు వేసిన తలుపులు వేసినట్లుగానే, వేసిన తాళాలు వేసినట్లుగానే వుండగా, మరి శ్రీ "బాలయోగి వారినెవరో చంపివేశారన్న" పుకారు ఒట్టిదేనని అది 'అభూత కల్పన' యని స్పష్టంగా విదితమగుచున్నది.

శ్రీ స్వామివారు కమిటీ సభ్యులకు ఏదో పని అప్పగించి, దానిని పూర్తి చేసి మూడు నెలల తర్వాత తమను దర్శించమని ఆదేశించారని శ్రీ మూర్తి గారు నాతో (యీ రచయిత) చెప్పడం జరిగింది. స్వామివారి ఆదేశాన్ని కమిటీ సభ్యులు సరిగ్గా గ్రహించలేక పోయారట. స్వామివారు 'కైవల్యసిద్ధి' చెందిన తర్వాత స్వామివారి సొజ్ఞలు జ్ఞప్తికి తెచ్చుకొని బాధపడ్డారు. సామాన్యంగా ఒక్క మహా శివరాత్రి నాడు తప్ప మిగిలిన రోజులలో మందిర తాళాలు తీసి, తలుపులు తెరవడం అనేది స్వామి వారి ఆదేశాను ప్రకారం జరగడంలేదు గదా! 1949 ఏప్రిల్‌లో మందిరానికి తలుపులు బిగించి తాళాలు వేసిన తర్వాత కొంతకాలం (కొన్ని సంవత్సరాలు) కమిటీ వారు ప్రతి సంవత్సరం డిశంబరు మాసమధ్యంలో మందిరం తలుపులు తెరచి (ఒక్కొక్క సారి వెంటనే తెరుచుకొనేవి-ఒక్కోసారి కొంత ఆలస్యంగా తెరచుకొనేవి) రాబోయే ఫిబ్రవరి-మార్చి మాసాలలో మహాశివరాత్రికి స్వామి వారు భక్తులకు యిచ్చే దర్శనంనకు అనుమతి గురించి, అందుకు స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు చేయవలసిన తగు యేర్పాట్లు గురించి స్వామివారి అనుమతి తీసుకొనేవారట. కొంతకాలం తర్వాత ముందుగా (డిశంబరులో) తమ అనుమతి కోసం మందిరం తలుపులు తీయనక్కరలేదని మహాశివరాత్రికి మాత్రమే మందిరం తలుపులు తీయుడని స్వామివారు కమిటీ వారికి నిర్ద్వంద్వంగా చెప్పారట. కనుక సంవత్సరంలో ఒక్క మహాశివరాత్రికి మాత్రమే మందిరం తలుపులు తీయడం జరుగుతూ వస్తుండేది.

అలా వుంచితే, 1985లో మహాశివరాత్రి మరుసటి దినం లక్షలాది భక్తులకు దర్శనం యిచ్చి తమ తపోమందిరంలోనికి వెళ్ళిపోయి ధ్యానపీఠంపై ఆసీనులైన పిదప ఆనవాయితీగా స్వామివారిని దర్శనం చేసుకొనుటకు కమిటీ సభ్యులు స్వామివారిని కలుసుకోగా, మూడు నెలల తర్వాత తమ దర్శనం చేసుకోవలసిందిగా ఆదేశించారని తెలిసింది. స్వామివారి ఆదేశాల్ని సరిగ్గా గ్రహించని కమిటీ సభ్యులు స్వామివారిని మూడు నెలల తర్వాత దర్శనం చేసుకోలేదు. ఇంతలో దురదృష్టవశాత్తు 1985 జూలైలో స్వామి వారు 'తనువు' చాలించి తమ జీవాత్మను పరమాత్మలో ఐక్యపరచి-కైవల్యసిద్ధి పొందారు. బ్రహ్మైక్యం చెందారు.

మనం గ్రహించవలసిన రహస్యమొకటుంది. మహాశివరాత్రి మరుసటి దినం తప్ప మిగిలిన ఏ రోజుల్లోనూ తమ తపోమందిరం తలుపులు తీయరాదని ఆదేశించిన శ్రీ బాలయోగివారు, యీసారి తమను మూడు మాసముల తర్వాత దర్శనం చేసుకోవలసిందిగా కమిటీ సభ్యులను ఆదేశించడంలోని ఆంతర్యం ఏమిటంటే, శ్రీ బాలయోగి వారికి తమ ఘోర తపస్సు ఫలించే సమయం ఆసన్నమైనదనీ, తమ తపో సిద్ధితో తాము 'తనువు' చాలించనున్నానని "యెఱుక" గల్గిన స్వామివారు కమిటీ వారిని మూడు నెలల తర్వాత తమను దర్శించమని చెప్పియున్నారు. వారు స్వామివారిని దర్శించుకోలేదు. మరికొద్ది రోజులు (బహుశా మరొక మాసం రోజులు) చూసారు. కమిటీ సభ్యులు తమ దర్శనంనకు రాలేదు. తమ తపో సిద్ధి పొందే సమయం ఆసన్నం కావడంతో తాము పంచభూతాత్మకమైన భౌతికకాయాన్ని "తనువు' 'ను వదలి (చాలించి) తమ పవిత్ర జీవాత్మను పరబ్రహ్మంతో ఐక్యపరచుకొని, జీవబ్రహ్మైక్యం చెంది జన్మ రాహిత్యం చేసుకొని, కైవల్యసిద్ధి పొందారు.

ప్రముఖ కవి బోయి భీమన్న గారు వ్రాసిన "బాలయోగీయం"లో ఈ విధముగా బాధపడుతూ వ్రాసిన మాటలు:

"అధికార అనధికార మేధావి వర్గాలలో కనీసం ఒక్కరైనా ఆయన మృతి గురించిన వివరాలివ్వడంగాని, సంతాప ప్రకటన చేసినట్లు గాని కనిపించలేదు. బ్రతికుండగా నలభై సంవత్సరాలపాటు లోకం దృష్టిని, లక్షల కొలదీ భక్తులను ఆకర్షించగలిగిన ఒక మహా తపస్వి హఠాత్తుగా మరణిస్తే ఒక్కరు కూడా పట్టించుకోలేదంటే ఏమనుకోవాలి? భారతీయమైన వేద సనాతనమైన ఆధ్యాత్మికశక్తిని అంత స్పష్టంగా అంతకాలం పాటు ప్రదర్శించి చూపిన ఒక పరమయోగి తపో మధ్యలోనే తనువు చాలించినప్పుడు ఆ రంగానికి సంబంధించిన మహర్షులూ, బాబాలూ, అధ్యాత్మవేత్తలూ తమ విభ్రాంతినీ, సంతాపాన్నీ ప్రకటించవలసి లేదా! ఇంత అన్యాయమా.... బాలయోగి హరిజనుడు కావడం వల్లనే అంతటి ఉపేక్షకు గురి అయినాడేమో

అనీ, మరొక పై కులం వాడై వుంటే నాయకులంతా పెద్ద పెద్ద పుష్పగుచ్ఛాలతో, ప్రచారక దళాలతో ఆయన మృత కళేబరం చుట్టూ మూగి ఉండేవారనీ, దేశంలోని అన్ని పత్రికల విలేఖరులు అక్కడే కాపురం పెట్టి వుండే వారనీ ఒక భావన నాలో మెదిలినప్పుడు ఇక నేను భరించుకోలేక పోయాను" నాలో మెదిలిన భావం సిసలైంది కాకపోవచ్చు ఆ క్షణంలోనే అనుకొన్నాను నేను. బాలయోగి కేంద్రంగా ఒక కావ్యం వ్రాయాలని వెంటనే ప్రారంభించాను రచన అని అంటూ, బాలయోగిని ఆదర్శంగా పెట్టుకొని, ఆయన తపోమందిరం చుట్టూ ఎన్నో యోగవిశ్వాలయాలు, ఆత్మశక్తి పరిశోధక కేంద్రాలు నెలకొల్పబడాల్సింది. ఏమీ జరగలేదు. కనీసం అంతటి మహాయోగి తనువు చాలిస్తే సంతాపం ప్రకటించిన వాళ్ళు గూడా లేకపోయారు.

"ఆశావాదినైన నేను సనాతన భారత జాతి చచ్చి పోతున్నదంటే అంగీకరించలేక కేవలం యిదంతా కులతత్వం కారణంగా జరుగుతున్నదని బాలయోగి హరిజనుడు కావడం వల్ల యిలాంటి ఉపేక్షకు గురి అయినాడే తప్ప భారతీయత మరణోన్ముఖం కాలేదని చెప్పబూనుకొన్నాను. భారతీయతా భారతీయ మేధావితా, సమగ్ర భారతీయ ఆత్మా జాగృతం కావాలనీ 'సమాన మస్తువోమనో' అనే వేద నినాదం ఉద్భుతమై పురోగమించాలనీ ఉద్బోధిస్తున్నాను. ఇదే నా "బాలయోగీయం" కావ్య లక్ష్యం అని భీమన్న గారు తమ రచనోద్దేశం విశదీకరించారు.

భీమన్న గారు తానీ 'బాలయోగీయం' కావ్యం రాస్తున్న రోజుల్లో, ముంగిట పూలమొక్కలు మధ్య కుర్చీలో కూర్చొని పద్యాలు రాస్తూ ఒకనాడు కాస్త కునుకు తీసి కళ్ళు తెరచేసరికి, ఒక చిన్న సర్పం తాను కూర్చున్న కుర్చీ ప్రక్కగా మెల్లగా తననేమీ చేయకుండా పూలమొక్కలలో కావ్యం రాసాడు. ఎంత విచిత్రం. నా దృష్టిలో అది శ్రీ బాలయోగివారి మహిమ ప్రభావమే. అలానే విగ్రహారాధనని తీవ్రంగా నిరసిస్తూ, దేవుడొక 'మత్తుమందు' అనే రచన చేసి, పరమాత్మవున్నా దేవుడు లేడనే భీమన్న గారు 'బాలయోగీయం' కావ్యం 'ముందుమాట' లో విగ్రహారాధనని సమర్థించడం విచిత్రం! అది శ్రీ బాలయోగి వారి మహిమేనని నా భావన.

అగ్ర-నీచ 'వర్ణ' వివక్షతతో విరాజిల్లుతున్న హైందవ సమాజంలో, అగ్రవర్ణాల వారికి 'అగ్రతాంబూలం' కులహీనులకు 'ఎంగిలాకులు' పంచిపెడుతున్న సమాజంలో 'కడజాతి' లో పుట్టినా దాదాపు నాల్గు దశాబ్దాలు అన్నపానీయాలు విసర్జించి ఘోర (కఠోర) తపమాచరించి శ్రీ బాలయోగీశ్వరుడు 'తనువు' చాలిస్తే కనీసం 'సంతాపం' ప్రకటించిన నాయకులు గాని, స్వామిజీలు కాని లేకపోవడం పట్ల భీమన్న మనోవేదనకు గురి అయ్యారు. మహాకవిగా తాను యాభైకి పైగా విభిన్న సాహితీప్రక్రియలకు సంబంధించిన మేలిముత్యాలవంటి మహాకావ్యాలు రాసిన, తాను కడజాతిలో పుట్టడం వల్లనే, జ్ఞానపీఠ్ వంటి దేశీయ ప్రతిష్ఠాత్మక అగ్ర పురస్కారం

గాని, పద్మభూషణ్ లేదా పద్మ విభూషణ్ వంటి అధికారిక గౌరవం గాని దక్కక పోయినందుకు మనోవేదనకు గురి అయిన భీమన్నగారు అంతటి మహాయోగి 'పరమపదిస్తే' తనువు చాలిస్తే కనీసం 'సంతాపం' ప్రకటించిన వారు లేకపోయినందులకు మనోవేదన చెందడం సహజం. తత్ఫలితంగానే తాను 'బాలయోగీయం' కావ్యరచన చేయడం శ్రీ భీమన్నగారి బాధలో మనోవేదనలో ఎంతో సత్యముంది. 'కుల వివక్షత' మూలంగా తక్కువ కులంలో పుట్టిన మేధావుల, మహనీయుల 'గొప్పతనాన్ని' యీ హిందూ సమాజం గుర్తించక పోవడం దురదృష్టకరం. విచారకరం. అయితే శ్రీ బాలయోగీశ్వరుల వారు పేరు ప్రతిష్టలు పొంది మాగధుల స్తోత్రాలు ఏనాడూ ఆశించలేదు. అందుకాయన తపస్సు చేయలేదు. తమ తపోదీక్ష లక్ష్యం జీవబ్రహ్మైక్యం!

'జీవబ్రహ్మములకే కాక శిల్పాకృతి'గా చిన్నతనమందె జీవబ్రహ్మైక మొందిన సిద్ధుడిగా 'ఆస్తికులకు నీవు వాస్తవ దైవంబు, నాస్తికులకు దైవ వాస్తవంబు'గా 'దళిత జనవేద వారసత్వ బుజువు'గా శ్రీ బాలయోగి వారిని భీమన్నగారు అభివర్ణించాడు.

"నిన్ను చూడరాగనీవు చూపెదు గీత
గీత చూడ బోవక్రియను చూపు
క్రియను చూడ కోటి కిరణాల మిరుమిట్లు
కన్ను మూసిలోని నిన్నె చూపు" - బాలయోగీయం

శ్రీ చిన బాలయోగీశ్వరులు

శ్రీ కటికదల గంగయ్య గారికి రెండవ భార్య శ్రీమతి రామమ్మ గారి వలన సుబ్బారావు అనే పేరుతో తృతీయ (మూడవ) కుమారుడు జన్మించి "బాలయోగి"గా ప్రసిద్ధి చెంది మహాయోగీశ్వరుడై నిర్వికల్ప సమాధి బ్రహ్మైక్యం చెందిరి. శ్రీ పెదబాలయోగి వారు పుట్టిన తర్వాత శ్రీమతి రామమ్మగారు నాల్గవ సంతానంగా ఒక కుమార్తెను కని పరమపదించింది. వయోవృద్ధుడైనను, జవసత్త్వములు గల్గియున్న వాడగుటచేతను, పెద్ద కుటుంబ భారం చేతను, ముఖ్యంగా రెండవ భార్య వలన కలిగిన బిడ్డల సాకుటకై శ్రీ గంగయ్య మూడవ వివాహం చేసుకొన్నాడు. మూడవ భార్య పేరు శ్రీమతి వెంకమ్మగారు.

శ్రీమతి వెంకమ్మ గారు, పెదబాలయోగి వారికి చిన్నమ్మ అవుతుంది (పిన్ని). అంటే పెదబాలయోగి వారి తల్లియైన రామమ్మ గారి తల్లి నక్క సత్తెమ్మగారు గదా. సత్తెమ్మగారి చెల్లెలు పరమటి వెంకమ్మగారు. వారి గ్రామం కొత్తపేట. ఈ వెంకమ్మ గారి ప్రథమ కుమార్తె శ్రీమతి వెంకమ్మ గారు. ఈ వెంకమ్మ గారినే శ్రీ గంగయ్య మూడవ భార్యగా వివాహమాడినాడు అంటే పెదబాలయోగి వారి తల్లి రామమ్మ గారున్నూ. వెంకమ్మ గారున్నూ అక్కా చెల్లెంద్ర కుమార్తె లన్నమాట. అంటే రామమ్మ గారికి వెంకమ్మగారు పినతల్లి కుమార్తె. అంటే వారిద్దరూ అక్కా చెల్లెళ్ళు.

శ్రీ గంగయ్య గారికి మూడవ భార్య యగు శ్రీమతి వెంకమ్మ గారి వలన ఐదుగురు కుమారులు ఒక కుమార్తె కలిగారు. ఐదుగురు కుమారులు, (1) భూషణం (2) చంద్రరావు (3) సూర్యనారాయణ (4) పెదసుబ్బారావు (5) చినసుబ్బారావు. కుమార్తె పేరు బాలయోగీశ్వరమ్మ. వెంకమ్మగారి పెద్ద కుమారుడు శ్రీ భూషణమే చిన బాలయోగీశ్వరులవారు. చినబాల యోగివారు ది. 3-11-1941న శ్రీ గంగయ్య శ్రీమతి వెంకమ్మలకు ప్రథమ కుమారుడుగా జన్మించాడు.

శ్రీ భూషణంనకు అయిదు సంవత్సరాల వయస్సురాగానే తల్లిదండ్రులు, తమ బిడ్డకు, చదువు నేర్పించే ఉద్దేశంతో 'బడి'లో వేసారు. కాని పిల్లవానికి చదువుపై ధ్యాసలేదు. "అక్షరాభ్యాసం" జరిగి "ఓనమాలు" (అ, ఆలు) నేర్చుకొని మొదటి తరగతి పూర్తిగా చదవకుండగనే శ్రీ భూషణం 'బడి'కి పూర్తిగా మానివేశాడు. "అక్షర స్వరూపుడగు" పరబ్రహ్మంను తెలిసి కొనవలసి యున్న బాలునకు యీ 'అ, ఆ"లు "ఓనమాలు" అక్షరాలు దిద్దినా ఒకటే దిద్దక పోయినా ఒకటే. విధివిలాసం, పిల్లవానిని చదివించవలయునని తల్లిదండ్రులు ఎంతో

ప్రయత్నించారు కాని ప్రయోజనం లేకపోయింది తిట్టినా కొట్టినా పిల్లవాడు బడికి పోనని మొండికేసాడు. చేసేది లేక శ్రీ గంగయ్య భూషణంను సహితం సుబ్బారావునకు వలె పాలేరుతనం చేయించ నిశ్చయించుకొన్నాడు.

శ్రీ చొక్కా సత్తెయ్య అను శెట్టి బలిజ కులస్థునింట భూషణమును "గోపాలుని"గా నుంచాడు శ్రీ గంగయ్య. ఒక సంవత్సరంపాటు మాత్రం ఆ కామందుని గోవుల కాచి ఆ తర్వాత గోపాలవృత్తి మానివేసి, శ్రీ భూషణం యింటి వద్దనే యుండి తమకున్న "పశువుల్ని" మేపుచుండెడివాడు.

తన అన్నగారు శ్రీ సుబ్బారావు (పెదబాలయోగి) అప్పటికి తపస్సు ప్రారంభించి (జూన్ 4) యున్నాడు. అప్పటికి శ్రీ భూషణం ఐదారు సంవత్సరాల వయస్సు గల బాలకుడు మాత్రమే. ఆశ్రమ కమిటీ ఉపాధ్యక్షుడైన శ్రీ ముత్యాల జానకిరామన్నగారు ఆశ్రమానికి నాల్గైదు గోవులను కొనిచ్చినాడు. శ్రీ భూషణం ఆ గోవులను మేపుచూ పగలపూట శ్రీ పెదబాలయోగి వారి ఆశ్రమ ప్రాంగణమందే యుండెడివాడు. తల్లిదండ్రులతోను, తోటి బాలకులతోను శ్రీ భూషణం పెద బాలయోగి తపో పర్ణశాల దగ్గరకు వెళ్ళి అన్న కన్నులు మూసుకొని, పిలిచినా పలుకకుండా తపస్సు చేయడం, వింతగా చేసేవాడు. సంతోషపడేవాడు. తెలియని ఆనందానుభూతి పొందేవాడు. తపస్సు చేసుకొనే అన్నగారి యెడల శ్రీ భూషణానికి భక్తి విశ్వాసములు, ప్రేమ, గౌరవం ఏర్పడసాగాయి. తన అన్నగారగు సుబ్బారావు వలె తానును ఎందుకు తపస్సు చేయకూడదని అంత పిన్నవయస్సులోనే ఆలోచన చేయడం మొదలు పెట్టాడు శ్రీ భూషణం.

భక్తులు ప్రజలు తండోపతండాలుగా వచ్చి అన్నగారిని దర్శించి భక్తిశ్రద్ధలతో దర్శించి పోతూ వుండడం శ్రీ భూషణం గమనించాడు. 1950 ఫిబ్రవరిలో వచ్చిన శివరాత్రికి పెదబాలయోగీశ్వరుల వారిని దర్శించుటకు, లక్షలాది మంది ప్రజలు వచ్చుట శ్రీ భూషణం గమనించాడు. అన్నగారిని అందరూ "యోగీశ్వరుడని" బాల శివావతారునిగా సంభావించుట గమనించాడు. శ్రీ పెదబాలయోగి వారు అప్పటికి తపస్సు ప్రారంభించి, నాల్గు సంవత్సరాలు గూడా నిండలేదు. అప్పుడాయన పెంకుటింటి పర్ణశాలలోనే తపస్సు చేసుకొనుచుండెడివాడు. ఎవరూ లేని సమయంలో శ్రీ భూషణం తపో పర్ణశాలలోనికి వెళ్ళి "ఒరేయ్ అన్నాయ్ నేను గూడా నీకు లాగానే తపస్సు చేస్తాను రా చేయమంటావా వద్దా" అంటూ అప్పుడప్పుడు ఒంటరిగా నున్నప్పుడు అడిగే వాడనీ "సరే నీయిష్టం" అని శ్రీ పెదబాలయోగీశ్వరులవారు తమ్మునకు సైగలతో చెప్పినట్లు జనశ్రుతి! అన్నగారి అనుమతియే దైవాజ్ఞగా సంభావించి, తానూ తన అన్నగారి వలెనే తపస్సు చేయాలని, నిశ్చయించుకొన్నాడు శ్రీ భూషణం!

శ్రీ భూషణం 16-2-1950 "శివరాత్రి" మరునాడు అన్నగారగు బాలయోగీశ్వరుల వారి "చిత్రపటం"ను కొన్నాడు. అన్నగారు శ్రీ సుబ్బారావు తపస్సు ప్రారంభించిన ఇళ్ళ గోవిందరావుగారి కొబ్బరి తోటలోనే అన్నగారు ఏ కొబ్బరి చెట్టుక్రింద అయితే "తపస్సు" ప్రారంభించాడో, ఆ చెట్టు క్రిందనే అన్నగారి చిత్రపటమును పూజించి, ది. 26-3-1950 తేదీన శ్రీ భూషణంను తపస్సు ప్రారంభించాడు. శ్రీ పెదబాలయోగి తపస్సు ప్రారంభించినప్పుడు 15 సంవత్సరాల బాలుడు. శ్రీ భూషణం తపస్సు ప్రారంభించినాటికి కేవలం 81/2 సంవత్సరాల వయస్సు మాత్రమే. అంటే తపస్సు ప్రారంభించిన నాటి పెదబాల యోగి వారి వయస్సులో భూషణం తపస్సు ప్రారంభించిన నాటికి సగం వయస్సు మాత్రమే.

శ్రీ భూషణంమున్నూ అన్నగారికి వలెనే తపస్సు ప్రారంభించినట్లు తెలియగానే తల్లిదండ్రులు సోదరులు-బంధువులు చాలా ఆతురత, ఆందోళన చెందారు. రెండవ అన్నగారు శ్రీ నాగన్న (పెదబాలయోగి వారి రెండవ సహోదరుడు) శ్రీ భూషణంను యెవరికీ తెలియకుండగా బలవంతంగా లేవనెత్తుకొని వచ్చి తమ యింటిలో దాచిపెట్టినాడు. శ్రీ పెదబాలయోగి వారిని గూడా శ్రీ తాతయ్య అనే ఒక స్వకులవృద్ధుడు బలవంతంగా లేవతీసుకొని వచ్చినాడు గదా! అయినా శ్రీ పెదబాలయోగి వారు తపస్సు మానలేదు. అలానే శ్రీ భూషణంను శ్రీ నాగన్న బలవంతంగా లేవదీసుకొని వచ్చినను, యింట్లోనే తపస్సు చేయడం మానలేదు.

తల్లిదండ్రులు అన్నగారగు శ్రీ సుబ్బారావుకు వలే శ్రీభూషణం తపస్సు చేయుట చూసి చింతించిరి. ఒకే కుటుంబంలో ఇద్దరన్నదమ్ములు యోగీశ్వరులు కావడం విచిత్రం, ఆశ్చర్యకరమే కాదు. తల్లిదండ్రులకు ఆందోళన, మనోవేదన కలిగించాయి. పెదబాలయోగీశ్వరుని 'మారు' తమ్ముడు శ్రీ భూషణం గూడా అన్నగారివలె తపస్సు ప్రారంభించిన వార్త చుట్టుప్రక్కల 'కార్చిచ్చు' లా వ్యాపించింది. పైగా శ్రీ భూషణానికి పట్టుమని 9 సం॥లు నిండలేదు. ఈ వార్త విని ప్రజలు విచిత్రంగా చెప్పుకొనసాగారు. ఒకే కుటుంబంలో యిద్దరన్నదమ్ములు "యోగు"ల వడం అసాధారణం. విచిత్రం, దైవలీల ప్రజలు తండోపతండాలుగా వచ్చి భూషణంను నారి పూరింటిలో చూడసాగారు. అది అటు ప్రజలకు, యిటు కుటుంబ సభ్యులకు యిబ్బందికరంగా వుంది. అయినా చేసేది ఏమియు లేక, యింటిలో పిల్లవాడు తపస్సు చేయుట మంచిది కాదని గ్రహించి పెదబాలయోగివారు తపస్సు చేయుచున్న తపోమందిరంనకు వెనుక నున్న గవర్నమెంటు వారి పోరంబోకు 'ఖాళీ' స్థలంలో శ్రీ భూషణం తపస్సు చేసుకొనుటకు, ఆయన తల్లిదండ్రులు చిన్న పర్ణశాల (తపోమందిరం) వేసి అందులో ఆయన్ని కూర్చోబెట్టారు. శ్రీ భూషణం ఆ పర్ణశాలలో అన్నగారగు పెదబాలయోగీశ్వరునివలె అన్న పానీయాలు మాని, కఠోర తపస్సు చేయసాగిరి. పెదబాలయోగీశ్వరుని తమ్ముడు శ్రీ భూషణం, తపస్సు చేయుట

వలన (అన్నగారికి వలె) శ్రీ భూషణంను 'చిన బాలయోగీశ్వరు' లని ప్రజలు పిలువసాగిరి.

బెజవాడ వాస్తవ్యులు శ్రీ పల్నాటి నారాయణస్వామి గారు ముమ్మిడివరంలో అన్నదమ్ములు 'యోగీశ్వరులై" ఘోరతపస్సు చేయుచున్నారన్న వార్త విని, వారిని దర్శించుటకు ముమ్మిడివరం వెళ్ళారు. ఇద్దరు యోగీశ్వరులను భక్తి శ్రద్ధలతో దర్శించుకొన్నాడు చినబాలయోగి వారు కేవలం "తాటాకు" పర్ణశాలలో తపస్సు చేసుకొనుట నారాయణ స్వామివారికి బాధకలిగించింది. ది. 18-12-1951న ఒక గది గల పెంకుటిల్లు తపో ఆశ్రమంను దాని చుట్టు ప్రాకారంగా ఒక రాతి గోడను నారాయణస్వామి గారు నిర్మింపజేసినారు.

పెదబాలయోగివారికి ఏకాంత ప్రశాంత వాతావరణం తపస్సు చేసుకొనుటకు ఏకాగ్ర స్థితి సమకూర్చుటకు, వారి యాజ్ఞ మేరకు వారి తపో పర్ణశాలను తలుపులు వేసి నిర్ణీత ఉదయకాలమందు మాత్రమే వారి దర్శనార్థం తలుపులు తీసెడివారు. అలానే చినబాలయోగి వారికి ధ్యానమందు "ఏకాగ్రత" ఏకాంత ప్రశాంత వాతావరణం సంతరించుటకు చిన బాలయోగి వారి ధ్యాన పర్ణశాలకు గూడా తలుపులు వేసి తాళము వేసెడి వారు. పెదబాలయోగివారి 'దర్శన' సమయమందే చిన బాలయోగి వారి దర్శనం ఏర్పాటు చేయడం జరిగేది.

శ్రీ పల్నాటి నారాయణ స్వామిగారు శ్రీ చినబాలయోగి వారికి నిర్మించిన చిన్న తపోమందిరం వెనుక భాగాన (దక్షిణాన) చిన బాలయోగి వారికి శాశ్వతమైన సిమెంటు తపో మందిరాన్ని బచ్చు మాధవయ్య గారు 1969 నవంబరు సంవత్సరంలో నిర్మించారు. 1967లో బచ్చు మాధవయ్య గారు చినబాలయోగి వారి తపో ఆశ్రమం చుట్టూ గట్టి ప్రహరీ గోడ కట్టించారు. 1971లో బచ్చు మాధవయ్య గారే చినబాలయోగివారి తపో ఆశ్రమం చుట్టూ శాశ్వతమైన ప్రాకారం నిర్మించారు.

చినబాలయోగి తపోమందిరంపై 1975లో గోపురంను శ్రీ బచ్చు మాధవయ్యగారు నిర్మించారు. అలానే 1968లో చిన్నబాలయోగి వారి దర్శన మండపంను, 1975లో దర్శన మండపం పై గోపురంను శ్రీ బచ్చు మాధవయ్యగారే నిర్మించారు. (ఈ విధంగా చినబాలయోగి వారి తపోమందిరం, దాని చుట్టూ ప్రాకారం, దర్శన మండపం నిర్మాణం చేయుటకు మహాదాత బచ్చు మాధవయ్య గారిది ప్రముఖమైన ప్రధానమైన పాత్ర. పెదబాలయోగివారి ఆశ్రమ అభివృద్ధికి గూడా బచ్చు మాధవయ్యగారు ఎంతో దానం చేశారు. నిజంగా వారు ధన్యులు.)

అన్నగారి కంటె పిన్న వయస్సునందే, అన్నగారికి వలెనే, బ్రహ్మచర్య వ్రతమూని, జలాన్నములు లేక, కేవలం వాయుభక్షణంతో, అచంచల మనస్సుతో, ఏకాగ్ర చిత్తంతో, నిర్మల హృదయంతో ఇంద్రియ నిగ్రహుడై, సర్వకర్మ సన్యాసం చేసి (నిష్కామ కర్మయోగ

మార్గమునవలంబించి) అన్నగారగు శ్రీ పెదబాలయోగీశ్వరుల వారినే "దైవం"గా సంభవించి అంతర్ముఖుడై, నిర్జన స్థల మందు (అన్నగారగు శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు స్వయం తపోమందిర నిర్బంధితమగుట) లోక మోహబంధ విముక్తుడై, విషయవాంఛా విరక్తుడై, విరాగియై, జీవన్ముక్తిమార్గవాలంబియై, శ్రీ చినబాలయోగి వారు కఠోర తపమాచరించి, నిర్వికల్ప సమాధిగ్రస్తుడైనాడు.

శ్రీ పెదబాలయోగి వారు కనీసం 27-3-49న ముగ్గురు పరమభక్తులతో నోరు విప్పి స్వీయ జీవిత విశేషాలు, నిత్యదర్శన మార్గదర్శక సూత్రాలు (ఆదేశాలు) దివ్య తత్త్వోపదేశాలు చేసారు. కాని చినస్వామి తపస్సు ప్రారంభించినది మొదలు ఏనాడును ఎవరుతోను మాట్లాడి యెరుగరు. ప్రతి సంవత్సరం శివరాత్రి రెండవ రోజు శ్రీ పెదస్వామి భక్తులకు బయట నిర్మింపబడిన దర్శన మండపంపై శేషపీఠంపై తపో ముద్రలో ఆసీనులై భక్తకోటికి దర్శనమిస్తే, శ్రీ చినస్వామి (తనకు గూడా ప్రత్యేకంగా దర్శన మండపం నిర్మింపబడినా, అన్నగారి ఆమోదంలేనందువల్లనో, మరే కారణం చేతనో) తన తపోమందిరంలో తాను తపస్సు చేసుకొనుచోట నుండి యే శ్రీ చినస్వామి భక్తులకు దర్శనం యిచ్చేవారు. పెదస్వామికి ఏ కార్యక్రమం జరుపబడేదో, చినస్వామికి గూడా అదే రోజు, అదే సమయంలో, అదే కార్యక్రమం జరుపబడేది.

"శివరాత్రి" పర్వదినం రాత్రి (మరుసటి రోజు) భక్తకోటికి దర్శన మండపం నుండి సర్వదర్శనం యిచ్చే ముందు శ్రీ పెద్దస్వామి గారితోనే కమిటీ సభ్యులు మాట్లాడేవారు. శ్రీ పెదస్వామి వారే సభ్యులకు తమ సంజ్ఞలతో సలహాలు ఆదేశాలిచ్చేవారు. సందేహాలు తీర్చే వారు. చిన్నస్వామి కమిటీ సభ్యులతో ఏనాడునూ మాట్లాడలేదు (సైగలతోనైనా) కమిటీ సభ్యులు గూడా శ్రీ పెదస్వామి వారినే సంప్రదించేవారు. ఆశ్రమంలో చేపట్టిన, చేపట్టదలచిన కార్యకలాపాలు, భవన నిర్మాణ పురోగతి క్రమం యిత్యాది విషయాలు శ్రీ పెదస్వామితోనే సంప్రదించేవారు. శ్రీ చినస్వామిని సంప్రదించే వారు కాదు. శ్రీ చినస్వామి తపోమందిరం విషయాలు గూడా శ్రీ పెదస్వామి వారితోనే సంప్రదించేవారు. పెదస్వామి వారే సలహాలు, ఆదేశాలిచ్చేవారు.

అదే విధంగా చిన్నస్వామి ఎవ్వరితోను ఎన్నడును సంభాషించలేదు. పెద్దస్వామి వారి వలె చిన్నస్వామి వారు ఎలాంటి తత్త్వోపదేశాలు చేసిన సందర్భాలు లేవు. అంటే అన్నగారగు పెద్దస్వామివారిని 'దైవ సమానం'గా భావించే చిన్న స్వామివారికి, పెద్ద స్వామి వారు చెప్పిన తత్త్వోపదేశాలే తప్ప తాను వేరుగా, నేరుగా చెప్పే తత్త్వోపదేశాలు, సలహాలు, ఆదేశాలులేవని మనం గ్రహించవలెను.

పెద్దస్వామి వారు కైవల్యసిద్ధి చెందిన తర్వాత చిన్నస్వామివారు ఐదు సంవత్సరాలు జీవించారు. ఈ ఐదు సంవత్సరాలు చిన్నస్వామి వారు (పెదస్వామి వారి వలెనే) శివరాత్రి మరునటి రోజు మాత్రమే భక్తులకు సర్వదర్శనం ఇచ్చేవారు. సంవత్సరమంతా చిన్నస్వామి వారి తపోమందిరం తలుపులు వేసి తాళం వేసేవారు. పెదస్వామి వారు బ్రహ్మసాయుజ్యం చెందిన తర్వాత గూడా చిన్నస్వామి తన తపోమందిరంలోనే భక్తులకు సర్వదర్శన భాగ్యమొసంగి నారు తప్ప, తన కోసం నిర్మించిన దర్శన మండపం పైకి వచ్చి దర్శనమీయలేదు. శివరాత్రి రాత్రి, (మరుసటి రోజు) భక్తులకు సర్వదర్శనం యిచ్చేముందు, కమిటీ సభ్యులు చినస్వామి వారితో ఆశ్రమ విషయాలు వివరించే వారు. పెద్దస్వామి వారయితే, కళ్ళు తెరచి, కమిటీ వారు చెప్పిన దానికి అంగీకారంగానో, అనంగీకారంగానో సొంజ్ఞలతో చెప్పేవారు. సలహాలు, ఆదేశాలు ఇచ్చేవారు. సందేహాలు తీర్చేవారు కాని చిన్నస్వామి వారు, కమిటీ సభ్యులు చెప్పిన దానికి యెటువంటి జవాబు వుండేది కాదు. వారు విన్నట్లే అంగీకరించినట్లే భావించి, ఆశ్రమ విషయాలు వివరించేవారు. సభ్యులు చెప్పిన విషయాలు వినేవారే తప్ప చిన్నస్వామి వారు కమిటీ వారితో మాట్లాడి యెరుగరు. సలహాలు, ఆదేశాలు ఇచ్చియుండలేదు. పెదస్వామివారికి జీవించియుండగా, యే కార్యక్రమాలు జరిపే వారో, చిన్నస్వామి వారికి గూడా, పెద్దస్వామి వారు కైవల్య సిద్ధిపొందిన తర్వాత గూడా, జరిపేవారు. శ్రీ పెదస్వామి వారికి వలె, చినస్వామి వారి నుండి కమిటీ సభ్యులకు ఎటువంటి సలహాలు, ఆదేశాలు లేక పోవుట పట్ల అప్పటి కమిటీ కార్యదర్శి యిప్పటి ప్రెసిడెంటు గారైన శ్రీ కె.యస్.ఆర్. మూర్తి గారు చాలా బాధపడేవారు. ఈ విషయం శ్రీ మూర్తిగారు యీ రచయితతో (వీరిద్దరూ బాల్యస్నేహితులు) గూడా చెప్పడం జరిగింది. సోదరయోగుల కన్నతండ్రి శ్రీ గంగయ్య గారు పరమ పదించినపుడు ఆ వార్త పెద్ద చిన్న స్వాముల వారికి కమిటీ సభ్యులకు తెలియజేయడం జరిగింది. అలానే చిన్నస్వామి వారికి జన్మనిచ్చిన మాతృమూర్తి శ్రీమతి వెంకమ్మగారు పరమపదించినపుడు ఆ వార్త యిరువురికి కమిటీ సభ్యులు తెలియజేయడం జరిగింది.

అయితే ఒక చిన్న విచిత్ర సంఘటన జరిగింది. ది. 21-2-71న శివరాత్రికి ముందు రోజున శ్రీమతి వెంకమ్మగారు పరమపదించినది. స్వామివారి పరమభక్తుడగు శ్రీ తాళ్లూరి కామేశ్వరరావు శివరాత్రి రేపు గదా. రేపు ముమ్మిడివరం వెళ్ళదామునుగదా అని ఆలోచించుకొనుచుండగా, శ్రీ కామేశ్వరరావు గార్కి "రేపు కాదు, నేడు రమ్ము" అనెడి మాటలు స్పష్టముగా వినబడ్డాయి. శ్రీ కామేశ్వరరావు వెంటనే బయలుదేరి ముమ్మిడివరం వెళ్ళగా శ్రీమతి వెంకమ్మగారు పరమపదించినట్లు తెలిసింది.

శ్రీ పెద్దస్వామివారు కైవల్య సిద్ధి పొందిన వార్త గూడా కమిటీ సభ్యులు చిన్నస్వామివారికి తెలియజేయడం జరిగింది. వారి నుండి సమాధానం రాకపోయినా, వారు విన్నను, వినక

పోయినను, (తపో సమాధిలో నున్నప్పుడు ప్రాపంచిక తెలివి యుండదుగదా) వారు విన్నట్లే కమిటీ సభ్యులు భావించడం పరిపాటి.

అదృష్టమో, దురదృష్టమో కాని, పెదబాలయోగి జీవిత చరిత్రకు వారి ఆదేశాలకు, వారి తత్త్వోపదేశాలకు, వారి మహిమలకు జరిగినంత ప్రచారం చిన్నస్వామివారి విషయంలో జరుగలేదు. శ్రీ పెద్దస్వామి వారి కరుణా కటాక్షములకు పాత్రుడైన శ్రీ జయంతి స్వామినాయనగారున్నూ, అలానే శ్రీ వంకల అప్పారావు గారున్నూ, తదితరులున్నూ, శ్రీ పెదబాలయోగి వారి జీవిత చరిత్రనే వ్రాసారు గాని చిన్నబాలయోగి వారి జీవిత చరిత్రకు అంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. అదే విధంగా, చిన్నవారి మహిమలు, భక్తులు వారి ప్రభావంలో వారికి జరిగిన మేళ్ళు 'రికార్డు చేయబడలేదు'. దురదృష్టవశాత్తు గ్రంథస్తం కాలేదు. ఇది భక్తలోకం దురదృష్టం.

చిన్నస్వామి వారి తపో మందిరం, దాని చుట్టూ ప్రహరీ గోడ తదితర పనులకు అధిక మొత్తం డబ్బు ఖర్చుపెట్టిన మహాదాత, సోదర బాలయోగుల పరమభక్తుడు శ్రీ బచ్చు మాధవయ్యగారికి ఒకసారి బాగా జబ్బుచేసింది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. అదే సమయంలో శ్రీ మాధవయ్య వారికి చిన్నస్వామి వారు స్వప్నంలో పండ్లరసం తీయుచున్నట్లు కనిపించాడు. కలను ఆధారంగా శ్రీ మాధవయ్యగారు నారింజపండ్ల రసం తీసుకొని రెండు పూటలు సేవించాడు. అంతే. వారి రుగ్మతమటుమాయమైనది. ఇలాంటి సంఘటనలు ఎన్నో వున్నాయి. భక్తుల అనుభవాలున్నాయి కాని దురదృష్టవశాత్తు అవేవియు రికార్డు (నమోదు) కాలేదు.

అన్నగారగు పెద్దస్వామి వారి చిత్ర పటాన్నే ముందు పెట్టుకొని పూజించి తపస్సు ప్రారంభించి, "పెదబాలయోగి" వారే "దైవం"గా నమ్మిన చిన్నస్వామి, పెద్దస్వామికి లక్ష్మణుడు వంటివాడు. అగ్రజుడగు శ్రీ రామచంద్రుని మాట జవదాటి యెరుగడు లక్ష్మణుడు. శ్రీరామచంద్రుని వెంటనే తిరుగుతూ అన్నగారికి చేదోడు వాదోడుగా వుంటూ (చివరకు అర్ధాంగి ఊర్మిళను అయోధ్యలో విడిచి పెట్టి అన్నగారితో అడవులకు వెళ్ళాడు గదా) జీవించాడు. అలాగానే పెదబాలయోగి వారి మాట చినస్వామి ఏనాడు జవదాటలేదు. పెదబాలయోగి వారి మాట ప్రకారమే ఆశ్రమ కార్యకలాపాలు, చివరకు చినస్వామి వారికి సంభవించిన పనులైనా సరే, జరిగేవి.

ఒక తండ్రికి జన్మించిన యీ పెద, చిన సోదర బాలయోగులు అపూర్వ సోదర యోగులు. ఒక తండ్రికి యిద్దరు యోగి కుమారులు జన్మించడం అరుదైన సంఘటన. ఈ విషయమై ఒకసారి పెదబాలయోగివారు, "తమ తండ్రి పూర్వజన్మలో మహా తపస్విగా మహా పుణ్యం

చేసుకొన్నారు. కనుకనే వారికి తామిద్దరము జన్మించినాము" అని చెప్పారు. నిజమే గదా. తండ్రితో పాటు, యిద్దరి తల్లులు గూడా ఎంత పుణ్యం చేసికొన్నారో గదా.

ఈ రచయిత గూడా, తన సతీమణి తోడుగా, పెదస్వామి వారిని దర్శించుకొన్న ప్రతిసారీ చిన్నస్వామి వారిని గూడా దర్శించికొన్నాడు. పెదస్వామి వారు కైవల్యసిద్ధి పొందిన తర్వాత గూడా, చిన స్వామి వారిని దర్శనం చేసుకొన్నాడు. ఒక సంవత్సరం (19...) చినస్వామి జటాజూటం శివజటాజూటం వలె ముడివడి (ఎవరూ అలా ముడివేయలేరనిపిస్తుంది) యుండుట కమిటీ సభ్యులు, భక్త జనులతో పాటు, యీ రచయిత, వారి సతీమణి దర్శించుకునే భాగ్యమొచ్చినది. చినస్వామి వారి శిరోజాలు, ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క రీతిగా వుండేవి.

అయితే ఒక విషయం. శ్రీ చినస్వామి వారిలో వయస్సుతో పాటు శరీరం పెరిగింది. కాని వారి శరీరం బలంగా వుండేది కాదు. బలహీనంగా, బక్క పల్చగా, "శల్యావశిష్ట మాత్రంగా కనిపించేది. కాని పెద్దస్వామి శరీరం వయస్సుతోపాటు, పెరగడమే కాదు బలంగాను, లావుగాను రోజూ సుష్టుగా భోంచేసిన వారి శరీరం వలె) కనిపించేది. ఇందుకు భిన్నంగా చిన్నస్వామి వారి శరీరం ఉండేది. ఉపవాసాలు చేసేవారు. శుష్కించినట్లు, బలహీనంగా కనిపించేది. ఎన్నోసార్లు చిన్నస్వామిని గూడా దర్శించుకొన్న యీ రచయిత స్వీయానుభవంతో అంటున్న మాటలివి. ఇదే అభిప్రాయాలు కమిటీ సభ్యులు, భక్తులు కొందరు వెల్లడించడం గూడా యీ రచయిత స్వయంగా విన్నాడు కూడ.

శ్రీ చినబాలయోగీశ్వరుల వారికి అస్వస్థత, శివరాత్రికి భక్తులకు దర్శనం ఆగిపోవుట.

మహా శివరాత్రి మరుసటి రోజు పెదబాలయోగీశ్వరుల వారితోపాటు, చినబాల యోగీశ్వరులవారును, భక్తులకు దర్శనమిచ్చెడివారు. శ్రీ పెదస్వామి వారు కైవల్యసిద్ధి, బ్రహ్మైక్యం చెందిన తర్వాత గూడా (1985 తర్వాత) ఆశ్రమ కమిటివారు మహా శివరాత్రి మరుసటి రోజు శ్రీ చినస్వామి వారి దర్శన భాగ్యం భక్తులకు కలుగజేసేవారు. శ్రీ చినస్వామి వారు దర్శన మండపంపైన కాక తాము కూర్చుని తపస్సు చేయు తపోమందిరంలోనే భక్తులకు దర్శన మిచ్చెడివారు. శ్రీ పెదస్వామి వారు కైవల్యసిద్ధి పొందిన తర్వాత మహాశివరాత్రి మరుసటి రోజు భక్తులకు దర్శనభాగ్యం కలుగజేయమని శ్రీ చినస్వామి వారిని కమిటి వారు ప్రార్థించడం జరిగింది. అందుకు శ్రీ చినస్వామివారి 'మౌనమే' సమాధానం అయింది. సరే, యని కాని 'కాదని' కాని శ్రీ చినస్వామి వారు సమాధానం యివ్వలేదు. 'మౌనం అర్థాంగీకారం' అన్నలోకోక్తిననుసరించియు, శ్రీ పెద్దస్వామివారు బ్రహ్మైక్యం చెందక పూర్వం శివరాత్రి మరుసటి రోజు శ్రీ పెదస్వామి వారితోపాటు శ్రీ చినస్వామివారును భక్తులకు దర్శన భాగ్యం కలుగజేయుట

చేతను, కమిటీవారు 1985 తర్వాత గూడా (శ్రీ పెదబాలయోగివారికైవల్య సిద్ధి చెందిన తర్వాత) శ్రీ చినస్వామివారి దర్శన భాగ్యం శివరాత్రి మరుసటి రోజు భక్తులకు కలుగజేసారు. ముందుగా శ్రీ పెదస్వామివారి 'సమాధిని దర్శించిన తర్వాత భక్తులు శ్రీ చినస్వామి వారిని దర్శించుకొనేవారు.

1990లో మహాశివరాత్రి మరునటి రోజు శ్రీ చినస్వామివారి దర్శనం ఏర్పాటు యథాప్రకారం జరిగిపోయాయి. కమిటీవారు, కుటుంబ సభ్యులు, తదితర ప్రముఖులు శ్రీ చినస్వామివారి తపోమందిరం తలుపులు తీసి తపోమందిరంల్లో శ్రీ చినస్వామివారిని దర్శనం చేసుకొనడం ధ్యానించడం మొదలుపెట్టారు. అందులో యీ రచయిత తన సతీమణితో సహా తపోమందిరంలో శ్రీ చినస్వామి వారిని దర్శనం చేసుకొన్నారు. శ్రీ కె.యస్.ఆర్. మూర్తి గారికి యీ రచయిత ఆత్మీయ బాల్య స్నేహితుడగుటచేతను, శ్రీ బాలయోగీశ్వరుల వారి సహోదరులు, కమిటీ సభ్యులతో యీ రచయిత సన్నిహితంగా యుండుట చేతను, యీ రచయిత కమిటీ సభ్యుడు కాకపోయినను, ప్రత్యేక ఆహ్వానిత ప్రముఖునిగా శ్రీ బాల యోగీశ్వరుల వారిని వారి తపోమందిరంలలో దర్శించుకొనే అదృష్టవంతుడీ రచయిత)

శ్రీ చినస్వామి వారిని తపోమందిరంలో దర్శనం చేసుకొన్న వారిలో శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారు, సర్వశ్రీ ధారా సర్వేశ్వరరావు, ముత్యాల జానకిరామన్న తదితరులు, కుటుంబ సభ్యులున్నారు. ఫొటోగ్రాఫర్లు శ్రీ స్వామి వారిని ఫొటోలు తీయడం మొదలుపెట్టారు. శ్రీ మూర్తిగారు శ్రీ చినస్వామి వారికి కుడిప్రక్కగా (అంటే మందిర ద్వారంనకు ఎడమవైపు ఈశాన్య దిశలో కూర్చొని కళ్ళు మూసుకొని ధ్యానం చేసుకొంటున్నాడు. ఈ రచయిత శ్రీ చినస్వామి వారి వంక తదేక దృష్టితో భక్తి ప్రవత్తులతో చూస్తూ "స్వామీ, తమకు తెలియని విషయాలు లేవు. మా కష్టసుఖాలు-యీతి బాధలు అన్నీ తమకు తెలియనికావు. నన్నూ నా భార్యా బిడ్డల్ని దయతో చూడు (యీ రచియతయే గుడికి పోయి ఏ దేవుని దర్శించుకొన్నా ప్రత్యేకించి యే కోరిక కోరకుండా సర్వసాధారణంగా యిదే విధంగా దైవాన్ని వేడుకోవడం జరుగుతుంది) ఇంతలో శ్రీ చినస్వామి హఠాత్తుగా కన్నులు తెరచి ధ్యానంలోవున్న మూర్తిగారి వైపు చూస్తూ చేతితో రెండుసార్లు "వెళ్లిపొండి" అనే విధమైన సైగ చేస్తూ, మెల్లగా వొరిగిపోయారు. ఇదంతా తృటిలో జరిగిపోయింది. మందిరంలో శ్రీ చినస్వామివారిని చేతులు జోడించి దర్శనం చేసుకొనుచున్న వారందరం క్షణ కాలం నిశ్చేష్టులమై తేరుకొని యున్నాము. కలవరపడ్డాము. కలయో మాయయో ఏమీ అర్థం కాలేదు. జరిగిన సంఘటన నమ్మలేక పోయాం. కాని జరిగింది నమ్మకుండా ఎలా వుండడం మూర్తిగారు, మిగిలిన కమిటీ సభ్యులు శ్రీ స్వామి వారి సహోదరులు అందర్నీ బయటి గదిలోనికి (ఉత్తరపు గది) పంపించి వేసారు. తలుపులు మూసివేసారు. కొంచెం సేపటికి తలుపులు తీసుకొని, బయటికి వచ్చి, అక్కడున్న పోలీసు, రెవెన్యూ అధికారుల్ని క్షణాలమీద

రప్పించారు. అమలాపురంలోని పై రెవెన్యూ అధికారుల్ని, పోలీసు అధికారుల్ని, డాక్టర్లను ఆఘమేఘాలమీద రప్పించారు. ఒరిగి (వాలి) పోయి పరుండిన శ్రీ చినస్వామివారిని డాక్టర్లు వైద్య పరీక్షలు చేయటానికి బలవంతంగా ప్రయత్నించారట. అందుకు శ్రీ స్వామివారు నిరాకరించారట. శ్రీ స్వామి వారి నాడి బలహీనంగా వుందని పిరుదులపై పెద్ద పెద్ద పుండ్లు వచ్చాయని, శ్రీ స్వామివారికి "సెలైన్" ఎక్కించాలని, పుండ్లు శుభ్రపరచి మందువేసి కట్లుకట్టాలని వైద్యులు విఫలప్రయత్నంచేసారని తర్వాత మూర్తిగారు, కమిటీ-కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. శ్రీ స్వామివారు తమను వైద్యులు ముట్టుకొనుటకు వైద్యం చేయించుకొనుటకు నిరాకరించారు.

శ్రీ స్వామి దర్శనార్థం వచ్చిన వేలాది భక్తులకు "శ్రీ స్వామి" వారు దర్శనం యివ్వడం లేదని ప్రకటన చేసారు కమిటీ. శ్రీస్వామి వారి దర్శనం కొరకు పరిసర ప్రాంతాల నుండి దూరప్రాంతాల నుండి వచ్చిన (తమిళనాడు తదితర ప్రాంతాలు) భక్తులకు ఏమి జరిగిందో తెలియక, శ్రీస్వామివారు ఎందుకు దర్శనమిచ్చుటలేదో తెలియక సంభ్రమాశ్చర్యాలతో నిరాశచెందారు.

అప్పుడు రాష్ట్ర రెవెన్యూ ముఖ్యకార్యదర్శిగా వున్న శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారి చొరవతో తిరుమల-తిరుపతి దేవస్థానం వారు శ్రీ బాలయోగి వారి ఆశ్రమ ప్రాంగణంలో భక్తుల సౌఖర్యార్థం ఒక ధర్మసత్రం నిర్మింప చేయుటకు యిరవైలక్షల ఆర్థిక సహాయం చేయుటకు అంగీకరించినందున, సదరు ధర్మసత్ర భవనానికి 'శంకుస్థాపన' (భూమిపూజ) చేయుటకు అప్పటి రాష్ట్ర దేవాదాయ మంత్రిగారు శ్రీ మాగంటి రవీంద్రనాథ చౌదరి గారు విచ్చేసి యున్నారు. తిరుమల-తిరుపతి దేవస్థానం నుండి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ నుండి కొందరు ఉన్నతాధికారులు గూడా వచ్చియున్నారు. కాని వారెవరికీ, చివరకు మంత్రిగారికిన్నీ శ్రీ చినస్వామివారి 'దర్శన భాగ్యం' లభించలేదు. పైగా ఎంతో "బ్రహ్మాండం"గా చేయతలపెట్టిన "శంకుస్థాపన" కార్యక్రమం గూడా అతిసామాన్యంగా "సింపుల్"గా జరిగిపోయింది.

శ్రీ చినబాలయోగీశ్వరుల వారి తపోమందిరానికి తాళాలు వేసే విషయంలో ఆశ్రమ కమిటీ వారు సుదీర్ఘంగా ఆలోచించారు. శ్రీ పెదబాలయోగి వారు 'పాంచభౌతిక' కాయాన్ని విడిచి పెట్టి కైవల్యసిద్ధి చెందిన సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని, శ్రీ చినస్వామివారి తపో మందిరం తలుపులు వేసి తాళాలు కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీ చినస్వామి వారి 'ఆరోగ్యం' గురించి తెలుసుకొనేందుకు అప్పుడప్పుడు కుటుంబ సభ్యులు తలుపులు తెరచి శ్రీ స్వామివారిని కనిపెట్టవలసిందిగా కోరడం జరిగింది. అయితే శ్రీ చినస్వామి వారి దర్శనం యితరులకు నిషేధించబడింది. శ్రీ చినస్వామి వారు గూడా కుటుంబ సభ్యులతో గూడా మాట్లాడేవారు కాదు. కేవలం శ్రీ చినస్వామి వారి ఆరోగ్యం గురించి తెలుసుకొని కుటుంబ సభ్యులు సంతృప్తి

చెందేవారు. శ్రీ చినస్వామి వారు తమ తపోశక్తి వలన ఆరోగ్యం పుంజుకొని, మరలా దీక్షతో తమ తపస్సు కొనసాగించారు. తర్వాత వచ్చిన మహాశివరాత్రి పర్వదినాలలో శ్రీ చినస్వామివారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. చివరకు శ్రీ చినబాలయోగీశ్వరుల వారు 28-10-1991న కైవల్య సిద్ధి పొంది బ్రహ్మైక్యం చెందారు. శ్రీ పెదస్వామివారి భౌతిక కాయాన్ని, వారు దీర్ఘ కాలం తపస్సు చేసుకొన్న పవిత్రస్థలంలోనే సమాధి చేసినట్లు శ్రీ చినస్వామి వారి భౌతిక కాయాన్ని గూడా వారు తపస్సు చేసిన పవిత్ర ప్రదేశమందే సమాధి చేయడం జరిగింది.

సుమారు 40 సంవత్సరాలు కఠోర తపస్సు చేసిన శ్రీ చినబాలయోగివారు 'అస్వస్థులగుట' యేమిటని కొందరి సందేహం! తమ తపోశక్తి వలన తన శరీరంనకు వచ్చిన 'రుగ్మత'లను నివారించుకొనలేక పోయారా! అని ధర్మసందేహాలను వెలిబుచ్చిన వారున్నారు. పాంచభౌతిక దేహం ఏనాటికైనా శిథిలమై పోవలసిందేగదా! దైవాలుగా, అవతార పురుషులుగా ఆరాధింపబడుతున్న శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణభగవానుడు తమ తమ 'దేహాల్ని విడిచిపెట్టలేదా! శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ వివేకానందస్వామి, శ్రీ రమణ మహర్షి ప్రభృతి అవధూతలు, మహానుభావులు, శరీర సంబంధమైన అనారోగ్యంతో బాధపడ్డారు. అయితే వారు తమ 'శరీర' ముల గురించి, తమ శారీరక బాధల గురించి యేనాడు 'బాధ' పడలేదు. శాశ్వతమైన పరమాత్మతో (పరబ్రహ్మం) తమ జీవాత్మని అనుసంధానం చేసుకొన్న ఆ మహాదివ్యపురుషులు నశించిపోయే తమ పాంచభౌతిక శరీరాలలకు కలిగిన రుగ్మతలు'అస్వస్థత'లు గురించి యేనాడూ చింతించలేదు. తమ శారీరక బాధల్ని సంయమనంతో సహించారు. అసలు తమ దేహబాధలు గురించి పట్టించుకొనలేదు. ఎక్కడో కొలిమిలో పడిన కమ్మరి, పసిపాపను రక్షించుటకు 'ధుని' లో చేతిని కాల్చుకున్న షిరిడీ సాయిబాబా గూడా కాలిన తన చేతిని వైద్యం చేత వైద్యం చేయించుకొనుటకు నిరాకరించాడు. అదే రీతిగా మన చినస్వామివారు గూడా అస్వస్థతకు గురి అయిన తమ 'శరీరం'నకు వైద్యం చేయించుకొనుటకు నిరాకరించారు. ఈ 'అస్వస్థత, రుగ్మత, అశాశ్వతమైన పాంచభౌతిక దేహానికి కాని, పరమాత్మ (పరబ్రహ్మ)లోని అంశమైన 'జీవాత్మ'కు కాదు గదా. చివరగా 28-10-91న శ్రీ చినబాలయోగి వారు కైవల్యసిద్ధి పొందారు. శ్రీ చినబాలయోగీశ్వరుల గురించి ప్రముఖ హైకోర్టు న్యాయవాది 'శ్రా' వసంతరావు ఇంగ్లీషులో గొప్ప రచన చేసియున్నారు.

కలియుగ భూలోక అపూర్వ యోగి సోదరులు

పురాణాలలో, ఇతిహాస గాథలలో, వందలు వేలు సంవత్సరాలు తపస్సు చేసిన ప్రహ్లాద, విశ్వామిత్ర, కపిల, భరత మహా ఋషి ప్రభృతుల గాథలు గురించి విన్నాం. కాని కలియుగంలో, చారిత్రక ఆధారాలను బట్టి భగవాన్ బుద్ధ, ఆదిశంకరాచార్య, రామకృష్ణ పరమహంస, రమణ

మహర్షి స్వామి వివేకానంద ప్రభృతులు కొన్ని రోజులు, కొన్ని నెలలు, లేదా కొన్ని సంవత్సరాలు (బుద్ధుడు) ధ్యాననిమగ్నులైనట్లు మనకు తెలుస్తున్నది.

కాని, శ్రీ ముమ్మిడివరం శ్రీ పెదబాలయోగీశ్వరుల వారున్నూ, శ్రీ చిన బాలయోగీశ్వరులవారున్నూ ఏక బిగిన సుమారు నాల్గు దశాబ్దాలు దీర్ఘ కఠోర తపస్సు చేయడం అపూర్వమైన విషయం. అందునా ఒకే వంశమందు, ఒకే తండ్రికి జన్మించిన వారు శ్రీ పెద, చిన బాలయోగీశ్వరులు కావడం మరొక విశేషం. పంచమ కులంలో పుట్టి, అక్షర జ్ఞానం లేక, గురూపదేశం లేక, బాల్యమందే కఠోర తపస్సునకు ఉపక్రమించడం అసాధారణ విషయం. శ్రీ పెదస్వామి వారు 16 సం॥రాల వయస్సులో తపస్సునకు కూర్చుంటే శ్రీ చినస్వామి వారు 9 సంవత్సరముల వయస్సులోనే తపస్సునకు కూర్చునుట సామాన్యమైన విషయం కాదు. ఎక్కడో అడవులలోనో, గుహలలోనో, నిర్జన ప్రాంతమందు యీ యిరువురు యోగి సోదరులు తపస్సు చేయలేదు. తాము జన్మించిన గ్రామం వెలుపల 'స్వయం స్వచ్ఛంద నిర్బంధిత తపోమందిరము' ల్లో తలుపులకు తాళములు బిగింపజేసి, అన్నపానీయాలు లేక కేవలం 'వాయుభక్షణం' చేతనే జీవిస్తూ బ్రహ్మచారులై, విరాగులై, ఇంద్రియ నిగ్రహులై, అచల మనస్కులై, ఏకాగ్ర చిత్తంతో, 'జీవసమాధి'లో, మోక్షగాములై, బ్రహ్మైక్య దీక్ష కంకణబద్ధులై నాల్గు దశాబ్దాలు ఘోర తపస్సు చేయడం, ప్రఖ్యాత సాహితీవేత్త శతావధాని వేలూరు శివరామ శాస్త్రి గారు, శ్రీ జయంతిస్వామి నాయనగారి అభిప్రాయంతో ఏకీభవిస్తూ, ఇట్టి స్థితి లోగడయే యోగికిని విన్నదియు కన్నదియు కాదు".

శ్రీ పెదస్వామివారు శ్రీ కృష్ణ, నారదుల చిత్రపటాన్ని ఎదుటపెట్టుకొని పూజించి, తపస్సునకు కూర్చుంటే, శ్రీ చినస్వామి వారు తమ అన్నగారగు శ్రీ పెదస్వామివారి చిత్రపటాన్ని యెదుట పెట్టుకొని భక్తిశ్రద్ధలతో పూజించి, తపస్సు ప్రారంభించాడు. శ్రీ పెదస్వామి 39 సంవత్సరములపైబడి దీర్ఘ తపస్సు చేస్తే శ్రీ చినస్వామి దాదాపు 40 సంవత్సరాలు తపస్సు చేయడం విశేషం. ఇద్దరికీ తండ్రి ఒక్కరే. శ్రీ కటికదల గంగయ్య గారు. ఆయన గూడా విద్యాగంధంలేని నిరుపేద. కాయకష్టం చేసి నిజాయితీగా, తృప్తిగా జీవితం గడిపిన ధన్యజీవి. శ్రీ పెదస్వామి వారి మాతృమూర్తియును, శ్రీ చినస్వామివారి మాతృమూర్తియును స్వంత అక్కాచెల్లెండ్ల బిడ్డలు. అంటే వారును అక్కాచెల్లెండ్రే. కజిన్సు.

ఇరువురు యోగి సోదరులు "మౌన" వ్రతం చేపట్టిన వారే. శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు మాత్రమే. తపస్సు ప్రారంభించిన సుమారు 2 సం॥ 8 మాసములకు ది. 6-2-49 మరియు 10-2-49ను 17-2-49ను శివరాత్రి 27-3-49 రోజునను శ్రీ వ్యాసం సత్యరాజు శ్రీ గరిమెళ్ళ కృష్ణమూర్తి, మరియు గాదెం అప్పారావు గార్లతో నోరు విప్పి, సందర్శక భక్తులు

ప్రజల నుండి తమకు 'తపోభంగం కలగకుండా తపో మందిరానికి తలుపులు తాళం వేయమనియు, మరియు తన స్వీయ చరిత్ర విశేషాలు. దివ్యతత్త్వోపదేశాలు వివరించారు. తర్వాత తాను మరలా ఎవరితోను నోరు విప్పి మాట్లాడలేదు. ప్రతి సంవత్సరం శివరాత్రికి సర్వదర్శన మిచ్చునప్పుడు, కమిటీ సభ్యులతో సంజ్ఞలతోనే ఆశ్రమ విషయాలు వివరించేవారు. వారి సందేహములను తీర్చెడివాడు. ఈ సమయంలో కళ్ళు తెరిచి కమిటీ సభ్యులతోను, తదితర తమకు ఆత్మీయులైన వారితో సైగలతో మాట్లాడెడివాడు.

కాని శ్రీ చిన్నస్వామివారు మాత్రం ఆయన తపస్సులో కూర్చున్న దగ్గరనుండి, కైవల్య సిద్ధి పొందేవరకు ఎవరితోను మాట్లాడలేదు. కళ్ళు తెరచి చూడలేదు. కనీసం శ్రీ పెదస్వామి వారివలె సైగలతోనైనా మాట్లాడలేదు.

ఆశ్రమంలో ఏ వేడుకలు జరిగినా, శ్రీ పెదస్వామి వారికి ఏ శుభకార్యములు జరిగినా, వారి దర్శన భాగ్యం ప్రజలకు లభించినట్లుగానే, శ్రీ చినస్వామి వారికి శ్రీ పెదస్వామి వారితోపాటు రివాజుగా జరపడం ఆశ్రమంలో సాంప్రదాయమైనది. చినస్వామి తపోమందిర నిర్మాణ కార్యకలాపాలు, శ్రీ పెదస్వామి వారి ఆజ్ఞల ప్రకారం జరిగేవి.శివరాత్రికి శ్రీ పెదస్వామి వారు తపోమందిరం నానుకొని బయట నిర్మింపబడిన దర్శన మండపం నుండి లక్షలాది ప్రజలకు, భక్తులకు దర్శనం యిచ్చేవారు. శ్రీ చినస్వామి వారికి పెదస్వామి వారికి వలె దర్శనమండపం నిర్మింపబడినా, శ్రీ చినస్వామివారు ఆ దర్శన మండపంపైకి ఏ శివరాత్రికి వచ్చి భక్తులకు దర్శనమీయలేదు. శివరాత్రికి శ్రీ చినస్వామివారు తపస్సు చేసుకొనే తపోమందిరంలోనే, వారిని ప్రజలు దర్శనం చేసుకొనేవారు. శ్రీ చిన స్వామివారు అసలు మాట్లాడక పోవడం (కనీసం సైగలతోనైనా) కన్నెత్తి చూడకపోవడం, శివరాత్రికి దర్శన మండపం పైకి రాకపోవడం, బహుశా తాను దైవంగా భావించే 'యోగి సహోదరుని (అన్నగారు) ఆజ్ఞల ననుసరించియేమో! ఏది ఏమైనా ఏనాడైనా, మాట జవదాటక శ్రీరామచంద్రునికి లక్ష్మణుడెట్టివాడో, శ్రీ పెదస్వామివారికి శ్రీచినస్వామి అటువంటి వాడనిపిస్తుంది.

కృత, త్రేతా, ద్వాపర యుగాలలో కొన్ని వందల సంవత్సరాలు తపస్సు చేసిన యోగులున్నారు. కాని ఒకే తండ్రికి పుట్టిన 'యోగి సహోదరులు' ఉన్నట్లు దాఖలాలు లేవు. వైకుంఠపురం ముఖ్య ముఖద్వారం వద్ద నిత్యం కాపలా వుండే సనకసనందులు, స్వయాన సహోదరులైనట్లు పురాణాలు చెపుతున్నాయి. కాని వారు ఎన్ని సంవత్సరాలు తపస్సు చేసినారో తెలియదు. కొన్ని రోజులు, కొన్ని నెలలు బహుశా ధ్యాననిమగ్నులై యుండెడివారేమో!

శ్రీ పెదస్వామి వారు చెప్పినట్లు, వారు జన్మించిన ప్రదేశం పూర్వం మహాఋషులు

తపస్సు చేయుటచేత, "మహాపవిత్రమైన" దగుట చేతను, తమ తండ్రి శ్రీ గంగయ్య గారు పూర్వ జన్మలో మహాతపస్వి యగుట చేత ఆయన చేసుకొన్న "మహాపుణ్యం" వలన వారికి (శ్రీ గంగయ్య) తామిరువురము (శ్రీ పెద-చిన బాలయోగులు) జన్మించినారు. అలానే తమ "పూర్వ జన్మ సువాసనల" (సుకృతం) వలన వారు బాల్యమందే బ్రహ్మచారులుగా నుండగానే, సంసారలంపటంలో పడక పూర్వమే, విరాగులై, ఇంద్రియ నిగ్రహులై, అచల మనస్కులై, ఏకాగ్ర చిత్తులై, బ్రహ్మైకధ్యేయంతో అన్నదమ్ములిద్దరు నాల్గు దశాబ్దాల పాటు జలాన్నములు విసర్జించి కేవలం "వాయుభక్షణం"తో ఘోరతపస్సు చేసి, జన్మరాహిత్యమొనర్చుకొని, జీవన్ముక్తి పొంది, కైవల్యసిద్ధి, బ్రహ్మైక్యం పొందిన భూలోక అపూర్వ యోగి సోదరులు. కృత, త్రేతయుగ, ద్వాపర యుగాలలో పురాణ గాథలను బట్టి, దీర్ఘ తపస్సులు, లోకాంతర ప్రయాణాలు, మహిమలు, అద్భుతాలు వంటివి జరిగినట్లు చదువుతున్నాం. సినిమాల్లో చూస్తున్నాం. కాని కలియుగంలో యిటువంటి వింతలు అద్భుతాలు చాలా అరుదు. ఈ యిరవయ్యో శతాబ్దాన్ని రాకెట్ యుగమని, కంప్యూటర్ శకమని చెప్పవచ్చు. మనిషిని బోలిన రోబోట్‌ని మనిషి సృష్టించాడు. మానవుడు చంద్రమండలంపై కాలూని తిరిగివచ్చాడు. ఇదొక వింత. అద్భుతం. మానవుడు తన మేదాసంపత్తితో, సాంకేతిక విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానంతో, కృత్రిమ ఉపగ్రహాలు, తయారుచేసి, అంగారక, శుక్రగ్రహాల పైకి పంపి ఆ గ్రహాలపైన జీవరాశి ఉనికి గురించి అక్కడి వాతావరణం గురించి, పరిశోధనలు చేస్తున్నారు. ఇట్టి 'విజ్ఞాన పరిజ్ఞాన' యిరవయ్యవ శతాబ్దంలో ఒక తండ్రికి జన్మించిన యిరువురు సోదరులు, నాల్గు దశాబ్దాల తరబడి కఠోర తపస్సు చేయడం వింతలో వింతగా మహాద్భుతంగా నిస్సందేహంగా నిశ్చయంగా పేర్కొనవచ్చు.

ఈ యిరువురు యోగిసోదరుల్ని కన్న తల్లిదండ్రులు ధన్యులు. వారు జన్మించిన ముమ్మిడివరం ధన్యం. వారిని దర్శించిన ప్రజాకోటి, వారిని దైవ సమానులుగా విశ్వసించి, పూజించిన పూజిస్తున్న భక్తకోటి ధన్యులు.

శ్రీ పెదబాలయోగీశ్వరులవారు 19-7-1985 తేదీన కైవల్యసిద్ధి పొందగా, శ్రీ చిన బాలయోగీశ్వరులవారు 28-10-91న కైవల్యసిద్ధి బొందారు.

పోతే శ్రీ గంగయ్య గారి రెండవ భార్య వలన ముగ్గురు సంతానమును, మూడవ భార్య వలన 5గురు మొత్తం 9 మంది సంతానం కలిగినట్లు యింతకు ముందు 'వంశవృక్షం' అనే అధ్యాయంలో తెలుసుకున్నాం గదా. ఈ 9 మంది సంతానంలో నేడు (1999 జనవరి) సజీవంగా వున్న వారు శ్రీ నాగన్న (పెదస్వామి వారి సోదరుడు) శ్రీయుతులు చంద్రరావు, సూర్యనారాయణ, పెదసుబ్బారావు, చినసుబ్బారావు, శ్రీమతి బాలయోగీశ్వరమ్మలు మొత్తం 6గురు తమ కుటుంబ సభ్యులతో, సుఖ సంసార జీవితాలు గడుపుతున్నారు.

"మహాపుణ్యశాలి" శ్రీ గంగయ్య

ది. 27-3-49న శ్రీ వ్యాసం సత్యరాజు మరి యిద్దరితో శ్రీ పెదబాలయోగీశ్వరులవారు తమ 'స్వీయ చరిత్ర' గురించి వివరిస్తూ, "నా తల్లిదండ్రులు పూర్వజన్మమున చేసికొనిన "మహాపుణ్యము" వలన నేను వారికి బిడ్డగా పుట్టినాను. నేను ఉన్న స్థలమును, నాకు యీ స్థితియు నా పూర్వజన్మ సువాసనల వలన వచ్చెను" అని చెప్పియున్నారు. శ్రీ గంగయ్యగారు పరమపదించినపుడు ఆ విషయం కమిటీ సభ్యులు శ్రీ పెదబాలయోగివారికి శ్రీ చినబాలయోగివారికి తెలుపగా, శ్రీ పెదబాలయోగివారు "తమ తండ్రిగారు పూర్వజన్మలో మహా తపస్వియనియు వారు 105 సం॥లు పైగా జీవించిరనియు, వారు "మహాపుణ్యము" చేసుకొనినారనియు కనుకనే వారికి తామిద్దరము (శ్రీ పెదబాలయోగి వారు, శ్రీ చినబాలయోగివారు) జన్మించితిమనియు "విశదపరచియున్నారు. గత జన్మలో 'మహాతపస్వి' యై యీ జన్మలో "మహాపుణ్యము" చేసిన శ్రీ గంగయ్య గారి వర్ధంతి నాడు ప్రతి సంవత్సరం శ్రీయుత 'యోగిసోదరులు' ఉదయం 4 గం॥ నుండి 6 గం॥లకు కొద్ది మంది భక్తులకు, వారి కుటుంబ సభ్యులకు "దర్శనభాగ్యం" కలుగజేస్తూ వచ్చారు. సోదర యోగీశ్వరులిద్దరును కైవల్యసిద్ధి (బ్రహ్మైక్యం) చెందిన తర్వాత గూడా ఆశ్రమకమిటీ సజీవులైన శ్రీ గంగయ్యగారి సంతానం నేటికిని ప్రతి సంవత్సరం ఆశ్రమంలో ఆయా సందర్భాలను పురస్కరించుకొని జరుపుచున్న వివిధ విశిష్ట పూజా కార్యక్రమాలతో పాటు శ్రీ గంగయ్యగారి వర్ధంతి (నిర్యాణదినం) ని జరుపుచున్నారు. భక్తులు శ్రీయుతులు బోర పోలయ్యరెడ్డి, బచ్చుమాధవయ్య ప్రభృతులు శ్రీ గంగయ్యగారి జ్ఞాపకార్థం ఒక 'చిన్నకుటీరం'ను వారి విగ్రహంను నిర్మింప సంకల్పించి శ్రీ పెదబాలయోగి వారి అనుమతి కోరగా అందుకు శ్రీ పెదస్వామి వారు "మా తండ్రిగారు సామాన్య మానవుడు కాదు. చాలా గొప్ప వ్యక్తి కనుక వారి పేర మేము నిర్మించదలచినను పెద్దది మాత్రమే నిర్మించవలయును. చిన్న చిన్నవి నిర్మించవద్దు" అని కరాఖండిగా చెప్పియున్నారు. కనుకనే ఆశ్రమంనకు దక్షిన భాగాన శ్రీ గంగయ్య గారి నివాసంనకు మధ్య వేయి మంది భక్తులు కూర్చొనుటకు వీలున్న "శ్రీ గంగయ్య మెమోరియల్ హాలు" ను పక్కా సిమెంటు భవనాన్ని నిర్మించారు శ్రీ బచ్చు మాధవయ్య ప్రభృతులు.

శ్రీ గంగయ్యగారికి ముగ్గురు భార్యలు. మేనమామ కుమార్తె శ్రీమతి వెంకటమ్మగారు. మొదటి భార్య సంతానం అకాల మరణమొందింది. రెండవ భార్య శ్రీమతి రామమ్మ గారి వలన (యీమెను గూడ వెంకమ్మ అనిపిలిచెడివారు) ముగ్గురు కుమారులు ఒక అమ్మాయి జన్మించారు. పుట్టిన ఆడపిల్ల కొన్ని రోజుల (నెలలు)లో మరణించింది. శ్రీమతి రామమ్మ గారును అకాల మరణం చెందారు. రామమ్మ గారికి గల్గిన ముగ్గురు కుమారులలో

మూడవవాడైన శ్రీ సుబ్బారావే శ్రీ పెదబలయోగీశ్వరుల వారిగా లోకప్రసిద్ధి చెంది 39 సం॥లు పైగా "ఘోర" (కఠోర) తపస్సు చేసారు. శ్రీ గంగయ్య గారి మూడవ భార్య వెంకమ్మగారి వలన 5గురు కుమారులు, ఒక కుమార్తె, మొత్తం ఆరుగురు సంతానం కలిగారు. వీరిలో మొదటి సంతానమైన శ్రీ 'భూషణమ్'. 'శ్రీ చినబాలయోగి' గా లోకప్రసిద్ధి చెంది సుమారు 40 సం॥లు ఘోర తపస్సు చేసారు. మరొక విశేషమేమంటే, ఇరువురు సోదర యోగీశ్వరులు "తపస్సు" ప్రారంభించిన ఇళ్ళ గోవిందరావు గారి కొబ్బరితోటయే పూర్వం గంగయ్య గారి తండ్రి తాతలు నివాసమున్నారు. అచ్చటనే శ్రీ గంగయ్య జన్మించాడు. ఇంకొక విచిత్రమేమంటే, శ్రీ గంగయ్యకు కల్గిన సంతానం ఆయనకు 60 (అరవై) సంవత్సరాల వయస్సుపై బడిన తర్వాతనే. అంతటి ముసలి వయస్సులో ఆయనకు పదిమంది సంతానం కల్గుట విచిత్రమే కాక నమ్మశక్యం గాని 'వింత'గా అనిపిస్తుంది. కాని నమ్మలేని పరమసత్యం! దశరథ మహారాజుకు ముసలి వయస్సులోన శ్రీరామచంద్రాది నల్గురు సంతానం కలిగారు. ముసలి వయస్సులోనే మహర్షి మృకండు మనస్విని వలన శివభక్తుడైన మార్కండేయునకు జన్మనిచ్చాడు. వసుదేవునికి వయస్సు మీరిన తర్వాతనే ఆఖరి సంతానంగా శ్రీకృష్ణునిని కన్నాడు. శ్రీ గంగయ్య గారు ప్రస్తుత జన్మలో పంచమ కులంలో పేదవానిగా, పుట్టి వుండవచ్చును. విద్యాధికుడు కాక పోవచ్చును. కాని యిద్దరు మహా బాలయోగులకు జన్మనిచ్చిన శ్రీ గంగయ్య గారు నిజముగా చాలా గొప్పవాడు.

కోనసీమ సౌందర్యం-ముమ్మిడివరం స్థల మహాత్మ్యం

దక్షిణ గంగగా ప్రసిద్ధి చెందిన గోదావరి నది రాజమండ్రి సమీపమందున్న ధవళేశ్వరం వద్ద రెండు పెద్ద పాయలుగా చీలి-గౌతమి వశిష్టలను పేరున తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో సంగమిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ గౌతమీ, వశిష్టల మధ్యనున్న ప్రదేశమే కోనసీమ.

ఈ కోనసీమ సస్యశ్యామల సీమ. కదళీ-నారికేళ ఫల నానా పుష్పవనసీమ. బంగరు పంటలసీమ. సిరిసంపదల సీమ. సహజ వనరుల సీమ. (ఈ మధ్య యీ ప్రాంతంలో సహజ వాయువు, చమురు లభ్యమైన విషయం అందరెరిగినదే) నిత్య కళ్యాణం, పచ్చతోరణంగా విలసిల్లే దివ్యసీమ. ఇది సకల కళాభిరామం, కవిపండిత మండిత సాహితీ నిలయం. నిత్యం వేదఘోషతో ప్రతిధ్వనించే పవిత్ర వేదభూమి. పుణ్య క్షేత్రాలతో పునీతమైన పరమ పవిత్రభూమి. తాపస మునీంద్రుల తపస్సుతో తరించిపోయిన తపోభూమి.

కోనసీమకు ప్రధాన పట్టణం అమలాపురం. అమలాపురానికి పది పండ్రెండు కిలోమీటర్ల దూరంలో ముమ్మిడివరం కుగ్రామం వుంది. అదియే పంచాయితీ గ్రామం. ప్రస్తుతమది

మండల కేంద్రం. ఈ గ్రామంనకు ఉత్తరాన సమీపముననే గోదావరిపాయ, గౌతమీనది తూర్పుగా ప్రవహిస్తోంది. గౌతమీ గట్టున అవతల ఉత్తరాన ద్రాక్షారామం, కోటిపల్లి యివతల దక్షిణాన (కోనసీమలో) ముక్తేశ్వరం శివక్షేత్రాలు, తూర్పుగా కుండలేశ్వరం, దక్షిణంగా వైనతేయ, వశిష్ట గోదావరి పాయలు, గట్టున వైష్ణవ క్షేత్రమైన అంతర్వేది ఉన్నాయి. ఈ ముమ్మిడివరం గ్రామములోనే పురాతనమైన 'శ్రీ సూర్యేశ్వర కేశవ స్వాముల' వారి దేవాలయమున్నది. గ్రామంనకు ఉత్తరాన 'అశ్వముఖి' (అశ్వముక్తి) అను చిన్న నది ప్రవహిస్తున్నది. దక్షిణమున 'పోలమ్మ చెరువు'న్నది. ఈ చెరువు యెట్టి అనావృష్టి పరిస్థితులందును, కరువు కాటకాల కాలమందును 'బట్టి' ఎండిపోయి ఎరుగదు. మహాకవి డా॥ బోయిభీమన్న గారి అభిప్రాయం ప్రకారం (బాలయోగీయం కావ్యం) యిది "ముమ్మిడివరం" అంటే మూడు ముడులు గల గ్రామం. సృష్టి, స్థితి, లయం అనే మూడు ప్రకృతి ధర్మాలు ఒక జీవసూత్రంలో బంధించబడినదని అర్థం.

ఈ ముమ్మిడివరం 'వశిష్ట' 'భరద్వాజ' అను గోదావరి నదీపాయల మధ్యనున్న 'కౌశిక' పాయ తీరమందున్నది. పూర్వమిచ్చట 'మునులు' తపస్సు చేసుకొనుట చేత యీ గ్రామమును 'మునివరం' అని పిలిచే వారట. మహమ్మదీయుల పరిపాలనా కాలంలో యీ గ్రామాన్ని "మహమ్మద్" వరమని పిలిచేవారట. అదే రాను, రాను 'ముమ్మిడివరం' మైనదని జనశ్రుతి.

ది. 27-3-49 శ్రీ వ్యాసం సత్యరాజు మరి యిద్దరు భక్తులతో శ్రీ పెదబాలయోగివారు తమ 'స్వీయ జీవిత చరిత్ర' విశేషాలు వివరిస్తూ "నేను ఉన్న స్థలమును, నాకు యీ స్థితియు నా పూర్వ జన్మ సువాసనల వలన వచ్చె"ననియు "నా జన్మస్థానము కొన్ని సంవత్సరములకు పూర్వం ఘోరారణ్యము ఇచ్చట అప్పటి ఋషులు తపస్సు చేయుచు ముక్తి చెందెడివారు. ఇది మహా పవిత్రమైన ప్రదేశమగుటచేత యిచట జన్మించితి"ననియు స్పష్టపరచియున్నారు గదా. ఈనాడు 'కోనసీమ' ప్రాంతమంతయు పైరుపచ్చని పంట పొలాలతో, వివిధ ఫల పుష్ప వనాలతో (తోటలతో) సస్యశ్యామలంగా, నిత్యకళ్యాణం, పచ్చనితోరణంతో వెల్లివిరుస్తూ యున్న విషయం ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. కాని శ్రీ బాలయోగివారు చెప్పినట్లు కొన్ని వందల, లేదా వేల సంవత్సరాల క్రిందట యీ ప్రాంతంలో జనావాసం కాని ఘోరారణ్య ప్రాంతంగా వుండెడిదేమో! ఆనాడిది సముద్రతీరమందలి పచ్చని అరణ్య ప్రాంతం అయియుండుట చేతను, మరో ప్రక్క పావన గోదావరి నది ప్రవహిస్తూ యుండుటచేతను పూర్వం (పురాణ-ప్రాచీన) ఋషులీ ప్రాంతంలో తపస్సు చేసుకొంటూ జీవనం సాగిస్తూ వుండెడివారేమో! ఈ కారణాల వల్ల యీ ప్రాంతం 'మహాపవిత్ర' మైనందున తాను నిచట జన్మించినట్లు శ్రీ బాలయోగివారు చెప్పారు.

స్కాంధ పురాణం-శ్రీనాథ మహాకవి రచించిన 'కాశీఖండం' 'భీమేశ్వర పురాణం (భీమఖండం) కావ్యాలు చదివితే, అగస్త్య మహాముని, అలానే శివునాజ్ఞ శిరసావహించి కాశీని వదలి దక్షిణాభిముఖంగా, వింధ్య పర్వతాలు దాటి, తమ తమ శిష్యబృందాలతో ఆంధ్రతీరమందలి పీఠికాపురం (పిఠాపురం) సర్పవరం, కోనసీమలో గోదావరి తీరమందలి కోటిపల్లి, ముక్తేశ్వరం, సముద్రతీరమందున్న కుండలేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలు దర్శించినట్లు తెలియుచున్నది. అలా వచ్చిన ఆ మహాఋషులు కొంతకాలం యీ ప్రాంతంలో జీవనం సాగించి తపస్సు (ధ్యానం) చేసుకొని యుండవచ్చును. ప్రసిద్ధ మహాకవి డా॥ బోయిభీమన్న గారు గూడా తాను రాసిన 'బాలయోగీయం' కావ్యం ముందు మాటలో "వేదకాలంలో కోనసమ కేంద్రంగా గల సప్తగోదావరీ ప్రాంత భూములు, ఋష్యాశ్రమాలతో కలకలలాడుతుండేవని, అగస్త్యుడు, వ్యాసుడు మొదలగు మహా మహర్షులు, భారత సంస్కృతీ పితామహులు యీ ప్రాంతంలోనే ఆశ్రమ జీవితాలను గడిపారని సోదాహరణంగా నిరూపించి చెప్పడమే యిక్కడ నా లక్ష్యం' అని వివరించారు. బహుశా ఆనాడు ముమ్మిడివరం ప్రాంతం, సముద్ర తీరమందున్న అరణ్యంగా వుండి వుంటుంది. కనుక శ్రీ బాలయోగి వారు చెప్పినట్లు యీ ప్రాంతం 'మహా పవిత్రప్రదేశమై' యున్నందున తామిచ్చట జన్మించి (గత జన్మలో అసంపూర్ణంగా ఆగిపోయిన తపస్సు) 'చిట్టచివరి జన్మ' లో తాము 'కడపటి మెట్టు'లో 'ఘోరతపస్సు'నకుపక్రమించి యున్నారని మనం గ్రహించవలసి యున్నది.

అదే విధంగా ముమ్మిడివరంలో శ్రీ పెదబాలయోగి వారి సమాధి ప్రక్కనే స్వామివారి నిలువెత్తు పాలరాతి విగ్రహం (స్వామివారు ధ్యాన ముద్రలో కూర్చొన్న స్థితి ఆకాశంలో చెక్కబడిన విగ్రహం) ప్రతిష్ఠించబడింది. శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తిగారు (రిటైర్డు ఐ.ఏ.ఎస్. అధికారి, మాజీ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు) అధిక వ్యయప్రయాసల కోర్చి ఉదార స్వభావులైన దాతల సహాయ సహకారాలతో జైపూర్‌లో శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి విగ్రహాన్ని తయారు చేయించి 1991లో ప్రతిష్టింపచేసారు. అదే విధంగా 1997/98 సంవత్సరంలో శ్రీ చినబాలయోగి వారి నిలువెత్తు నల్లని పాలరాతి విగ్రహం (చినస్వామి వారు ధ్యానముద్రలో కూర్చొన్న స్థితిలో వున్న విగ్రహం)ను తయారు చేయించి, శ్రీ చినస్వామి వారి సమాధి ప్రక్కనే ప్రతిష్ఠింప చేసారు. ఈ విగ్రహం తయారు చేయించుటకు ఎందరో శ్రీ చినస్వామివారి శరీరచ్ఛాయ కాస్త 'నల్లగా' వుంటుంది కనుక, నల్లని పాలరాతితో వారి విగ్రహం చేయించారు. శ్రీ పెదస్వామి వారు 'పండంటి' యెర్రని శరీరచ్ఛాయ గల వారు కనుక, తెలుపు, రోజా కలర్ టింజిగల కలిపిన పాలరాతితో వారి విగ్రహం తయారు చేయించడం జరిగింది. శ్రీ పెదస్వామి, శ్రీ చినస్వామి వారల 'పాలరాతి' విగ్రహాలు తయారు చేయించి, ప్రతిష్టింప జేయటానికి మూలకారకుడైన శ్రీ

మూర్తిగారి జీవితం ధన్యం. శ్రీ మహాయోగి సోదరుల పట్ల శ్రీ మూర్తిగారికున్న భక్తి విశ్వాసాలకిది ప్రబల నిదర్శనం. శ్రీ మూర్తిగారే ప్రస్తుతం ఆశ్రమ కమిటీ అధ్యక్షులుగా యున్నారు.

శ్రీ పెదబాలయోగి వారి విగ్రహం, శ్రీ చినబాలయోగి వారి విగ్రహం, 'జీవ' ముట్టిపడేట్లు సందర్శకుల మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఇరువురు సోదర మహాయోగీశ్వరులు భౌతికంగా జీవించి, ధ్యానముద్రలో దీర్ఘకాలంపాటు ఘోర తపస్సు చేసినప్పుడు, వారిని "సందర్శించుకొనే' భాగ్యం లేనివారు, యీనాడు ముమ్మిడివరం పోయి, ఆశ్రమంలో వారి వారి తపోమందిరాలలో ప్రశాంత, మౌన ప్రసన్న వదనాలతో, ధ్యానముద్రలోనున్న విగ్రహాల్ని సందర్శిస్తే, వారిరువురూ 'సజీవం'గానే వుండి తపస్సు చేసుకొంటున్నార్న 'భ్రమ' కలుగుతుంది. ఆ యిరువురి విగ్రహాలు అంత గొప్పగా 'శిల్పకళాత్మకంగా మలచబడ్డాయి. శ్రీ పెదస్వామివారి ఆదేశానుసారం, శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తిగారు వారి (కీ.శే.) శ్రీమతి అనసూయాదేవి గారు అనేక భక్తుల సహాయంతో శ్రీ పెదస్వామి వారి జన్మప్రదేశంలో జన్మస్థలం వారి "జనన మందిరం" నిర్మించారు. ఆ చిన్న మందిరంలోనే శ్రీమతి అనసూయాదేవి పరమపదించిన తర్వాత ఆమెచిన్న విగ్రహం గూడా నెలకొల్పారు. ఈ జనన మందిరంనకు పై అంతస్థు గూడా నిర్మింపబడింది.

శ్రీ పెద బాలయోగివారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి అవతారమని చాలా మంది విశ్వాసం. శ్రీ 'బ్రహ్మం'గారు భూగృహంలో 'జీవసమాధి' అయిన స్థలం (వారే దేహం చాలించే ముందు జీవ సమాధిలోనికి పోయి తనువు చాలించి బ్రహ్మైక్యం చెందారు) లోనే, కంది మల్లాయపల్లెలో, పెద్ద గుడి నిర్మించబడింది. అదే 'బ్రహ్మంగారి మఠం'గా ప్రసిద్ధి చెందింది. శ్రీ బ్రహ్మంగారి జీవ సమాధి అయిన 'మఠం'లో నేడు నిత్యపూజలు జరుగుతున్నాయి. వారి వంశీకులు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యం వందలాది మంది భక్తులు 'మఠా'నికి వచ్చి శ్రీ బ్రహ్మంగారి సమాధిని దర్శించి పూజలు చేసిపోతుంటారు.

షిరిడీలో బూటీ అనే గొప్ప ధనికుడు శ్రీకృష్ణ విగ్రహం ప్రతిష్టింప తలపెట్టిన మందిరంలోనే శ్రీ సాయి అభీష్టం మేరకు, బూటీ, సాయి సన్నిహిత భక్తుల కోరిక మేరకు, శ్రీసాయి బాబా వారి భౌతికకాయాన్ని సమాధి చేయడం జరిగింది. ఆ సమాధి ప్రక్కనే నిలువెత్తు తెల్లని పాలరాతి శ్రీసాయి విగ్రహాన్ని (రాయిపై కూర్చున్నట్లుండు విగ్రహాన్ని) ప్రతిష్టించడం జరిగింది. ఈనాడు మందిరం 'ద్వారకామాయి'గా ప్రసిద్ధిచెందింది. నిత్యం వేలాది భక్తులు షిరిడీ యాత్ర చేస్తూ శ్రీ సాయి బాబా వారి విగ్రహానికి పూజాదికాలు నిర్వహిస్తుంటారు. శ్రీ సాయిబాబా సమాధిగతుడైనా గొప్ప మహాత్మ్యం గలవాడని భక్తుల విశ్వాసం. షిరిడీ ఈనాడు గొప్ప ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోంది.

అలాగే శ్రీ పెద, చిన బాలయోగీశ్వర సోదర మహాయోగులు, నాల్గు దశాబ్దాలపాటు సుదీర్ఘ కాలం ఘోరతపస్సు చేసి, కైవల్యసిద్ధి పొందిన పవిత్ర ప్రదేశములందే వారి భౌతిక కాయాలను సమాధి చేయడం జరిగింది. వారి సమాధుల చెంతనే వారి విగ్రహాలను (తపస్సు చేయుచున్నట్లుండు విగ్రహాలను) ప్రతిష్ట జేయడం జరిగింది. ప్రతినిత్యం వందలాది భక్తులు ముమ్మిడివరం వచ్చి, ఆశ్రమంలోని బాలయోగి సోదరుల 'తపో మందిరాలలో నెలకొల్పబడిన సమాధులను, దర్శించి వారి విగ్రహాలకు పూజాదికాలు జరిపి పోతుంటారు. యోగి సోదరుల విగ్రహాలకు ప్రతినిత్యం పూజాదికాలు నిర్వహించబడుతున్నాయి. ఇరువురు మహా యోగి సహోదరులు సుదీర్ఘకాలం పాటు 'కఠోర తపస్సు' చేసిన ముమ్మిడివరం చాలా పవిత్రమైనది వేదకాలంలో యీ ప్రాంతం పరమ పవిత్రమైనదని శ్రీ పెదస్వామి వారు చెప్పియున్నారు. శ్రీ పెదబాలయోగివారు "ఆశ్రమంలో నెలకొకనాడైనా" 'రాత్రి' నిద్రచేయమని, కనీసం ఒక 'గంట' సమయమైనా ఆశ్రమంలో ధ్యానం చేయమని కమిటీ సభ్యులతో చెప్పెడివారని శ్రీ బోరపోలయరెడ్డి ద్వారా తెలియుచున్నది. ముందు ముందు ముమ్మిడివరం, షిరిడీ వలె, బ్రహ్మంగారి మఠంవలె మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్ల గలదు. యోగిసోదరుల తపోమహిమవలన భౌతికంగా, జీవించి తపస్సు చేసినంత కాలం, యిరువురు సహోదర మహా యోగీశ్వరులు 'మహాశివరాత్రి' మరుసటి రోజున మాత్రమే భక్తులకు, సందర్శకులకు దర్శన భాగ్యం కలుగజేసారు గదా! వారు జీవించినంత కాలం వారి తపోమందిరాలకు తాళాలు బిగించి వుండేవి. కాని యీనాడు (వారు కైవల్యసిద్ధి పొందిన తర్వాత) తపో మందిరంలో ఉదయం, సాయంత్రం, పూజాదికాలు నిర్వహించి హారతులివ్వబడుతున్నాయి. నిత్యం, వందలాది మంది భక్తులు, సందర్శకులు వచ్చి ఆశ్రమమందున్న వారి తపో మందిరాలలో ప్రతిష్టింపబడిన వారి 'పవిత్ర విగ్రహాలను భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి పోతుంటారు. మరి కొందరు వారి దివ్య విగ్రహాలను సందర్శించి వెళుతూ వుంటారు. అలానే ఆశ్రమ ప్రాంగణంలో నిర్మింపబడిన 'తపోమందిరం (భజన మందిరం) వారి ధ్యాన మందిరాలపై చెక్కబడిన సోదరయోగుల విగ్రహాలతోపాటు, యితర పురాణ యోగిపుంగవుల విగ్రహాల శిల్పకళానైపుణ్యాన్ని ఆసక్తితో తిలకించిపోతుంటారు. పెదస్వామివారి జన్మస్థలంలో నిర్మింపబడిన జనన మందిరాన్ని, వారు ప్రప్రథమంగా తపస్సునకు కూర్చున్న ఇళ్ళ గోవిందరావుగారి కొబ్బరి తోటలో నిర్మింపబడిన చిన్న కట్టడాన్ని శ్రీ గంగయ్య మెమోరియల్ హాలు, తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించిన పెద్ద హాలు, యిత్యాది కట్టడాలను, భక్తులు, సందర్శకులు భక్తిపూర్వకంగా ఆసక్తిదాయకంగా తిలకించి పోతూవుంటారు.

ఇక్కడొక విషయం గుర్తు చేసుకోవాలి. సోదర మహాయోగులు కైవల్యసిద్ధి పొందిన తర్వాత గూడా, మహాశివరాత్రి నాడు యితర పర్వదినాలలో బాలయోగీశ్వరుల వారి

తపోమందిరాలను దర్శించి, వారి పవిత్ర సమాధులను, వారి దివ్య విగ్రహాలను సందర్శించి, పూజలు చేయటానికి భక్తులు వందలాదిగ వస్తుంటారని తెలుసుకొన్నాం గదా. శ్రీ బాలయోగివారు సజీవంగా తపస్సు చేసుకొంటూ మహా శివరాత్రికి భక్తకోటికి దర్శన భాగ్యం కలుగచేసినప్పుడు శ్రీ బాలయోగి వారి పరమభక్తుడు శ్రీ బోర పోలయ్యరెడ్డిగారు భక్తులకు, 'అన్నదాన' సదుపాయం సమకూర్చెడివారని తెలుసుకున్నాం. శ్రీ బాలయోగివారు బ్రహ్మైక్యం చెందారు. శ్రీ బోర పోలయ్యరెడ్డి గారు పరమపదించారు. అయినా శ్రీ రెడ్డిగారి కుటుంబీకులన్ను శ్రీ కర్రి గంగరాజు రెడ్డిగారున్నూ, మహా శివరాత్రి తదితర పర్వదినాలలో ఆశ్రమంలో జరిగెడి విశేష పూజాదికాల కార్యక్రమాలకు హాజరయ్యే భక్తులకు 'అన్నదాన' సదుపాయం నేటికిన్నీ సమకూర్చడం విశేషం. గమనార్హం.

మహాయోగులైన 'అపూర్వ సోదరులిరువురు (చిన, పెద బాలయోగీశ్వరులు) 'పంచమ' జాతి (దళిత-హరిజన)లో పుట్టడం వలన యోమోగాని సుమారు నాల్గు దశాబ్దాలు దీర్ఘకాలం తపస్సు చేసిన ఇరువురు 'యోగి' సోదరులకు రావలసినంత ప్రాచుర్యం, ప్రతిష్ఠలు లభించలేదు. అసలు వాటి కోసం ఆ ఇరువురు సోదర యోగీశ్వరులు తపస్సు చేయలేదు. వారు యే యితర అగ్రకులములందు జన్మించియుంటే యీపాటికి వారికి బ్రహ్మరథం పట్టియుండేవారు. ఇదే అభిప్రాయం డా॥ బోయి భీమన్న గారు, శ్రీ పెదబాల యోగివారు కైవల్య సిద్ధిపొందిన తరువాత, రాసిన "బాల యోగీయం" కావ్యం "ముందుమాట"లో సవివరంగా రాసారు. ఆ విషయం మరొక చోట చెప్పడం జరిగింది.

ఏది ఏమైనా అన్నదమ్ములైన యిరువురు మహాయోగీశ్వరుల వారి దీర్ఘకాలఘోర "తపస్సు" వ్యర్థం కాదు. ఊరకపోదు. పెదస్వామి వారు చెప్పినట్లు ఆ ప్రదేశంలో పూర్వం మహా ఋషులు తపమాచరించారు. ఆ స్థలం "పవిత్రమైనది" పైగా ఒకనాడు అంటరాని వారిగా, చూడరానివారిగా, మాట్లాడరాని వారిగా ఎంచబడి, నీచంగా చూడబడిన, 'పంచమి' జాతుల వారు ఈనాడు ఏకారణాల వల్లనైతేమీ అన్ని విధాల అభ్యున్నతి చెందుతున్నారు.

శ్రీ వీరబ్రహేంద్రస్వామి వారు అన్నట్లు "మాలలకు మంచాలు బ్రాహ్మలకు పీఠలు" దినాలు వచ్చాయి. "కాలము మారిపోయె. కలకాలము దాస్యము వుండబోదు... మాలలు రాజావ లేలుదు రుసుమా" అని మహాకవి డా॥ బోయి భీమన్న గారు 1920 ప్రాంతంలో చదువుకునే రోజులలోనే పద్యం రాసాడు కవి ఋషి గదా. ద్రష్ట గదా.

రోజులు మారి పోతున్నాయి. మహాయోగుల తపోబలం, తపోశక్తి, తపో మహిమ ఆ ప్రదేశమందు నిక్షిప్తమైయున్నది. రానున్న కాలంలో ముమ్మిడివరం షిరిడీ వలె, బ్రహ్మంగారి మఠం వలె, అత్యున్నత మహా దివ్య పుణ్యక్షేత్రంగా విరాజిల్లగలదు.

భగవాన్ శ్రీ బాలయోగీశ్వరుల వారి ఆశ్రమం

భగవాన్ శ్రీ బాలయోగీశ్వరుల వారి ఆశ్రమ ప్రాంగణంలో నిర్మితమైన గుడి గోపుర భవన సముదాయం గురించి తెలుసుకుందాం.

ముమ్మిడివరం గ్రామం, అటు పెద్ద పట్టణం కాదు. ఇటు చిన్న పల్లెయు కాదు. అది యిప్పుడు 'మేజర్ పంచాయితీ' గ్రామం ప్రస్తుతం అది రెవెన్యూ మండల కేంద్రం. అమలాపురంనకు తూర్పుగా సుమారు 12 కిలో మీటర్ల దూరంలో నున్నది. అమలాపురం నుండి ముమ్మిడివరం వరకు పక్కా రోడ్డు సౌకర్యం కలదు. శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారు (ఐ.ఏ.ఎస్.) రోడ్లు భవనాల కార్యదర్శిగా నున్న కాలంలో యీ రోడ్డును బాగా వెడల్పు చేయగలిగారు.

అమలాపురం నుండి బయలుదేరి వెడుతూ వుంటే ముమ్మిడివరం గ్రామ ప్రవేశమున రోడ్డునకు తూర్పుగా, కుడి ప్రక్కగా అల్లంత దూరాన రెండు పెద్ద పెద్ద గోపురాలు చూపురులకు కన్నుల పండువుగా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ప్రధాన రహదారి నుండి తూర్పుదిశగా ప్రక్కనే ప్రవహించే పంటకాల్వ, నానుకొని యున్న చిన్న రోడ్డు గుండా ప్రయాణిస్తే, (సుమారు ఒక కిలో మీటరు లోపు) దక్షిణాన భగవాన్ శ్రీ బాలయోగీశ్వరుల వారి పెద్ద ఆశ్రమం సందర్శకులను ఆకట్టు కొంటుంది. పంట కాల్వ, దానిప్రక్కల చిన్న రోడ్డు, ఆనుకొని దక్షిణ దిశలో నున్న పెద్ద గోపుర మందిరమందే శ్రీ పెదబాలయోగీశ్వరుల వారు సుదీర్ఘ కాలం పాటు కఠోర (ఘోర) తపస్సు చేసియున్నారు. దీనినే ధ్యానమందిరమని, తపోమందిరమని అంటారు. దాని ముందు భాగాన (ఉత్తర భాగాన, దర్శన మండపమున్నది. మహాశివరాత్రి మరునటి రోజు శ్రీ పెదబాలయోగివారు తమ ధ్యాన (తపో) మందిరం నుండి యీ దర్శన మండపంపైకి విచ్చేసి శేషపీఠంపై ధ్యానముద్రలో ఆసీనులై భక్తకోటికి దర్శన భాగ్యం చేసెడివారు.

దర్శన మండప దిగువున, శ్రీ బాలయోగీశ్వరుల వారు తపస్సు ప్రారంభించిన తొలినాటి శ్రీవారి విగ్రహం, శ్రీకృష్ణ విగ్రహాలున్నాయి. వాటి ముందు తులసి కోట నంది విగ్రహం ప్రాకారం గోడ ఆనుకొని లోపల భాగాన శ్రీయుతులు డి. బాలసుందరం (నాటి జిల్లా కలెక్టరు) పెయ్యల పల్లయ్య, శ్రీ గంగయ్య గార్ల సుందరమైన సిమెంటు విగ్రహాలున్నాయి. ఇద్దరు మహాయోగి సోదరుల కన్న తల్లిదండ్రులైన శ్రీమతి రామమ్మ, శ్రీమతి వెంకమ్మ, శ్రీ గంగయ్యల విగ్రహాలున్నాయి.

తపో మందిరం గోపురం పైన నలు దిక్కుల శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి వివిధ దశలలో, (తపస్సు ప్రారంభించిన నాటి నుండి) తపో భంగిమ సిమెంటు విగ్రహాలు 60 (అరువది)

పెద్దవి, (అర్థ చంద్రాకార ఆర్చీలలో), అలానే 24 (యిరువది నాల్గు) (అర్థ చంద్రాకార ఆర్చీలలో) చిన్న విగ్రహాలు (ఆర్చీలలో) మొత్తము 84 (ఎనభైనాల్గు) యున్నవి. ముందుభాగాన, గోపుర పై భాగాన, శ్రీ మహావిష్ణువు విగ్రహమున్నూ, కుడి భాగమున బ్రహ్మ మూర్తి విగ్రహమున్నూ, ఎడమ భాగాన మహేశ్వరుని విగ్రహమున్నూ, వెనుక భాగాన కామధేనువు విగ్రహమున్నూ గలవు. శ్రీ బాలయోగీశ్వరులవారు, 'త్రిమూర్త్యాత్మక స్వరూపుడని, పూర్వాశ్రమంలో (బాల్యమందు) శ్రీ సుబ్బారావు పేర గోపాలుడిగా జీవితం గడిపియుండుట చేత, వెనుక భాగాన నున్న కామధేనువు ప్రతీకగా వున్నది. గోపురం పడమర వైపున శ్రీ వెంకటేశ్వరస్వామి (మహావిష్ణువు) వారి విగ్రహం, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహం వున్నవి. శ్రీ పెదబాలయోగివారు తపస్సు ప్రారంభదశలో 'శ్రీ కృష్ణ-నారదుల చిత్రపటం పూజించుటచేతను, 'కృష్ణ నారాయణ' నామజపం చేయుటవల్లను, మందిరం లోపల శ్రీ లక్ష్మీ నారాయణుల వారిని పూజించుట చేతను, శ్రీకృష్ణుని భక్తులకు దర్శనమిచ్చుటచేతను, మహావిష్ణువు, శ్రీ వేంకటేశ్వరస్వాముల వారి విగ్రహాలు, శ్రీ బాలయోగివారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి అవతారంగా పరిగణింపబడుటచేత, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి విగ్రహమున్నూ, ప్రతీకలుగా గోపురంపై సిమెంటుతో చెక్కబడి యున్నాయి.

శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి తపో ఆశ్రమం రెండతస్థుల గోపుర భవనం వెనుక భాగాన (దక్షిణ భాగాన), శ్రీ చినబాలయోగీశ్వరుల వారి పెద్ద తపో ఆశ్రమ గోపుర భవనమున్నది. గోపురం పైభాగాన చుట్టూరా, వయస్సును బట్టి, దశలవారీగా (సంవత్సరాల వారీగా) శ్రీ చినస్వామి వారి తపో భంగిమలలో ఆర్చీలలో మొత్తం 44 విగ్రహాలున్నాయి. శ్రీ చినస్వామివారి ఆశ్రమ వెనుకభాగాన (దక్షిణం) నున్న ప్రహరీగోడ ఆశ్రమ ప్రవేశద్వారం (పెద్దగేటు) పై పెద్ద ఆర్చీ నిర్మించబడింది. ఆ ఆర్చీపై త్రిమూర్తులు, సప్తఋషుల విగ్రహాలతోపాటు ప్రహ్లాద, ధ్రువ, మార్కండేయాది ప్రభృతి (7) ఏడుగురు బాలముని కుమారుల విగ్రహాలున్నాయి. గోపుర పడమర (ఎడమ) వైపున దశావతారముల విగ్రహములతోపాటు మధ్యలో శ్రీ పెదబాలయోగీశ్వరులవారి విగ్రహమున్నది. శ్రీ చిన స్వామివారి తపో, మందిర గోపుర భవనం ముందు భాగాన (ఉత్తర, తూర్పు భాగాన) దర్శనమండపమున్నది.

రెండు గోపురాలు నిర్మించి, వాటిపై విగ్రహాలు చేయించిన వారు శ్రీ స్వామివారి పరమభక్తుడు శ్రీ బచ్చు మాధవయ్యగారు (ఏలూరు) గోపురాల నిర్మాణం, ఆర్చీలు, విగ్రహాలు, తయారుచేసిన మహా శిల్పులు తమిళనాడుకు చెందిన శ్రీ 'గంగాధరన్' బ్రదర్సు మధురై నగరవాస్తవ్యులు.

శ్రీ పెదస్వామి, శ్రీ చినస్వామి వారల తపో ఆశ్రమాల మధ్యలో రెండు వృద్ధ (కవల) నారికేళ (కొబ్బరి) వృక్షములు 1954 ప్రాంతంలో నాటినవి నేటికిని కాయలు కాస్తూ, సహోదర

మహాయోగీశ్వరులకు ప్రతీకలుగా 'జంట'గా ఏపుగా పెరిగి విరాజిల్లుతున్నాయి.

శ్రీ పెదబాల యోగీశ్వరులవారి తపోఆశ్రమ గోపుర భవనం (ధ్యానమందిరం)నకు తూర్పు యీశాన్యదిశలో 'తపో మందిర'మున్నది. మరి యీ తపోమందిరంలో శ్రీ పెదస్వామివారు ఏనాడూ తపస్సు చేసిన దాఖలాలులేవు. బహుశా, తాము దీర్ఘకాలం తపస్సు చేసిన తపో ఆశ్రమం నుండి యీ 'తపో మందిరం'లోనికి మారి తపస్సు చేయవలెనని ఆయనకు కోరిక యుండేదేమో ఎవరికి తెలియదు. ఇందులో మధ్య గదిలో శేషపాన్పు శ్రీ పెదస్వామి వారి విగ్రహాలున్నాయి. ఈ మందిరాన్ని 'భజన మందిర'మని గూడా పిలుస్తారు.

ఆశ్రమ ప్రాంగణం (శ్రీ పెద, శ్రీ చిన బాలయోగీశ్వరుల వారి తపోమందిరాలున్న ప్రదేశం) దక్షిణ భాగాన (చిన్న రోడ్డు దక్షిణ-తూర్పు భాగాన) శ్రీ తిరుపతి, తిరుమల దేవస్థానం వారు నిర్మించిన పెద్ద సత్రశాల (విశాలమైన హాలు) యున్నది. ఈ సత్రశాలపైని చుట్టూరా పిట్టగోడలపైని ప్రసిద్ధ పురాణ పురుషుల, సిద్ధ పురుషుల విగ్రహములున్నాయి. శ్రీ కె.యస్.ఆర్. మూర్తి (రిటైర్డు ఐ.ఏ.ఎస్.) గారు రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా యున్న కాలంలో వారి ప్రమేయంతో టి.టి.డి. వారీ సత్రశాల నిర్మాణంనకు అనుమతి మంజూరు చేసారు.

శ్రీ పెదబాలయోగివారు జన్మించిన పవిత్ర ప్రదేశమందు (ఆశ్రమ ప్రాంగణం దక్షిణ భాగాన) శ్రీ స్వామివారి అభీష్టం మేరకు శ్రీ కె.యస్.ఆర్. మూర్తిగారు భక్తులు నిర్మించిన రెండస్తుల చిన్న గుడి యున్నది. అదే విధంగా శ్రీ పెదస్వామివారు ప్రప్రథమంగా తపస్సునకు కూర్చున్న ఇళ్ళ గోవిందరావుగారి కొబ్బరితోటలో 1970లో శ్రీ గుడ్ల అప్పారావుగారిచే నిర్మించబడిన చిన్నగుడి యున్నది. ఆశ్రమానికిది సుమారు నాల్గు ఫర్లాంగులు (అరకిలోమీటరు) దూరంలో వుంది. పంట చేలు కొబ్బరితోటలున్న యీ ప్రదేశంనకు శ్రీ మూర్తిగారు ఆశ్రమ ప్రాంగణం నుండి చిన్న రోడ్డు వేయించారు.

ఆశ్రమానికి దక్షిణభాగాన (గంగయ్య గారి కుటుంబీకులకు నిర్మించిన పెద్ద గృహంనకు ఉత్తరాన) ఆశ్రమ కమిటీ అధ్యక్షుల వారు బసచేయుటకు 'గెస్టుహౌజు' కమిటీ సభ్యుల వారి కొక గెస్టు హౌజు, శ్రీ గంగయ్య మెమోరియల్ హాలు వున్నాయి. కమిటీ అధ్యక్షుల వారి వసతి గృహం శ్రీ వి. బాల సుందరం గారు (జిల్లా కలెక్టరు) శ్రీ గంగయ్య మెమోరియల్ హాలును శ్రీ బోరపోలయ్యరెడ్డి గారు శ్రీ బచ్చు మాధవయ్య గారలు.

ఇవికాక అమలాపురం ముమ్మిడివరం రహదారిపై తూర్పున పోలమ్మ చెరువుగట్టుపై శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తిగారి చొరవతో రోడ్లు భవనాల కార్యదర్శిగా నున్న కాలంలో నిర్మింపబడిన ప్రభుత్వ అతిథి గృహం (ఆర్.&బి.) పెద్దది ఒకటున్నది. అలాగే అమలాపురం ముమ్మిడివరం రోడ్డు ప్రక్కన, పోలమ్మ చెరువుగట్టుపై శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి గారి చొరవతో, పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా నున్న కాలంలో నిర్మింపబడిన అతిథిగృహం కూడ ఉన్నది.

ఇక శ్రీ బాలయోగీశ్వరుల వారి ఆశ్రమంలోని శ్రీ పెద, శ్రీ చినబాలయోగీశ్వరుల వారి తపోమందిరాలలో, వారి సమాధి, విగ్రహాలకు ప్రతినిత్యం పూజాదికాలు జరుగుతున్నాయి. ఎవరైనా ప్రముఖులు వస్తే ఆ విషయం సమీపమందున్న కుటుంబ సభ్యులకు తెలియజేయడం, వారు వెంటనే పురోహితుణ్ణి రప్పించి తపో ఆశ్రమ తలుపులు తీయించి ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు.

ఇవికాక ప్రతి సంవత్సరం ఆశ్రమంలో ప్రత్యేక పూజాదిక కార్యక్రమాలు, ఆరాధనోత్సవాలు జరుగుతుంటాయి. కొన్ని ఆంగ్ల తేదీల ప్రకారం జరుపబడితే మరికొన్ని చాంద్రమాన (భారతీయ హైందవ పంచాంగం ప్రకారం) తెలుగు తిథి నక్షత్రాల ప్రకారం జరుపబడుతున్నాయి.

మహాశివరాత్రి మరుసటి రోజు శ్రీ సోదర బాలయోగీశ్వరులు జీవించి, తపస్సు చేసినప్పుడు, భక్తులకు దర్శన భాగ్యం కలుగజేసెడివారు గదా. వారివురురు కైవల్య సిద్ధి పొందినను ప్రతి సంవత్సరం మహాశివరాత్రి నాడు, మరుసటి రోజు ఆశ్రమంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు జరుపబడుతున్నాయి. ఇప్పటికిన్నీ తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒరిస్సా ప్రాంతములనుండి భక్తులు వస్తుంటారు. శ్రీ బోర పోలయ్యరెడ్డిగారి కుటుంబీకులు అన్నదాన సంతర్పణ యథావిధిగా జరుపుతున్నారు. అలాగే శ్రీ పెదస్వామి వారు మొదట శ్రీ కృష్ణుని పటమునకు పూజలు చేయుట చేతను శ్రీ స్వామివారు శ్రీ కృష్ణునిగా దర్శన మిచ్చియున్నారు. కనుక ఆశ్రమంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరుపబడున్నాయి. తపస్సు చేసిన తొలి సంవత్సరాలలో శ్రీ పెదస్వామివారు శ్రీదేవిని పూజించినట్లు కొందరు భక్తులు స్వయంగా చూచియున్నారు కనుక ఆశ్రమంలో ప్రతి సంవత్సరం 'దుర్గాష్టమి' (దేవిపూజ' పర్వదినం ప్రత్యేక పూజలు జరుపబడుతున్నాయి. శ్రీ పెదస్వామివారిని "పరమ గురువు" గా సంభవించి దైవ స్వరూపంగా భక్తిశ్రద్ధలతో పూజించే వారున్నారు కనుక 'గురుపూర్ణిమ' (ఈ శివుడు దక్షిణామూర్తి గదా, శ్రీ పెదస్వామి వారు బాల శివావతారునిగా దర్శనం యిచ్చియున్నారు గదా) ఉత్సవం గూడా ప్రతి సంవత్సరం జరుపబడుతున్నది. అలానే శ్రీ రామనవమి పర్వదినం గూడా ఆశ్రమంలో జరుపబడుచున్నది.

శ్రీ పెదబాలయోగీశ్వరులు, శ్రీ చిన బాలయోగీశ్వరులు జన్మదిన వేడుకలు, వారు తపస్సు ప్రారంభించిన పవిత్ర పర్వదిన వేడుకలు వారు కైవల్యసిద్ధి బొందిన పరమపవిత్రదిన వేడుకలు, వీటితోపాటు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పర్వదినాలలో ప్రత్యేక పూజాదికాలు జరుపబడతాయి. ఈ పర్వదిన వేడుకలు ఆంగ్లమాన తేదీల ప్రకారం కాక హైందవ పంచాగం (చాంద్రమాన) తిథి నక్షత్రాల ప్రకారం జరుపబడుతున్నాయి. వాటి వివరాలు.

1. శ్రీ రామనవమి
2. శ్రీ చిన్నబాలయోగీశ్వరుల వారి తపస్సు ప్రారంభ మహోత్సవము.
3. ఓమ్ భగవాన్ శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి తత్త్వోపదేశ జయంతి మహోత్సవము.
4. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి సమారాధన మరియు శ్రీ కన్యకాపరమేశ్వరి జయంతి.
5. ఓమ్ భగవాన్ శ్రీ పెదబాలయోగీశ్వరులు వారి తపస్సు ప్రారంభమహోత్సవము.
6. గురు పౌర్ణమి సద్గురు పూజా మహోత్సవము.
7. ఓమ్ శ్రీ భగవాన్ శ్రీ పెదబాలయోగీశ్వరులవారి కైవల్య సిద్ధి పూజా మహోత్సవము.
8. శ్రీ కృష్ణ జయంతి మహోత్సవము.
9. శ్రీ దేవి పూజా మహోత్సవము.
10. శ్రీ చినబాలయోగీశ్వరుల వారి కైవల్యసిద్ధి మహోత్సవము.
11. శ్రీ చినబాలయోగీశ్వరులవారి జన్మదిన మహోత్సవము.
12. ఓమ్ భగవాన్ శ్రీ పెదబాలయోగీశ్వరుల వారి జన్మదిన మహోత్సవము.
13. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి పూజా మహోత్సవము.
14. ఓమ్ భగవాన్ బాలయోగీశ్వరులు తండ్రిగారు కీ.శే. కటికదల గంగయ్యగారి వర్ధంతి పూజ.
15. చినబాలయోగీశ్వరుల వారి మాత శ్రీమతి కటికదల వెంకమ్మగారి వర్ధంతి పూజ.
16. మహాశివరాత్రి మహోత్సవములు.

ఆశ్రమానికి స్థలం కొన్న దాతలలో ప్రముఖులు, శ్రీయుతులు బచ్చు మాధవయ్య, ఏలూరు, ముత్యాల జానకిరామన్న, చెల్లూరు, శ్రీ బోరపోలయ్యరెడ్డి రాజమండ్రి, శ్రీ సూరిశెట్టి వెంకటస్వామి నాయుడు (మగటపల్లి) ఉంగరాల హనుమంతరావు, నార్నికదేశ్వరుడు, అప్పటి తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు గారైన డి. బాలసుందరంగారున్నూ మరికొందరు మద్రాసు (తమిళ) భక్తులు.

ఆశ్రమ ప్రాంగణంలోని మొదట పెంకుటి ధ్యానమందిరం, నిర్మించిన వాస్తు తద్వారా పక్కా సిమెంటు రెండస్తుల తపో (ధ్యాన) మందిర గోపుర భవనం, దాని తూర్పున తపో మందిరం (భజన మందిరం) శ్రీ చిన బాలయోగివారికి మొదట పెంకుటి ధ్యానమందిరం నిర్మించినవారు పల్నాటి నారాయణస్వామి, ఆ తర్వాత పక్కా సిమెంటు తపోమందిర గోపురం నిర్మించినవారు శ్రీ బచ్చు మాధవయ్యగారు. పెదస్వామివారి దర్శన మండపం, శ్రీ గంగయ్య మెమోరియల్ హాలు నిర్మించిన వారు శ్రీ బోరపోలయ్యరెడ్డిగారు. శ్రీ బాలయోగి వారి కుటుంబ సభ్యులకు నివాస యోగ్యమైన పక్కా సిమెంటు గృహం కట్టించిన వారు శ్రీ ముత్యాల జానకిరామన్న గారు. శ్రీమతి పామి లెన్ కార్ట్, ఫ్రెంచి భక్తురాలు పెదస్వామి వారి పాలరాతి విగ్రహమును జయపూర్‌లో చేయించి పెదస్వామివారి దర్శన మండపము మీద ప్రతిష్టించినారు.

బాలయోగి

-పద్మశ్రీ బోయి భీమన్న

వసియించితివి జనావాసాల మధ్యలో
ప్రజలకు నీ దీక్షపంచి యడగ
ప్రకటించితివి బ్రహ్మపదవికి విగ్రహ
ద్వారమే సుఖమైనదన్న నిజము
చూపించితివి దివ్య దీప రశ్ముల లోన
తరగని మధురామృతాన్నములను
బోధించితివి భూతములు కారు నరులు, ఓ
జో మూర్తులను వేద సూక్తవితతి.

బాల శివుడవైమండలాబ్దములుపాటు
ధ్యానమే నీవు, నీవె బ్రహ్మమ్ము కాగ
స్వచ్ఛ మానవాదర్శ శిల్పప్రదర్శ
నమ్ము గావించినావు, ధన్యము జగమ్ము.

నీవు నిరూపించితి వీ
జీవగుణాదర్శధర్మ సిద్ధులనెల్లన్
జీవన్ముక్తుడవైతివి
జీవ బ్రహ్మముల కేకశిల్పాకృతివై
నీవు సన్యాసి కావు, బాబావు కావు
నాయకుడవును కావు, చిన్న తనమందె
జీవ బ్రహ్మైక్యమొందిన సిద్ధుడవు
ఎందుకుండును దేహ సంస్పృహము నీకు

ఆస్తికులకునీవు వాస్తవదైవంబు
నాస్తికులకు దైవ వాస్తవంబు
ఆస్తి నాస్తినడుమ అస్మిత, వసితవు
ఆదినీదమీవు వేదములకు.
నిన్ను చూడరాగ నీవు చూపెదు గీత
గీత చూడబోవ క్రియను చూపు
క్రియను చూడ కోటి కిరణాల మిరుమిట్లు
కన్ను మూసిలోని నిన్నెచూపు

నీవాధార విశేషతముగా నీ చుట్టు రాజీవమై
నీవాసమ్మొక క్షేత్రమై వెలయ నుండెన్; యోగ విద్యాధరీ
శ్రీవాసమ్మయి, మానవోత్తర మహాసృష్టి క్రియా కేంద్రమై
ప్రావిష్కారము పొందనుండెను, పరావాసమ్ము కానుండెనున్

ఓం శ్రీ భగవాన్ శ్రీ బాలయోగీశ్వర సుప్రభాతం

శ్రీకృష్ణ పరమాత్మనే నమః
శ్రీ భగవాన్ బాలయోగీశ్వరాయ నమః
రామాంబికా సుప్రజాస్వామిన్
పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ట బాలయోగీశ
కర్తవ్యం దివ్య దర్శనం
ఉత్తిష్ఠోత్తిష్ట యోగీశ! ఉత్తిష్ట శుభదర్శన
ఉత్తిష్ట ఫణిరాట్తల్పా! త్రైలోక్యం మంగళంకురు

శ్రీకృష్ణ దివ్యపదపంకజ భృంగరాజ
రామాంబికా మలపుణ్యఫలానురూప
శ్రీ బాలయోగీశ్వర పుణ్యమూర్తే
దివ్య స్వరూప భగవన్ తవ సుప్రభాతం

శ్రీ గంగ యార్య మహానీయ కుల ప్రదీప
కళ్యాణ నిర్మల గుణాకార దివ్యమూర్తే
శ్రీ బాలయోగీశ్వర సుప్రసన్న
దివ్యస్వరూప భగవన్ తపసుప్రభాతం

స్వామిన్ భవతూర్వ భవోపలబ్ధి
సంపూర్ణ యోగమహిమాగ్ని మయశ్శరీరః
శ్రీ బాలయోగీశ్వర పుణ్యమూర్తే
దివ్యస్వరూప భగవన్ తపసుప్రభాతం

ప్రణవ స్వరూప భగవత్పద పద్మభృంగ
దైవోప మాన మహానీయ విశిష్టమూర్తే
శ్రీ బాలయోగీశ్వర సుప్రసన్న
దివ్యస్వరూప భగవన్ తపసుప్రభాతం

పరమార్థ చింతన పరాయణ సుస్వభావ
రాగాది దోష భయవర్జిత భాగ్యరాశే
శ్రీ బాలయోగీశ్వర పుణ్యమూర్తే
దివ్యస్వరూప భగవన్ తపసుప్రభాతం

పరిశుద్ధ సత్త్వగుణశోభిత సాధుమూర్తే
కారుణ్య పూర్ణపరమార్థ పరావరజ్ఞె
శ్రీ బాల యోగీశ్వర సుప్రసన్న
దివ్యస్వరూప భగవన్ తపసుప్రభాతం

పరతత్వ నిత్య నిరవద్యరసాను భూతౌ
సారూప్య వైభవ నిమగ్న హృదంతరాళ
శ్రీ బాలయోగీశ్వర పుణ్యమూర్తే
దివ్యస్వరూప భగవన్ తపసుప్రభాతం

శ్రీ బాలయోగీశ్వర సంస్తుతి

- శ్రీ జయంతి స్వామినాయన

ఈతడు కాష్టమౌని పరమేశ్వరు నంతటి వాడగున్ మహా
భూతము లెల్ల వశ్యములు బూర్ణుడు భక్తుడు ముక్తు డట్టి యీ
పూత చరిత్రునిన్ విబుధపూజ్యుని గొల్చెడి భాగ్యరేఖ నా
చేతుల లేకపోయె నని చింతిలు చుంటిని మాటిమాటికిన్

గాలిని మాత్రమే గొనుచు గర్మములన్ సకలంబు వీడి మో
క్షాలయ మందగా బురుష యత్నము జూపిన యోగి వీనినిం
బోలెడి వాని నెందు గన బోను, పురాణము లందు నున్నచో
వ్రేలును జూపి చూపుడని వేడుదు దెల్పుడి పండితోత్తముల్

బాలుడు మాల డంచు నొకభూతి దలంతురొ మేమొ కర్మ చం
డీలుడు గాడితండు సుగుణంబుల ప్రోవు మహానుభావు డు
ద్వేలతపః ప్రభావుడువిందదళాక్షపదాబ్జ సేవనా
లోలుడు తత్త్వశీలు డని లోక మెఱుంగుత బాలయోగినిన్

నీవు మహానుభావుడవు నీదు తపోమహిమంబుచే రమా
దేవి పదద్వయంబవసుదేవకుమార దివ్యపాదరా
జీవయుగంబు-నీ నిలయ సీమను జూపి మదీయ జన్మమున్
బావనముం బొనర్చిన ఋణం బెటు దీర్తు మునీంద్ర చంద్రమా!

ఎంతటి వాడ వైతివి! మహేంద్ర ప్రముఖామరు లంత వారి క
త్యంతము దుర్లభంబగు మహత్తరశక్తి గడించి నీ గృహా
భ్యంతర సీమ గృష్ణభగవానుని గట్టిగ గట్టి తౌర నీ
యంతటి వాని గానను జు! మా! మఱి బాల మునీంద్ర చంద్రమా!

పదియారు వన్నె మేల్పసిమి బంగరు చాయ
మించి రాణించు నెమ్మేను వాడు
నిండు పున్నమ నాటి నెలతోడ సరివచ్చు
నిగరిగల్ గల ముద్దు మొగము వాడు

తెలిదమ్మి పువ్వు రేకుల సోయగము గేరి
నును సొంపు లొలయు కందోయి వాడు
వెనుదాక వ్రేలాడుటను వీడి శిరమందు
ముడి గన్న నిడుద కెంజడల వాడు

కవిత ముకుళిత హస్త యుగ్మంబు వాడు
ధ్యాన నిష్ఠాగరిష్ఠుడై తనరువాడు
నిరుపమానంద మూర్తియైనెగడువాడు
బ్రహ్మవిదుడైన వాడు మా బాలయోగి

మందిరము నుండి హోమ ధూమములె కావు
బంధురాగరు కర్పూర గంధములును
వెలుగును వేద ఘోషాలు వెలికి వెడలు
నట్టి సంస్కారముల జేసి రెవరు నీకు

ఈ తడి బట్ట లెక్కడివి యీ ఘృతదీపము లేమి యీ తనూ
ద్భూతమనోహర ప్రభల పోడిమి యేమి శివావతార మ
ట్లే తవరారు చుంటి వెవరీ ముడి దీర్చిరి తెల్పుమా మనో
తీతమ్ము లయ్యె మాకు భవదీయ తపోమహిమాతిరేకముల్

శ్రీకృష్ణ భగవాను లీలగా నే యోగి
నిజమందిరమున బంధితుని జేసె
బాలకృష్ణ స్వరూపముదాల్చి యే మునీం
ద్రుడు ప్రదర్శించె సారూప్యముక్తి
భువి యందు శివకేశవుల బ్రదర్శించె నెవడు
ఇదియ నా తుది జన్మ మీ జగంబున నంచు
నే మహాత్ముండు బోధించె మనకు

నట్టి భగవత్స్వరూప నత్యధికభక్తి
హృదయ సీమను నిలిపి పూజింతు నెపుడు
సంతితాగామి పాపసంక్షయము నొంద
బ్రహ్మవిద్వర్య గురువర్య! బాలయోగి.

మూసిన కన్ను లెప్పుడును మూసిన యట్టులె యుండుటా అహో!
ఆనన భేదమైన కలదా యశనాది సమస్త కర్మస
న్యాస మొనర్చుటా ప్రకృతినైజ మెఱింగి సమాధి నుండి త
త్త్వాసవ బిందు సేకరణ మా! కడు వింతలు గాదె నీ క్రియల్

నిరసన దీక్ష బూనితివి నిత్యుని సత్యుని నీరజాక్షు నాం
తరమున భక్తి జేసితివి ధన్యుడ వైతివి బ్రహ్మలోక సు
స్థిరవిభవంబు సేకురెను జెప్పగ నేల పదేపదే యత
న్నిరసను లందు నీకు సరి నీవ జగంబున యోగి పుంగవా!

తారక పూర్వజన్మ సుకృతంబున గాదొకొ నీకు మోక్షల
క్షులిభవంబు సేకురు విశేషవిరాగము దేవ దేవుసం
సేవన దీక్షయున్ సగుణ సిద్ధియు నిశ్చల తత్త్వమున్ స్వయం
భావన మబ్బ టెల్ల శుకమౌని విధంబున యోగిరాణ్మణీ!

శ్రీశుభక్తుండ వగు నీకు శ్రీశునకును
లేశ మేనియు భేదంబు లేదు తండ్రి
తావకాంచితనిలయ సందర్శనంబు
తలప శ్రీకృష్ణనిలయ సందర్శనం!

నీరము నైన గ్రోలక వినిర్మల చిత్తము నెల్ల వేళలన్
శ్రీరమణీయ మనోహరుని జెంతను జేర్చి భజించు చుండు నీ
ఘోరతపః ప్రభావమునకున్ సురలే వెఱ వోదు రన్న వి
ద్యారహితాత్ము లైన వరు లబ్బుర మందరె యోగిపుంగవా!

దారధారలుగ రంధ్రము నుండి ప్రవహించు
పాలన జేపట్టి గ్రోలు వేళ
పదపడి విచ్చేయు పనుపునీటిని భక్తి
నాపాదమస్తకం బలదు వేళ
పొరి పొరి నరుదెంచు పొగబారులను జూచి
యతితరాశ్చర్యంబు నందు వేళ
తదనంతరంబు నెత్తావు లాఘ్రాణించి
యానందవార్ధి నోలాడు వేళ
భాష లెన్నియొ పుందిర ప్రాంగణమున
గడియ కాలంబు నిను గూర్చి నుడివి నట్టి
మమ్ము నెల్లర మన్నించి నెమ్మి గనుము
బ్రహ్మవిద్యానురాగి ఓ బాలయోగి

కేవలంబును బురాకృతపుణ్యమున బరా
పరవిరాగము గన్న బాలుడెవడు
కాయంబు బవనభక్షణ మాత్రమున నిల్ప
గా గల యల తపోయోగి యెవడు
తన యాశ్రమాంతరంబున కృష్ణభగవాను
బంధితున్ జేసిన భక్తు డెవడు
తత్త్వ విజ్ఞానామృతము దేశదేశాల
గురిపించు బ్రహ్మ విద్వరు డెవండు

అట్టి శ్రీ బాలయోగీంద్రు డట్టి పరమ
హంస యట్టి జీవన్ముక్తు డట్టి యచాలు
డైహి కాముష్మికాసుఖంబు లందజేసి
యెలమి మమ్ముల నెపుడు రక్షించుగాత!
ఉపవాసవ్రతదీక్ష బూనుచును నిత్యున్ విష్ణు సంధించుచున్
దపమున్ జేయుచు నుంటి వెంతటి మహా ధన్యాత్ము (డౌ దోయి) ఆ
కపిల బ్రహ్మవు నీవ అట్టి నిను వేడ్కన్ గొల్వగా లేని నా

యపరాధంబును సైపుమయ్య మునిచంద్రా బాలయోగీశ్వరరా!
నీ సరి వచ్చు సాత్వికమునిప్రవరుండెవడయ్య శాస్త్ర వి
శ్వాసము తోడ బల్కెదను సంస్తుతి గా దిది స్వర్వదేవతా
గ్రేసరు డైన శ్రీ హరియ కేవలమున్ బరిచర్య సేయ నౌ
జేసెడి సేవ యెంతటిది చెప్పవె బాలమునీంద్ర చంద్రమా

ఎవరు తీరిచి దిద్దిరీ జుటా జూటంబు
బాలశంకరుని రూపంబు దనర
రతనాల కాంతితో జతవచ్చు క్రొంగ్రొత్త
దీపాలు వెలిగించి తెచ్చి దెవరు

విమల శంఖధ్వనుల్ వినుచుంటి మెవ్వారు
పూరింతు రోయి నీ పొంతనిలచి
కమనీయ పరిమళోత్కరము ల శ్రాంతంబు
గ్రమ్ముచునుండు నెక్కడివి తండ్రి

ఏ పవిత్రోదకంబుల దెవరు నిన్ను
జలక మాడించి నూత్న వస్త్రంబు విడిరి
ఔర నీ దివ్య చరితమత్యద్భుతంబు
బ్రహ్మవిద్యానురాగి ఓ బాలయోగి

SS804



అమూల్యశ్రీ

1. తెలుగు సాహితీలోకములో కవి, రచయిత, విమర్శకుడు, పరిశోధకులుగా అమూల్యశ్రీగా సుపరిచితులై పేరెన్నికగన్న శ్రీ జూపూడి అమ్మలయ్య జన్మస్థలము జూపూడి గ్రామము, పొన్నూరు మండలము, గుంటూరు జిల్లా. స్థిర నివాసము గుంటూరు.

2. జననము : ది. 9-6-1931.

3. తల్లిదండ్రులు: అమ్మక్కమాంబ-పెదవీరయ్యగార్లు.
జీవిత భాగస్వామిని : రత్నజ్యోతి.
వివాహము : ది. జూన్, 1957.
సంతానము : ముగ్గురు కుమార్తెలు. ఇద్దరు కుమారులు.

4. విద్యాభ్యాసము: ఎ) జూపూడి, బ్రాహ్మణ కోడూరు, తెనాలి, మచిలీపట్నము.
బి) ఆంధ్రవిశ్వవిద్యాలయము, వాల్తేరు నుండి ఆర్థిక శాస్త్రములో బి.ఏ. (ఆనర్సు) డిగ్రీ.

5. ఉద్యోగము: వాణిజ్యపన్నుల శాఖలో సరాసరి ఎంపిక ద్వారా ఏ.సి.టి.ఓ.గా ఉద్యోగములో ప్రవేశించి, వివిధ హోదాల్లో పనిచేసి చివరిగా డిప్యూటీ కమీషనరుగా కళంకములేని సేవలు చేసి పదవీ విరమణ చేశారు. కొంతకాలము రాష్ట్ర అధికారభాషా సంఘము సభ్యులుగా ఉన్నారు.

6. వ్యాపకాలు: నాటకాలు, చిత్రలేఖనము, పిన్ననాటి సరదాలు, వేదాంతము, సాహిత్య వ్యాసంగము, కావ్యపఠనము, రచనా వ్యాసంగము తరువాయి వ్యాపకాలు.

7. రచనలు: ***ఎ) అచ్చయినవి.*** అమూల్యశ్రీ అమృత హస్తము పూనిన కలము నుండి జాలు వారి యింతవరకు వెలుగు చూచిన రచనలు.

1) శ్రీ వెంకటేశ్వర శతకము 2) గాంధీశతకము. 3) రత్నాల రవ్వలు (పద్య, గేయ రచన కవితా ఖండ కావ్యము) 4) కృష్ణవేణి (వచన కవిత). 5) బెజవాడ గోపాలరెడ్డి కవితా సౌరభాలు (విమర్శ) 6) జాషువా కవితా వైభవము (పరిశీలన) 7) శ్రీమతి అనసూయామూర్తి (జీవిత చరిత్ర) 8) భారత జాతిరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ (జీవితచరిత్ర) 9) అమ్మలయ్య పదాలు (లఘు కవితలు). 10) తెలుగు లెంక తుమ్మల సీతారామమూర్తి కవిత్వము, వ్యక్తిత్వము (విమర్శ) 11) పద్మశ్రీ బోయి భీమన్న కవి తారసరాగమనోజ్ఞత (పరిశీలన) 12) జాషువా గబ్బిల రాయభారము 13) జాషువా ఫిరదౌసికవి 14) జాషువా మానవతా వాదము 15) కన్నతల్లి గుండెకోత 16) జాషువా ముంతాజ్ మహల్ కావ్య సమాలోచన.

బి) అచ్చులో ఉన్నవి: i) కళియుగ వసుధైక దివ్యచైతన్యమూర్తి భగవాన్ ముమ్మిడివరం పెదబాలయోగీశ్వరులు (జీవిత చరిత్ర). ii) ఫిరదౌసి కవి.

సి) అచ్చుకావలసినవి : 1) యువక శతకం 2) క్రీస్తు శతకము 3) సాయి రామశతకము 4) కంఠశోష 5) కన్నతల్లి గుండెచప్పుళ్ళు.

8) ఆలిండియా రేడియోలో ప్రసారమైనవి:

1) హంపీ విజయనగరము 2) నేతాజీ సుభాస్ చంద్రబోస్ 3) రాజాధిరాజు (క్రీస్తు జననము) 4) ధృవ విజయం (ఆత్మగౌరవము) 5) తుంగభద్ర (రూపకాలు)

ఇవిగాక రేడియోలో ప్రసారమైన లిఖిత గేయాలెన్నో! వివిధ పత్రికల్లో వచ్చిన కథలు, కవితలు, వ్యాసాలు మరెన్నో!! వెలుగు చూడవలసిన రచనలింకెన్నో!!!
గుండెనిండా మృధుమధుర కలకండల కండలు కల్గిన దండి కవీంద్రుడు అమూల్యశ్రీ అమ్మలయ్య, "కవి కులాలంకార" బిరుదాంకితులు అమూల్యశ్రీ శ్రీ అమ్మలయ్య.

9. పరమపథము : ది. 10-6-1999 న దివంగతుడయ్యెను.